www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

కాంగ్రెస్‌లోకి వినేశ్ ఫొగాట్?

బజరంగ్ పునియా కూడా..

2

రాహుల్‌గాంధీని కలిసిన రెజ్లర్లు

హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ?



గురువారం | 5-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 159 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: విదియ మ. 12.22 తదుపరి తదియ; నక్షత్రం: ఉత్తర ఉ. 6.14 తదుపరి హస్త; వర్జ్యం: మ.3.44-5.33, దుర్ముహూర్తం: ఉ.10.10-10.59, మ.3.05-3.54; అమృతఘడియలు: రా.2.37-4.25; రాహుకాలం: మ.1.30-3.00, సూర్యోదయం: 6.05, సూర్యాస్తమయం: 6.21 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

హైడ్రాకు హైపవర్



ఆక్రమణల తొలగింపునకు సర్వాధికారాలు

నోటీసులు కూడా జారీ చేసేలా..

రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ, జీహెచ్‌ఎంసీ, పంచాయతీరాజ్‌కు పురపాలక శాఖ లేఖ

చట్టంలో మార్పులా?.. అధికారాల బదలాయింపా?

న్యాయ సలహా కోరిన రెవెన్యూ అధికారులు

హెచ్‌ఎండీఏలోని 3532 చెరువులు హైడ్రా కిందికే!

హైకోర్టు నియమించిన కమిటీ తన నివేదికలో గోపన్‌పల్లిలోని గోసానికుంట చెరువు గురించి పేర్కొన్న అంశాలు..

ఈ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఆక్రమణలు జరిగాయి. ఫెన్సింగ్, రింగ్ బండ్/వాకింగ్ ట్రాక్ తదితర పనులు చేసినట్లుగా కనిపించలేదు. సీసీ కెమెరాలు లేవు. లేక్ గార్డులు ఎవరూ లేరు. మురుగు నీటి మళ్లింపు పనులు జరుగుతున్న ఆనవాళ్లు అసలే లేవు.

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెరువులు, పార్కులు, ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ఏర్పాటైన హైడ్రాకు మరిన్ని అధికారాలను కట్టబెట్టే దిశగా అడుగులు వేగంగా పడుతున్నాయి. అక్రమ కట్టడాల తొలగింపునకు ఇప్పటివరకు వివిధ శాఖల పరిధిలో ఉన్న అధికారాలన్నింటినీ హైడ్రా పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. రెవెన్యూ, నీటిపారుదల, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, పంచాయతీ రాజ్, రోడ్లు-భవనాల శాఖ.. ఇలా సంబంధిత శాఖలన్నింటి నుంచి హైడ్రా విధి నిర్వహణకు అవసరమైన అధికారాలను ఆ సంస్థకు బదలాయించనున్నారు. ఉదాహరణకు.. ఇటీవల దుర్గం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న భవనాల తొలగింపునకు సంబంధించి రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చారు. అయితే ఇక నుంచి నోటీసులిచ్చే అధికారాన్ని కూడా రెవెన్యూ నుంచి హైడ్రాకు బదలాయించనున్నారు. కాగా, జీహెచ్‌ఎంసీ, పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఉండే అధికారాలనూ హైడ్రాకు బదలాయించాలని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి ఆ శాఖలను కోరినట్లు విశ్వసనీయంగా తెలిసింది. హైడ్రాకు అధికారాలను కట్టబెట్టే విషయంపై ఇటీవల సీఎస్ శాంతి కుమారి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. అక్రమ కట్టడాలు, ఆక్రమణల తొలగింపు విషయంలో, ప్రభుత్వ ఆస్తుల సంరక్షణకు సంబంధించి హైకోర్టు ఆదేశాల మేరకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించే విషయంపై ఆగస్టు 29న ఈ సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా.. ఆక్రమణల తొలగింపుపై నీటిపారుదల, పురపాలక, పంచాయతీరాజ్ శాఖలు, జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ ప్రస్తుతం వేర్వేరుగా నోటీసులు

మిగతా 14వ పేజీలో...

కబ్జాలమయం.. కలుషితం!

- ఆక్రమణల బారిన చెరువులు
- అసంపూర్తిగా మురుగునీటి మళ్లింపు పనులు
- రక్షణ చర్యలు కరువు.. సీసీ కెమెరాలు లేవు
- కాలుష్య కాసారంగా హస్మత్‌పేట్ జలాశయం
- దుర్గంధభరితంగా కూకట్‌పల్లి అంబీర్ చెరువు
- హైదరాబాద్‌లోని చెరువులపై అధ్యయనానికి కమిటీని నియమించిన హైకోర్టు
- 13 చెరువులను పరిశీలించి నివేదిక ఇచ్చిన కమిటీ

14

రేపటి కోసం రోడ్ మ్యాప్

అంతర్జాతీయ సదస్సులో ఏఐ సిటీ ప్రణాళిక ప్రకటిస్తాం



నేడు, రేపు ప్రపంచ కృత్రిమ మేధ సదస్సు

ప్రారంభించనున్న సీఎం రేవంత్

పాల్గొననున్న మంత్రి శ్రీధర్‌బాబు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

ఇలాంటి సదస్సు దేశంలో ప్రథమం

సదస్సుకు దాదాపు 2000 మంది ప్రతినిధులు

12

పదింతల అభివృద్ధికి 'కృత్రిమ మేధ' దోహదం

పోటీ ప్రపంచంలో 'ఏఐ'తో ప్రయాణించాల్సిందే

తొలిదశలో వ్యవసాయం, విద్య, వైద్యంలో వినియోగం

35 శాఖల్లో ఏఐతో మెరుగైన పాలనపై కసరత్తు

పెద్ద సంఖ్యలో కొలువులు పోయినా.. కొత్తవీ వస్తాయి

నష్ట నివారణ చర్యలపైనే ఎక్కువగా దృష్టి సారించాం

వ్యక్తిగత గోప్యతకు ఇబ్బంది లేకుండా చర్యలుంటాయి

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేక ముఖాముఖి

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచంతోపాటు వేగంగా ప్రయాణించాలన్న లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కి అత్యంత ప్రాధాన్యమిస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. గురు, శుక్రవారాల్లో జరగనున్న అంతర్జాతీయ ఏఐ సదస్సుకు హైదరాబాద్ ఆతిథ్యమివ్వనున్న నేపథ్యంలో ఆయన బుధవారం 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఏఐ రంగానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలను ఆయన పంచుకున్నారు. ఏఐ టెక్నాలజీ ప్రస్తుతం ప్రపంచాన్ని శాసిస్తోందని, అన్ని రంగాలపై దీని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ తరుణంలో కొత్త

మిగతా 12వ పేజీలో...



విద్యుత్తు శాఖపై సీఎం రేవంత్ సమీక్ష

నిమిషం కూడా కరెంట్ పోవద్దు!

సరఫరాలో అంతరాయాలు ఉండొద్దు

రాష్ట్రం బిజినెస్ హబ్ కాబోతోంది

భవిష్యత్ అవసరాలకనుగుణంగా విద్యుత్తు అందుబాటులో ఉండాలి

ఖాళీ భూముల్లో సోలార్ ప్లాంట్లు

రైతులకు ఫ్రీగా సౌర పంపులివ్వాలి

విద్యుత్తుపై సమీక్షలో ముఖ్యమంత్రి

వరద బాధితుల కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళాలు ఇవ్వండి

సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒక్క నిమిషం కూడా కరెంటు పోకుండా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు ఉండకూడదన్నారు. తెలంగాణ ఒక బిజినెస్ హబ్‌గా మారనుందని.. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విద్యుత్తు అందుబాటులో ఉండేలా చూడాలని స్పష్టం చేశారు. ఇందుకోసం ఐటీ, పరిశ్రమల శాఖలతో సమన్వయం చేసుకొని, కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని నిర్దేశించారు. బుధవారం ఆయన తన నివాసంలో విద్యుత్తు శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ఇంధన శాఖ కార్యదర్శి రోనాల్డ్‌రాస్, డిస్కంల సీఎండీలు ముషారఫ్ అలీ ఫారూఖీ,

మిగతా 12వ పేజీలో...

బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో.. మావోయిస్టు అగ్రనేత జగన్ మృతి

చర్చి పాస్టర్ నుంచి మావోయిజం వైపు..

ఏరియా కమిటీ నుంచి కేంద్ర కమిటీకి..

35 ఏళ్లు కొనసాగిన జగన్ ప్రస్థానం

ఆయనపై రూ.25 లక్షల రివార్డు

ఎన్‌కౌంటర్ మృతుల్లో మిగిలినవారి గుర్తింపు



జగన్ (ఫైల్)

3

ఇంట్లో బురద.. బయట వాన

ఖమ్మం మున్నేరు వరద బాధితుల దారుణ పరిస్థితి

బురద కారణంగా వీధుల్లో దుర్వాసన.. ఇంట్లో ఉండలేరు.. బయట తిరగలేరు

ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు.. ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి 5 లక్షల దాకా నష్టం





ఖమ్మం నగరంలోని ఓ కాలనీలో రోడ్డుపై పేరుకుపోయిన చెత్తను తొలగిస్తున్న మునిసిపల్ సిబ్బంది; ఇంట్లోకి చేరిన బురదను ఎత్తిపోస్తున్న మహిళ

ఖమ్మం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఇంట్లో బురద.. బయట వాన! ఇంట్లో ఉండలేరు.. ఆరుబయట నిలవలేరు!! ఇదీ ఖమ్మం నగరంలోని మున్నేరు వరద బాధితుల పరిస్థితి. ప్రకృతి ప్రకోపానికి దెబ్బతిన్న వేలాది కుటుంబాలు.. వరద తగ్గినా బురద కారణంగా ఇంకా కోలుకోలేని దుస్థితి నెలకొంది. రోడ్లన్నీ బురదతో చిత్తడిగా మారి అసలే కంపు కొడుతున్నాయి! దీనికి తోడు బుధవారం మళ్లీ వర్షాలు ప్రారంభం కావడంతో మున్నేరు బాధితుల పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. వారంతా మళ్లీ సాధారణ జీవనం గడపాలంటే నెలరోజులు పట్టే పరిస్థితి కనిపిస్తోంది. మున్నేరు వరదబాధితుల్లో ఎవరిని

మిగతా 2వ పేజీలో...

నేటి నుంచి 4 రోజులు భారీ వర్షాలు!

వర్షాలకు ఇద్దరు వృద్ధ మహిళల మృతి

ములుగు జిల్లాలో ఒకరు.. యాదాద్రి భువనగిరి జిల్లాలో మరొకరు

నిండా ముంచిన వానలు.. నీట మునిగిన పత్తి, వరి, మిర్చి

ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో దెబ్బతిన్న పంటలు

13

'ఎస్డీఆర్‌ఎఫ్'కు నిధులిస్తున్నాం

ప్రస్తుతం రాష్ట్రం వద్ద రూ.1,345 కోట్లున్నాయి

'యూసీ'లు లేక రూ.208 కోట్లు ఇవ్వలేదు

ఇప్పటికైనా యూసీలిస్తే.. మా వాటా నిధులిస్తాం

సీఎస్‌కు కేంద్ర హోం శాఖ లేఖ

నేటి నుంచి యథావిధిగా రైళ్లు: ద.మ. రైల్వే

ఇంటికన్నె-తాళ్లపూసపల్లి మరమ్మతులు పూర్తి



సిద్దిపేటలో వినాయక విగ్రహాల్ని అందిస్తున్న హరీశ్

ఈ కష్టాలకు కారణం.. ప్రభుత్వ నిర్లక్ష్యమే

ఎస్డీఆర్‌ఎఫ్ నిధులున్నా వినియోగించట్లే

సీఎంకు వ్యంగ్యం తప్ప.. పాలన తెల్వదు

వరద బాధితులకు విరాళంగా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల నెల వేతనం: హరీశ్‌రావు

హైదరాబాద్/సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ సర్కారు నిర్లక్ష్యం రాష్ట్ర ప్రజలకు శాపంగా మారుతోందని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. వరదలతో ప్రజలు ఇబ్బంది పడుతుంటే ఎస్డీఆర్‌ఎఫ్ నిధులు రూ.1345.15 కోట్లున్నా.. వారిని ఆదుకోవడంలో విఫలమయ్యారని విమర్శించారు. వరద ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పటివరకు కేంద్రానికి స్టేటస్ రిపోర్ట్ ఇవ్వలేదని తప్పుబట్టారు. కేంద్ర హోం మంత్రిత్వ

మిగతా 13వ పేజీలో...

పింఛను ఇకపై ఎక్కడి నుంచైనా..

ఈపీఎస్ పింఛనుదారులకు శుభవార్త

దేశంలో ఏ బ్యాంకు నుంచైనా పొందొచ్చు

కేంద్రీకృత చెల్లింపు వ్యవస్థకు ఈపీఎఫ్‌వో ఓకే; జనవరి 1 నుంచి అమల్లోకి..

2

వరదలను అడ్డుకోలేదని..

30 మందికి మరణశిక్ష

ఉత్తర కొరియాలో కిమ్ అరాచకం

మొబైల్ వినియోగంతో మెదడు క్యాన్సర్ రాదు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: సెల్‌ఫోన్ రేడియేషన్ వల్ల క్యాన్సర్ వస్తుందన్న భయం చాలా మందిలో ఉంటుంది! కానీ.. అదంతా వట్టి అపోహేనని, మొబైల్‌ఫోన్ వినియోగానికి మెదడు క్యాన్సర్‌కు మధ్య ఎలాంటి సంబంధమూ లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) చేయించిన అధ్యయనాల అధ్యయనంలో వెల్లడైంది. అంటే.. ఈ అంశంపై ఇప్పటిదాకా జరిగిన పలు అధ్యయనాల నివేదికలపై అధ్యయనం అన్నమాట. ఇందులో భాగంగా డబ్ల్యూహెచ్‌వో.. ఆస్ట్రేలియన్ రేడియేషన్ ప్రొటెక్షన్ అండ్ న్యూక్లియర్ సేఫ్టీ ఏజెన్సీ(అర్పాన్సా) నేతృత్వంలో ఒక అంతర్జాతీయ పరిశోధకుల బృందాన్ని నియమించింది. ఆ బృందం.. ప్రపంచవ్యాప్తంగా 1994 నుంచి 2022 నడుమ దీనిపై జరిగిన 5000కు పైగా అధ్యయనాలనను పరిశీలించింది. వాటిలో 63 అధ్యయనాల నివేదికలు వివిధ జర్నళ్లలో ప్రచురితమయ్యాయి. వాటన్నింటినీ కాచి వడబోసిన బృందం.. మొబైల్ రేడియేషన్ వల్ల గిలోమా, మెనింజియోమా వంటి బ్రెయిన్ క్యాన్సర్ల బారిన పడే ప్రమాదం, పీయూష గ్రంధిలో కణితుల ప్రమాదం లేదని తేల్చిచెప్పింది. ఈ బృందం చేసిన 'అధ్యయనాల అధ్యయనం' తాలూకా నివేదిక ఎన్విరానమెంటల్ ఇంటర్నేషనల్ జర్నల్‌లో ప్రచురితమైంది. అయితే, ఇటీవలికాలంలో సాధారణంగా మారిపోయిన 5జీ మొబైల్ నెట్‌వర్క్‌ల వల్ల క్యాన్సర్ ముప్పుపై ఇంకా అధ్యయనం చేయాల్సి ఉంది.

త్రిపురలో ముగిసిన తిరుగుబాటు

» శాంతి ఒప్పందంపై 2 రెబల్ గ్రూపుల సంతకాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: దశాబ్దాల సాయుధ పోరాటానికి స్వస్తి పలుకుతూ త్రిపురలో రెండు తిరుగుబాటు గ్రూపులు జన జీవన స్రవంతిలో కలిసేందుకు అంగీకరించాయి. ఈమేరకు కేంద్రం, త్రిపుర ప్రభుత్వంతో నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర (ఎన్‌ఎల్‌ఎఫ్‌టీ), ఆల్ త్రిపుర టైగర్ ఫోర్స్ (ఏటీటీఎఫ్) గ్రూపులు శాంతి ఒప్పందం కుదుర్చుకున్నాయి. బుధవారం కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమక్షంలో త్రిపుర శాంతి ఒప్పందంపై సీఎం మాణిక్ సాహా, కేంద్ర హోంశాఖ అధికారులు, రెండు రెబల్ గ్రూపుల ప్రతినిధులు సంతకాలు చేశారు. దీనిపై అమిత్‌షా స్పందిస్తూ.. 'ఇది చరిత్రలో నిలిచిపోయే రోజు.. గత 35 ఏళ్ల పోరాటానికి ముగింపు పలుకుతూ రెండు రెబల్ గ్రూపులు శాంతి మార్గంలోకి వస్తున్నందుకు సంతోషిస్తున్నాను. దాదాపు 10 వేల మంది ఆయుధాలు విడిచి జన జీవన స్రవంతిలోకి వస్తున్నారు' అని పేర్కొన్నారు.

ఢిల్లీలో డ్రగ్స్ కలకలం.. 944 మంది అదుపులోకి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: దేశ రాజధాని ఢిల్లీలో డ్రగ్స్ కలకలం రేపాయి. నగరంలో పెద్ద ఎత్తున డ్రగ్స్ విక్రయం, వినియోగం జరుగుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పోలీసులు 325 ప్రదేశాల్లో దాడులు నిర్వహించి.. ఏకంగా 944 మందిని అదుపులోకి తీసుకున్నారు. గత శనివారం సాయంత్రం 4 గంటల నుంచి ఆదివారం తెల్లవారుజాము 4 గంటల వరకు ఏకధాటిగా 12 గంటలపాటు ఈ దాడులు కొనసాగాయి. ఢిల్లీ అదనపు పోలీస్ కమిషనర్ సంజయ్ భాటియా నేతృత్వంలో నిర్వహించిన ఈ దాడుల్లో 108.93 గ్రాముల హెరాయిన్, 66.28 కిలోల గంజాయితోపాటు 1100 గ్రాములు చరస్, 16 గ్రాముల ఎండీఎంఏ పట్టుబడ్డాయి.

అమెరికా పాఠశాలలో కాల్పుల కలకలం

» నలుగురు విద్యార్థుల మృతి, 30 మందికిపైగా గాయాలు

విండర్, సెప్టెంబరు 4: అమెరికాలో మరోసారి కాల్పులు కలకలం రేపాయి. జార్జియా బోరో కౌంటీలోని ఓ పాఠశాలలో జరిగిన కాల్పుల్లో నలుగురు విద్యార్థులు మృతి చెందగా, 30 మందికిపైగా గాయపడ్డారు. భద్రతా సిబ్బంది గాయపడిన విద్యార్థులను హెలికాప్టర్లలో హుటాహుటిన ఆస్పత్రులకు తరలించారు. పాఠశాలను తమ అదుపులోకి తీసుకుని, విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అనుమానితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. బోరో కౌంటీలో లాక్‌డౌన్ ప్రకటించి జార్జియాలోని అన్ని పాఠశాలలకు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

అమెజాన్‌లో బెస్ట్ సెల్లర్‌గా ట్రంప్ పుస్తకం



వాషింగ్టన్, సెప్టెంబరు 4: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాసిన 'సేవ్ అమెరికా' పుస్తకం విడుదలైన కొద్ది గంటల్లోనే అమెజాన్ బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. పుస్తకం ధర 92.06 డాలర్లు(రూ.7,732) ఉన్నప్పటీ "అధ్యక్షులు, దేశాధినేతల జీవిత చరిత్రలు" విభాగంలో అమ్మకాల్లో తొలిస్థానంలో నిలిచింది. మొత్తంగా చూస్తే 13వ స్థానంలో ఉంది. ట్రంప్ ఈ పుస్తకాన్ని మంగళవారం విడుదల చేశారు. అమెరికా దేశ భక్తులంతా ఈ పుస్తకాన్ని కచ్చితంగా చదవాలన్నారు. తాను అధ్యక్షుడిగా పనిచేసినప్పటి నుంచి ప్రస్తుత ఎన్నికల ప్రచారం వరకు తన జీవిత విశేషాలు, అధ్యక్షుడిగా తన అనుభవాలను పుస్తకంలో పొందుపర్చినట్లు చెప్పారు. జూలైలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా ట్రంప్‌పై కాల్పులు జరిగిన సంగతి తెలిసిందే. అప్పుడు ఆయన అదే వేదికపై నిలబడి పిడికిలి బిగించి, 'పోరాడతా' అంటూ నినదిస్తున్న ఫొటోను పుస్తకం కవర్ ఫొటోగా పెట్టారు.

మోదీ సర్కారు పతనం త్వరలో

మానసికంగా ప్రధాని పనైపోయింది.. జమ్మూకశ్మీర్ ఎన్నికల ప్రచారంలో రాహుల్



అనంత్‌నాగ్‌లో ఎన్నికల ప్రచారంలో రాహుల్, ఎన్సీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా తదితర నేతలు

జమ్మూ, సెప్టెంబరు 4: మానసికంగా ప్రధాని నరేంద్ర మోదీ పనైపోయిందని లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. లోక్‌సభలో మోదీ ఎదురుగా కూర్చునే తాను.. ఆ విషయాన్ని స్పష్టంగా గ్రహించగలిగినట్లు చెప్పారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల ఫలితాల తర్వాత ప్రధాని ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయారని పేర్కొన్నారు. త్వరలో ఆయన నేతృత్వంలోని ప్రభుత్వం తొలగిపోతుందని జోస్యం చెప్పారు. ఇద్దరు ధనికుల కోసం ఆర్టికల్ 370ని నిర్వీర్యం చేసి, జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదాను లాగేసుకున్నారని విమర్శించారు. స్వతంత్ర భారత దేశంలో ఒక రాష్ట్ర హోదాను లాగేసుకోవడం ఇదే తొలిసారి అని.. గతంలో కేంద్ర పాలిత ప్రాంతాలు రాష్ట్ర హోదాను సాధించాయని గుర్తుచేశారు. బుధవారం ఆయన జమ్మూకశ్మీర్‌లోని బనిహాల్ అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా జరిగిన ర్యాలీలో మాట్లాడారు. "ప్రస్తుతం మోదీ, అమిత్‌షా, వారి కార్పొరేట్ మిత్రులు కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. మోదీ హయాంలో నిరుద్యోగిత పెరిగింది. జీఎస్టీ, నోట్ల రద్దు కారణంగా చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మోదీ మిత్రులుగా చెప్పే అదానీ, అంబానీల పేర్లను నేరుగా చెప్పకూడదని నాకు ఆదేశాలున్నాయి. అందుకే నేను వారిని ఏ1, ఏ2 అని పిలుస్తాను. ఈ ప్రభుత్వం తీరు మేమిద్దరం-మాకిద్దరు(మోదీ, షా - అదానీ, అంబానీ) అన్నట్లుగా ఉంది. ఈ నలుగురు కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని నడుపుతున్నారు" అని రాహుల్ విమర్శించారు. భారత్‌లోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే.. జమ్మూకశ్మీర్‌లో పరిస్థితులు దారుణంగా ఉన్నాయన్నారు. కులగణనపై మోదీ అసలు ఆ అవసరం లేదంటారని, కానీ, ఆరెస్సెస్ మాత్రం అది సరైందేనంటుందని ఎద్దేవా చేశారు. "ఇంతకు ముందు ఎన్నికల్లో మీరు చూసే ఉంటారు. మోదీ విశాలమైన ఛాతీతో వచ్చేవారు. ఇప్పుడు మాత్రం రాజ్యాంగాన్ని వెంటబెట్టుకుని వస్తున్నారు. మోదీ తనకు తాను నేరుగా దేవుడితో సంబంధం ఉందని చెప్పుకొంటారు. మోదీ దేవుడితో నేరుగా మాట్లాడొచ్చేమో.. కానీ, జమ్మూకశ్మీర్ ఎన్నికల విషయంలో మాత్రం దేవుడు మాత్రం ప్రజల మాటే వింటాడు" అని రాహుల్ అన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే.. జమ్మూకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణకు కృషి చేస్తామన్నారు. కాగా.. ఈ నెల 18, 25, అక్టోబరు 1న మొత్తం మూడు దశల్లో జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే..!

కాంగ్రెస్‌లోకి వినేశ్ ఫొగాట్?

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ప్రత్యక్ష రాజకీయాల్లోకి రావడం ఖాయమైనట్లు కనిపిస్తోంది. బుధవారం ఆమె రాహుల్ గాంధీతో సమావేశమవడం చర్చనీయాంశమైంది. వినేశ్‌తో పాటు బజరంగ్ పునియా కూడా రాహుల్‌ను కలిశారు. హరియాణా అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఈ పరిణామాలు ఆసక్తి రేపుతున్నాయి. ఎన్నికల్లో వినేశ్, పునియా పోటీ ఖాయమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జులానా స్థానం నుంచి వినేశ్‌ను బరిలో దింపాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తున్నట్లు సమాచారం. ఇక పునియాను బద్లి స్థానం నుంచి పోటీ చేయించాలని చూస్తున్నట్లు తెలిసింది. ఒకవేళ ఎమ్మెల్యే సీటు ఇవ్వలేకపోతే ఏఐసీసీలో కీలక పదవిని ఇస్తారన్న ప్రచారంకూడా జరుగుతోంది. వీరిద్దరి చేరికతో హరియాణాలో జాట్‌ల ఓట్లు కాంగ్రెస్‌కు అనుకూలంగా మరింత సంఘటితమవుతాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఫొగాట్ కాంగ్రెస్ తరఫున పోటీ చేసినా, ప్రచారం చేసినా పెద్ద సంఖ్యలో ఓట్లు వస్తాయని, మహిళలు నీరాజనాలు పడతారని పేర్కొంటున్నారు. కాంగ్రెస్, ఆప్ మధ్య సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతున్న వేళ వీరిద్దరూ కాంగ్రెస్‌లో చేరితే పార్టీకి మరింత బలం చేకూరినట్లవుతుంది. హరియాణా అసెంబ్లీలో 90 సీట్లుండగా.. ఆప్ తమకు 10 స్థానాలు కావాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. అయితే కాంగ్రెస్ మాత్రం ఏడు సీట్ల కంటే ఎక్కువ ఇవ్వబోమని చెప్పినట్లు సమాచారం. మరోవైపు వినేశ్ సోదరి బబిత 2019లో బీజేపీ తరఫున దాద్రి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అదే స్థానంలో బబితకు పోటీగా వినేశ్‌ను దించాలని కాంగ్రెస్ ఆలోచనలు చేస్తున్నట్లు సమాచారం. కాగా, హరియాణా అసెంబ్లీ ఎన్నికలకు 67మంది అభ్యర్థులతో తొలి జాబితాను బీజేపీ బుధవారం విడుదల చేసింది. దాని ప్రకారం.. లద్వా నుంచి సీఎం నాయబ్ సైనీ పోటీ చేయనున్నారు.

లోకం తీరు



వరదలను అడ్డుకోలేదని.. 30 మందికి మరణశిక్ష!



ప్యాంగ్యాంగ్, సెప్టెంబరు 4: ఇటీవలి వరదలతో అతలాకుతలమైన ఉత్తర కొరియాలో.. ఆ దేశ అధినేత కిమ్ జాంగ్ ఉన్ 30 మంది అధికారులకు మరణ శిక్ష విధించారు. కారణమేంటంటే..? వారు వరదలను అడ్డుకోలేకపోవడమేనట..! విపత్తు నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే అభియోగాలపై ఆ 30 మందికి మరణశిక్ష అమలు చేయాలని కిమ్ ఆదేశాలు జారీ చేసినట్లు పలు అంతర్జాతీయ వార్తాసంస్థలు కథనాలను ప్రసారం చేశాయి. అవినీతి, విధుల్లో నిర్లక్ష్యం పేరుతో గత నెల 20-30 మంది అధికారులకు కిమ్ మరణశిక్ష విధించారని తొలుత దక్షిణ కొరియాకు చెందిన 'చోసన్ టీవీ'లో ఓ కథనం ప్రసారమైంది. ఆ తర్వాత కొద్దిరోజులకే వీరికి మరణశిక్షను అమలు చేసినట్లు మరో కథనం పేర్కొంది. జూలై, ఆగస్టు నెలల్లో ఉత్తర కొరియాలో భారీ వర్షాలతో 4 వేల మంది ప్రాణాలు కోల్పోయారు.

పింఛను.. ఇకపై ఎక్కడి నుంచైనా!

దేశంలో ఎక్కడ, ఏ బ్యాంకు నుంచైనా తీసుకోవచ్చు

» కేంద్రీకృత పింఛను చెల్లింపు వ్యవస్థకు ఈపీఎఫ్‌వో ఆమోదం

» వచ్చే జనవరి 1 నుంచి అమల్లోకి: కేంద్ర మంత్రి మాండవీయ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4: కేంద్ర ప్రభుత్వం ఈపీఎస్ పింఛన్‌దారులకు శుభవార్త చెప్పింది. పింఛనుదారులు ఇకపై దేశంలో ఎక్కడి నుంచైనా పింఛను తీసుకునే వెసులుబాటు కల్పించింది. ఏ ప్రాంతంలో ఉన్నా, ఏ బ్యాంక్ నుంచైనా పింఛను తీసుకునే వీలు కల్పించింది. ఈ మేరకు కేంద్రీకృత పింఛను చెల్లింపు వ్యవస్థ (సీపీపీఎస్)ను తీసుకొచ్చేందుకు ఈపీఎఫ్‌వో ఆమోదం తెలిపినట్లు కేంద్ర కార్మిక శాఖ మంత్రి, ఈపీఎఫ్‌వో ట్రస్ట్‌బోర్డ్ చైర్మన్ మన్సుఖ్ మాండవీయ వెల్లడించారు. 2025 జనవరి 1 నుంచి ఈ సదుపాయం అందుబాటులోకి రానుందని తెలిపారు. దీనివల్ల 78 లక్షల మంది పింఛన్‌దారులకు ప్రయోజనం కలగనుందని చెప్పారు. పింఛనుదారులు ఒక ప్రాంతం నుంచి ఇంకో ప్రాంతానికి వెళ్లినప్పుడు పింఛను పేమెంట్ ఆర్డర్ (పీపీవో)ను బదిలీ చేసుకోవాల్సిన అవసరం ఉండదన్నారు.

సీపీపీఎస్‌తో సమూల మార్పులు..

సీపీపీఎస్ ప్రస్తుత పింఛను పంపిణీ వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టనుంది. ప్రస్తుతం ఈపీఎఫ్‌వో జోనల్/ప్రాంతీయ కార్యాలయాలు కేవలం 3-4 బ్యాంకులతో మాత్రమే ఒప్పందాలు కలిగి ఉన్నాయి. పింఛను ప్రారంభ సమయంలో పింఛనుదారులు ధ్రువీకరణ కోసం సంబంధిత బ్యాంకుకు వెళ్లాలి. కేంద్రీకృత విధానం వల్ల ఇకపై ఆ అవసరం తప్పుతుంది. పింఛను విడుదలైన వెంటనే, ఆ మొత్తం పింఛనుదారు ఖాతాలో జమవుతుంది. ఆధార్ చెల్లింపు వ్యవస్థను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు మాండవీయ చెప్పారు.

ఫిరాయింపు ఎమ్మెల్యేలకు పింఛను కట్

కొత్త బిల్లుకు హిమాచల్ అసెంబ్లీ ఆమోదం

కాంగ్రెస్‌ది రాష్ట్రానికో తీరు: కేటీఆర్

న్యూఢిల్లీ, హైదరాబాద్, సెప్టెంబరు 4: పార్టీ ఫిరాయింపులను అరికట్టేందుకు హిమాచల్‌ప్రదేశ్‌లోని కాంగ్రెస్ ప్రభుత్వం సంచలన నిర్ణయాన్ని తీసుకుంది. పార్టీని ఫిరాయించిన ఎమ్మెల్యేలకు పింఛన్‌ను రద్దయ్యేలా రూపొందించిన కొత్త బిల్లుకు ఆ రాష్ట్ర శాసనసభ బుధవారం ఆమోదం తెలిపింది. ఫిరాయింపు నిరోధక చట్టం(10వ షెడ్యూల్) కింద అనర్హత వేటు ఎదుర్కొన్న సభ్యులకు ఈ నిబంధన వర్తిస్తుంది. హిమాచల్‌ప్రదేశ్ శాసనసభ(సభ్యుల అలవెన్సులు, పింఛన్లు) సవరణ బిల్లును ఆ రాష్ట్ర సీఎం సుఖ్విందర్ సింగ్ సుఖు ప్రవేశపెట్టిన బిల్లుకు మెజార్టీ సభ్యులు మూజువాణి ఓటు ద్వారా మద్దతు తెలిపారు. అయితే, పార్టీ ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్‌పార్టీ సర్కస్‌ఫీట్లు చేస్తోందని, ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. "తెలంగాణలో ప్రతిపక్ష పార్టీల నాయకులను ప్రలోభపెట్టి పార్టీ మారేలా చేయాలి.. అదే హిమాచల్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తే.. పింఛన్ ఇవ్వబోమని చట్టం చేయాలి. ఇదేం వైఖరి" అంటూ ఆయన 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు.

నరేంద్ర మోదీ గారూ.. స్వాగతం

» ఘనంగా ఆహ్వానించిన సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్



ప్రధాని మోదీతో లారెన్స్ వాంగ్

సింగపూర్, సెప్టెంబరు 4: విదేశాల పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ బుధవారం సింగపూర్‌కు చేరుకొన్నారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ మోదీని ఘనంగా ఆహ్వానించారు. ప్రతిష్ఠాత్మక శ్రీ తెమాసెక్ భవనంలో ఆతిథ్యం ఇచ్చారు. ఈ సందర్భంగా "నరేంద్ర మోదీ గారు.. సింగపూర్‌కు స్వాగతం" అంటూ మోదీతో కలిసి ఉన్న ఫొటోను ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. గురువారం వీరిరువురూ అధికారికంగా భేటీ కానున్నారు. ఈ సందర్భంగా పలు అవగాహనా ఒప్పందాలపై సంతకాలు చేయనున్నారు. లారెన్స్ వాంగ్ ఆహ్వానం మేరకే మోదీ సింగపూర్ పర్యటనకు వెళ్లారు. ఆ దేశం నుంచి పెట్టుబడులను ఆకర్షించడం, వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పెంపొందించడం, ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా మోదీ సింగపూర్‌లో పర్యటిస్తున్నట్లు విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ప్రధాని హోదాలో మోదీ సింగపూర్‌లో పర్యటించడం ఇది ఐదోసారి. మరోవైపు, గురువారమే సింగపూర్ పార్లమెంటుహౌస్‌లో ఆ దేశ అధ్యక్షుడు షణ్ముగరత్నంను మోదీ కలుసుకోనున్నారు. సింగపూర్‌లో వ్యాపారవేత్తలతో కూడా భేటీ కానున్నారు. అంతకుముందు మోదీ బ్రూనై పర్యటనలో ఆ దేశ సుల్తాన్ హసనల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ప్రధాని కీలక ప్రకటన చేశారు. త్వరలో రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

వీడిన ముంపు.. తొలగిన ముప్పు

వరద నుంచి తేరుకుంటున్న బెజవాడ.. 80శాతం ప్రాంతంలో నీరు తగ్గుముఖం

» ఊపందుకుంటున్న సహాయక చర్యలు

» సుమారు పదివేల మందితో పారిశుధ్య దళం

విజయవాడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బుడమేరు వరద ముంపు మెల్లగా తొలగిపోతోంది. విజయవాడ నగరం కోలుకుంటోంది. బుడమేరు ముంచెత్తడంలో 5 నుంచి 8 అడుగుల వరద నీటిలో మునిగిన అజిత్ సింగ్‌నగర్, పాయకాపురం తదితర ప్రాంతాల్లో దాదాపు 80 శాతం ముంపు నుంచి బయటపడ్డాయి. వరద నీరు తగ్గిన ప్రాంతాల్లో అధికారులు ఎక్కడికక్కడ విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. వరద ముంపు ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేస్తున్నారు. విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో 3454 మంది కార్మికులతో పాటు 450 మంది ప్రజారోగ్య సిబ్బందిని ఈ పనులకు వినియోగిస్తున్నారు. వీరితోపాటు ఇతర మున్సిపాలిటీల నుంచి వచ్చిన 5889 మంది కార్మికులను రంగంలోకి దించారు.



వరద బాధితుల కోసం ట్రాక్టర్లతో ఆహారం, నీళ్లు సరఫరా చేస్తున్న సహాయక సిబ్బంది

గాడినపడుతున్న ఆహార పంపిణీ

వరద ప్రాంతంలో పరిస్థితులను వివరిస్తూ 'ఆంధ్రజ్యోతి' బుధవారం సవివరమైన కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. దీంతో... గత మూడు రోజులుగా ఆహారం, తాగునీటి పంపిణీ విషయంలో విఫలమైన యంత్రాంగం బుధవారం దిద్దుబాటు చర్యలు తీసుకుంది. ఐఏఎస్ అధికారి కోన శశిధర్ సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ వద్దే ఉండి.. అంతా క్రమపద్ధతిలో జరిగేలా చూశారు. ఆహారం, తాగునీటితో వచ్చిన వాహనాలను ఏయే ప్రాంతాలకు పంపాలో ప్రణాళికా బద్ధంగా నిర్ణయించి... ప్రతి వాహనం వెంట డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందాన్ని పంపించారు. దీంతో చాలా వరకు బాధితులకు ఆహారం, తాగునీటి బాటిళ్లు చేరాయి. ఇతర జిల్లాల యంత్రాంగాలు వరద బాధితుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి ట్యాంకర్‌లను పంపించాయి. ఈ ట్యాంకర్లు కూడా వరద బాధిత ప్రాంతాల్లో తిరిగాయి. బాధితులు బిందెలు, క్యాన్లలో నీటిని నింపుకొన్నారు. విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని వాంబే కాలనీ, కండ్రిక, రాజీవ్ నగర్ కాలనీ, ఉడా కాలనీ, ఆంధ్రప్రభ కాలనీలలోని చివరి ప్రాంతాలు నాలుగైదు అడుగుల ముంపులో ఉన్నాయి. వరద ముంపు నుంచి బయటపడిన జనం ఇళ్లకు తాళాలు వేసి సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు. సుమారు 60 వేల ఇళ్లు పూర్తిగా వరద ముంపునకు గురయ్యాయని, రూ.600 కోట్ల నష్టం సంభవించి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇది కేవలం నివాస గృహాల్లో జరిగిన ఆస్తి నష్టం మాత్రమే. ఒక్కో కుటుంబం కనీసం లక్ష రూపాయల విలువైన ఆస్తిని నష్టపోయి ఉంటుందని అంచనా. చాలా మంది కార్లు, ద్విచక్రవాహనాలు నీటిలో మునిగిపోయాయి.

'పద్ధతి' పాటించాలి

బుధవారం అటు ప్రభుత్వ యంత్రాంగం, ఇటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భారీ సంఖ్యలో వాటర్ బాటిళ్లను పైపుల రోడ్డు సెంటర్, సింగ్ నగర్ ఫ్లైఓవర్ వద్దకు తీసుకెళ్లారు. కానీ... వాటిని పద్ధతిగా పంపిణీ చేసే వ్యవస్థ కనిపించలేదు. బాధితులు మంచినీళ్ల కోసం పోటెత్తారు. స్వచ్ఛంద సంస్థల వాహనాలు రాగానే మంచినీటి ప్యాకెట్ల కోసం చుట్టుముట్టారు. పరిస్థితిని నియంత్రించలేని ఆయా సంస్థల ప్రతినిధులు పన్నెండు చొప్పున బాటిళ్లతో కలిపిన ప్యాక్‌లనే కిందికి వదిలేశారు. మళ్లీ నీళ్లు దొరుకుతాయో లేదో అన్నట్లుగా కొంతమంది భుజాలపై రెండు మూడు కేసుల వాటర్ బాటిళ్లను తీసుకెళ్లడం కనిపించింది. మరోవైపు... మంచినీటి బాటిళ్ల కోసం కొందరు దుకాణదారులు కూడా ఎగబడ్డారు. వాటిని సొంతం చేసుకుని తమ టీ స్టాల్‌లోకి, బేకరీలోకి తరలించటం కనిపించింది. ముంపు బాధితుల కోసం రాష్ట్రవ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ఆహారం, తాగునీరు విజయవాడ వచ్చి చేరుతోంది. సహాయ సామగ్రిని అందుకుని, సక్రమంగా పంపిణీ జరిగేలా సమన్వయ పరిచేందుకు ఒక అధికారిని నియమించాల్సిన అవసరముంది.

32కు చేరిన మృతులు

అమరావతి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఏపీలో భారీ వర్షాలు, వరద కారణంగా చనిపోయిన వారి సంఖ్య 32కు చేరింది. ఎన్టీఆర్ జిల్లాలో మృతుల సంఖ్య 24కు పెరిగింది. కొత్తగా గుంటూరు జిల్లాలో ఏడుగురు, పల్నాడు జిల్లాలో ఒకరు చొప్పున మరణాలు నమోదయ్యాయని విపత్తుల నిర్వహణ సంస్థ బుధవారం వెల్లడించింది.

ఆహారం... వ్యర్థం

మూడు రోజులుగా నెలకొన్న సమన్వయ లోపంతో పెద్దస్థాయిలో ఆహారం వృథా అయ్యింది. పైపుల రోడ్డు సెంటర్‌లో ఎక్కడిపడితే అక్కడ ఆహార ప్యాకెట్లు బస్తాలు బస్తాలు పోగుపడి ఉన్నాయి. పాడైపోయిన ఆహారాన్ని కొంతమంది ఏలూరు కాలువలో పారవేశారు. సింగ్ నగర్ నుంచి వరద ముంపు తీవ్రంగా ఉన్న దూరప్రాంతాల్లో రోడ్ల వెంట ఎక్కడపడితే అక్కడ ఆహార ప్యాకెట్లు కనిపించాయి. పారిశుధ్య సిబ్బంది వీటిని తొలగించడం మొదలుపెట్టారు.



ఫైర్ ఇంజన్లతో ఇళ్లు శుభ్రం

ఇళ్లలో బురద మేట వేయడంతో దాన్ని శుభ్రం చేసుకునేందుకు తీవ్ర ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఈ పరిస్థితిని గమనించిన అధికారులు ఏకంగా ఫైర్ ఇంజన్లను రంగంలోకి దించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 48 ఫైర్ ఇంజన్లను తెప్పించారు. వాటి ద్వారా వీధుల్లో, ఇళ్లలోకి చేరిన బురద, మురుగును కొట్టేస్తున్నారు.

ఇంట్లో బురద.. బయట వాన

(మొదటి పేజీ తరువాయి)

కదిలించినా కన్నీటి గోడే వినిపిస్తోంది. ప్రతి ఇంటికి కనీసం లక్ష నుంచి రూ.5లక్షల వరకు నష్టం జరిగిందంటే మున్నేరు వరద బీభత్సం ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. వరద తాకిడికి నగరంలోని బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, మోతీనగర్, ధంసలాపురం, కాల్వొడ్డు, మమతారోడ్డు, కవిరాజనగర్, జూబ్లీక్లబ్ ఏరియాతో పాటు ఖమ్మంరూరల్ మండలంలోని పెద్దతండా, కరుణగిరి, జలగంనగర్, రాజీవ్‌గృహకల్ప, రామన్నపేట, దానవాయిగూడెం తదితర కాలనీలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రోటరీనగర్, కవిరాజ నగర్, చైతన్య నగర్, మామిళ్లగూడెం, పాండురంగాపురం కాలనీలు కొంత కోలుకున్నా.. కాల్వొడ్డు, బొక్కలగడ్డ, మోతీనగర్, వెంకటేశ్వరనగర్, మంచికంటినగర్, ధంసలాపురం, ఖమ్మం రూరల్ మండలం పెద్దతండా తదితర కాలనీల పరిస్థితి ఇంకా అధ్వానంగా ఉంది.



ఇంట్లో వస్తువులను శుభ్రం చేస్తున్న వరద బాధితుడు

భారీగా నష్టం..

మున్నేరు వరదతో పరివాహక ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ప్రతి ఇంటికీ రూ.లక్ష నుంచి రూ.5 లక్షల దాకా నష్టం వాటిల్లింది. కొన్ని ఇళ్లు పూర్తిగా కూలిపోయాయి. కొన్ని ఇళ్ల రేకులు ఎగిరిపోయాయి. ఇళ్లలో దుస్తులు, దుప్పట్లు, సర్టిఫికెట్లు, విలువైన పత్రాలు, దస్త్రాలు, నిత్యావసర సామగ్రి, వస్తువులు పూర్తిగా బురదమయం అయ్యాయి! బురదకు నాని దుస్తులు కంపు కొడుతుండడంతో కొందరు వాటిని ఉతకలేక పారేస్తున్నారు. ఇలా బయట పారేసిన వస్త్రాలతో పరిసరాలన్నీ మరింత దుర్గంధభరితంగా మారాయి. ప్రభుత్వం, అధికారులు వీలైనంత వేగంగా స్పందించి రోడ్లపై బురదను తొలగించాలని బాధిత కాలనీలవాసులు వేడుకుంటున్నారు.

హోటల్, ఇల్లు నాశనమయ్యాయి

ఎఫ్‌సీఐ గోదాం వద్ద హోటల్ నడుపుకొంటూ జీవిస్తున్నాం. వరదకు హోటల్ కూలిపోయింది. ఇల్లంతా బురదమయం అయ్యింది. వస్తువులన్నీ పనికిరాకుండా పోయాయి. దాదాపు రూ.5లక్షల దాకా నష్టం జరిగింది. పిల్లాపాపలతో ప్రశాంతంగా ఉంటున్నాం. ఇలా జరుగుతుందని ఎన్నడూ ఊహించలేదు. మున్నేరు వరద వస్తుందని తెలియగానే తెల్లవారుజామునే పిల్లలను తీసుకొని వెళ్లిపోయాం. ఇప్పుడు వచ్చి చూస్తే అంతా బురదే ఉంది.

- తోట సంధ్య, పద్మావతినగర్

మా ఇల్లే పోయింది.. ఉండేదెట్లా

ఆదివారం తెల్లవారుజామున 4గంటలకు మున్నేరు వరద వచ్చి పడింది. వెంటనే బజారులోకి పరుగు తీశాం. కట్టుబట్టలతోనే బయటకు వెళ్లాం. వరద తగ్గిన తర్వాత వచ్చి చూస్తే అసలు ఇల్లే లేదు. రేకులషెడ్డుతో ఉన్న ఇల్లు కూలిపోయింది. దుస్తులు, సామగ్రి కొట్టుకుపోయాయి. నా కొడుకు గుండెజబ్బుతో చనిపోయాడు. కోడలు, మనవలతో కలిసి ఉంటున్నా. మేం ఇద్దరం ఆడవాళ్లం.. పిల్లలతో ఎలా బతకాలో అర్థం కావడంలేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

- ఆర్.పుణ్యవతి, పద్మావతినగర్

పిల్లల సర్టిఫికెట్లు కొట్టుకుపోయాయి

మిర్చి మార్కెట్‌లో కూలీ పనులు చేసుకుంటూ బతుకుతున్నాం. ఉన్నంతలో ప్రశాంతంగా ఉన్న మమ్మల్ని మున్నేరు వరద కన్నీటిపాలు చేసింది. పై అంతస్తులో దుస్తులు పెడితే అక్కడికి కూడా వరద వచ్చింది. ఆదివారం ఉదయం 7గంటలకే వరద రావడంతో అందరం కట్టుబట్టలతోనే బయటపడ్డాం. ఇంట్లో అన్ని వస్తువులూ నాశనం అయ్యాయి. పిల్లల సర్టిఫికెట్లన్నీ వరదపాలయ్యాయి. పునరావాస కేంద్రంలోనూ ఉండలేకపోతున్నాం. మాకు సుమారు రూ.5 లక్షల దాకా నష్టం జరిగింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.

- ఫరీదా, కాల్వొడ్డు వాసి

బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో.. మావోయిస్టు అగ్రనేత జగన్ మృతి

వరంగల్(ఆంధ్రజ్యోతి ప్రతినిధి), చర్ల, సెప్టెంబరు 4: ఛత్తీస్‌గఢ్‌లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో.. మావోయిస్టులకు భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఘటనలో 9 మంది మృతిచెందగా.. బుధవారం ఉదయం మావోయిస్టు పార్టీ అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు అలియాస్ జగన్ అలియాస్ రణ్‌దేవ్ దాదా మృతదేహాన్ని గుర్తించారు. జగన్ స్వస్థలం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం. ఆయన అసలు పేరు మాచర్ల ఏసోబు. దళిత సామాజికవర్గానికి చెందిన ఏసోబు.. తొలుత చర్చి పాస్టర్‌గా పనిచేశారు. రైతు ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటూ.. భూస్వామ్య వ్యతిరేక పోరాటాల పట్ల ఆకర్షితుడై.. 1990లో పీపుల్స్‌వార్ గ్రూప్(పీడబ్ల్యూజీ) నేత కడారి రాములు అలియాస్ రవి నేతృత్వంలో అడవుల బాట పట్టారు. అజ్ఞాతంలోకి వెళ్లారు. తొలుత వరంగల్ జిల్లా అన్నాసాగర్ ఏరియా కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 35 ఏళ్ల అనేక ఉద్యమాల్లో, దాడుల్లో పాల్గొన్నారు. క్రమంగా ఆర్గనైజర్‌గా, కమాండర్‌గా నియమితులయ్యారు. 1995లో వరంగల్ జిల్లా కమిటీ సభ్యుడిగా.. 2001లో తెలంగాణ కమిటీ ప్రెస్, రక్షణ వ్యవహారాల కోసం ఏర్పాటైన ప్లటూన్ కమాండర్‌గా పనిచేశారు. 2004లో కేంద్ర కమిటీ రక్షణ కోసం ఏర్పాటైన కంపెనీ కమాండర్‌గా.. 2012లో ఛత్తీస్‌గఢ్‌లో జనతన సర్కార్‌లో వ్యవసాయాభివృద్ధి కమిటీ నేతగా అబూజ్‌మడ్‌లో పనిచేశారు. ఆ తర్వాత కేంద్ర కమిటీ సభ్యుడిగా.. మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ఇన్‌చార్జిగా, కేంద్ర కమిటీ మిలటరీ ఇన్‌చార్జిగా మావోయిస్టు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగారు. మంగళవారం ఎన్‌కౌంటర్‌లో జగన్ మృతిచెందినట్లు పోలీసులు ప్రకటించారు. జగన్ అజ్ఞాతంలోకి వెళ్లాక.. ఎన్నడూ సొంత ఊరికి రాలేదని గ్రామస్థులు చెబుతున్నారు. కాగా.. జగన్‌పై రూ.25 లక్షల రివార్డు ఉంది. గురువారం మధ్యాహ్నానికి ఆయన మృతదేహం టేకులగూడెం చేరుకుంటుందని, ఆయనకు నివాళులు అర్పించేందుకు పెద్ద సంఖ్యలో మాజీ నక్సలైట్లు, హక్కుల కార్యకర్తలు తరలివచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. కాగా.. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మిగతా 8 మంది మావోయిస్టులను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మృతుల్లో శాంతికుమారి(రూ.5లక్షల రివార్డు), మడకం సుశీల (5లక్షలు), ముచకి గంగి(5లక్షలు), కోసా మాద్వి(5లక్షలు), లలిత (5లక్షలు), కవిత (5లక్షలు), మకం హిడ్మే(2లక్షలు), కమలేశ్(2లక్షలు) ఉన్నారు. జగన్ సహా.. 9మందిపై రూ.59లక్షల రివార్డు ఉన్నట్లు వివరించారు.

1,350 కి.మీ మేర దెబ్బతిన్న రోడ్లు

- ప్రాథమికంగా గుర్తించిన ఆర్ అండ్ బీ
- పునరుద్ధరణకు 2వేల కోట్లవుతుందని అంచనా

హైదరాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరదల ధాటికి ఆర్ అండ్ బీ రోడ్లు దాదాపు 1,350 కి.మీ మేర దెబ్బతిన్నాయని అధికారులు ప్రాథమిక అంచనాల్లో పేర్కొన్నారు. దెబ్బతిన్న రహదారుల గుర్తింపు ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. ఇప్పటివరకు గుర్తించిన దెబ్బతిన్న రోడ్లకు సంబంధించి తాత్కాలిక మరమ్మతులకు దాదాపు రూ.65 కోట్లు, పూర్తిస్థాయి నిర్మాణాలకు రూ.2 వేల కోట్లకు పైగా నిధులు అవసరమని తేల్చారు. అయితే దెబ్బతిన్న రహదారుల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతున్నందున అంచనాలు పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. వర్షాలప్రభావంతో 120చోట్ల రోడ్లు తెగిపోగా, వీటిలో కొన్నింటిని పునరుద్ధరించారు. అయితే క్రాస్ డ్రైనేజీ (కల్వర్టులు, కాజ్‌వేలు, చిన్న బ్రిడ్జిలు, వంతెనలు)లు 600 వరకు దెబ్బతిన్నట్లు ప్రాథమిక నివేదికలో అధికారులు పేర్కొన్నారు.

సింగరేణి సవ్యసాచి!

- బొగ్గు ఉత్పత్తితో పాటు ఇప్పటికే అక్కడ సౌర విద్యుదుత్పత్తి
- త్వరలోనే పంప్‌డ్ స్టోరేజీ విద్యుదుత్పత్తి కూడా
- 3వేల కోట్లతో 'పంప్‌డ్ స్టోరేజీ'కి ప్రణాళిక

మంచిర్యాల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సింగరేణి అనగానే సహజంగా బొగ్గు ఉత్పత్తే గుర్తుకొస్తుంది. నల్ల బంగారు సంపదతో తెలంగాణకు సింగారంగా వెలుగొందుతూ ఇప్పటికే సౌర విద్యుదుత్పత్తి సిరులు వెదజల్లుతున్న ఈ సంస్థ త్వరలోనే పంప్‌డ్ స్టోరేజీ విద్యుత్తును ఉత్పత్తి చేసే దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. బొగ్గు ద్వారా విద్యుదుత్పత్తితో కాలుష్యం పెరిగిపోతోందని, ఆ తరహా విద్యుదుత్పత్తిని తగ్గించాలని ప్రపంచ పర్యావరణ సంస్థ ఆదేశించడంతో ఈ మేరకు ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. రెండు దశల్లో సింగరేణి వ్యాప్తంగా మొత్తం 532 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. సౌరశక్తి ఆధారంగా ఇప్పటికే తొలి దశలో 246 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి చేసిన సంస్థ, రెండో దశలో 286 మెగావాట్ల విద్యుదుత్పత్తి కోసం టెండరు ప్రక్రియ పూర్తిచేసింది. సోలార్ ప్లాంట్లను మంచిర్యాల జిల్లా కాసిపేట, మందమర్రి, చెన్నూరు మండలాల్లో 90 యూనిట్ల కోసం ఏర్పాట్లు చేయగా, చెన్నూరులో 11 మెగావాట్ల విద్యుదుత్పత్తికి త్వరలో శ్రీకారం చుట్టనున్నారు. మూడో దశలో రాజస్థాన్‌లోని జైపూర్‌లోని ఎస్టీపీసీలో గల వాటర్ రిజర్వాయర్‌పై పనులు దాదాపు పూర్తయ్యాయి. లోయర్ మానేరు డ్యాం, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల్లోనూ సోలార్ విద్యుదుత్పత్తికి సంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ప్రభుత్వం అనుమతులు జారీ చేస్తే ఈ రెండు చోట్ల 800 మెగావాట్ల విద్యుదుత్పత్తికి సింగరేణి సిద్ధంగా ఉంది. రాజస్థాన్‌లో కూడా మరో 500 మెగావాట్ల సోలార్ విద్యుదుత్పత్తి ప్రారంభించాలనే యోచనలో యాజమాన్యం ఉంది. ఇక సింగరేణి యాజమాన్యం రూ.3వేల కోట్ల అంచనా వ్యయంతో 600 మెగావాట్ల పంప్‌డ్ స్టోరేజీ (జల విద్యుత్తు) కేంద్రాల స్థాపన కోసం పనులు ప్రారంభించింది. ప్రభుత్వం నుంచి ఇప్పటికే అనుమతులు రావడంతో పెద్దపల్లి జిల్లా రామగుండం రీజియన్‌లోని మేడిపల్లి ఓపెన్ కాస్టు (ఓసీపీ) 500 మెగావాట్లతోపాటు ఇల్లందులోని మరో ఓసీపీలో 100 మెగావాట్ల విద్యుదుత్పత్తికి ఏర్పాట్లు చేస్తోంది.


సిద్ధమైన సోలార్ విద్యుత్తు ప్లాంటు

'పంప్‌డ్ స్టోరేజీ' ఇలా...

మేడిపల్లి సింగరేణి ఓసీపీలో బొగ్గునిల్వలు అడుగంటిపోవడంతో ఆ క్వారీని పంప్‌డ్ స్టోరేజీ ప్రాజెక్టు కోసం వినియోగించనున్నారు. క్వారీ ఎగువన మట్టి కుప్పల (ఓవర్ బర్డెన్)పై రిజర్వాయర్ నిర్మించి.. అందులోకి క్వారీలోని నీళ్లను సౌరవిద్యుత్తుతో మోటార్ల ద్వారా పంపింగ్ చేస్తారు. రాత్రి ఆనీళ్లను దిగువకు విడుదల చేసి.. జలవిద్యుదుత్పత్తి చేస్తారు. ఈవిద్యుత్తును యూనిట్‌కు రూ.10చొప్పున విక్రయించేందుకు యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. ఈ ప్లాంట్ల ద్వారా సింగరేణికి రూ.1,134 కోట్ల వార్షిక టర్నోవర్, రూ.425 కోట్లు లాభాలుంటాయని చెబుతున్నారు.

ఆర్ అండ్ బీ ఎన్.హెచ్ అధికారిగా మధుసూదన్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ పరిధిలోని జాతీయ రహదారుల విభాగం అధికారిగా పి.మధుసూదన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు ఈ పోస్టులో కొనసాగిన ఐ.గణపతిరెడ్డి రాజీనామా చేయడంతో ఆర్ అండ్ బీ ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా పనిచేస్తున్న మధుసూదన్‌కు ప్రభుత్వం ఈ బాధ్యత అప్పగించింది. కాగా రెగ్యులర్ ఈఎన్‌సీ పోస్టు నుంచి గణపతిరెడ్డి 2017లోనే రిటైర్డ్ అయినప్పటికీ గత ప్రభుత్వం దాదాపు ఏడేళ్లు సర్వీసును పొడిగిస్తూ వచ్చింది. ఆయన ఆధ్వర్యంలోనే సచివాలయం, ప్రగతిభవన్, సమీకృత జిల్లా కలెక్టరేట్లు, వివిధ ఆసుపత్రుల నిర్మాణాలు జరిగాయి. తాజాగా వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రితో పాటు, హైదరాబాద్‌లోని అల్వాల్, సనత్ నగర్, ఎల్బీ నగర్‌లో నిర్మితమవుతున్న ఆస్పత్రుల భవనాలకు సంబంధించి అంచనాల పెంపుపై ప్రస్తుత ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించిన నేపథ్యంలో గణపతిరెడ్డి తన పదవికి రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.

మాజీమంత్రి కబ్జాల వల్లే అపార నష్టం

కాంగ్రెస్ పార్టీకి దాడులు చేసే సంస్కృతి లేదు.. వరదలను జాతీయ విపత్తుగా పరిగణించాలి

- కేసీఆర్‌లా మేము ఫాంహౌస్‌లో కూర్చోలేదు
- మీడియాతో మంత్రి పొంగులేటి
- 2 బాధిత కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం

హైదరాబాద్,కూసుమంచి/నేలకొండపల్లి/కారేపల్లి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఓ మాజీమంత్రి కాల్వలను కబ్జా చేయడం వల్లే ఖమ్మం జిల్లాకు పెనుముప్పు వాటిల్లిందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. ఆ కబ్జాల వల్ల వరద నీరు ప్రవహించే దారి లేకుండా పోయిందని విమర్శించారు. కాల్వలు సరిగ్గా ఉండి ఉంటే నష్టం ఎంతో కొంత తగ్గి ఉండేదన్నారు. ఖమ్మం జిల్లాలోని పలు మండలాల్లో వరద బాధితులను బుధవారం ఆయన పరామర్శించారు. షేక్ యాకూబ్-సైదాబీ దంపతులు, తండ్రీకూతుళ్ల మోతీలాల్, అశ్విని మృతి చెందిన నేపథ్యంలో ఆయా కుటుంబాలకు రూ.10లక్షల చొప్పున మొత్తం రూ.20లక్షల పరిహారం అందజేశారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల సీఎం ఖమ్మం పర్యటనకు వచ్చిన సందర్భంలోనూ పంట కాల్వల కబ్జా విషయాన్ని ప్రస్తావించారని గుర్తుచేశారు. ఆ తర్వాత ఇక్కడకు వచ్చిన ఆ పార్టీ ముఖ్య నేతలెవరూ దీనిపై స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. బాధితులకు జరిగిన నష్టాన్ని అర్థం చేసుకుని ఆవేదన వ్యక్తం చేస్తే, వారిపై దాడులు చేశామని ప్రచారం చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీకి దాడులు చేసే సంస్కృతి లేదన్నారు. ఇప్పటికైనా సదరు మాజీమంత్రి ప్రభుత్వ భూమిని తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా ఖమ్మం, భద్రాద్రి, ములుగు, సూర్యాపేట, మహబూబాబాద్, నల్లగొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో రూ.5,438 కోట్ల మేర నష్టం వాటిల్లిందని పొంగులేటి తెలిపారు. వరదలను జాతీయ విపత్తుగా ప్రకటించి, తక్షణమే రూ.2వేల కోట్లు ఇవ్వాలంటూ కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసినట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2022లో వరదలు వచ్చినప్పుడు క్లౌడ్ బరస్ట్ అని, విదేశీ కుట్ర అని మతి లేని ప్రకటనలు చేసిన బీఆర్ఎస్ నాయకులకు.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత లేదని పొంగులేటి స్పష్టం చేశారు. కేసీఆర్ మాదిరిగా తాము ఫాంహౌస్‌లో కూర్చోలేదని ఒక ప్రకటనలో తెలిపారు. దొర గారి అల్లుడు హరీశ్.. తాజా పరిస్థితులను కూడా కుట్ర కోణంలోనే చూస్తున్నారని ఎద్దేవా చేశారు. జైలు నుంచి వచ్చిన బిడ్డను ఆశీర్వదించడానికి కేసీఆర్‌కు సమయం ఉంది కానీ, కష్టాల్లో ఉన్న ప్రజలను పరామర్శించడానికి గడప దాటలేకపోతున్నారని ధ్వజమెత్తారు. ఇక.. ఆయన కుమారుడు కేటీఆర్ అమెరికాలో ఉండి, రాష్ట్రంలో ఏం జరుగుతుందో తెలియకుండా సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.


మోతీలాల్ భార్య నేజాకి చెక్కు అందజేస్తున్న పొంగులేటి

బాధితుల ఖాతాల్లోకే వరద సాయం: తుమ్మల

ఖమ్మం, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. వరద బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన ఆర్థిక సాయాన్ని.. బాధితుల బ్యాంకు ఖాతాల్లోనే నేరుగా జమ చేస్తామని చెప్పారు. ఖమ్మంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖమ్మం పట్టణంతోపాటు జిల్లాలో 7,400 ఇళ్లు వరద ముంపునకు గురయ్యాయని మంత్రి చెప్పారు. వరద బాధితుల్లో ప్రతి కుటుంబానికి 10 కిలోల బియ్యం, రగ్గులు, రెండు జతల చీరలు, నూనెప్యాకెట్, కూరగాయలు, నిత్యావసర వస్తువుల కిట్లను అందిస్తున్నామని తెలిపారు. ఇంటింటి సర్వే నిర్వహించే.. వరద బాధితుల వివరాలతో పాటు బ్యాంకు ఖాతా వివరాలు తీసుకుని ఆర్థిక సాయాన్ని ఆ ఖాతాలోనే జమ చేస్తామని వివరించారు. వరద బాధితులను ఆదుకునేందుకు ప్రజలు ముందుకు రావాలని కోరారు.

సిరిసిల్లకు పవర్‌లూం క్లస్టర్ మంజూరు చేయండి

- కేంద్ర టెక్స్‌టైల్ శాఖ మంత్రికి కేంద్రమంత్రి బండి సంజయ్ వినతి

సిరిసిల్ల, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : సిరిసిల్లకు పవర్‌లూం క్లస్టర్ మంజూరు చేయాలని, అందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర టెక్స్‌టైల్ శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్‌ను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కోరారు. ఢిల్లీలో టెక్స్‌టైల్ శాఖ మంత్రికి బండి సంజయ్ బుధవారం వినతిపత్రం అందజేశారు. మెగా పవర్‌లూం క్లస్టర్‌తో పాటు 'నేషనల్ హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్' ఆధ్వర్యంలో నేతన్నలు కొనుగోలు చేసేందుకు అవసరమయ్యే యార్న్ డిపో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. యార్న్ ఖర్చుల కారణంగా నేతన్నలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో సబ్సిడీని 80 శాతం మేరకు పెంచాలని కోరారు. సిరిసిల్లలో పవర్‌లూం క్లస్టర్ ఏర్పాటు చేస్తే వేలాది మంది నేత కార్మికులకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. యార్న్ డిపోతో ముడిసరుకులు తక్కువ ధరకు, సులభంగా లభిస్తాయని తెలిపారు. పావలా వడ్డీకే రుణాలు ఇవ్వాలని కోరారు. టెక్స్‌టైల్ శాఖ మంత్రి స్పందిస్తూ పవర్‌లూం క్లస్టర్, యార్న్ డిపో మంజూరుపై సానుకూలంగా నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. యార్న్ సబ్సిడీ, పావలా వడ్డీ రుణాలపై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.


గిరిరాజ్ సింగ్‌కు వినతిపత్రం అందజేస్తున్న బండి సంజయ్


ట్రిపుల్ ఐటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులు

బాసర ట్రిపుల్ ఐటీలో మళ్లీ విద్యార్థుల ఆందోళన

- రెగ్యులర్ వీసీ నియామకంతో పాటు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

బాసర, సెప్టెంబరు 4: నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో విద్యార్థులు మరోసారి ఆందోళన బాట పట్టారు. రెగ్యులర్ వైస్ చాన్స్‌లర్ నియామకంతో పాటు వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బుధవారం సుమారు 2 వేల మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైస్ చాన్స్‌లర్ భవనం ఎదుట నిరసన చేపట్టారు. అధికారులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ.. ప్లకార్డులతో బైఠాయించారు. మొత్తం 17 అంశాలతో కూడిన డిమాండ్లను విద్యార్థులు అధికారుల ముందు ఉంచారు. స్థానికంగా ఉండే రెగ్యులర్ వీసీ నియామకంతో పాటు హాస్టల్ గదుల్లో, మెస్సుల్లో, విద్యాబోధనలో ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. యాక్షన్ కమిటీగా ఏర్పడిన విద్యార్థులు సుమారు గంటన్నర పాటు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. తమ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని.. లేదంటే శాంతియుతంగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని చెప్పారు.


కోదండరాంకు సన్మానం చేస్తున్న నరసయ్య, బద్రుద్దీన్, తదితరులు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: కోదండరాం

చిక్కడపల్లి, కవాడిగూడ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తన పదవిని బాధ్యతగా భావించి ప్రజా సమస్యలను చట్టసభలో లేవనెత్తి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలంగాణ జన సమితి (టీజేఎస్) రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ప్రొ.కోదండరాం అన్నారు. టీజేఎస్ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు ఎం.నరసయ్య ఆధ్వర్యంలో బుధవారం త్యాగరాయ గానసభలో కోదండరామ్‌కు ఆత్మీయ పౌర సన్మాన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి కోసం అన్ని వర్గాలు, సమూహాలు, ఉద్యమకారులు, సంఘాలతో కలిసి ఎప్పటిలాగే పనిచేస్తానన్నారు. ప్రొ.జయశంకర్ సమకాలీకుడు చంద్రశేఖర్, నరసయ్య, టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బద్రుద్దీన్, తదితరులు మాట్లాడారు. అంతకు ముందు లోయర్ ట్యాంక్‌బండ్ కట్టమైసమ్మకు కోదండరాం పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక ఓపెన్‌టాప్ జీపులో ఆయనను ఊరేగింపుగా లోయర్ ట్యాంక్‌బండ్, మీదుగా త్యాగరాయ గానసభకు తీసుకెళ్లారు.

బిడ్డర్లకు తక్కువ ధరకు వడ్లిచ్చి.. బియ్యాన్ని ఎక్కువకు కొనుగోలు!

- సివిల్ సప్లైస్‌పై పెద్ది సుదర్శన్ రెడ్డి హైకోర్టులో పిల్..

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వడ్లను బియ్యంగా మార్చే ప్రక్రియలో బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా తెలంగాణ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ లిమిటెడ్ (టీఎస్‌సీఎస్‌సీఎల్) నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని టీఎస్‌సీఎస్‌సీఎల్ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ వద్ద ఉన్న వడ్లను మార్కెట్ ధరకన్నా అతి తక్కువ ధరకు విక్రయిస్తూ.. బియ్యంగా మార్చాక వారి దగ్గరి నుంచి అత్యంత ఎక్కువ ధరకు కొంటున్నారని ఆయన ఆరోపించారు. ఫలితంగా సర్కారు ఖజానాకు మెట్రిక్ టన్నుకు రూ.32,799 చొప్పున నష్టం జరుగుతోందని.. మొత్తం ప్రక్రియ ద్వారా రూ.1100 కోట్ల మేర నష్టం జరిగేలా అక్రమాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి పూర్తి ఆధారాలు ఉన్నాయంటూ ఆయన హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేశారు. ఈ పిటిషన్ చీఫ్ జస్టిస్ ధర్మాసనం ఎదుట త్వరలో విచారణకు రానుంది.

నియంత్రణ లేని పేలుళ్లతో ఇబ్బందులు

- జూబ్లీహిల్స్ న్యాయవిహార్ వద్ద పేలుళ్లపై హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తులు నివాసం ఉండే జూబ్లీహిల్స్ న్యాయవిహార్ పరిసర కొండ ప్రాంతంలో నియంత్రణ లేని పేలుళ్లపై వివరణ ఇవ్వాలని హైకోర్టు ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. ఈమేరకు కౌంటర్లు దాఖలు చేయాలని పేర్కొంటూ గనులు, భూగర్భవనరుల శాఖ, పర్యావరణం, అటవీ, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శులు, కాలుష్య నియంత్రణ మండలి(టీజీపీసీబీ), గనులశాఖ డైరెక్టర్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, జీహెచ్ఎంసీ కమిషనర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. జూబ్లీహిల్స్‌లోని కొండల్లో నిత్యం పేలుళ్లు చేపట్టడంపై పత్రికల్లో వచ్చిన కథనాలపై హైకోర్టు సుమోటోగా విచారణకు స్వీకరించింది. పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా చర్యలు తీసుకోవాలని పేర్కొంటూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ భీమపాక చీఫ్ జస్టిస్‌కు లేఖ రాశారు. రోజుకు కనీసం పది సార్లు పేలుళ్లు జరుపుతున్నారని, తద్వారా చుట్టుపక్కల నివాస సముదాయాల్లో ఉండేవారికి కంటి మీద కునుకు లేకుండా పోతోందని పేర్కొన్నారు. నియంత్రణ లేకుండా రాత్రి సమయాల్లో సైతం పేలుళ్లు చేపడుతున్నారు. పేలుళ్లు నిత్యకృత్యంగా మారడంతో చుట్టుపక్కల ప్రాంతాల వాళ్లు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె. శ్రీనివాసరావు ధర్మాసనం.. కాలుష్య నియంత్రణ మండలి తీరుపై అసహనం వ్యక్తం చేసింది. పీసీబీ ప్రజల కోసం కాకుండా పరిశ్రమల ప్రయోజనం కోసం పనిచేస్తోందని వ్యాఖ్యానించింది. ఈమేరకు ప్రతివాదులందరికీ నోటీసులు జారీ చేస్తూ విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది.

ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం..

ఆసిఫాబాద్‌లో ఏజెన్సీ బంద్ ఉద్రిక్తం

జైనూరు మండల కేంద్రానికి వేలాదిగా ఆదివాసీలు.. నిందితుడి ఇల్లు ధ్వంసం, నిప్పు

- ఓ వర్గానికి చెందిన దుకాణ సముదాయంపై దాడి
- బాధితురాలికి ప్రభుత్వం తరపున న్యాయం: సీతక్క
- నిందితుడిపై వెంటనే చర్యలెందుకు తీసుకోలేదు
- డీజీపీని ఆరా తీసిన కేంద్ర మంత్రి బండి సంజయ్

జైనూరు/అడ్డగుట్ట/ఆసిఫాబాద్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా జైనూరు మండలానికి చెందిన ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం, దాడి ఘటన ఏజెన్సీ ప్రాంతంలో ఉద్రిక్తతలను సృష్టించింది. ఆదివాసీ సంఘాలు పిలుపునిచ్చిన బంద్‌కు సంపూర్ణ మద్దతు లభించింది. నిందితుడిని ఉరి తీయాలంటూ వేలాది మంది ఆదివాసీలు జైనూరు మండల కేంద్రానికి తరలివచ్చి నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. నిందితుడి ఇంటిని ధ్వంసం చేసి నిప్పు పెట్టారు. ఆ తర్వాత.. అతడిని వెంటనే శిక్షించాలంటూ ఆందోళన నిర్వహించారు. ఆ తర్వాత ఆదివాసీలు మండల కేంద్రంలోని ఓ వర్గానికి చెందిన దుకాణ సముదాయంలోని పాన్‌షాపులోని సామగ్రిని రోడ్డుపైకి తీసుకువచ్చి నిప్పంటించారు. దీంతో ఆ వర్గం వారు ఆందోళనకు దిగి కొంతమంది దుకాణాలను ధ్వంసం చేశారు. ఇరువర్గాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఆందోళనకారులను అదుపు చేయడానికి ప్రత్యేక పోలీసు బలగాలను రంగంలోకి దించాల్సి వచ్చింది.

కఠిన శిక్ష పడేలా చేస్తాం: మంత్రి సీతక్క

బాధితురాలికి ప్రభుత్వం తరపున న్యాయం చేస్తామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని సీతక్క బుధవారం పరామర్శించి వివరాలను తెలుసుకొన్నారు. నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారని, అతనికి కఠినశిక్ష పడేలా చేస్తామన్నారు. మరోవైపు, ఆదివాసీ మహిళపై అత్యాచారయత్నం అమానుషమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. బుధవారం డీజీపీ జితేందర్‌కు సంజయ్ ఫోన్ చేసి జైనూర్‌లో తలెత్తిన ఉద్రిక్తత పరిస్థితులపై ఆరా తీశారు. నిందితుడిపై చర్యలెందుకు తీసుకోలేదని నిలదీశారు.

అసలు ఏం జరిగిందంటే..!

జైనూరు మండలానికి చెందిన ఆదివాసీ మహిళ ఆగస్టు 31న సిర్పూర్(యూ) మండలంలోని తన తల్లిగారి గ్రామానికి నడుచుకుంటూ వెళ్తుండగా సోనుపటేల్‌గూడకు చెందిన నిందితుడు ఆమెను తన ఆటోలో ఎక్కించుకున్నాడు. రాఘాపూర్ దాటిన తర్వాత అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఆమె ప్రతిఘటించడంతో చితకబాదాడు. దీంతో ఆ మహిళ స్పృహ కోల్పోయింది. ఆమె చనిపోయిందేమోనని భావించిన నిందితుడు.. యాక్సిడెంట్ జరిగినట్లుగా ఆ మహిళను రోడ్డుపై పడేసి పరారయ్యాడు. ఆ రోడ్డుపై వెళ్లే వాళ్లు ఆమెను ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆమెపై అత్యాచార యత్నం, దాడి జరిగిందన్న విషయం బాధిత మహిళ స్పృహలోకి వచ్చి చెప్పేవరకు పోలీసులకు తెలియదు. కాగా, బాధిత మహిళ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సిర్పూర్(యూ) పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 1న కేసు నమోదు చేశారు. మరోవైపు, ఈ ఘటనపై ఆదివాసీ సంఘాలు మంగళవారమే జైనూరులో ఆందోళనకు దిగి.. బుధవారం ఏజెన్సీ బంద్‌కు పిలుపునిచ్చారు.


ఆదివాసీలు ధ్వంసం చేసిన నిందితుడి ఇల్లు

జైనూర్‌లో 144 సెక్షన్, ఇంటర్నెట్ బంద్

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జైనూర్‌లో శాంతి, భద్రతలు అదుపులోకి వచ్చినట్లు పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించారు. ముందు జాగ్రత్త చర్యగా జిల్లా యంత్రాంగం స్థానికంగా 144 సెక్షన్ విధించింది. సోషల్ మీడియాలో వదంతులు ప్రచారం చేయకుండా ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. పోలీస్ పికెటింగ్‌లను ఏర్పాటు చేశారు. జైనూర్‌లో పరిస్థితుల్ని డీజీపీ జితేందర్, అదనపు డీజీపీ (శాంతి భద్రతలు) మహేశ్ భగవత్ ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సర్కారు సిద్ధం

- టీజీఈజేఏసీ నేతలకు భట్టి భరోసా

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు. బుధవారం సచివాలయంలో తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీజీఈజేఏసీ) చైర్మన్ మారం జగదీశ్వర్, నేతలు ఏలూరి శ్రీనివాసరావు, సైదులు డిప్యూటీ సీఎంను కలిసి 39 డిమాండ్ల వినతి పత్రాన్ని అందజేశారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏల విడుదల, 51% ఫిట్‌మెంట్, హెల్త్ కార్డుల జారీ, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని కోరారు. భట్టి స్పందిస్తూ.. ఇందిరమ్మ రాజ్యంలోని ప్రజా ప్రభుత్వం ఉద్యోగుల పట్ల సానుకూల దృక్పథంతో ఉందన్నారు.

కుంభవృష్టి.. సుడిగాలులే కారణం

మేడారం అడవుల్లో వేలాది చెట్లు కూలిపోవడంపై చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియల్

తాడ్వాయి, సెప్టెంబరు 4: ములుగు జిల్లా తాడ్వాయి అడవుల్లో వేలాదిగా చెట్లు కూలిపోయిన ప్రాంతాన్ని బుధవారం ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆర్ఎం డోబ్రియల్ పరిశీలించారు. గత నెల 31న రాత్రి 500 ఎకరాల్లో విస్తరించిన 50 వేలకుపైగా వివిధ రకాల చెట్లు నేలమట్టమయ్యాయి. ఈ విధ్వంసానికి కుంభవృష్టితోపాటు బలమైన గాలులు వీయడమే కారణమని డోబ్రియల్ తెలిపారు. ఈ ప్రాంతంలో మంచి నేల ఉందని, పైనే మినరల్స్ దొరకడం వల్ల చెట్ల వేర్లు భూమి లోతుకు వెళ్లలేదన్నారు. చాలా చెట్ల వేర్లు ఒక అడుగు లోతుకు మాత్రమే వెళ్లాయన్నారు. నలుదిశల నుంచి గాలి బలంగా వీయడం, చెట్లు వేళ్లూనుకుని లేకపోవడంతో సునాయాసంగా కూలిపోయాయన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక సమర్పిస్తామన్నారు. ఈ ప్రాంతంలో సహజంగానే చెట్లు పెరుగుతాయని, మళ్లీ అడవి దట్టంగా మారుతుందన్నారు.

కేంద్రం పరిశోధన చేయించాలి: సీతక్క

ములుగు: ఈ ఘటనపై కేంద్రం స్పందించి సమగ్ర పరిశోధన చేయించాలని మంత్రి ధనసరి సీతక్క కోరారు. ఇలాంటి విపత్తులు సంభవించే అవకాశాలున్న ప్రాంతాల ప్రజలను ముందుగా అప్రమత్తం చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ స్పందించి అడవి పునరుద్ధరణ, సంరక్షణ కోసం నిధులు మంజూరు చేయించాలని కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

నెతన్యాహుపై నిరసన

ఇజ్రాయెల్‌లో సోమవారం దేశవ్యాప్త సమ్మె జరిగింది. ప్రధాని బెంజమీన్ నెతన్యాహూ గాజా యుద్ధం మొదలుపెట్టిన తరువాత ఇంతటి విస్తృతస్థాయి సమ్మె జరగడం ఇదే మొదటిసారి. ఇజ్రాయెల్‌లోని అతిపెద్ద కార్మిక సంఘమైన హిస్ట్రాడ్రట్ ఈ సమ్మెకు పిలుపునిచ్చింది. అన్ని వ్యాపార వాణిజ్యసంస్థలూ, పరిశ్రమలు, విద్యాసంస్థలు సమ్మెలో పాలుపంచుకున్నాయి. బ్యాంకులు, ప్రభుత్వకార్యాలయాలు, షాపింగ్ మాల్స్ మూతపడ్డాయి. ఆర్థికవ్యవస్థకు ఆయువుపట్టులాంటి రంగాలన్నీ పనిచేయకపోవడం ఈ సమ్మె లక్ష్యం కనుక, అది నెరవేరినట్టే. హమాస్ చెరలో బందీలుగా ఉన్న వారిని విడిపించడంలో నెతన్యాహూ వైఫల్యాన్ని నిరసిస్తూ ఈ సమ్మె జరిగింది. ఆదివారం నాడు బందీల్లో ఆరుగురు చనిపోయిన స్థితిలో కనిపించడంతో ఇజ్రాయెలీల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. సొరంగంలో బందీలుగా ఉంచిన ఈ ఆరుగురినీ తమ సైన్యం అక్కడకు చేరుకోగానే హమాస్ అంతం చేసిందని ఇజ్రాయెల్ ఆరోపిస్తోంది. యుద్ధాన్ని కొనసాగించడం ద్వారా నెతన్యాహూ ఏమీ సాధించలేరనీ, తక్షణమే కాల్పుల విరమణ ఒప్పందం చేసుకోవాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో భాగంగా దేశవ్యాప్తంగా పలు పట్టణాలు, నగరాల్లో ర్యాలీలు జరిగాయి. రాజకీయ దురుద్దేశంతో పిలుపునిచ్చిన ఈ సమ్మెను నిలువరించాలంటూ ఇజ్రాయెల్ ప్రభుత్వం న్యాయస్థానాల్లో వాదించినప్పటికీ ప్రయోజనం లేకపోయింది.

ఒకపక్క యుద్ధం సాగుతూ, మరోపక్కన చర్చలు మరింత వెనక్కుపోతున్న స్థితిలో హమాస్ చేతుల్లో బందీలుగా ఉన్నవారు మరణించడం తప్ప, బయటకు రావడం అసాధ్యమని ఇజ్రాయెలీలకు అర్థమైపోయింది. హమాస్ దాడిజరిగి మరోనెలలో సంవత్సరం అవుతుంది. గత ఏడాది అక్టోబర్‌లో ఇజ్రాయెల్‌పై దాడిచేసిన హమాస్ దాదాపు పన్నెండువందలమందిని చంపి, 250మందిని బందీలుగా అపహరించుకుపోయింది. వీరిలో వందమంది ఆ తరువాత విడుదలైనప్పటికీ, ఈ పదకొండునెలల కాలంలో చనిపోయినవారు కాక, మరో వందమంది ఇంకా హమాస్ గుప్పిట్లోనే ఉన్నారు. యుద్ధం సాగుతూంటే మరింతమంది హత్యకు గురయ్యే ప్రమాదమూ ఉంది. ఈ సమ్మె వెనుక ఏవో కుట్రలున్నాయనీ, రాజకీయ కక్షలున్నాయని నెతన్యాహూ ప్రభుత్వం వాదిస్తున్నది కానీ, ఆయన యుద్ధపిపాసి అని ఇజ్రాయెలీలకు తెలుసు.

యుద్ధం ముగిసి, ఎన్నికలు జరిగితే నెతన్యాహూ ఓడిపోవడం ఖాయమని చాలా విశ్లేషణలు వచ్చాయి. దానిని కొనసాగించడం ద్వారా ఇప్పుడున్న విస్తృతమైన అధికారాలను చెలాయించడంతోపాటు, తనకు రాజకీయంగా లబ్ధిచేకూరుతుందన్న నమ్మకం కుదిరినప్పుడే ముగించవచ్చునని నెతన్యాహూ అనుకుంటున్నారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదరకుండా అడ్డుపడుతున్నది ఇజ్రాయెల్ ప్రధాని కదూ అన్న ప్రశ్నకు అవును ఆయనేనని అమెరికా అధ్యక్షుడు విలేకరులముందు ఒప్పుకోవాల్సివచ్చింది. ఈ అంగీకారం బాగున్నది కానీ, నెతన్యాహూ మొండితనాన్ని నిలబెడుతున్నది అమెరికాయే. చర్చల్లో హమాస్ కొంత దిగివచ్చినా ఏదో కారణంతో అవి సాగనివ్వకుండా చేస్తున్నారు. బందీలందరినీ విడిచిపెట్టేవరకూ యుద్ధం సాగిస్తానన్న ఆయన వాదనను దేశప్రజలు మెచ్చడం లేదు. బందీలను వదిలేశాక ఆయన ఇంకెంత విధ్వంసానికి పాల్పడతాడో హమాస్‌కు తెలుసు. యుద్ధం ఆపి, ఇజ్రాయెల్ తన సేనలను ఉపసంహరించుకున్న పక్షంలోనే బందీలను విడిచిపెడతానన్న వాదననుంచి హమాస్ కాస్తంత సడలిందని కూడా వార్తలు వచ్చాయి. ఈజిప్ట్–గాజా సరిహద్దు ప్రాంతంనుంచి ఇజ్రాయెల్‌సేనలు వెనక్కుపోవాలన్న హమాస్ డిమాండ్ కూడా చర్చల్లో ప్రతిష్టంభనకు కారణమంటారు. ఇక్కడ వెనక్కుతగ్గి చర్చలకు సానుకూలత ప్రదర్శించి, అంతిమంగా బందీలను విడిపించుకుందామని సన్నిహితులనుంచే ఒత్తిడి వస్తున్నప్పటికీ నెతన్యాహూ ఒప్పుకోవడం లేదు. టీకాలు వేయించుకుంటున్న పిల్లలమీద కూడా బాంబులు కురిపించి హతమార్చడానికే ప్రాధాన్యం ఇస్తున్నాడు. యుద్ధాన్ని ఆపి, చర్చలకు మొగ్గుచూపిన మరుక్షణంలో సంకీర్ణ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని కూటమిలోని మితవాద, మతవాద భాగస్వామ్య పక్షాలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఆయన చర్చల ఊసెత్తబోరని విశ్లేణలు సాగుతున్నాయి. నిజానికి, హమాస్ దాడి, బందీల అపహరణను తీవ్రంగా నిరసిస్తూ, నెతన్యాహూ ప్రతీ చర్యనూ సమర్థిస్తూ ఆయనకు అండగా ఉండాల్సిన ప్రజలు, అందుకు పూర్తి భిన్నంగా నిరసన ప్రదర్శనలు చేయడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఆదివారం నాటి భారీ ప్రదర్శనలు, సోమవారం దేశవ్యాప్తంగా జరిగిన సమ్మె ఓ వందమంది బందీలు, వారి బంధువులతో ముడిపడిన విషయం కాదనీ, నెతన్యాహూ మీద దేశప్రజలకు ఇక ఏమాత్రం విశ్వాసం లేదనడానికి నిదర్శనమని విశ్లేషకుల అభిప్రాయం.



కృత్రిమ మేధ పేరిట మన సమాజం ఉపాధ్యాయుడు లేని విద్య దిశగా ఆలోచనలు చేస్తోంది. ఇది మంచి పరిణామం కాదు. గురువు స్థానంలో ఓ కృత్రిమ మేధ బొమ్మను ఉంచి చిలక పలుకులు పలికిస్తే చదువు వస్తుంది. చదువు వస్తుందేమో గానీ, సంస్కారం ఎక్కడ నుంచి వస్తుంది? జీవన వికాసానికి నవ్యమార్గాలను నిర్మించే మహోన్నత విద్యాయజ్ఞాన్ని నిర్వహించిన సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తితో భావి తరాలకు వెలుగు బాటలు వేయాలి.

సర్వేపల్లి స్ఫూర్తితో భావి పౌరుల శిక్షణ

సమాజమంతా నేటి గురించి ఆలోచిస్తూ ఉంటుంది. కానీ రేపటి సమాజాన్ని గురించి ఆలోచించే మహోన్నత వ్యక్తిత్వం గురువుల సొంతం. వారు ఈ రోజు తీసుకునే ప్రతి నిర్ణయం వెనుక భవిష్యత్‌ను మహోన్నతంగా నిర్మించాలన్న సంకల్పమే ఉంటుంది. అందుకే ఉపాధ్యాయులు రేపటి ఆశలకు సారథులుగా, భవిష్యత్ నిర్మాణానికి వారధులుగా నేను భావిస్తాను. తమ కోసం ఆలోచించుకోకుండా, భవిష్యత్ గురించి కలలు కనటం బహుశా వారికే చెల్లింది. అందుకే విద్యాబుద్ధులు నేర్పించే ఉపాధ్యాయులకు ఈ సమాజం ఎప్పుడూ రుణపడి ఉంటుంది. అలాంటి ఉపాధ్యాయులందరినీ గౌరవించుకునేందుకు భారతదేశ మొదటి ఉపరాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి అయిన సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని భారత ప్రభుత్వం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించింది. జీవన వికాసానికి నవ్య మార్గాలను నిర్మించే మహోన్నత విద్యాయజ్ఞాన్ని నిర్వహించి ఉన్నత పదవులను అధిష్ఠించిన రాధాకృష్ణన్ స్మృతికి ఈ సందర్భంగా నివాళులు అర్పించటంతో పాటు, ఆయన చూపిన ఆదర్శనీయ మార్గాన్ని భావి తరాలకు ఆచరణలో చూపెట్టాలని ఆకాంక్షిస్తున్నాను.

ఉపాధ్యాయ వృత్తి ఉద్యోగం కాదు. నాలుగు డబ్బులు సంపాదించుకునే మార్గమూ కాదు. అది రేపటి సమాజాన్ని సృష్టించే ఓ మహా యజ్ఞం. ఆ యజ్ఞాన్ని మహోన్నతంగా నిర్వహించి, భవిష్యత్తును నిర్మించిన మహనీయులు ఎంతో మంది ఉన్నారు. వారందరికీ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రణతులు అర్పిస్తున్నాను. గతమంతా శృతంగా సాగిన భారతీయ విద్యా వ్యవస్థలో గురువు స్థానం మహోత్కృష్టమైనది. శిష్యులను కుమారుల కంటే ఎక్కువగా చూసిన గొప్పతనం గురువులదైతే, గురువును తల్లిదండ్రుల కంటే గొప్పగా గౌరవించిన సంస్కారం శిష్యుల సొంతం. మైసూరు రాజా వారి కళాశాలలో పని చేసి బదిలీ అవుతున్న సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను అక్కడి విద్యార్థులు గుర్రపు బగ్గీలో ఊరేగిద్దామనుకుని, సమయానికి గుర్రాలు రాకపోతే స్వయంగా వారే బండి లాగి తమ గురువు పట్ల గౌరవాన్ని చాటుకున్నారు. ఈ సంఘటనకు మొదటి కారణం తరతరాలుగా మన రక్తంలో జీర్ణించుకుపోయిన గురుశిష్య సంబంధం ఒక కారణమైతే, రెండోది సర్వేపల్లి వారు ఆ విద్యార్థుల్లో నాటిన సంస్కార బీజాలు.

ఇటీవల పత్రికల్లో చదివాను. ఇదే విధమైన గౌరవాన్ని శిష్యుల నుంచి పొందిన గురువు గురించి, గురువు బదిలీ అయ్యి వెళుతుంటే కన్నీళ్ళు పెట్టుకున్న శిష్యుల గురించి. ఇదో మంచి పరిణామం. కాలం మారుతోందని మనం నమ్మి తీరాల్సిన వాస్తవం. అయితే మన పెద్దలు నాటిన సంస్కార బీజాల కారణంగా కాలం మారుతున్నా, గురుశిష్య సంబంధాల్లో ఇలాంటి సానుకూల పరిణామాలనే నేను ఆకాంక్షిస్తున్నాను. అయితే కారణాలు ఏవైనా కావచ్చు అక్కడక్కడా మానవీయ విలువలు పలుచనైపోయి, మానవసంబంధాలు ప్రతికూల మార్గంలో వెళుతున్న సంఘటనలు చూస్తూ ఉన్నాం. ఇలాంటి పరిస్థితి రాకూడదంటే మన బోధనా విధానాల్లో మార్పు రావలసిన అవసరం ఎంతైనా ఉంది. మన విద్యా వ్యవస్థలో గురువులపైన ఉన్న నమ్మకం సన్నగిల్లలేదు. ఉపాధ్యాయుడు చెప్పింది పొరపాటున ఒకవేళ వాస్తవం కాదని చెప్పినా, మా ఉపాధ్యాయుడు సరిగానే చెబుతాడు అనే నమ్మకం విద్యార్థుల్లో బలంగా ఉంది. మన విద్యావ్యవస్థ మూలాలు బలంగా ఉన్నాయని చెప్పటానికి ఇదొక్కటి చాలు. అయితే బలమైన మూలాల నుంచి మరింత



పటిష్ఠమైన భావి భారత నిర్మాణం రూపుదిద్దుకోవాలంటే చదువులోని నిజమైన పరమార్థాన్ని తెలియజెప్పే విధంగా ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించాలి.

నేను అనేక సందర్భాల్లో చెప్పినట్లు చదువంటే మార్కులు మాత్రమే అనే సంస్కృతి పోవాలి. జ్ఞానాన్ని అందించటంతో పాటు భారతీయ విలువలతో కూడిన విద్యను బోధించాలి. ఇందుకోసం విద్యా విధానాల్లో మార్పులు రావలసిన అవసరం ఉంది. ఋగ్వేదం చెప్పినట్లుగా 'ఆనో భద్ర\ కృతవో\ యంతు\ విశ్వతః' అంటే ఉత్తమమైన భావాలు అన్నివైపుల నుంచి రావాలి. దీన్ని విస్తృత అర్థంలో ఆకళింపు చేసుకోవలసిన అవసరం ఉంది. విద్యార్థులు తరగతి గదుల నుంచి, పుస్తకాల నుంచి మాత్రమే కాదు సమాజం నుంచి, ప్రకృతి నుంచి నేర్చుకోవలసింది ఎంతో ఉంది. మొక్కలను చూసి ఎదగడం, పక్షులను చూసి ఎగరడం, చెట్టును చూసి సాయం... ఇలా ఎన్నింటినో నేర్చుకోవచ్చు. అప్పుడే విద్యార్థుల్లో నిజమైన నైపుణ్యం బయటకు వస్తుంది. దీనితో పాటు ఉపాధ్యాయులు వ్యక్తిగత అలవాట్లు కీలకమే. అవి విద్యార్థులను ప్రభావితం చేస్తాయి. ఈ మధ్య కాలంలో మొబైల్ ఫోన్ పుణ్యమాని కొంతమంది ఉపాధ్యాయుల తీరులోనూ మార్పులు వచ్చాయని అక్కడక్కడా వినిపిస్తోంది. ఇంటి సమస్యలను పాఠశాలల వరకూ మోసుకొచ్చేవారు, పాఠశాల సమయంలోనూ ఇంటి గురించి దిగులుపడేవారు ఉన్నారన్నది వాస్తవం. అలాంటి పరిస్థితుల్లో మార్పు రావాలి. ఉపాధ్యాయుల కోపం, కష్టం లాంటివి పాఠశాలల గోడలకు బయటే ఉండాలి తప్ప, ఆ గోడలు దాటి తరగతి నాలుగు గోడల మధ్యకు రాకూడదనే విషయాన్ని ఉపాధ్యాయులు గుర్తుంచుకోవాలి.

ఈ సందర్భంగా నాకు ప్రహ్లాద చరిత్రలో ఓ ఘట్టం గుర్తుకువస్తోంది. సాక్షాత్తు శ్రీమన్నారాయణుడే దేవుడు కాదు నేనే దేవుణ్ణి అన్న హిరణ్యకశిపుడు సైతం తన కుమారుడికి విద్యను నేర్పేందుకు గురువుల వద్దకే పంపించాడు. చదువులలో మర్మమెల్ల చదివితి తండ్రి అంటూ నిజమైన విద్యలోని పరమార్థాన్ని తెలుసుకోగలిగానన్న ప్రహ్లాదుని జీవితమే ఈ తరాలకు ఆదర్శం కావాలి. ఈ మధ్యకాలంలో కృత్రిమ మేధ పేరిట మన సమాజం గురువు లేని విద్య దిశగా ఆలోచనలు చేస్తోంది. ఇది మంచి పరిణామం కాదు. నేను అనేక సందర్భాల్లో చెప్పినట్లు గూగుల్ సైతం గురువుకు ప్రత్యామ్నాయం కాదు. గూగుల్‌కు సమస్య వచ్చినా దాన్ని తీర్చడానికి గురువే కావాలి. అసలు తరగతి గతంలో 30 మందికి మించి విద్యార్థులు ఉండకూడదు అనే నియమం ఎందుకు పెట్టారన్న కనీస విషయాన్ని ఆలోచించే ఎవరికైనా ఇది అవగతం అవుతుంది. ప్రతి ఒక్కరి పట్ల గురువు శ్రద్ధ వహించాలనేది ఇందులోని పరమార్థం. గురువు స్థానంలో ఓ కృత్రిమ మేధ బొమ్మను ఉంచి చిలకపలుకులు పలికిస్తే చదువు వస్తుంది. చదువు వస్తుందేమో గానీ, సంస్కారం ఎక్కడ నుంచి వస్తుంది? చంపటం ఎలా అని ఎవరైనా గురువును అడిగితే... అది తప్పు అని చెబుతాడు. గూగుల్‌ని అడిగితే మొత్తం వివరాలు అందిస్తుంది. అంటే మనిషి దగ్గర ఉండే ఒకే ఒక మెదడు, సానుకూల ఆలోచనతో సంబంధం లేకుండా భవిష్యత్ తరాలను తయారు చేస్తే పరిస్థితి ఎలా ఉంటుందో మనం గమనించవచ్చు.

గురువు లేని విద్య – గుడ్డి విద్య అని మన పెద్దలు ఏనాడో చెప్పారు. విద్య అంటే నాలుగు మాటలు నేర్పి దాన్ని అదే విధంగా రాస్తే మార్కులు వేసి సర్టిఫికేట్ ఇవ్వటం కాదు. విద్యార్థుల జ్ఞానాన్ని పెంపొందింపజేసి, వారిని భవిష్యత్ పౌరులుగా తీర్చిదిద్దే ఓ అత్యున్నత విధానం. విద్యార్థి మూర్తిమత్వ వికాసం, జ్ఞానాభివృద్ధి సరైన విద్య ద్వారానే సాధ్యమౌతుంది. ప్రపంచంలో ఎన్ని బోధనా పద్ధతులు వచ్చినా, వాటి ప్రధాన ఉద్దేశం ఇదే. విద్య అంటే మార్కుల కోసం నేర్చుకునే అక్షరాలు కాదు... మనుగడ కోసం నేర్చుకోవలసిన సంస్కారం అనే ఆలోచన సమాజంలో రావలసిన అవసరం ఉంది. ఇందుకోసం భారతీయ నూతన విద్యావిధానం సరికొత్త బాటలు వేస్తోంది. వీటిని అధ్యాపకులు వినియోగించుకోవాలి. దీనితో పాటు విద్యార్థులకు మాతృభాషలో బోధించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ మధ్యకాలంలో ఏ మీడియంలో బోధించాలనే విషయం మీద అనేక మల్లగుల్లాలు సాగుతున్నాయి. ప్రాథమిక విద్యాబోధన మాతృభాషలోనే అందించాల్సిన అవసరం ఉంది. అప్పుడే విద్యార్థులను మనవైన విలువలతో పరిపూర్ణంగా తీర్చిదిద్దగలము.

ఎన్ని నూతన విధానాలు వచ్చినా మంచి సమాజం సాకారం కావాలంటే విద్యే మూలాధారం. విద్యకు ఆధారం గురువే. ఇందులో ఎలాంటి సందేహం లేదు. దేశానికి రాజైనా ఒక గురువుకు శిష్యుడే. అది గుర్తుంచుకున్న ప్రతి ఒక్కరూ తాము ఎంత స్థానంలో ఉన్నా గురువులను గౌరవిస్తారు, ఆ వృత్తిని పూజిస్తారు. భారతదేశానికి తలమానికమైన గురుశిష్య సంబంధం భవిష్యత్ తరాలకు ఆదర్శనీయం కావాలని ఆకాంక్షిస్తూ... ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.

• **ముప్పవరపు వెంకయ్యనాయుడు**
పూర్వ ఉపరాష్ట్రపతి

(నేడు జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం)

మనుషులం కదా, ముద్రలూ మూసలూ ఎందుకు?





■ కె. శ్రీనివాస్

సందర్భం

నేను అన్నది ఎంతటి సంఖ్యతో సమానం? లక్షల మంది, కోట్లమంది గురించి లెక్కవేస్తున్నప్పుడు కూడా, 'నేను' పక్కన వేసే విలువ ఎంత? నేను అన్నది ఉనికి. ఆ ఉనికిలో నుంచి సమస్త ప్రపంచం, జీవితం వ్యక్తమవుతుంది. కనీసం తనవరకు అయినా 'నేను'తోనే అంతా పుడుతుంది, అంతా అంతమవుతుంది. అటువంటప్పుడు, తనని తాను కేవలం ఒకటిగా లెక్కించుకుని, పెద్ద అంకె ముందు తనను తక్కువ చేసుకోవడం ఎంత కష్టం? ఇతరులను కాపాడడానికి సాహసం చేయడం సరే, అందుకు సిద్ధపడినప్పుడు తనకు తాను చెప్పుకున్న సమర్థన, అనేక ఇతర ప్రాణాల ముందు తానొక్కడే కదా? ప్రాణాలకు తెగించినందుకే కాదు, 'నేను'ను జయించిన ఈ సమర్థన వల్ల కూడా సుభాన్ మనందరి ఆరాధనలకు అర్హుడు.

ఒక ఉదాత్తమైన మానవీయత తారసపడినప్పుడు, దైనందిన అల్పత్వం నుంచి ఉద్ధరింపు దొరికిన తన్మయ భావన కలుగుతుంది. ఆ క్షణాలను కూడా కలుషితం చేయడానికి కావలసినంత కల్మషం సమాజంలో యథావిధిగా ప్రవహిస్తూనే ఉంటుంది. సుభాన్ మతం గురించిన ప్రస్తావన అటువంటిదే. అతను ముస్లిమ్ కావడాన్ని ఒకరు ఎక్కువచేసినా, మరొకరు తక్కువ చేసినా, అందులో విషాదం తప్ప మరేమీ లేదు. సుభాన్ స్థానంలో ఒక శంకర్ కూడా ఉండి ఉండవచ్చు అతను కూడా మరొక సమర్థనతో ప్రాణాలకు తెగించి ఉండేవాడేమో? మంచితనం ఏ మతస్థులకూ గుత్త సొత్తు కాదు, చెడ్డతనం కూడా అంతే. నేరగాళ్లు, ఉత్తములు ఏ గుర్తింపునకు చెందినవారయినా, ఆ గుర్తింపు సమూహమంతా నేరస్థులూ కాదు, నీతివంతులూ కాదు. సమాజంలో తమ, పర భేదాలను తీవ్రంగా విస్తరింపజేసేవారికి, పరులు మంచిపని చేసినప్పుడు అప్రియంగా ఉంటుంది. పరులకు 'మంచి' పేరు వస్తుందన్న ఉక్రోషం ఉంటుంది. సమాజంలో సహజీవన సంస్కృతి కోరుకునేవారికి మాత్రం ఇటువంటి ఉదంతాలు జరిగినప్పుడు పండగే. వారిది ఒక నిస్సహాయ స్థితి. 'పరులు'గా చిత్రితమయ్యేవారు కూడా మంచివారే అని చెప్పగలిగే ఉదాహరణలు ఇట్లా రూపొందుతూ ఉండాలి, వారికి. అందరూ, కనీసం శ్రమజీవులందరూ, లోలోపల, సారాంశంలో, పదిమంది కోసం, పదిమందితో నిలబడేవారే అని సుభాన్ సాహసం చెబుతున్నది. అంతిమంగా, మనుషులలో ఉండే ఏకసూత్రతను, ఏకరూపతను చాటిచెబుతూ, ఒక సముదాయాన్ని, జనశ్రేణిని మూకుమ్మడిగా ఇతరులుగా, పరులుగా చిత్రించే ద్వేషవైఖరిని పరాజితం చేస్తున్నది. కానీ, ఈ విలువను నిరూపించడం కోసం, మంచివారిగా, త్యాగజీవులుగా ఉండే నిర్బంధ భారాన్ని ఆ 'పరులు' మోయవలసి రావడం విచారం కలిగిస్తుంది. ఎంత మంచితనాన్ని కుమ్మరిస్తే, నిర్మించి నిర్మించి వదిలిన రాక్షసముద్రలు తొలగిపోతాయి?

నేరగాళ్లు, ఉత్తములు ఏ గుర్తింపునకు చెందినవారయినా, ఆ గుర్తింపు సమూహమంతా నేరస్థులూ కాదు, నీతివంతులూ కాదు. సమాజంలో తమ, పర భేదాలను తీవ్రంగా విస్తరింపజేసేవారికి, పరులు మంచిపని చేసినప్పుడు అప్రియంగా ఉంటుంది. పరులకు 'మంచి' పేరు వస్తుందన్న ఉక్రోషం ఉంటుంది. సమాజంలో సహజీవన సంస్కృతి కోరుకునేవారికి మాత్రం ఇటువంటి ఉదంతాలు జరిగినప్పుడు పండగే. అందరూ, కనీసం శ్రమజీవులందరూ, లోలోపల, సారాంశంలో, పదిమంది కోసం, పదిమందితో నిలబడేవారే అని సుభాన్ సాహసం చెబుతున్నది. అంతిమంగా, మనుషులలో ఉండే ఏకసూత్రతను, ఏకరూపతను చాటిచెబుతూ, ఒక సముదాయాన్ని, జనశ్రేణిని మూకుమ్మడిగా ఇతరులుగా, పరులుగా చిత్రించే ద్వేషవైఖరిని పరాజితం చేస్తున్నది. కానీ, ఈ విలువను నిరూపించడం కోసం, మంచివారిగా, త్యాగజీవులుగా ఉండే నిర్బంధ భారాన్ని ఆ 'పరులు' మోయవలసి రావడం విచారం కలిగిస్తుంది. ఎంత మంచితనాన్ని కుమ్మరిస్తే, నిర్మించి నిర్మించి వదిలిన రాక్షసముద్రలు తొలగిపోతాయి?

ప్రాణాపాయ పరిస్థితుల్లో ఆపద్బాంధవుల్లాగా వచ్చే ధీరోదాత్తులు కొందరున్నట్టే, తామనుకున్న ధర్మాన్ని రక్షించడానికి ప్రాణాలు తీయగలిగేవారు కూడా కొందరు ఉంటారు. వారిలో గోరక్షకులమంటూ ఆయుధాలతో సంచరించేవారు కూడా కొందరుంటారు. వారికి గోవుల రక్షణ ముఖ్యం. అందుకోసం స్వచ్ఛంద సైనికుల్లాగా, ఎక్కడెక్కడ పశువుల రవాణా జరుగుతుందో, ఎవరెవరు పశుమాంసం తింటూ ఉంటారో నిఘావేసి పట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. పట్టుకునే క్రమంలో, ఆగ్రహం ప్రకటించే క్రమంలో మనుషుల ప్రాణాలను తీయడానికి కూడా వారు వెనుకాడరు. చట్టాలను కూడా ఖాతరు చేయని గాఢమైన విశ్వాసం వారిది. హర్యానాలో పోయిన సంవత్సరం పశువుల రవాణాదార్లు అన్న అనుమానంతో ఇద్దరిని వారి వాహనంతో సహా దహనం చేయడం, అనంతరం జరిగిన హింసాకాండ తెలిసిందే. పరిస్థితి ఏమీ మారలేదు. ఈ ఆగస్టు నెలాఖరులో పాత సామాన్లు అమ్మి బతికే ఒక వలస కార్మికుడిని ఈ గోరక్షకులు చంపేశారు. అతను బెంగాల్ నుంచి వచ్చాడు. బీఫ్ తిన్నాడని అతని మీద అభియోగం. ఈ సంఘటన మీద నిరసనలు వినిపించినప్పుడు, హర్యానా ముఖ్యమంత్రి నాయబ్‌సింగ్ సైని దిగ్భ్రాంతికరమైన వ్యాఖ్యలు చేశారు. "ఆవులంటే వాళ్లకు అంతటి భక్తి, వాళ్లను ఎవరు ఆపగలరు?" అన్నాడాయన. ఇటువంటివి జరగకూడదు, ఇటువంటివి చేయకండి, అని కూడా అన్నారు తప్ప, చేసినవారిని చట్టం ఉపేక్షించదన్న మాట అనలేదు. ఆ ఘాతుకం సరే, దానికి మించి బాధ కలిగించే అంశం, ఆ హత్య చేసిన వారిలో ఇద్దరు మైనర్లు ఉండడం. ఎటువంటి తరం తయారవుతోందన్న బాధ కలుగుతుంది. బీజేపీ దట్టిస్తున్న ఆవేశాల వల్లనే ఇటువంటివి జరుగుతున్నాయని టీఎంసీ నాయకురాలు మహువా మొయిత్రా అన్నారు కానీ, బీజేపీ నేతలందరూ సైనీ లాగా మాట్లాడలేదు. "ఇదేమి అన్యాయం? ఇందులో గోరక్షణ ఏముంది? ఇది మానవత్వానికే అవమానం, పోలీసులు కఠినచర్య తీసుకోవాలి" అన్నారు బీజేపీ ఎంపీ ధరంబీర్‌సింగ్. చూపు పూర్తిగా కలుషితం కాని రాజకీయ వాదులు లేకపోలేదు. ఈ సంఘటనలో హతుడు నిరుపేద. అతని మతమేమిటో స్పష్టంగా తెలుసును. అతను బీఫ్ తిన్నాడో లేదో కానీ, తినడానికి ఆస్కారమున్న పుట్టుకే అతన్ని చంపడానికి కావలసిన ఆధారం. అతన్ని ఒక మనిషిగా, అతనిది ఒక ప్రాణంగా చూడడానికి ఆ పుట్టుకే ఒక అవరోధం.

భారతదేశంలో గోవులను మాంసానికి కానీ, ఇతర అవసరాలకు కానీ వధించడాన్ని నిరోధించడం పెద్ద కష్టమేమీ కాదు. ప్రయత్నిస్తే, అందుకు సామరస్యంతో జనాభిప్రాయాన్ని కూడగట్టడమూ అసాధ్యం కాదు. కానీ, ఇక్కడ సామరస్యమూ, పరిష్కారమూ ముఖ్యం కావు. సమస్య, ఘర్షణా కొనసాగడమే వారికి ప్రయోజనకరం. నిజానికి, సమస్య మూలకారణాలలోకి వెడితే, పరిస్థితి కొంత అర్థమవుతుంది. గోవులను నిర్వహించడం రైతాంగానికి అసాధ్యమైన పరిస్థితి ఏర్పడింది. పశువులతో కూడిన వ్యవసాయం బాగా జరిగే రోజుల్లో కూడా, శ్రమచేయలేని, పాలివ్వలేని పశువులను రైతులు విక్రయించేవారు. సంక్షోభంలో ఉన్న రైతాంగమే గోవులను అమ్ముతున్నది. కబేళాలు కొంటున్నాయి. పశుమాంసాన్ని ఇతర దేశాలకు ఎగుమతిచేసే పెద్ద పెద్ద కబేళాలేవీ బీఫ్ భక్షక సామాజిక, మతవర్గాలకు చెందినవి కావు. ఈ రెండు చోట్లా గోరక్షకులు ఏ కార్యక్రమమూ తీసుకోరు. పశుమాంసం ఎగుమతిని నిషేధించమని, కబేళాలు మూసివేయమని వారెప్పుడూ ప్రభుత్వాన్ని ఒత్తిడి చేయరు. తరలింపులు చేసి పొట్టపోసుకునే వారి మీద మాత్రం దాడులు చేస్తారు. మాంసం తీసుకుపోయే వారిని అనుమానిస్తారు. కారణాలు పెద్ద ఆశ్చర్యకరమైనవేమీ కావు. ముద్రలే ముఖ్యం. ముద్రల సహాయంతో చేయగలిగే సమీకరణలు ముఖ్యం.

మనుషుల మీద పడే ముద్రలు, ఒక్కోసారి ఆ ముద్రల నుంచి రక్షణ ఉన్నవారిని కూడా బలితీసుకుంటాయి. ఆగస్టు నెలలోనే హర్యానాలో ఒకచోట పశువులను ఎస్‌యువి వాహనంలో తరలిస్తున్నారన్న సమాచారం తెలిసి, గోరక్షక బృందం మాటువేసింది. ఆ సమయంలో ఎదురైన ఒక వాహనాన్ని అడ్డగించబోతే, లోపల ఉన్నవారు బెదిరిపోయి, వేగం పెంచి పారిపోవడానికి ప్రయత్నించారు. దానితో గోరక్షకులు తుపాకితో కాల్పులు జరిపారు. ఆ ఘటనలో వాహనంలో ఉన్న 12వ తరగతి విద్యార్థి ఆర్యన్ మిశ్రా చనిపోయాడు. బహుశా, ఆ సమయంలో వాహనంలోని వారిని 'గుర్తించడానికి' గోరక్షకులకు వీలు కాలేదో, రూపురేఖలు అందుకు అవకాశం ఇవ్వలేదో? అనుమానితులు, అమాయకులు అందరూ ఒకేరకంగా కనిపించడంలోని 'శారీరక' సారూప్యత ఒక్కోసారి హంతకుల చేత 'పొరపాటు' చేయిస్తుంది. భారతదేశపు ముఖాలలో ఇంకా మతవిభజన జరగలేదు. తరలింపుదారులు వీరే అనుకుని పొరపడ్డామని హంతకులు చెబుతున్నారు తప్ప, తాము చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని తుపాకులతో వీధుల్లోకి రావడం తప్పని అనుకోవడం లేదు. ఈ రెండో వరుస సంఘటన తరువాత కూడా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిలో పెద్ద కదలిక లేదు. రెండు రోజుల కిందట మహారాష్ట్రలో కూడా ఒక ముసలాయనను రైల్లో ఒక గుంపు కిందకు తోసేసినంత పనిచేసింది. ఆయన దగ్గర గోమాంసం ఉన్నదని అనుమానం. అటువంటి ఘటనలు సాధారణమైపోయాయి. కానీ, ఆ గుంపు ఎవరు? పోలీసు ఉద్యోగానికి అర్హత పరీక్ష రాయడానికి వెడుతున్న ఉద్యోగార్థులట! రేపు వాళ్లు పోలీసులైతే, న్యాయం ఎట్లా ఉంటుందో?

హర్యానా, మహారాష్ట్ర రెండూ త్వరలో ఎన్నికలకు వెడుతున్న రాష్ట్రాలు. ద్వేషాలను మరింతగా పెంచి లాభపడదామనుకునే రాజకీయాలు గెలుస్తాయా, విసిగి వేసారి లోగుట్టు అర్థం చేసుకున్న ప్రజలు గెలుస్తారా అన్నది చూడాలి.

ఈ సంఘటనల్లో మృత్యువు కంటె, హింస కంటె, దేశవ్యాప్తంగా అది వ్యాపింపజేసే భయమూ పరాయితనమే ఎక్కువ బాధిస్తుంది. అంతో ఇంతో సఖ్యత సహజీవనం ఉన్న దక్షిణాదిలో కూడా, విభజనరేఖలు వెలుస్తున్నాయి. మంచిచెడ్డలను చట్టం కాక, విశ్వాసాలు నిర్వచించి అమలుచేస్తున్నాయి. మూసలను బట్టి, ముద్రలను బట్టి మనుగడలు నిర్ణయం అవుతున్నాయి. విభజనల మీద ఆధారపడి రాజకీయార్థిక పరమార్థాలు చెలరేగిపోతున్నాయి!

కొత్త ఆలోచనలు లేకపోవడం ఎవరికైనా అవలక్షణం మాత్రమే, కానీ, బలశాలికీ, పెత్తందారుకీ భావదారిద్ర్యం ఉంటే మాత్రం అది మహా ప్రమాదకరం. ఒకసారి విఫలం అయ్యాక, జనం నీలో చెడు చూడడం మొదలుపెట్టారని తెలిశాక, ఆ గ్రహింపు తెచ్చుకోవడమే మొదట చేయవలసినది. అప్పుడు దిద్దుబాటు కోసం అన్వేషించాలి. అయితే, తప్పులను గుర్తించి దారి సరిచేసుకోవాలి లేదా, కొత్తదారులను వెదుకుతూ ప్రజల సమ్మతిని గెలుచుకోవాలి. ఈ రెండూ చేతకాక, తనకు తెలిసింది ఒకే విద్య, దాన్ని మాత్రమే పదే పదే ప్రయోగిస్తాను, మరింత బలంగా, మరింత తీవ్రంగా ఉపయోగిస్తాను అనుకునే శక్తులు, బహుశా, తమ శూన్యబుద్ధుల కారణంగానే పతనాన్ని చవిచూస్తారు.

హర్యానా, మహారాష్ట్ర రెండూ త్వరలో ఎన్నికలకు వెడుతున్న రాష్ట్రాలు. ద్వేషాలను మరింతగా పెంచి లాభపడదామనుకునే రాజకీయాలు గెలుస్తాయా, విసిగి వేసారి లోగుట్టు అర్థం చేసుకున్న ప్రజలు గెలుస్తారా అన్నది చూడాలి.

షరతులు వర్తించవు

కొన్ని అవసరాలూ
కొన్ని అనవసరాలూ అయిన
నిబంధనల బంధనాల
ఈ ప్రపంచ వలయంలో
షరతులు వర్తించని/ మానవీయ క్షేత్రాలు రెండు
ఒకటి అమ్మ ఒడి/ మరొకటి చదువుల బడి

తన కడుపులో శిశువు
రూపుదాల్చిందన్న ఊహ విరిస్తేచాలు
ఆ అమ్మతనం ఆనందాల ఆర్ణవం
ప్రాణాన్ని పణంగా పెట్టిన ప్రసవ వేదనసైతం
ఆ పురిటికేకతో ఓ ఆశల ఏరువాక

పసి ఆశను ప్రపంచశ్వాసగా
అందిస్తున్న ఆ పవిత్ర బాధ్యతలో
తల్లి తన ప్రపంచాన్ని పక్కకు నెడుతుంది
తానొక నవజాత చైతన్యచేతనమవుతుంది
అది అమ్మ ఒడి/ షరతుల ఛాయసైతం లేని
మమతల గుడి

తన తరగతి గదియే
తన ప్రపంచంగా మలచుకొని
తన మేధను మధియించి
తన గుండెను కరిగించి
ఆ లేత హృదయాలలో ఒదిగిపోతాడు
నలువైపులా జ్ఞానకిరణాల్ని ప్రసరింపచేస్తాడు
ప్రపంచాన్ని ఒక ఆశావహ వేదికగా
ముస్తాబు చేస్తాడు ఉపాధ్యాయుడు

పసిపాప కేరింతల్లో/ తల్లి మనసు పులకరించినట్లే
తన విద్యార్థి వికసనంలో
ఉపాధ్యాయ హృదయం పరవశిస్తుంది
తనకంటూ ఏమీ దాచుకోని అమ్మలాగే
తన విద్యార్థులలోనే విశ్వాన్ని దర్శిస్తాడు.
అమ్మఒడి మానవజాతి గర్భగుడి
తరగతిగది మానవనీతి గర్భగుడి
మనిషిని పెంచిన అమ్మతనానికి మాతృదేవోభవ
మనసును పంచిన ఉపాధ్యాయుడికి ఆచార్యదేవోభవ!

– మడిపల్లి దక్షిణామూర్తి



కొలిచే దైవం

మనసుని చెక్కే విద్యతో
జీవితానికి పునాదిలా
అక్షరమై నుదుట వ్రాతలో
బతుకును మలిచేవాడు

దేవుడు రూపాన్ని ధరించి
ప్రేమగా బుద్ధులు గుద్ది చెప్పి
తీపి కలకు అల్లిక నేర్పి
మంచి మనిషిగా తీర్చువాడు.

విలువ రుచిని రంగరించి
మనసు పాదున చిలరించి
చక్కని మొక్కలా నిలిపి
మంచి ఫలాల్ని కానించే వాడు

ప్రతి జీవితంలో తప్పని పాత్రలా
ప్రతి గుండెలో మరువని బంధంలా
ప్రతి నోరూ కొలిచే దైవం
ప్రతి చేయి పూజించే ఇష్టం ఉపాధ్యాయుడు.

– చందలూరి నారాయణరావు

సృష్టికి ప్రతిసృష్టి చేయగలడు

పేగుబంధంతో బిడ్డలను తీర్చిదిద్దేది తల్లిదండ్రులైతే...
ఏ బంధం లేని ఆ బిడ్డల భవిష్యత్తు తీర్చిదిద్దేది గురువులు

నుదిటి రాతను రాసేది బ్రహ్మైతే...
భవిష్యత్తు రాతను రాసేది గురువు

ప్రకృతి సంపద సృష్టికర్త భగవంతుడైతే...
ఆ ప్రకృతిలోని జ్ఞాన సంపద సృష్టికర్త గురువు

దేశాభివృద్ధిలో కీలకమైనది యువశక్తైతే...
ఆ యువశక్తిని శక్తివంతం చేసేది గురువు

పురోభివృద్ధికి అవసరమైనది జ్ఞానం అనుభవమైతే...
ఆ జ్ఞానాన్ని అనుభవాన్ని ప్రసరింపజేసేది గురువు



సామరస్య సమ్మిళిత సమాజ నిర్మాణానికి కావలసింది ఐక్యతా భావమైతే...
ఆ ఐక్యతా భావాన్ని పెంపొందించేది గురువు

దేశ పురోభివృద్ధికి అవసరమైనది భవిష్యత్తరమైతే...
ఆ భవిష్యత్తరాన్ని ప్రభావితం చేయగల జ్ఞాన శక్తి గురువు

సృజనాత్మకత, సాంకేతికత, పారిశ్రామిక విప్లవాలను తీసుకొచ్చేది విద్యాధికులైతే...
ఆ విద్యాధికులకు స్ఫూర్తి ప్రదాత, మార్గదర్శకుడు గురువు

నాయకులు, సైనికులు, ఆవిష్కర్తలు,
బాధ్యత గల పౌరులు దేశానికి వెన్నుముకైతే...
ఆ వెన్నుముక నిర్మాణంలో మూల స్తంభమైన
గురువుకు వందనం... పాదాభివందనం

– నసుబోలు రాజశేఖర్

దిద్దుబాటల్ని చూపే వేళ్లు

ఆదిమ కాలపు గురుకులాలైనా
ఆధునిక యుగంలో హంగుల నెలవులైనా
బడిలో అడుగుపెట్టే ప్రతిరోజూ
మీ గురుస్థానం మీకు మరో బాల్యం
బోధించేది ఆదికాండమైనా
ఆఖరి పర్వమైనా
పాఠం మొదలుపెట్టే ప్రతిసారీ
మీది అక్షరమాల వల్లెవేసిన నాటి శ్రద్ధ!

పండ్లచెట్టు కింద ఫలాలు రాలినట్టు
మీ మునివేళ్ళ నుండి
ముచ్చటగా బొమ్మలు రాల్తాయి
మీ గొంతులో మాటలూ పాటలూ కథలూ
పరుగుపందెంలా పోటీ పడతాయి

ఛాత్రోపాధ్యాయ శిక్షణలో
ఎన్ని వాత్సల్య సూత్రాలు
మీ చెవిలో ఊది ఉంటారో..
నిదురించే పాపాయి మోములో
సన్నగా చిర్నవ్వురేఖ మురిసినట్లు
పిల్లల ముందు మీదెంత ప్రశాంత వదనం!

విద్యార్థులు వినయంగా పుస్తకాలై
మీ చెయ్యందుకోవాలేగాని
వారి బతుకులోంచి సగం చీకట్లు మాయం
మీ చూపుడువేళ్ల వెంట
దిద్దుబాటల్లో నడిస్తే
అనునిత్యం ముట్టడించాలని చూసే
ఏ అసురసంధ్యలైనా మటుమాయం

మీలాంటి నిస్వార్థ ఉపాధ్యాయ లోకం
జాతి శ్రేయస్సును కోరుతుంది
విలువలూ విజ్ఞానం అతుల్య సంపదలుగా
కొత్త తరాలకు పంచిపెడుతుంది
మీ తరగతి గది స్వప్నాల వెలుగులోనే
ఈ దేశం పచ్చగా శ్వాసిస్తుంది

– కంచరాన భుజంగరావు

గురువు

తమస్సు తరిమి వేసి
విజ్ఞానపు విత్తును నాటే ఉషస్సు
జ్ఞాన చక్షువును తెరిపించే
అక్షర విధాత
మట్టిని మాణిక్యాలుగా
అజ్ఞానపు పిండాలను
విజ్ఞానపు పుంజాలుగా

విద్యార్థిని విద్వత్తుగా మలిచే
విజ్ఞానపు అమృత భాండం
నాలుగు గోడల మధ్య
పరిపూర్ణ మేధస్సును పెంచి
లోకాన్ని వీక్షింపచేసే గవాక్షం
కలెక్టరైనా ప్రధాని అయినా
నన్ను మలిచింది

ఈ మహనీయుడే అని
అర క్షణమైనా ఆలస్యం లేకుండా
తలవంచి నమస్కరించే అర్థం
గురువు...

– పెండెం శివానంద్

నగరంలో ప్రధాన నాలాలకు ఇరువైపులా కబ్జాలు ఇలా..

నాలా పేరు	అక్రమ కట్టడాలు	కూల్చివేసినవి	కోర్టు కేసు
నయీంనగర్ నాలా	283	79	95
భద్రకాళి నాలా	131	28	08
బొందివాగు నాలా	08	00	04
సాకరాశికుంట నాలా	102	00	00
మొత్తం	524	107	107



నాలాలనూ వదలట్లే!

కాలువల పక్కన ఖాళీ స్థలం కనిపిస్తే చాలు కబ్జానే

- నగరంలో 16.42కి.మీ. ప్రవాహంతో నాలుగు కీలక నాలాలు
- 50ఫీట్ల నుంచి 20ఫీట్లకు కుంచించుకుపోయిన వైనం
- ఆక్రమించిన ప్రాంతాల్లో 524 అక్రమ నిర్మాణాలు
- కట్టడాల్లో ఫంక్షన్‌హాళ్లు, ప్రైవేట్ విద్యాసంస్థలు, షాపింగ్‌మాళ్లు
- ఫలితంగా వరద ముంపులో వరంగల్ మహానగరం
- ఆక్రమణల తొలగింపుపై అధికారులకు రాజకీయ ఒత్తిళ్లు
- అక్రమార్కులకు అండగా నేతలు, వారి అనుచరగణం

కబ్జా పర్వం-1


(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

చెరువులే కాదు.. నాలాలను సైతం కబ్జారాయుళ్లు వదలటం లేదు. మురుగు కాలువ పక్కన ఖాళీ జాగా కనిపిస్తే చాలు దర్జాగా కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. అధికారులు ఎవరైనా ప్రశ్నిస్తే చేతులు తడపటమో... బెదిరింపులకు దిగటమో చేస్తున్నారు. దీంతో నగరంలో 16.42కి.మీ ప్రవాహంతో ఉన్న నాలుగు ప్రధాన నాలాలను ఇరువైపుల కబ్జాలు చేసి దర్జాగా 524 అక్రమ కట్టడాలను నిర్మాణం చేశారు. దీంతో వరంగల్ మహనగరంలో ఒకప్పుడు 50ఫీట్లు వెడల్పుతో ప్రవాహించిన నాలాలు సైతం ఇప్పుడు పది ఫీట్ల వెడల్పు కూడా లేకుండా చేశారు. ప్రతీ వర్షాకాలం వరంగల్ మహానగరంలోని పలు కాలనీలు నీట మునగటానికి ఈ నాలాల కబ్జానే ప్రధానకారణం. ఇరుకైనా నాలాల నుంచి వరద నీరు బయటకు వెళ్లలేక.. కాలనీలను ముంచెత్తుతున్నాయి.

నగరంలో నాలుగు ప్రధాన నాలాలు

12లక్షలకు పైగా జనాభా, 2వేలకు పైగా కాలనీలతో ఉన్న వరంగల్ మహానగరం ఇటీవల కాలంలో మరింత వేగంగా విస్తరిస్తోంది. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టుగా ఇంటి నిర్మాణాలు కూడా పెరిగి, కొత్త కాలనీలు, పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయి. ప్రధానంగా నగరంలో డ్రెయినేజీ సమస్య ప్రజలను పీడిస్తుంది. నగరంలో ఖాళీగా జాగ కనిపిస్తే చాలు.. నాలాను సైతం కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. దీంతో నాలాలు బక్కచిక్కి మురుగు, వరద నీరు కాలనీలను ముంచెత్తుతోంది. నగరంలో నాలుగు ప్రధాన నాలాలు ఉండగా వీటిలో నయీంనగర్ నాలా కీలకమైంది. ఇది వడ్డేపల్లి చెరువు నుంచి గోపాలపూర్ ఊరచెరువు వరకు, రాజాజీ బ్రిడ్జి నుంచి కాకతీయ కెనాల్ వరకు మొత్తం 5.55కి.మీలు పొడువునా విస్తరించి ఉంది. అలాగే భద్రీనాలా పోతననగర్ నుంచి అలంకార్ బ్రిడ్జి, కాపువాడ వరకు, భద్రకాళీ చెరువు నుంచి అలంకార్ బ్రిడ్జి వరకు 3.63కి.మీలు పొడవున విస్తరించి ఉంది. అలాగే బొందివాగు నాలా బెస్తం చెరువు నుంచి జక్కులొద్ది (మద్దెలకుంట)వరకు 0.84కి.మీలు, సాకరాశి కుంట నాలా అగర్తల నుంచి 12వెంట్స్ వరకు 6.40కి.మీలు పొడువున విస్తరించి ఉంది. మొత్తం నాలుగు ప్రధాన కాలువలు వరంగల్ నగరంలో 16.42కిలోమీటర్లు మురికి నీటిని తీసుకెళ్లుతున్నాయి. వీటితో పాటు నగరంలో వందలాది మురికి కాలువలు ఉన్నప్పటికి ఎక్కడిక్కడ గజం స్థలం ఖాళీగా ఉన్నా మాయం చేస్తున్నారు. దీంతో నాలాలు, మురికి కాలువలు చిక్కిపోతు.. వరద చిక్కులను సృష్టిస్తున్నాయి.


నయీంనగర్ నాలా




బొందివాగు నాలా


ములుగురోడ్ వద్ద భద్రకాళి నాలా

ఆక్రమణల వెనుక నేతల అనుచరులే..

వరంగల్ మహానగరంలో నాలాలను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేసిన వారికి గత ప్రభుత్వంలోని కీలకమైన నేతలతో పాటు ద్వితీయశ్రేణి నేతల హస్తం ఉందనే చర్చ జరుగుతోంది. వడ్డేపల్లి చెరువు నుంచి గోపాలపూర్ ఊర చెరువు వరకు నాలాకు ఇరువైపులా భారీగా అక్రమ నిర్మాణాలు వెలిశాయి. ఇందులో ప్రైవేట్ విద్యాసంస్థలు, ఫంక్షన్ హాల్స్, షాపింగ్ మాల్స్‌తో పాటు ఇంటి నిర్మాణాలు చేపట్టారు. ఐదారు నెలల క్రితం కూడా గోపాల్‌పూర్ ఊర చెరువ సమీపంలో నాలాకు ఇరువైపుల అక్రమ నిర్మాణాలు పూర్తి చేశారనే ఆరోపణలున్నాయి. సమ్మయ్యనగర్, విద్యానగర్, సింగారం, పెద్దమోరీ, బొక్కలగడ్డ తదితర ప్రాంతాల్లో ప్రైవేటు పాఠశాలలు, పెట్రోల్ బంకులు, ఫంక్షన్ హాల్స్ షాపింగ్ మాల్స్‌తో పాటు ఇతర నిర్మాణాలను నేతల అండతో దర్జాగా నాలాను అక్రమించి నిర్మించారనే ప్రచారం జరుగుతోంది. అలాగే ములుగురోడ్డు సమీపంలో భద్రకాళీ నాలాను అక్రమించి అనేక ఫంక్షన్‌హాల్స్, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థలు, ఇళ్లను యథేచ్ఛగా నిర్మించారనే ఆరోపణలున్నాయి. గతంలో వరంగల్ కార్పొరేషన్‌లో కీలకంగా వ్యవహరించిన నేతల అండతో దర్జాగా నాలాను ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టినట్టుగా ప్రచారం జరుగుతోంది. అధికారులపై నేతలు, కొందరు మాజీ కార్పొరేటర్లు ఒత్తిడి తెచ్చి అక్రమ నిర్మాణాలకు అనుమతులు ఇప్పించారనే ప్రచారం జరుగుతోంది. అక్రమ కట్టడాలని తెలిసిన వాటిని టచ్ చేసేందుకు ప్రస్తుతం అధికారులు, ప్రజాప్రతినిధులు ధైర్యం చేయటం లేదనే చర్చ నగరవాసుల్లో జరుగుతుంది.

ఖాళీ జాగా కనిపిస్తే.. నాలా సైతం కబ్జానే..

వరంగల్ నగరం ముంపునకు ప్రధాన కారణం నాలాల ఆక్రమణే. విచ్చల విడిగా నాలాలను ఆక్రమించి దర్జాగా ఇళ్ల నిర్మాణం చేయటంతో నాలాలు చిక్కిపోయాయి. గతంలో అధికార పార్టీ నేతల అండా.. కార్పొరేషన్ అధికారుల సహకారంతో వరంగల్, హనుమకొండ, కాజీపేట ట్రైసిటీలో నాలాలను అక్రమించుకుని నిర్మాణాలు చేశారు. నివాస గృహలే కాకుండా.. కాలేజీలు, ఫామ్ హౌస్‌లు, వ్యాపార సముదాయాలు, ఇళ్ల నిర్మాణం చేపట్టారు. ప్రధానంగా హనుమకొండ పట్టణంలోని నయీంనగర్ నాలాకు ఇరువైపుల భారీగా కబ్జాలు చేశారు. 5.55కిలో మీటర్లు ప్రయాణించే నయీంనగర్ నాలాకు వడ్డెపల్లి చెరువు నుంచి గోపాలపూర్ ఊర చెరువు వరకు 136 అక్రమ కట్టడాలు నిర్మించారు. వీటిలో అధికారులు కేవలం 23 అక్రమ నిర్మాణాలనే తొలగించగా, 62 కట్టడాలపై కోర్టు నుంచి స్టే ఉంది. మిగిలిన 51 అక్రమ నిర్మాణాలను తొలిగించటంపై కార్పొరేషన్ అధికారులు మీనమేషాలు

మిగతా 8వ పేజీలో..

సైబర్ నేరస్థుడి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 4: సైబర్ నేరగాళ్లకు సహకరిస్తూ వారు దోచుకున్న డబ్బును తన బ్యాంకు ఖాతాకు మళ్లించి డాలర్లుగా మార్చి తిరిగి వారికి పంపిస్తున్న తమిళనాడుకు చెందిన మరియా బెనెడిక్ట్ (38)ను వరంగల్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టుకు సంబంధించిన వివరాలను వరంగల్ సైబర్ క్రైం ఏసీపీ విజయ్‌కుమార్ బుధవారం ప్రెస్ మీట్‌లో వెల్లడించారు. పలువురు సైబర్ నేరగాళ్లు వారు దోచుకున్న డబ్బును భద్రం చేసుకునేందుకు బెనెడిక్ట్ ఖాతాలోకి మళ్లించేవారని తెలి పారు. తన ఖాతాలోకి వచ్చిన డబ్బును విత్‌డ్రా చేసి డాలర్లుగా మార్చి నేరగాళ్ల వ్యక్తిగత ఖాతాల్లోకి పంపిస్తూ సహకరించేవాడని ఆయన పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి రూ.33లక్షల 50వేలు పెట్టుబడి పెట్టి మోసపోయిన వరంగల్‌కు చెందిన బాధితుడు సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టినట్లు ఆయన అన్నారు. సైబర్ నేరగాళ్లు ఈ డబ్బును అరెస్టు చేసిన నిందితుడి ఖాతాలోకి మళ్లించినట్లు గుర్తించామన్నారు. చెన్నైలో నిందితుడు బెనెడిక్ట్‌ను అరెస్టు చేసి వరంగల్‌కు తీసుకువచ్చి విచారణ చేసినట్లు ఆయన తెలిపారు. నిందితుడిని సమగ్ర విచారణ చేసి అతడితో సంబంధం ఉన్నవారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని ఏసీపీ విజయ్‌కుమార్ వివరించారు. ఈ విలేకర్ల సమావేశంలో సైబర్ క్రైం ఇన్స్‌పెక్టర్ రవికుమార్, ఎస్ఐలు చరణ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి

- ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలి
- కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిషోర్ ఝా


మట్టి గణపతి విగ్రహాల పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, సీపీ తదితరులు

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 4: గణేష్ ఉత్సవాలకు వివిధ శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశాలు జారీ చేశారు. జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, మునిసిపల్, వైద్య, ఆరోగ్య, విద్యుత్, సాగునీటిపారుదల, మైనింగ్, మత్స్య, అర్అండ్‌బీ, గణేష్ ఉత్సవ కమిటీల ప్రతినిధులతో బుధవారం కలెక్టర్ సమావేశమయ్యారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాల ఏర్పాట్లు, నిర్వహణపై అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. నిమజ్జనం ప్రాంతాలలో ఒక్కో ప్రాంతంలో సీనియర్ జిల్లా అధికారితో పాటు మరొక అధికారిని నియమిస్తున్నట్లు తెలిపారు. వైద్య, ఆరోగ్య, విద్యుత్, రెవెన్యూ, పోలీస్‌శాఖ, సాగునీటి పారుదల శాఖల అధికారులతో పాటు తగినంత సిబ్బంది నిమజ్జన ప్రాంతాలలో విధులు నిర్వర్తిస్తారన్నారు. నిమజ్జనం సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద తగినంత సిబ్బందిని విధులు నిర్వహించే విధంగా కేటాయిస్తామన్నారు. నిమజ్జన పాయింట్ల వద్ద ఎలాంటి సమస్య తలెత్తకుండా అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని, విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి భోజన సౌకర్యాన్ని కల్పించాలన్నారు. నిమజ్జన ప్రాంతాలలో క్రేన్లను సిద్ధం చేయాలని మైనింగ్ శాఖ అధికారులకు ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలని కమిటీలకు కలెక్టర్ సూచించారు.

పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ.. గణేష్ ఉత్సవాలను విజయవంతం చేసేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పనిచేయాలన్నారు. నిమజ్జనం రోజు ట్రాఫిక్‌కు ఎక్కడ కూడా ఇబ్బందులు లేకుండా అందరు సహకరించాలన్నారు. వాహనాలు నడిపేందుకు మంచి డ్రైవర్లను నియమించుకోవాలని ఉత్సవ కమిటీల ప్రతినిధులకు సూచించారు. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ.. వరంగల్, హనుమకొండ, కాజీపేట ప్రాంతాలలో తాగునీరు, తదితర ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. జిల్లా పరిధిలో సాగునీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో 8 చెరువుల వద్ద, మునిసిపల్ శాఖ ఆధ్వర్యంలో 14 చెరువుల వద్ద నిమజ్జన ఏర్పాట్లు చేస్తున్నామని సాగునీటిపారుదల, మున్సిపల్ శాఖ అధికారులు తెలిపారు. గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేయాలని ప్రభుత్వం ఆదేశించిందని విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, డీఆర్‌వో వై.వి.గణేష్, ఆయా శాఖల ఉన్నతాధికారులు, గణేష్ ఉత్సవ కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు.

మట్టి గణపతి విగ్రహాలను పూజించాలి

జిల్లాలోని ప్రతీ ఒక్కరు మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణం కలుషితం కాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని కార్యాలయంలో బుధవారం మట్టి గణపతి విగ్రహాల పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రతి జిల్లాకు 2వేల మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తుందన్నారు.

తాగునీరు కలుషితం కాకుండా చూడండి : మేయర్


అధికారులతో మాట్లాడుతున్న మేయర్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 4: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా తాగునీటి పైపులోకి నీరు వచ్చే అవకాశాలు ఉంటాయని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని మేయర్ గుండు సుధారాణి అధికారులకు సూచించారు. గురువారం బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. నగరంలో పైపులైన్ల లీకేజీలను అరికట్టి నీటి సమస్య రాకుండా చూడాలన్నారు. ప్రధాన రహదారులతో పాటు గల్లీలలో రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చివేయాలని అన్నారు. పారిశుధ్య విభాగంలో చెత్తను తరలించే వాహనాలు మరమ్మతుకు వస్తే తక్షణమే రిపేరు చేసి పంపించాలన్నారు. వర్షాలకు దెబ్బతిన్న వీధి దీపాలను మరమ్మతు చేయాలని ఆదేశించారు. ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, ఆజ య్య, ఈఈ మహేందర్, డీఈ శివానంద్, ఏఈలు సంతోష్, పణికుమార్ పాల్గొన్నారు.


కేసముద్రం మండలం ఇంటికన్నె వద్ద మరమ్మతులు పూర్తి చేసిన రైల్వేట్రాక్‌పై నుంచి ట్రయల్ రన్‌లో వెళుతున్న ప్రయాణికులు లేని సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్

లక్ష్యంతో పనిచేశారు.. పట్టాలెక్కించారు

- మూడు రోజుల పాటు నిరంతరాయంగా రైల్వేట్రాక్ మరమ్మతు పనులు
- 12 ఎక్స్‌కవేటర్లు, 11 టిప్పర్లు, 2 క్రేన్లు, వెయ్యిమంది సిబ్బంది
- ఇంటికన్నె వద్ద పూర్తి.. పర్యవేక్షించిన రైల్వే జీఎం
- మధ్యాహ్నం నుంచే పాక్షికంగా రైళ్ల పునరుద్ధరణ
- రైల్వేశాఖకు రూ.కోట్లలో నష్టం

7

నేలకొరిగిన రైతు కూలీ నాయకుడు

- ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మాచర్ల ఏసోబు మృతి
- మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా తుదిశ్వాస..
- స్వస్థలం టేకులగూడెంలో విషాదఛాయలు



మృతిచెందిన యేసోబు, యేసోబు (ఫైల్)

కాజీపేట, సెప్టెంబరు 4: రైతుకూలీ నాయకుడు, రాడికల్ నేత, ప్రస్తుత మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు (70) అలియాస్ జగన్ అలియాస్ రణదేవ్ దాదా మంగళవారం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్-దంతెవాడ జిల్లాల సరిహద్దులో భద్రతా దళాలు చేసిన ఎన్‌కౌంటర్‌లో కన్నుమూశారు. ఈయన మరణ వార్త తెలుసుకున్న గ్రామస్తులు.. ఏసోబు ఇంటికి వెళ్లి కన్నీరుమున్నీరయ్యారు. ఏసోబు కుమారుడు మాచర్ల మహేశ్ రోదనలు ఆపడం ఎవరి తరం కాలేదు. ఏసోబు కుమారుడు మహేశ్ ప్రత్యేక అంబులెన్స్‌లో ఏసోబు పార్థివదేహాన్ని తీసుకురావడానికి బుధవారం మధ్యాహ్నం టేకులగూడెం నుంచి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లారు. గురువారం సాయంత్రం అతడి మృతదేహం స్వగ్రామం టేకులగూడెం రానుంది. అంత్యక్రియలు ఎప్పుడు జరుగాతాయనే విషయం స్పష్టంగా తెలియడం లేదు.

ఉద్యమ ప్రస్థానం

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన ఏసోబుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై దొరలు, అగ్రవర్ణాలపై తిరుగుబాటే ఉద్యమం వైపు అడుగులు వేసేలా చేశాయి. 1980 సంవత్సరంలో రైతుకూలీ సంఘం కార్యకర్తగా తన ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అప్పటి పీపుల్స్‌వార్ అనుబంధ సంఘమైన రైతుకూలీ సంఘానికి 1990 నుంచి 1992 సంవత్సరంలోనే జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 1990 మే, 5, 6 తేదీలలో హనుమకొండ ప్రకాశ్‌రెడ్డి పేటలో రైతుకూలీ మహాసభలకు లక్షలాది జనాలను తరలించి పార్టీలో ప్రత్యేకస్థానాన్ని సంపాదించారు. ఐదో తరగతి వరకే చదివిన ఏసోబు.. 1993లో పూర్తిస్థాయి అజ్ఞాతంలోకి వెళ్లాడు. అన్నసాగర్ దళంలో కదారి రాములు దళంలో దళసభ్యుడుగా చేరారు. 1992లో ఏసోబు టేకులగూడెంకు వచ్చారని తెలుసుకున్న పోలీసులు.. గ్రామాన్ని చుట్టిముట్టినప్పుడు ప్రజల సహకారంతో చాకచక్యంగా తప్పించుకున్న సంఘటన రాష్ట్రంలో సంచలనం రేకెత్తించింది. నాటి నుంచి దంతెవాడ ఎన్‌కౌంటర్ వరకు ఎన్నో ఎన్‌కౌంటర్‌లలో పోలీసుల కల్లుకప్పి చాకచక్యంగా తప్పించుకున్నట్లు చెబుతారు. మావోయిస్టు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి కేంద్రకమిటీ సభ్యుడిగా, మహారాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నాడు. ఛత్తీస్‌గఢ్ దంతెవాడ బేస్ ఏరియా ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ప్రస్తుతం మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. ఇలా మరణం వరకు ఉద్యమంలోనే కొనసాగాడు.

కుటుంబ నేపథ్యం

గట్టుమ్మలమ్మ-చంద్రయ్యల దంపతులకు మొదటి సంతానం ఏసోబు. ఇతడికి అక్కలు విమల, శాంత, తమ్ముడు వెంకటేశ్, ఉన్నారు. ఏసోబు భార్య లక్ష్మి 2023 జనవరి 14న అనారోగ్యంతో ఇంట్లోనే మరణించింది. ఏసోబుకు ముగ్గురు కూతుళ్లు ఫాతిమా, పరిశుద్ధ, సంధ్య, కుమారుడు మహేశ్ ఉన్నారు. కుమారుడు ఎల్ఎల్‌బీ పూర్తి చేసి అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. కులాంతర వివాహం చేసుకున్న ఇతడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.



ఈనెల 9 వరకు ఎన్పీడీసీఎల్‌లో సెలవులు రద్దు

హనుమకొండ, సెప్టెంబర్ 4: ఈనెల 9 వరకు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణశాఖ సూచించిన నేపథ్యంలో అప్పటి వరకు ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి వెల్లడించారు. అత్యవసరంగా కావాలనుకుంటే సీఈ (హెచ్‌ఆర్డీ అండ్ ట్రైనింగ్)కు సమాచారం ఇచ్చి అనుమతి పొందాలన్నారు. 16 సర్కిళ్ల ఎస్‌ఈలు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా పరిస్థితిని పరిశీలించాలన్నారు. 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. తగినంత సామగ్రి, సిబ్బంది, కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. ఎలాంటి అవసరం ఏర్పడినా కార్పొరేట్ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలన్నారు.

కొలిపాక శ్రీనివాస్‌కు రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు



వడ్డెపల్లి, సెప్టెంబరు 4 : హనుమకొండ పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ఆచార్య బత్తిని చంద్రమౌళి గౌడ్ తెలిపారు. అధ్యాపకులందరూ డాక్టర్ శ్రీనివాస్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి.సుహాసిని, అకాడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. అరుణ, కంప్యూటర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్‌బాబు తోపాటు అధ్యాపకులందరు డాక్టర్ శ్రీనివాస్‌ను అభినందించారు.

కమిషనరేట్‌లో ఐదుగురు ఎస్‌ఐల బదిలీ

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 4: వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ బుధవారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. జి.దివ్య మడికొండ నుంచి వంగరకు, జి.రాజేష్ రెడ్డి నర్సంపేట నుంచి చెన్నారావుపేటకు, జి.అరుణ్ చెన్నారావుపేట నుంచి నర్సంపేటకు, ఎం.డి.షసియోద్దిన్ సీసీఎస్ నుంచి హనుమకొండ ట్రాఫిక్‌కు, ఎం.డి.యాకుబ్ కమిషనరేట్ నుంచి సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

'ఉత్తముల ఎంపిక సవ్యంగా జరగలేదు'

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: హనుమకొండ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక సవ్యంగా జరుగలేదని పలువురు ఉపాధ్యాయ సంఘ నేతలు ఆరోపణలు చేస్తున్నారు. ఎలాంటి ప్రామాణికత పాటించకుండా ఉత్తముల ఎంపికను జిల్లా విద్యాశాఖ నిర్వహించినట్లు టీయూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు నూతనకంటి బాబు ఒక ప్రకటనలో విమర్శించారు. ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను మాత్రమే ఉత్తములుగా ఎంపిక చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో అత్యధిక విద్యార్థులు ఉన్న పాఠశాలలు ప్రభుత్వ విభాగంలోనే ఉన్నాయని, అలాంటి పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయుల్లో చోటు దక్కకపోవడంపై ఆయన నిరసన వ్యక్తం చేశారు. నిబద్ధతతో పనిచేస్తున్న వారిని ఎంపిక చేయకుండా అధికారులు వారికి తోచిన విధంగా ఎంపిక చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలు గుర్తించడంలో జిల్లా విద్యాశాఖ పూర్తిగా విఫలమయ్యిందని మరో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆకుతోట శ్రీనివాస్‌లు నిరసన వ్యక్తం చేశారు.

మత్స్య అభివృద్ధి బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల జగదీశ్వర్ ప్రసాద్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రావుల జగదీశ్వర్‌ప్రసాద్

వడ్డెపల్లి, సెప్టెంబరు 4: తెలంగాణ ప్రాంతంలో ఆర్థికంగా వెనుకబడిన మత్స్యకారుల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు నిధులు మంజూరి చేసి వారి ఆర్థికాభివృద్ధి కోసం మత్స్య అభివృద్ధి బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావుల జగదీశ్వర్ ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సరిపోయినన్ని నిధులు కేటాయించి అసంఘటితరంగంలో కార్మికులుగా ఉన్న వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 8న ఉదయం 11 గంటలకు హనుమకొండ కేయూ - పెద్దమ్మగడ్డ రోడ్డులోని శారదా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ముదిరాజ్ మహాసభ రాష్ట్రస్థాయి సదస్సులో ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రావుల జగదీశ్వర్‌ప్రసాద్ కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల అధ్యక్షులు డాక్టర్ మౌటం కుమారస్వామి, వన్నాల కృపాసాగర్, ఏర్ల వెంకన్న, ఆకుల సుభాష్, సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ వెంకన్న, మహిళా నాయకురాలు లలిత, పిట్ట సురేష్ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

జాబ్ మేళా వాయిదా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: జిల్లా ఉపాధి కల్పనశాఖ ఆధ్వ ర్యంలో ఈనెల 6న నిర్వహించాల్సిన జాబ్‌మేళాను భారీ వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఉమారాణి బుధవా రం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారో ప్రకటన జారీ చేస్తామని ఆమె తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2902	2700
పల్లికాయ (సూక)	5300	5100
పల్లికాయ (పచ్చిది)	4500	3400
పెసళ్లు	6712	4552
పత్తి	7610	5000
పసుపు (కాడి)	--	--
పసుపు (గోల)	--	--
తేజ మిర్చి	12000	8000
తేజ ఏసీ	17500	14000
వండర్‌హాట్ ఏసీ	14500	13000
యూఎస్341 ఏసీ	14500	11000
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

పట్టభద్రులకు ఆర్‌బీఐ క్విజ్ పోటీలు

వరంగల్ చౌరస్తా, సెప్టెంబరు 4: భారతీయ రిజర్వు బ్యాంకు ఏర్పాటై 90 సంవత్సరాలు పూర్తిచేసుకున్న నేపథ్యంలో పట్టభద్రులైన విద్యార్థులకు మేథాశక్తి పెంపొందించే విధంగా క్విజ్ పోటీలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. జాతీయ స్థాయిలో సాగే ఈ క్విజ్ పోటీలు రాష్ట్ర స్థాయి నుంచి దేశ స్థాయి వరకు జరుగనున్నాయి. మూడు దశల్లో జరిగే ఈ పోటీల్లో మూడు దశల్లో ఉత్తీర్ణులైన వారికి బహుమతుల ప్రదానం ఉంటుందని ఆర్‌బీఐ సూచించింది.

ఆన్‌లైన్ ద్వారా నమోదు

ఆర్‌బీఐ ఏర్పాటు చేసిన క్విజ్ పోటీల్లో పాల్గొనడానికి ఇద్దరు విద్యార్థులతో కూడిన ఒక టీంగా వెబ్‌సైట్ నందు పేరు నమోదు చేసుకోవాలి. ఈ రిజిస్ట్రేషన్ ఈనెల 17న రాత్రి 9 గంటల లోపు నమోదు చేసుకోవాలి.

ఆన్‌లైన్ పరీక్ష

ఆర్‌బీఐ క్విజ్ పోటీల్లో వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 19, 20, 21 తేదీల్లో ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. ఈ మూడు రోజుల్లో ఏదైనా ఒక రోజు పరీక్షలో పాల్గొనాలి.

వివిధ దశలు

ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొనే విద్యార్థులు పాస్ అయిన వారికి రాష్ట్ర స్థాయిలో మరో పరీక్ష ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో పాస్ అయిన వారికి జోనల్ (ఐదు రాష్ట్రాలు) కలిపి ఒక పరీక్ష ఉంటుంది. ఇందులో పాస్ అయిన వారికి జాతీయ స్థాయిలో పరీక్ష ఉంటుంది.

ఈ విద్యార్హతలు ఉండాలి

ఈ క్విజ్‌లో పాల్గొనే విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, పీహెచ్‌డీ చదువుతున్న విద్యార్థులై ఉండాలి. 25 సంవత్సరాల లోపు వారు మాత్రమే అర్హులు.

బహుమతుల వివరాలు

ఆన్‌లైన్‌లో నమోదై పరీక్ష రాసి రాష్ట్ర స్థాయిలో పాస్ అయిన వారికి ప్రథమ బహుమతిగా రూ.2లక్షలు, ద్వితీయ బహుమతి రూ.1 లక్షా 50వేలు, తృతీయ బహుమతి రూ.లక్ష .

జోనల్ స్థాయిలో పరీక్ష రాసిన వారికి పాస్ అయిన వారికి ప్రథమ బహుమతి రూ.5లక్షలు, ద్వితీయ బహుమతి రూ.4లక్షలు, తృతీయ బహుమతి రూ.3లక్షలు.

జాతీయ స్థాయిలో..

జాతీయ స్థాయిలో పరీక్ష రాసి పాస్ అయిన వారికి ప్రథమ బహుమతి రూ.10లక్షలు, ద్వితీయ బహుమతి రూ.8లక్షలు, తృతీయ బహుమతి రూ.6లక్షలు నగదు బహుమతిగా ఇవ్వబడును.

ప్రత్యేక పోర్టల్

ఆర్‌బీఐ 90 క్విజ్ సంబంధించిన వివరాలన్నీ ప్రతీ రోజు ఆర్‌బీఐ పోర్టల్‌లో తెలియజేయడం జరుగుతుంది. క్విజ్‌లో పాల్గొనే విద్యార్థులు ఈ పోర్టల్‌ను ప్రతీ రోజు చూడవచ్చు.


పట్టభద్రులకు ఆర్‌బీఐ క్విజ్ పోటీలు
ఆన్‌లైన్ ద్వారానే నమోదు
ఇద్దరు విద్యార్థులతో ఒక టీమ్
4 స్థాయిల్లో బహుమతుల ప్రదానం

క్విజ్‌లో పాల్గొనండి..

రాజు, జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్

భారతీయ రిజర్వు బ్యాంకు ఏర్పాటై 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆర్‌బీఐ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నది.. ఇందులో వరంగల్ జిల్లాలోని పట్టభద్రులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా పేరు నమోదు చేసుకొని క్విజ్ పోటీల్లో పాల్గొనాలని కోరారు.







పంతం పట్టి.. పతకం కొట్టింది..

- పారాలింపిక్స్‌లో కాంస్యం సాధించిన 'పరుగుల సివంగి' దీప్తి
- పేద కుటుంబంలో పుట్టినా మొక్కవోని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం
- రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి అథ్లెట్

పర్వతగిరి, సెప్టెంబరు 4: పంతం పట్టి పతకాన్ని సాధించింది. ఇతరుల లాగా ఆలోచించలేకపోయినా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో తన లక్ష్యాన్ని చేరుకుంది. బరిలోకి దిగిన ప్రతీ పోటీలోనూ పతకమే లక్ష్యంగా దూసుకెళ్లింది. ప్రపంచ అత్యున్నత పోటీలైన పారాలింపిక్స్‌లో కూడా ఏ మాత్రం తడబడకుండా లక్ష్యం దిశగా దూసుకెళ్లి కాంస్య పతకాన్ని అందుకుంది. కాంస్య తన స్వగ్రామమైన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడను వార్తల్లో నిలిచేలా చేసింది. రాష్ట్రంలోనే ఈ ఘనత సాధించిన తొలి అథ్లెట్‌గా రికార్డుల్లో నిలిచింది.

పేద కుటుంబంలో జన్మించినా..

మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన జీవంజి ధనలక్ష్మి-యాదగిరి దంపతుల ప్రథమ పుత్రిక దీప్తి. గ్రామంలోని ఆర్డీఎఫ్ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తూ నాలుగో తరగతి నుంచే రన్నింగ్‌పై మక్కువ పెంచుకుంది. ఇంటి నుంచి పాఠశాలకు, పాఠశాల నుంచి ఇంటికి నడవడం కన్నా పరుగెత్తుతూనే వెళ్లేదని స్థానికులు చెబుతున్నారు. ఆమెలోని ప్రతిభను గుర్తించిన ఆర్డీఎఫ్ ఫౌండర్ మెంబర్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు క్రీడల వైపు మళ్లించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కోచ్ ద్వారా ప్రత్యేక తర్ఫీదునిస్తూ ప్రోత్సహించారు. అథ్లెటిక్స్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో 2016లో పాఠశాల స్థాయిలోనే 'సాయ్'లో శిక్షణకు ఎంపికైంది. శిక్షణ తీసుకుంటూ అక్కడే విద్యాభ్యాసం కొనసాగిస్తోంది.



పారాలింపిక్స్‌లో పతకంతో జివంజి దీప్తి

అవమానాలు ఎదురైనా..

ఇతర అమ్మాయిల మాదిరిగా కాకుండా కొంత భిన్నంగా ఉండడంతో పలువురు హేళన చేసేవారు. అబ్బాయిల లక్షణాలే అధికంగా ఉన్నాయని సూటిపోటి మాటలతో వేధించేవారు. వాటిని పట్టించకోకుండా పాల్గొన్న ప్రతీ పోటీలోనూ పతకమే తన లక్ష్యంగా ముందుకు సాగింది. విమర్శలన్నింటికీ నోటితో గాకుండా పరుగుతోనే సమాధానం చెప్పింది. కూతురును జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి పంపించడానికి గాను కూలీ పనులు చేసుకునే తల్లిదండ్రులు తమకున్న ఎకరం పొలాన్ని సైతం అమ్మేశారు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబంలో పుట్టిన దీప్తి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టింది.

బరిలోకి దిగితే పతకమే..!

చిరుత వేగంతో దూసుకెళ్లే దీప్తి బరిలోకి దిగితే ఖచ్చితంగా పతకం వచ్చి తీరాల్సిందే. పోటీలో నిలిచిన ఇతర క్రీడాకారులను వెనక్కి నెట్టి మరీ పరుగు పందెంలో ముందుకు దూసుకెళ్తుంది. ఆమెలోని వేగాన్ని గుర్తించిన 'సాయ్' అకాడమీ కోచ్ నాగపురి రమేష్ ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. ఒకవైపు చదువు కొనసాగిస్తూనే పరుగుపై దృష్టి సారించింది. మెరుగులు దిద్దితే పల్లెల్లోనూ ఆణిముత్యాలు తయారవుతారనడానికి దీప్తి విజయాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.



ప్రధాని, సీఎం అభినందనలు



ప్రధాని ట్వీట్



సీఎం ట్వీట్

పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవంజి దీప్తికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ, పర్వతగిరి మండలానికి చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు తదితరులు దీప్తికి ట్విటర్ (ఎక్స్)లో అభినందనలు తెలిపారు. విశ్వవేదికపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించిన దీప్తి ప్రస్థానం స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా

- 2016లో 'సాయ్' అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నప్పటి నుంచి దీప్తి పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధిస్తోంది.
- 2016లో కరీంనగర్‌లో జరిగిన జూనియర్ సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లు, 200 మీటర్లలో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించింది. తమిళనాడులో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లలో 5వ స్థానం, 200 మీటర్లలో 6వ స్థానం సాధించింది.
- 2017లో కేరళలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100, 200 మీటర్లలో గోల్డ్‌మెడల్. గుంటూరులో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 200 మీటర్లు, 400 మీటర్లలో గోల్డ్‌మెడల్.
- 2018లో రాంచీలో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లు, 200 మీటర్లలో గోల్డ్‌మెడల్.
- 2019లో ఛత్తీస్‌గడ్‌లో జరిగిన యూత్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 100 మీటర్లు, 200 మీటర్లలో గోల్డ్‌మెడల్. మహారాష్ట్రలో జరిగిన ఖేలో ఇండియా నేషనల్ చాంపియన్‌షిప్‌లో 100, 200 మీటర్లలో సిల్వర్ మెడల్. కర్ణాటకలోని ఉడిపిలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లు, 200 మీటర్లలో గోల్డ్ మెడల్ సాధించడమే గాకుండా 100 మీటర్లలో న్యూ మీట్ రికార్డును సృష్టించింది. గుంటూరులో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లలో గోల్డ్ మెడల్, 200 మీటర్లలో సిల్వర్ మెడల్. పంజాబ్‌లో జరిగిన నేషనల్ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లలో గోల్డ్ మెడల్, 200 మీటర్లలో సిల్వర్ మెడల్.
- అంతర్జాతీయ స్థాయిలో హాంగ్‌కాంగ్‌లో జరిగిన ఏషియన్ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 200 మీటర్లలో కాంస్య పతకం, మిడ్లే రిలేలో రజత పతకం సాధించింది. మొరాకోలో జరిగిన పారా ఏషియా పోటీల్లో 400 మీటర్ల విభాగంలో, జపాన్‌లో జరిగిన నేషనల్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించి పారాలింపిక్స్‌లో అర్హత సాధించింది.
- ప్రస్తుతం పారాలింపిక్స్‌లో కాంస్య పతకంతో మెరిసింది.



కోచ్ నాగపురితో దీప్తి

నా కల సాకారమైంది..

నాగపురి రమేష్, సాయ్ అకాడమీ కోచ్

ప్రతీ కోచ్‌కు తన శిష్యులు ప్రపంచంలోనే అత్యున్నతమైన ఒలింపిక్స్‌లో పతకం సాధించాలని కల ఉంటుంది. ఆ కల నాకు దీప్తి ద్వారా సాకారమైంది. నాకే పతకం వచ్చినంత సంతోషంగా ఉంది. ఇటీవల జరిగిన ఒలింపిక్స్‌లో తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్క పతకం కూడా లేకపోవడం కొంత ఆవేదన మిగిల్చింది. దాన్ని భర్తీ చేస్తూ దీప్తి పారాలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని కొల్లగొట్టింది. నార్మల్‌గా ఉన్న వ్యక్తులకు శిక్షణనివ్వడం ఎవరికైనా సాధ్యమే కానీ, దీప్తి లాంటి అథ్లెట్‌కు శిక్షణనివ్వడం అనేది సవాళ్లతో కూడుకున్న పని. ఎనిమిదేళ్ల కఠోరసాధనతో ఇది సాధ్యమైంది.

మాజీ మంత్రి ఎర్రబెల్లి అభినందనలు

రాంనగర్: ఒలంపిక్ అథ్లెట్‌లో కాంస్య పతకం సాధించిన దీప్తి జీవాంజికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అభినందనలు తెలిపారు. పతకం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జీవాంజి తల్లిదండ్రులకు బుధవారం ఫోన్ చేసి అభినందించారు. పారిస్ ఒలంపిక్ అథ్లెట్‌లో దీప్తి జీవాంజి కాంస్య పతకం సాధించడం యావత్ దేశానికి, తెలంగాణకు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు గర్వకారణమని ఈ సందర్భంగా దయాకర్‌రావు కొనియాడారు.

దీప్తి సాధించిన పతకాలతో తల్లిదండ్రులు



అదృష్టంగా భావిస్తున్నాం..

జీవంజి ధనలక్ష్మి, యాదగిరి (దీప్తి తల్లిదండ్రులు)

అవలక్షణాలతో పుట్టిన పిల్లలను తల్లిందండ్రులు దురదృష్టంగా భావిస్తుంటారు. కానీ, దీప్తి మాకు జన్మించడం మా అదృష్టంగా భావిస్తున్నాం. పరుగు పందెంలో పాల్గొనడానికి గాను మా సర్వస్వం ధారపోశాం. మా నమ్మకాన్ని నిలబెట్టింది.

లక్ష్యంతో పనిచేశారు.. పట్టాలెక్కించారు..

యుద్ధ ప్రాతిపదికన 3 రోజులపాటు రైల్వేట్రాక్ మరమ్మతు పనులు

మధ్యాహ్నం నుంచే పాక్షికంగా రైళ్ల పునరుద్ధరణ

కేసముద్రం, సెప్టెంబరు 4 : భారీ వర్షం సృష్టించిన బీభత్సంతో సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె, తాళ్లపూసలపల్లి వద్ద రైల్వేట్రాక్ ధ్వంసమైంది. దీంతో మూడు రోజులుగా రైళ్లరాకపోకలను పూర్తిగా నిలిపేశారు. ఈ విధ్వంసంతో పాటు రైళ్ల నిలిపివేతతో రైల్వేశాఖకు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. అయితే రైల్వే యంత్రాంగం ట్రాక్ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేసి.. రైళ్లను పునరుద్ధరించేందుకు ఓ లక్ష్యంతో పనిచేసింది. విజయవంతంగా మరమ్మతులు పూర్తి చేసి రైళ్లను పట్టాలెక్కించారు. కేసముద్రం - ఇంటికన్నె మధ్య 418 కిలోమీటరు వద్ద 40 మీటర్ల పొడవున రైల్వే ట్రాక్ ధ్వంసమైన ప్రాంతంలో మరమ్మతు పనులు తుదిదశకు చేరాయి. ఇదే మండలం తాళ్లపూసపల్లి- మహబూ బాబాద్ మధ్యన 432, 434 కిలోమీటరు వద్ద వరద తాకిడికి దెబ్బతిన్న సుమారు 30 మీటర్ల రైల్వే ట్రాక్‌ను మంగళవారం సాయంత్రమే మరమ్మతులు పూర్తి చేసిన విషయం తెలిసిందే.



ఇంటికన్నె వద్ద పునరుద్ధరణ చేసిన రైల్వే అప్‌లైను ట్రాక్



ఇంటికన్నె వద్ద ఈనెల 1న ట్రాక్ కొట్టుకుపోగా వేలాడుతున్న పట్టాలు (ఫైల్)

ఇంటికన్నె-కేసముద్రం మధ్యన కూడా మరమ్మతులు పూర్తి కావడంతో బుధవారం మధ్యాహ్నం నుంచే రైళ్ల రాకపోకలను పాక్షికంగా పునరుద్ధరించారు.

మూడు రోజులుగా పనులు..

కేసముద్రం-ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య 418 కిలోమీటరు రాయి వద్ద సుమారు 40 మీటర్ల ట్రాక్, తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ మధ్య 432,434 కిలోమీటరు వద్ద సుమారు 30 మీటర్ల రైల్వేట్రాక్ వరద నీటికి కొట్టుకు పోయిన విషయాన్ని అక్కడే కాపలా ఉన్న ట్రాక్‌మెన్‌లు రైల్వే అధికారులకు సమాచారం అందించారు. దీంతో కేసముద్రం రైల్వేస్టేషన్‌లో బెంగళూరు-దానాపూర్ సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్‌డౌన్ వైపులా వెళ్లే రైళ్లు, మహబూబాబాద్‌లో సింహపురి ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోయాయి. తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ మధ్య ధ్వంసమైన ట్రాక్‌ను మంగళవారం సాయంత్రం వరకు పునరుద్ధరించి సిద్ధం చేశారు. ఇక ఇంటికన్నె వద్ద రైల్వేట్రాక్ బాగా ధ్వంసం కావడం, వరద ప్రవాహం ఉండడంతో మరమ్మతులకు భారీ యంత్రాంగం కృషి చేయాల్సివచ్చింది. ఆదివారం సాయం త్రం నుంచి రేయింబవళ్లు 12 ఎక్స్‌కవేటర్ యంత్రాలు, 11 టిప్పర్లు, 2 క్రేన్లు, ఒక రోడ్డు రోలర్‌తోపాటు 600 మంది కార్మికులు, ఇంజనీరింగ్, ఓహెచ్ఈ (ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్), ఎస్అండ్‌టీ (సిగ్నల్ అండ్ టెలికాం) సిబ్బంది, ఉన్నతాధికారులు వెయ్యి మందికిపైగా నిర్విరామంగా పనిచేశారు. సిబ్బందికి భోజనం, నీళ్లు అక్కడికే తీసుకువచ్చి అందించారు. మరమ్మతులు జరుగుతున్న ప్రాంతం అంతా ఒకపెద్ద క్వారీ పరిశ్రమలాగా కనిపించింది. నిరంతరం శ్రమించి ఎట్టకేలకు బుధవారం ఉదయం 10 గంటలకు అప్‌లైను ట్రాక్‌ను సిద్ధం చేశారు.

వేగంగా పునరుద్ధరణ పట్ల హర్షాతిరేకాలు..

ట్రాక్ పూర్తిగా వరద తాకిడికి కొట్టుకుపోయి రైలుపట్టాలు వేలాడుతున్న స్థితి నుంచి మూడురోజుల్లోనే పునరుద్ధరణ చేయడంపట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్రాక్ మీదుగా తొలుత ఒక గూడ్స్‌రైలును ఆ తర్వాత కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు లేకుండా మూడు రోజులుగా నిలిచి ఉన్న బెంగళూరు-దానాపూర్ సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌ను ట్రయల్‌రన్‌లో భాగంగా పంపించారు. మధ్యాహ్నం 2 గంటలకు గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను పంపించారు. అందుబాటులోకి వచ్చిన అప్‌లైనుపై గోల్కొండ, నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌లు, డౌన్‌వైపు హౌరా, గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లను కాషన్ ఆర్డర్‌తో నెమ్మదిగా నడిపించారు. రాత్రి వరకు డౌన్‌లైనును సిద్ధం చేసి గురువారం నుంచి అన్ని రైళ్ల రాకపోకలను పునరుద్ధరించే అవకాశమున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. మూడు రోజులుగా యుద్ధప్రాతిదికన చేపట్టిన ఈ మరమ్మతు పనులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అజయ్‌కుమార్ జైన్ ప్రత్యేక రైలులో పలుమార్లు ఇంటికన్నెకు వచ్చి సమీక్షించారు. ఇక దక్షిణమధ్య రైల్వే డీఆర్ఎం భరతేష్ కుమార్ జైన్ మూడురోజుల పాటు అక్కడే ఉండి పనులను పూర్తిగా పర్యవేక్షించారు. ఈ మరమ్మతులకు రూ.6కోట్లకుపైగా ఖర్చయినట్లు అంచనా వేస్తున్నారు. మూడు రోజులపాటు రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంవల్ల రైల్వేశాఖకు కోట్లలో నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం జరిగిన ట్రాక్ ధ్వంసమైన పరిస్థితి ప్రస్తుత మరమ్మతుల దృశ్యాలను పోల్చుతూ 'హాట్సాఫ్ రైల్వే' అంటూ ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.

రాయనపాడు వద్ద వరదతో ఇబ్బందులు..

గిర్మాజిపేట, సెప్టెంబరు 4: భారీ వర్షాలు, వరదలతో సికింద్రాబాద్ - విజయవాడ మార్గంలోని తాళ్లపూసలపల్లి, ఇంటికన్నె మధ్య ట్రాక్ దెబ్బతినడంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోగా.. బుధవారం నాటికి మరమ్మతులు పూర్తవడంతో రైళ్లను పాక్షికంగా పునరుద్ధరించారు. అయితే విజయవాడ సమీపంలోని రాయనపాడు రైల్వేస్టేషన్ ఇంకా వరద ముంపులోనే ఉండటంతో పలు రైళ్లను వరంగల్ వైపు రాకుండా దారి మళ్లించారు. హైదరాబాద్-శాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.20గంటలకు వరంగల్‌కు చేరుకుని.. సుమారు 40 నిమిషాల తర్వాత విజయవాడ వైపు బయలుదేరింది. రాత్రి 7.30 గంటల వరకు కొండపల్లిలోనే నిలిచిపోయింది. వరంగల్ నుంచి పలువురు ప్రయాణికులు ఈ రైలులో విజయవాడ, విశాఖపట్టణం వెళ్లారు. ఆ రైలు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో అక్కడి నుంచి దారి మళ్లిస్తున్నట్లు సమాచారం. అలాగే సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు బయలుదేరిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను వరంగల్ రాకుండా నడికూడ మీదుగా గుంటూరుకు దారి మళ్లించారు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరాల్సిన గోదావరి, వందేభారత్ తదితర పలు రైళ్లను ఆలస్యంగా నడికూడ మీదుగా దారి మళ్లిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం గోల్కొండ, ఈస్ట్‌కోస్ట్ రైళ్లు వచ్చినపుడు వరంగల్ రైల్వేస్టేషన్‌లో కొద్దిసేపు ప్రయాణికుల సందడి కనిపించింది. అయితే రైళ్ల రద్దు, దారి మళ్లింపు సమాచారంతో ప్రయాణికుల సందడి తగ్గింది. రైల్వేస్టేషన్‌లోని హెల్ప్‌లైన్ సిబ్బంది ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నారు.

చదువుల దివిటీ.. గురువు..

● నేడు ఉపాధ్యాయ దినోత్సవం ● పాఠశాలలు, కళాశాలల్లో గురుపూజోత్సవం ● సన్మాన కార్యక్రమాలకు ఘనంగా ఏర్పాట్లు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: అజ్ఞానమనే చీకటిలో ఉన్నవారికి, విజ్ఞానమనే దారిని చూపి వారి జీవితాల్లో వెలుగులు నింపే దివిటీలు ఉపాధ్యాయులు. అలా అందరి జీవితాల్లో వెలుగులు నింపే టీచర్ల సేవలను గుర్తు చేసుకుంటూ ఏటా సెప్టెంబరు 5న దివంగత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రపంచ వ్యాప్తంగా అక్టోబరు 5న టీచర్స్‌డేను జరుపుకుంటుండగా, మన దేశంలో మాత్రం సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజున నిర్వహించుకోవడం జరుగుతోంది. భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతదేశ తొలి ఉపరాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా పని చేశారు. 1988లో తిరుత్తణిలో ఆయన జన్మించిన ఆయన యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ నుంచి ఫిలాసఫీలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. కోల్‌కతా, మైసూర్ యూనివర్సిటీలో ఆయన అధ్యాపకుడిగా పని చేశారు. చాలా మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ఏ రోజు తన పుట్టిన రోజును జరుపుకోవాలని కోరుకోలేదట. విద్యార్థులు ఎవరైనా పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తామని ఆయన్ను అడిగితే వద్దని వారించే వారట. విద్యార్థులు అంటే అమితమైన ఇష్టాన్ని ప్రదర్శించే ఆయన, విద్యార్థులు గురువుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని చెప్పేవారట. అందుకే 1962వ సంవత్సరం నుంచి ఆయన పుట్టిన రోజున అందరూ ఉపాధ్యాయులను గౌరవిస్తూ టీచర్స్ డే వేడుకలను జరుపుతున్నారు. నాడు మత ఆధ్యాత్మిక పునరుద్ధరణ వాదాన్ని అకడమిక్ తాత్వికస్థాయికి తీసుకువెళ్లిన గొప్ప పండితుడు సర్వేపల్లి రాధా కృష్ణన్. ఆయన 15 సార్లు నోబెల్ సాహిత్య బహుమతికి, 11 సార్లు నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు. ఈ క్రమంలోనే సర్వేపల్లి తనకు కృష్ణుడితో సమానమని జాతిపిత మహాత్మాగాంధీ కీర్తించారు. యుగపురుషుల గురించి ఉపన్యాసం ఇవ్వండి అని పిలిస్తే యుగపురుషుడే వచ్చారు అని సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఉద్దేశించి కీర్తించారట హోవెల్ అనే మహనీయుడు. అంతేకాదు తనలోని మామూలు మనిషిని దర్శించిన మహర్షి అంటూ సోవియట్ అధినేత స్టాలిన్ కూడా రాధాకృష్ణన్ గొప్పతనాన్ని చాటారు. అయితే గాంధీజీ మాటలను బట్టి ఆయన ఒక గీతాచార్యుడిగా, గొప్ప గురువుగా కీర్తించబడ్డారు. ఈనేపథ్యంలోనే భవిష్యత్ తరాలు ఆయన మార్గంలో పయనించాలని దిశానిర్దేశం చేస్తూ ఆయన పుట్టిన రోజును టీచర్స్ డే గా జరపాలని నాటి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నిర్ణయం తీసుకున్నారు.

కాగా, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు తమకు చదువుచెప్పే గురువులను ఘనంగా సత్కరించుకునేందుకు సిద్ధమవయ్యారు.

వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 'ఉత్తములు' వీరే..

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి పాఠశాల, ఇంటర్మీడియేట్ విద్యాశాఖల నుంచి మొత్తం ఐదుగురిని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది.

కొంక అనురాధ



వరంగల్ జిల్లాలోని రాయపర్తి మండలంలోని కొత్తూరు జడ్పీహెచ్ఎస్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. 2009లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయురాలుగా ప్రస్తుత సిద్ధిపేట జిల్లాలోని వేచరేణి జడ్పీహెచ్ఎస్‌లో ఉద్యోగం పొందారు. అక్కడ 3 ఏళ్లు పనిచేసిన అనంతరం ప్రస్తుత జనగామ జిల్లాలోని కామారెడ్డిగూడెం జడ్పీహెచ్ఎస్‌లో 2013 నుంచి 2015 వరకు, 2017 నుంచి 2022 వరకు చిట్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పనిచేశారు. జీవో నెం.317లో రాయపర్తి మండలంలోని కొత్తూరు జడ్పీహెచ్ఎస్‌కు వచ్చి ఇక్కడే పనిచేస్తున్నారు. స్కూల్లో కిచెన్ గార్డెన్, ఫ్లవర్ గార్డెన్, బొటానికల్ గార్డెన్‌ను ఏర్పాటు చేయడంలో కృషి చేయడంతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోంది.

కె.ఇందుమతి



కె.ఇందుమతి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1996లో నిర్వహించిన కాలేజ్ సర్వీస్ కమిషన్ పరీక్ష ద్వారా జువాలజీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాలోని తాటిపూడి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో చేరారు. అనంతరం 2001లో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు బదిలీపై వచ్చి ఇక్కడే ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

పి.సంపత్‌కుమార్



2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన కాలేజ్ సర్వీస్ కమిషన్ పరీక్షలో కెమిస్ట్రీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై ప్రస్తుత సిద్ధిపేట జూనియర్ కళాశాలలో ఉద్యోగంలో చేరారు. అక్కడ నుంచి 2011లో వరంగల్ జిల్లాలోని రంగశాయిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వర్తించారు. అనంతరం 2018 నుంచి 2021 వరకు వర్ధన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేశారు. ఇక్కడి నుంచి ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది ప్రస్తుతం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 2024లో బదిలీపై వరంగల్ జిల్లా నర్సంపేటలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రస్తుతం పనిచేస్తున్నారు.

జి.వెంకటయ్య



1983లో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ప్రస్తుతం సిరిసిల్ల జిల్లా జిల్లెల్ల జడ్పీహెచ్ఎస్‌లో ఉద్యోగంలో చేరారు. సిద్దిపేట జిల్లాలోని శనిగరం జడ్పీహెచ్ఎస్, కరీంనగర్‌లోని గొడిశాల జడ్పీహెచ్ఎస్‌లో 1996 వరకు ఎస్జీటీగా పనిచేశారు. అక్కడి నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది కరీంనగర్‌లోని సిర్సపల్లి యూపీఎస్‌లో పనిచేశారు. 2001లో జువాలజీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి పొంది వరంగల్ జిల్లాలోని ఫోర్ట్ వరంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరారు. 2017లో ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది ప్రస్తుత ములుగు జిల్లాలోని మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లారు. ప్రస్తుతం 2024 నుంచి వర్ధన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

డాక్టర్ ఎల్.కొమురారెడ్డి



డాక్టర్ ఎల్.కొమురారెడ్డి 2002లో హనుమకొండ జిల్లా చిన్నకోడెపాక జడ్పీహెచ్ఎస్‌లో హిందీ లాంగ్వేజ్ పండిట్‌గా ఉద్యోగంలో చేరారు. అక్కడ నుంచి 2011 బదిలీపై మనుగొండ యూపీఎస్‌లో పనిచేశారు. 2012లో కాలేజ్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన జూనియర్ లెక్చరర్ల పరీక్షలో ఉత్తీర్ణులై వరంగల్ జిల్లాలోని నెక్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా చేరారు. 2018లో బదిలీపై హసన్‌పర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లారు. అక్కడి నుంచి సాధారణ బదిలీల్లో 2024లో ప్రస్తుతం నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల (కోఎడ్యుకేషన్)లో విధులు నిర్వర్తిస్తున్నారు.

భూపాలపల్లి జిల్లాలో..

అమరేందర్‌రెడ్డి, రాజయ్య





భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 4: భూపాలపల్లి జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. భూపాలపల్లి మండలంలోని కొంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఇంగ్లిష్ బోధిస్తున్న స్కూల్ అసిస్టెంట్ అమరేందర్‌రెడ్డి, మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు గూడెల్లి రాజయ్య అవార్డు అందుకోనున్నారు.

రజనీకాంత్



కాటారం: గిరిజన గురుకులాల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆడెపు రజనీకాంత్ ఎంపికయ్యారు. భూపాలపల్లి జిల్లా కాటారం గిరిజన సంక్షేమ బాలుర గురుకులంలో ఆర్ట్అండ్ క్రాఫ్ట్ టీచర్‌గా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకులాల్లో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయగా అందులో రజనీకాంత్ ఒకరు.

సుధాకర్‌రెడ్డి



జఫర్‌గఢ్, సెప్టెంబరు 4 : జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం తిడుగు ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయుడు కుందూరు సుధాకర్‌రెడ్డి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. హసన్‌పర్తి మండలం బైరాన్‌పల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి.. 2002లో ములుగు వెంకటాపూర్ మండలం బాపూసింగ్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా నియామకమయ్యారు. 2013లో జఫర్‌గడ్ మండలం కూనూరు ప్రాథమిక పాఠశాలలో పదేళ్ల పాటు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి.. ఇటీవల జులై నెలలో ఇదే మండలం తిడుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చారు.

అధ్యాపకుల విభాగంలో..



కేడీసీ కెమిస్ట్రీ అధ్యాపకుడు శ్రీనివాస్

కేయూ క్యాంపస్: హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ వాసం శ్రీనివాస్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. 22 ఏళ్ల బోధనానుభవం కలిగిన డాక్టర్ వాసం శ్రీనివాస్ విద్యారంగంలో అందించిన విశిష్ట సేవలకు అవార్డుకు ఎంపికయ్యారు. వరంగల్ జిల్లా సంగెం మండలకేంద్రానికి చెందిన శ్రీనివాస్.. 2002లో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై 2010లో పదోన్నతి ద్వారా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో నిర్వహిస్తున్నారు. గతంలో ములుగు, సిద్ధిపేట ప్రభుత్వకళాశాలల్లో పనిచేశారు. అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో సుమారు 31 పరిశోధన పత్రాలను ప్రచురించారు. తెలుగు అకాడమీ, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వర్సిటీల కెమిస్ట్రీ 11 పాఠ్యపుస్తకాలను ప్రచురించారు.

ఫిజిక్స్ ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి



కేయూ క్యాంపస్: కేయూ ఫిజిక్స్ సీనియర్ ప్రొఫెసర్ బైరు వెంకట్రామిరెడ్డి ఈ ఏడాది రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. 35 ఏళ్ల సుదీర్ఘ బోధన, పరిశోధన అనుభవం కలిగిన బైరు వెంకట్రామిరెడ్డి ఫిజిక్స్ విభాగంలో విభాగాధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, వర్సిటీ రిజిస్ట్రార్‌గా, పరీక్షల నియంత్రణాధికారిగా, అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా, డీన్ అకడమిక్‌గా, వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్‌గానూ విశిష్ట సేవలందించారు. వరంగల్ జిల్లా పెద్దకోడెపాక గ్రామానికి చెందిన బైరు వెంకట్రామిరెడ్డి 1992లో కేయూ నుంచి ఫిజిక్స్ విభాగంలో పీహెచ్‌డీ డిగ్రీ పొందారు. 2003లో యూనివర్సిటీ పీజీ కళాశాల గోదావరిఖనిలో ఫిజిక్స్ అధ్యాపకులు ఉద్యోగ ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. 2018లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు.



నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి

సుబేదారి, సెప్టెంబరు 4: హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో గవర్నర్ భూమి పూజ చేసిన తలసేమియా వార్డు నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేయాలని రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్‌రెడ్డి కోరారు. బుధవారం హనుమకొండ సుబేదారిలోని రెడ్ క్రాస్ సొసైటీ ప్రాంగణంలో కన్సల్టింగ్ ఇంజనీర్ కె.సత్యనారాయణరావును షీల్డ్, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హనుమకొండ రెడ్ క్రాస్ వైస్ ఛైర్మన్ పెద్ది వెంకటనారాయణ గౌడ్, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర పాలక వర్గ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు, జిల్లా పాలక వర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, డాక్టర్ సుధాకర్‌రెడ్డి, చెన్నమనేని జయశ్రీతో పాటు రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పార్ట్‌టైమ్ ఉద్యోగులను తొలగించడం దుర్మార్గం


మాట్లాడుతున్న సదానందం, మనోజ్, సంజీవ

వడ్డెపల్లి, సెప్టెంబరు 4: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న 6వేల మంది పార్ట్‌టైమ్ ఉద్యోగులను తొలగించడం దుర్మార్గమని స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర కన్వీనర్ చాతల్ల సదానందం, రాష్ట్ర ఈసీ మెంబర్ మారపల్లి మనోజ్, రాష్ట్ర కార్యదర్శి ఇనం పల్లి సంజీవలు అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సైనిక్ స్కూల్, గురుకుల పాఠశాలల్లో వివిధ సబ్జెక్టులను బోధించే ఉద్యోగులను తొలగించడం ఎంత వరకు సమంజసమని దుయ్యబట్టారు. బడుగు, బలహీన వర్గాల అభివృద్ధిని, ఎదుగుదలను ఓర్వ లేకనే సీఎం రేవంత్‌రెడ్డి, తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల కార్యదర్శి అలుగు వర్షిణి నియంతలా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు నాణ్యమైన భోజన వసతిని ఏర్పాటు చేయకుండా వారి పొట్టకొడుతున్నారని ఆరోపించారు. ఈసమావేశంలో స్వేరోస్ నెట్‌వర్క్ రాష్ట్ర, జిల్లా నాయకులు శనిగరపు రాజేంద్రప్రసాద్, సాయికుమార్, రాకేష్, బొట్ల ప్రశాంత్, తిప్పారపు బన్ని, మహేష్, సాగర్, వికాస్ పాల్గొన్నారు.

వర్సిటీ భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 4: కాకతీయ యూనివర్సిటీ భూములను కబ్జా చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ డిమాండ్ చేశారు. బుధవారం కేయూ క్యాంపస్‌లోని క్యాంటీన్ వద్ద ఏబీఎస్ఎఫ్ కేయూ అధ్యక్షుడు దూడపాక నరేందర్ అధ్యక్షత జరిగిన విలేకరుల సమావేశంలో మంద నరేశ్ హాజరై మాట్లాడారు. వర్సిటీ చుట్టూ త్వరగా ప్రహరీ గోడ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఇన్‌చార్జి వీసీ అధికారి వాకాటి కరుణ వర్సిటీ భూముల రక్షణపై స్పందించాలని డిమాండ్ చేశారు. సీఆర్‌పీఎఫ్ భూములను వెంటనే వర్సిటీ అధికారులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. వర్సిటీకి అధిక బడ్జెట్‌ను ఇవ్వాలని, విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలన్నారు. ఫీజులతో సంబంధం లేకుండా విద్యార్థులకు ఉత్తీర్ణత ధ్రువపత్రాలను జారీ చేయాలని అన్నారు. లేకపోతే ఏబీఎస్ఎఫ్ నేతృత్వంలో విద్యార్థులకు మద్దతుగా పెద్ద ఎత్తున నిరసన ఆందోళనలు చేపడుతా మని హెచ్చరించారు. ఈ సమావేశంలో కేయూ ఏబీఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి బండారి పృథ్వీరాజ్, హర్షం చరణ్, అశోక్, రాజు, కిరణ్, వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా సవరణ

వేలేరు, సెప్టెంబరు 4: వేలేరు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో ఓటరు జాబితాల సవరణ కోసం ఈ నెల 6 నుంచి గ్రామ పంచాయతీల్లో ఓటరు జాబితాను ప్రచురించ డం జరుగుతున్నట్లు ఎంపీడీవో లక్ష్మి ప్రసన్న బుధవారం ప్రకటనలో తెలిపారు. ఓటరు జాబితాలో అభ్యంతరాలు ఉంటే సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదు చేయ డంతో పాటు ఆ సమస్యను పరిష్కరించుకోవాలని ఆమె తెలిపారు. 19వ తేదీ వరకు ఓటరు జాబితాను పరిశీలించి 21వ తేదీన ఓటర్ జాబితా ఫైనల్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు

మడికొండ, సెప్టెంబరు 4: మడికొండకు చెందిన మాదిరెడ్డి ఆహల్యమ్మ(90) అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబ సభ్యులు సమాజ హితం కోసం నేత్ర దానం చేయడానికి ముందుకొచ్చారు. వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది, ఎల్వీ ప్రసాద్ నేత్రసేకరణ నిపుణులు డాక్టర్ రాజేంద్రప్రసాద్ నేత్రాలను సేకరించారు. కార్యక్రమంలో బంధు మిత్రులు, 64వ డివిజన్ కార్పొరేటర్ రాధికరెడ్డి పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలల్లో సమస్యలు లేకుండా
చర్యలు తీసుకోవాలి

- అద్దె భవనాల యజమానులే మరమ్మతులు చేయించాలి
- కలెక్టర్ పి.ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 4: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఎలాంటి సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో బుధవారం జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల స్థితిగతులపై ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు, అద్దె భవనాల యజమానులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సొంత భవనాలతో పాటు అద్దె భవనాలలో కొనసాగుతున్న విద్యాలయాలలో విద్యార్థుల సంఖ్యతో పాటు తరగతి గదులు, వాటర్, విద్యుత్, డ్రైనేజీ సౌకర్యాల గురించి ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లను ఈ సందర్భంగా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. అద్దె భవనాలలో కొనసాగుతున్న గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఆయా భవనాల యాజమాన్యమే మరమ్మతులు చేయించి సౌకర్యాలు మెరుగ్గా ఉండేలా చూసుకోవాలన్నారు. అద్దె భవనాలలో గదులు, టాయిలెట్స్, డ్రైనేజీ, విద్యుత్, రంగులు వేయడం, డైనింగ్ హాల్ తదితర మరమ్మతు పనులను భవన యాజమాన్యమే పూర్తిచేయించాలన్నారు. కాంపౌండ్‌వాల్, భవనాలకు గ్రిల్స్ తప్పకుండా ఉండాలన్నారు. హసన్‌పర్తిలో కొనసాగుతున్న డిగ్రీ కళాశాలతో పాటు ఇతర పాఠశాలలు, కళాశాలల్లో నెల రోజుల్లోగా మరమ్మతు పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ మల్టీజోనల్ ఆఫీసర్ అలివేలు, జిల్లా సమన్వయ అధికారి ఉమా మహేశ్వరి, హసన్‌పర్తి, పరకాల, ఆత్మకూరు, ధర్మసాగర్, వరంగల్ వెస్ట్, హంటర్‌రోడ్, వర్ధన్నపేట, శాయంపేట పాఠశాలల ప్రిన్సిపాళ్లు, అద్దెభవనాల యజమానులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయండి

దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రామాల సునీత

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 4: బాద్రప్రద శుద్ధ చవితి శనివారం 7వ తేదీ నుంచి 16వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా అనేక చోట్ల జరిగే నవరాత్రి ఉత్సవాలను వైభవంగా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రామాల సునీత పిలుపునిచ్చారు. చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో వైభవోపేతంగా జరిగే ఉత్తిష్ట గణపతి నవరాత్రి వేడుకల ఆహ్వాన పత్రికను బుధవారం ఆలయంలో ఆమె ఆవిష్కరించారు. ఆలయ ఈవో వెంకటయ్య, ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ తదితరుల సమక్షంలో ఆవిష్కరించి మాట్లాడారు. అన్ని విఘ్నాలను తొలగించే ఆదిదేవుడుగా వినాయకుడిని ప్రజలందరూ కొలుస్తారని, ఈ క్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గణేష్ ఉత్సవ సమితులు ఈ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. ముఖ్యంగా పర్యావరణానికి విఘాతం కల్పించకుండా సహజమైన మట్టి గణపయ్యలతో పూజలు నిర్వహించుకోవాలని కోరారు.


ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న దేవాదాయ శాఖ ఏసీ రామాల సునీత

ఆలయ ప్రధాన అర్చకుడు గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిత్య పూజలు నిర్వహించడంతోపాటు ప్రతీరోజు గణపతికి వాహన సేవలు, నిత్య అలంకారాలు, అన్నదానం, ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామన్నారు. ప్రముఖ బిల్డర్ వేముల సత్యమూర్తి ఆధ్వర్యంలో నిత్య అన్నదానం, విజయలక్ష్మీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవో వెంకటయ్యతోపాటు ఉత్సవ కమిటీ సభ్యులు గండ్రాతి రాజు, కాశి లింగాచారి, ప్రణవ్, ఎస్.మధుకర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..

- 31 మంది ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక
- నేడు కలెక్టరేట్ సమావేశమందిరంలో సత్కారం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా విద్యాశాఖ జిల్లాలో 31మందిని ఉత్తమ ఉపాధ్యాయులకు ఎంపిక చేసింది. ఇద్దరు హెడ్మాస్టర్లు, 15 స్కూల్ అసిస్టెంట్, 13మంది ఎస్జీటీలకు, ఒక వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్, ఒక డ్రాయింగ్ టీచర్‌తో పాటు ముగ్గురు ప్రైవేటు టీచర్లను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు. వీరందరికీ గురువారం హనుమకొండలోని కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన గురుపూజోత్సవ కార్యక్రమంలో సన్మానం చేయనున్నారు.

హెడ్మాస్టర్ల విభాగంలో: ఎం.వేణు ఆనంద్ (రాంపూర్ జడ్పీహెచ్ఎస్) కె. హనుమంతరావు (నడికూడ జడ్పీహెచ్ఎస్)

స్కూల్ అసిస్టెంట్ విభాగంలో: ఎ.రాజేందర్ (ఉప్పల్ జడ్పీహెచ్ఎస్ బయోసైన్స్), ఎ.రవి, (అక్కంపేట జడ్పీహెచ్ఎస్, ఎస్ఏ బయోసైన్స్), కె.శ్రీనివాస్ (గట్లనర్సింగాపూర్, ఇంగ్లీష్), పి.సెలీనా (వెంకటాపూర్ జడ్పీహెచ్ఎస్, ఇంగ్లీష్), ప్రత్యూష (జీహెచ్ఎస్, వడ్డెపల్లి, ఇంగ్లీష్), డి.రమేష్, నీరుకుళ్ల (జడ్పీహెచ్ఎస్, మ్యాథ్స్), బి.అశోక్‌కుమార్ (గట్లనర్సింగాపూర్ జడ్పీహెచ్ఎస్, ఫిజికల్ సైన్స్), ఎస్.వేణుగోపాల్‌రావు (పీచర జడ్పీహెచ్ఎస్, ఫిజికల్ సైన్స్), పి.రవి, పెద్దకోడెపాక (జడ్పీహెచ్ఎస్, సోషల్), బి.శిరీష (ఉప్పల్ జడ్పీహెచ్ఎస్ బాయ్స్, తెలుగు), డి.భిక్షపతి (హనుమకొండ జీహెచ్ఎస్, ఉర్దూ మీడియం తెలుగు).

ఎస్జీటీ విభాగంలో: ఆర్.వెంకటేష్ (జగన్నాథపూర్ ఎంపీయూపీఎస్), జి.సుదర్శన్ (పోచారం ఎంపీయూపీఎస్), బి.లత (లక్ష్మీపురం ఎంపీయూపీఎస్), ఎం.శ్రీధర్ (వరికోల్ ఎంపీపీఎస్), ఎం.భిక్షపతి (కంఠాత్మకూర్ ఎంపీపీఎస్), ఎన్.శ్రీదేవి (నార్లపూర్ ఎంపీపీఎస్), వి.రఘు (పెద్దకోడెపాక ఎంపీపీఎస్), ఆర్.భిక్షపతి (ఆత్మకూరు ఎంపీపీఎస్) జె.పుష్పలత (ఆత్మకూరు ఎంపీపీఎస్), ఎన్.ప్రవీణ్‌కుమార్ (లోక్యాతండ ఎంపీపీఎస్), ఎం.రాధిక (ఎర్రబెల్లి ఎంపీపీఎస్), ఎ.జ్యోతి (బీసీకాలనీ ముప్పారం ఎంపీపీఎస్), జి.ఉషారాణి (పెద్దాపూర్ ఎంపీపీఎస్), పి.సత్యనారాయణ (మడికొండ జడ్పీహెచ్ఎస్, వొకేషనల్ ఇన్‌స్ట్రక్టర్), డి.నాగయ్య (పరకాల జడ్పీహెచ్ఎస్, డ్రాయింగ్ టీచర్)

ప్రైవేట్ స్కూళ్ల నుంచి: తక్కళ్లపెల్లి బుచ్చిబాబు (భారతి విద్యాభవన్ హైస్కూల్), (డాక్టర్ వి.మధుకర్, మేధా కాన్సెప్ట్ స్కూల్), (కె.అపర్ణ, విద్యాధరి హైస్కూల్).

నాలాలనూ వదలట్లే!

5వ పేజీ తరువాయి

లెక్కిస్తున్నారు. అలాగే నయీంనగర్ నాలాలో మరో భాగం రాజాజీ నగర్ బ్రిడ్జి నుంచి కాకతీయ కెనాల్ బ్రిడ్జి వరకు 147 అక్రమ కట్టడాలు ఉన్నాయి. వీటిలో 56 అక్రమ నిర్మాణాలను అధికారులు తొలిగించగా, 33 నిర్మాణాలపై కోర్టు నుంచి స్టే ఆర్డర్ ఉంది. మిగిలినా 58 అక్రమ నిర్మాణాలను తొలిగించటంలో అధికారులకు రాజకీయ అడ్డంకులు ఎదురవుతున్నాయి. అలాగే భద్రకాళి నాలా 3.63కిలో మీటర్లు ప్రవాహిస్తుంది. ఇందులో పోతననగర్, అలంకార్ బ్రిడ్జి, అలాగే కాపువాడ, భద్రకాళి మత్తడి, అలంకార్ బ్రిడ్జి వరకు మొత్తం 101 అక్రమ కట్టడాలు ఉండగా, 17 అక్రమ నిర్మాణాలను మాత్రమే అధికారులు తొలగించారు. 8మంది కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. మిగిలినా 76అక్రమ నిర్మాణాలను తొలగించేందుకే అధికారులు సాహసం చేయటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలంకార్ బ్రిడ్జి నుంచి కాకతీయ కెనాల్ వరకు 30 అక్రమ నిర్మాణాలు ఉండగా, 11 నిర్మాణాలను తొలగించారు. మిగతా 19 అక్రమ కట్టడాల వైపు చూసేందుకు అధికారులు జంకుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక వరంగల్ నరగంలోని బొందివాగు నాలా 0.84కిలో మీటర్లు ప్రవహిస్తుంది. ఇందులో బెస్తం చెరువు నుంచి జక్కలొద్ది వరకు 8 అక్రమ నిర్మాణాలు ఉండగా, నాలుగు కట్టడాలపై కోర్టులో కేసు నడుస్తోంది. మిగతా నాలుగు కట్టడాలపై అధికారులు మౌనం వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. సాకరాశికుంట నాలా 6.40 కిలో మీటర్లు నగరంలో ప్రవహిస్తోంది. ఈ నాలాకు ఇరువైపులా 102 అక్రమ కట్టడాలు ఉన్నట్లు గుర్తించినా ఒక్క అక్రమ నిర్మాణాన్ని తొలగించేందుకు అధికారులు ముందుకు రాకపోవడం విమర్శలకు తావిస్తోంది. మొత్తం వరంగల్ నగరంలో నాలుగు ప్రధాన నాలాలకు ఇరువైపులా 524 అక్రమ కట్టడాలు ఉంటే, హనుమకొండ నగరంలో మాత్రమే కేవలం 107 కట్టడాలను తొలగించారు. మరో 107 నిర్మాణాలపై వివిధ కోర్టుల్లో కేసులున్నాయి. మిగిలిన 310 అక్రమ కట్టడాలను తొలగించటంలో అధికారుల మౌనం వెనుక మతలబేంటనే చర్చ జరుగుతోంది. వరద నీటిని దర్జాగా బయటకు తీసుకెళ్లాల్సిన నాలాలు అక్రమణాలతో బక్కచిక్కి పోయాయి.

ఉపాధ్యాయులకు సన్మానం

వేలేరు, సెప్టెంబరు 4: వేలేరు మండలం ఎర్రబెల్లి ప్రభుత్వ పాఠశాలలో పదవి విరమణ పొందిన ఉపాధ్యాయురాలితో పాటు బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులకు ఆ పాఠశాల తోటి ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సన్మానించారు. ప్రైమరీ పాఠశాలకు చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయురాలు కిషోరీ పదవి విరమణ పొందడం, అలాగే వెంకటేశ్వర్లు బదిలీ కావడంతో వారికి వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారి శాలువాలతో సన్మానించి వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఎం.చంద్రమౌళి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్ లలిత, పీఆర్‌టీయూటీఎస్ మండల అధ్యక్షుడు రొండ్ల భానుప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పతంగి సమ్మయ్య, సీఆర్‌పీలు మొగిలిచెర్ల శ్రీనివాస్, రాజ్‌కుమార్, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమ నిర్మాణాలను తొలగించాలి

ఐనవోలు, సెప్టెంబరు 4: పంథిని గ్రామంలో నాగుల చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న అక్రమ డబ్బాలు, నిర్మాణాలను తొలగించాలని అధికారులు ఆదేశించారు. తహసీల్దార్ విక్రమ్‌కుమార్, ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ డీఈ శంకర్‌చౌహాన్, ఏఈ ప్రశాంత్, ఎంఆర్ఐ రాణి, ఏఆర్ఐ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి మాలతి గ్రామ పంచాయతీ సిబ్బంది బుధవారం నాగులచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోని నిర్మాణాలను వివిధ ఫిర్యాదుల మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎలాంటి అనుమతి లేకుండా ఎఫ్‌టీఎల్ జోన్‌లో నిర్మాణాలు చేపడుతున్నది గుర్తించి వారిని పిలిచి మాట్లాడారు. డబ్బాలు పెట్టుకొని చిరువ్యాపారాలు చేస్తు జీవిస్తున్నామని, తమ పొట్టకొట్టొదంటూ వేడుకున్న అధికారులు ఒప్పుకోలేదు. అయితే తమ డబ్బాలు తీయడానికి సిద్ధంగా ఉన్నామని, ముందుగా నాగుల చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మించిన గృహాలను తొలగిస్తారా? అంటూ ప్రశ్నించారు. చివరగా డబ్బాలు, షెడ్లు తొలగించేందుకు 15 రోజుల గడువు కావాలని వారు కోరారు. 15 రోజుల్లో తొలగించకపోతే తామే తొలగిస్తామని అధికారులు సూచించారు. అదేవిధంగా పంథిని తుమ్మలకుంట, పున్నేలు బాబాయ్ కుంట, రంగ సముద్రం చెరువులో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ పరిధిలోని అక్రమవెంచర్లను పరిశీలించారు. నివేదికను ఉన్నత అధికారులకు అందించనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 4: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా గురువారం బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని సాయినగర్, కంచరకుంట, లష్కర్‌బజార్ మెయిన్ రోడ్డులో ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు.

ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు సత్కారం


ఉద్యోగ విరమణ పొందిన పోలీసులతో సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 4: ఉద్యోగ విరమణ పొందిన పోలీసు అధికారులను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సత్కరించారు. బుధవారం హనుమకొండలోని కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉద్యోగ విరమణ పొందిన ఇన్‌స్పెక్టర్ వెంకట్రామ్, ఎస్ఐలు సంపత్‌కుమార్, బాపురావు, మల్లేశం ఏఆర్ ఏఎస్ఐ సత్యనారాయణ, సంపత్‌కుమార్, బాబురావు హెడ్ కానిస్టేబుల్ దేవేందర్‌రెడ్డిలను సీపీ సత్కరించారు. పోలీసు అధికారుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్ఐలు శ్రీనివాస్, స్పర్జన్‌రాజ్, సతీష్, ఆర్ఎస్ఐ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

దేశికళ ఆధ్వర్యంలో సిల్క్ ఇండియా వస్త్ర ప్రదర్శన ప్రారంభం


ఉత్పత్తును పరిశీలిస్తున్న సందర్శకులు

హైదరాబాద్, సెప్టెంబరు 9: నేతన్నలు నేసిన హ్యాండ్లూమ్ ఉత్పత్తులు అన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకువస్తూ దేశీకళ ఆధ్వర్యంలో హనుమకొండ అదాలత్ సర్కిల్‌లోని నక్కలగుట్టలో గల హరిత కాకతీయ హోటల్లో సిల్క్ ఇండియా వస్త్ర ప్రదర్శన బుధవారం ప్రారంభమైంది, ఎక్స్పోలో హస్తకళ సాంస్కృతిక వారసత్వంతోపాటు నేత కార్మికులు, డిజైనర్లు చేనేత ఔత్సాహికులకు ఒకే చోట చేర్చి చేనేత యొక్క గొప్ప సంప్రదాయాలను జరుపుకోవడానికి మద్దతు ఇవ్వడానికి ఒక ప్రత్యేక వేదికను అందిస్తున్నారు, నిర్వాహకుడు సతీష్ మాట్లాడుతూ.. ఈ ఎక్స్పోలో దేశవ్యాప్తంగా సుమారు 20పైగా నగరాల నుంచి 50కిపైగా మాస్టర్ వీవర్స్ చేనేతలు ఉత్పత్తులు అందుబాటులో ఉంచినట్టు చెప్పారు. ఈ ఎక్స్‌పోలో చీరలు, స్కార్ఫ్ గృహ వస్త్రాలు, బెనారస్, బాగల్పూరి సిల్క్, బెంగళూరు సిల్క్, మైసూర్ సిల్క్, ధర్మవరం, పోచంపల్లి, జాంధాని లెనిన్ కాటన్, విష్ణు పూరి సిల్క్, డ్రెస్ మెటీరియల్స్, చందేరి వంటి మొదలైన అన్ని రకాల ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ వస్త్ర ప్రదర్శన సెప్టెంబర్ 3 నుంచి 8వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు.

వ్యవసాయ పరిశోధనా క్షేత్రానికి స్థలాన్ని అప్పగించండి

హసన్‌పర్తి, సెప్టెంబరు 4 : మండలంలోని సిద్ధాపూర్ రెవెన్యూ శివారులో వ్యవసాయ పరిశోధనా క్షేత్రానికి కేటాయించిన స్థలాన్ని సర్వే చేసి హద్దులు నిర్ణయించి అప్పగించాలని ఆర్డీవో వెంకటేష్ బుధవారం మండల సర్వేయర్ సుజాతను ఆదేశించారు. బుధవారం సిద్ధాపూర్ వ్యవసాయ పరిశోధనా క్షేత్రం భూములను ఆయన పరిశీలించారు. సిద్ధాపూర్ రెవెన్యూ శివారులోని రైతులకు కేటాయించిన అసైన్డ్ భూములకు సంబంధించిన 55 ఎకరాల స్థలాన్ని రెవెన్యూ శాఖ నుంచి వ్యవసాయ పరిశోధన క్షేత్రానికి గతంలో అప్పగించారు. అయితే ప్రస్తుతం 49 ఎకరాల అసైన్డ్ భూమిని రైతుల నుంచి సేకరించి వ్యవసాయ పరిశోధనా క్షేత్రానికి అప్పగించారు. అయితే మిగిలిన 6 ఎకరాల అసైన్డ్ భూమిని రైతులు వ్యవసాయ పరిశోధనా క్షేత్రానికి అప్పగించడానికి అంగీకరించలేదు. దీంతో ఆర్డీవో వెంకటేష్ మండల సర్వేయర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ పరిశోధనా క్షేత్రానికి అప్పగించాల్సిన మిగతా అసైన్డ్ భూమికి కూడా హద్దులు నిర్ణయించి సంబంధిత శాఖ అధికారులకు అప్పగించాలని ఆదేశించారు. వారం రోజుల్లోగా సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని మండల సర్వేయర్‌తో పాటు మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన వెంట డిప్యూటీ తహసీల్దారు రహీం, ఏఆర్ఐ రాజేంద్రప్రసాద్, సర్వేయర్ సుజాత, వ్యవసాయ పరిశోధనా క్షేత్రం అధికారులు, స్థానిక రైతులు ఉన్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత

హసన్‌పర్తి, సెప్టెంబరు 4: రోడ్డు భద్రత మనందరి బాధ్యత అని హనుమకొండ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ డాక్టర్ పుప్పాల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని అనంతసాగర్ ఎస్సార్ విశ్వవిద్యాలయంలో లిండే బైక్ రైడింగ్ అవగాహన సదస్సు బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ పొందడం, భద్రతా చర్యలు కట్టుబడి ఉండడం, రోడ్డు ప్రమాదాలకు కారణాలు, నివారణ గురించి అవగాహన కలిగి ఉండడం వాహనదారుడికి అత్యంత ప్రధానమైనవన్నారు. మద్యం సేవించి, మొబైల్ మాట్లాడుతూ.. వాహనాలు నడపడం వల్ల కలిగే దుష్పరిణామాలు, రహదారి సంకేతాలను అర్థం చేసుకోవడం వంటి వాటి ప్రాముఖ్యతను వివరించారు. సమాజంలో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ పాటించేలా ఎస్సార్ విశ్వవిద్యాలయం విద్యార్థులకు అవగాహన కల్పించడం విద్యాసంస్థ సామాజిక బాధ్యతకు నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాకర్ అర్చనారెడ్డి, డాక్టర్ రాజ్యలక్ష్మీ, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ సుధాకర్, లిండె కంపెనీ ఎగ్జిక్యూటివ్ ప్రశాంత్, లాజిస్టిక్స్ స్కిల్ కౌన్సిల్ అజయ్, ఫ్యాకల్టీ డాక్టర్ గురునాథం, డాక్టర్ రమేష్‌బాబు, డాక్టర్ పూర్ణకుమారి, శ్రవణ్, పరిమిందర్‌సింగ్ పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలి

హసన్‌పర్తి, సెప్టెంబర్ 4: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు మెరుగైన, నాణ్యమైన విద్యను అందించాలని మండల విద్యాధికారి ఈసరి రవీందర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. మండల కేంద్రంలోని మసీదు ఆవరణలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను, మధ్యాహ్న భోజన పథకాన్ని, గ్రంథాలయ పుస్తకాల వినియోగం, పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, ఉపాధ్యాయుల దేవమ్మ, కురుమ పున్నంచందర్, రేవతి, సీఆర్‌పీ రాజుకుమార్, సర్దార్ కిషన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టులు సమస్యలను అధిగమించాలి

బాలసముద్రం, ఆగస్టు 4: సమాజంలో జర్నలిస్టులకు ఎన్ని సమస్యలు ఎదురైనా అధిగమించాలని, జర్నలిస్టు యోగిరెడ్డి, తన కూతురు ఆధ్య మృతి జర్నలిస్టులకు, సమాజానికి తీరనిలోటని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారం సదయ్య, సీనియర్ జర్నలిస్టులు బీఆర్ లెనిన్, పిన్నా శివకుమార్, తుమ్మ శ్రీధర్‌రెడ్డి గాడిపెల్లి మధు అన్నారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిలాపార్కు ఎదుట ఇటీవల మృతి చెందిన జర్నలిస్టు యోగిరెడ్డి, తన కూతురు ఆధ్య సంతాపసభను యోగిరెడ్డి స్నేహితులు నిర్వహించారు. ఈకార్యక్రమంలో జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని యోగిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, జర్నలిస్టులు పాల్గొన్నారు.

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగాభివృద్ధికి నిధులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 4: కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో చేపడుతున్న అభివృద్ధిపనులకు బుధవారం కేయూ రిటైర్డు ప్రొఫెసర్ గజ్జెల రామేశ్వరం రూ.20వేలను విరాళంగా అందచేశారు. ఈ సందర్భంగా రామేశ్వరాన్ని కేయూపబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, ఎంహెచ్ఆర్ఎం విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమల్ల శ్రీనివాస్‌రావు అభినందించారు. ఈ కార్యక్రమంలో కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం సీనియర్ ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరిరావు, డాక్టర్ చీకటి శ్రీనివాస్, డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ అక్రమ నిర్మాణంతోనే రహదారిపై వరద నీరు

- బఫర్‌జోన్‌లో నిర్మాణాన్ని నిర్ధారించిన రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులు
- హుటాహుటిన ఎక్స్‌కవేటర్‌తో ముళ్లపొదల తొలగింపు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన కలెక్టర్

ఐనవోలు, సెప్టెంబరు 4: కొత్తకాల్వకు అడ్డుగా బఫర్‌జోన్‌లో అక్రమంగా రైస్ మిల్ ప్రహరీ నిర్మించడంతోనే వరంగల్ - ఖమ్మం జాతీయ రహదారి(563) పంథిని వద్ద వరదనీరు వస్తోందని అధికారులు గుర్తించారు. ఈ మేరకు శ్రీమాత ఎంటర్‌ప్రైజెస్‌కు చెందిన లక్ష్మి బాలాజీ రైస్‌మిల్ ప్రహరీని తొలగించాలని, లేదంటే చర్యలు తీసుకుంటామని రైస్‌మిల్ యాజమానులను అధికారులు హెచ్చరించారు. అందుకు వారు గడువును అడిగారు. ముందుగా కాలువలో చెట్లను తొలగించే పనులు చేపట్టారు. హుటాహుటిన ఎక్స్‌కవేటర్‌ను తెప్పించి కాలువ పక్కన ఉన్న ముళ్ల పొదలను తొలగిస్తున్నారు.

కాగా, బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ప్రాణాలు పోతేగానీ పట్టించుకోరా..?' అనే కథనానికి కలెక్టర్ స్పందించారు. అడిషనల్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ విక్రమ్‌కుమార్‌తో మాట్లాడి క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. దీంతో తహసీల్దార్ ఆధ్వర్యంలో ఇరిగేషన్ శాఖ డీఈ శంకర్ చౌహాన్, ఏఈ ప్రశాంత్, ఎంపీడీవో పులి వెంకటేశ్వర్లు, ఎంఆర్ఐ ఆర్.రాణి, ఏఆర్ఐ మల్లయ్య, పంచాయతీ కార్యదర్శి మాలతిలు రైస్ మిల్ ప్రహరీని బుధవారం సందర్శించారు.

రెవెన్యూ రికార్డు, నక్షాను పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. రైస్ మిల్ ప్రహరీ నిర్మించకముందు కొత్తకాల్వ వరద నీరు నేరుగా పోయే మార్గాన్ని గుర్తించారు. బఫర్‌జోన్‌లో నిబంధనలకు విరుద్ధంగా ప్రహరీని నిర్మించి కాల్వ వరద నీటిని జాతీయరహదారికి అనుకొని వెళ్లేవిధంగా దారిమళ్లించినట్లు నిర్ధారించారు. బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణంపై కలెక్టర్‌కు నివేదికను అందించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

వరద నీరు రోడ్డుపై ప్రమాదకరంగా ప్రవహిస్తుందని ప్రహరీని తొలగించకపోతే భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందని తహసీల్దార్, డీఈలు పేర్కొన్నారు..


పంథిని కొత్తకాల్వపై అక్రమ ప్రహరీ నిర్మాణంను పరిశీలించిన తహసీల్దార్, డీఈ, ఏఈ, అధికారులు

పత్తాలేని ఎన్‌హెచ్ ఆర్‌అండ్‌బీ అధికారులు

వరంగల్-ఖమ్మం జాతీయ రహదారికి రెండు వైపులా రోడ్డు సెంటర్ నుంచి 75 ఫీట్ల రోడ్ వైండింగ్ ఉండాలి. పంథిని రైస్ మిల్ వద్ద 10 ఫీట్లు లేదు, రోడ్డు అంచునే అక్రమంగా 20 ఫీట్ల వెడల్పున కాలువ తవ్విన ఆర్‌అండ్‌బీ అధికారులు చూస్తుపోతున్నారే తప్పా వారిపై చర్యలు తీసుకోలేదు. ప్రయాణికుల ప్రాణాలకు ఆర్‌అండ్‌బీ శాఖ ఎంత విలువిస్తున్నారో జిల్లా కలెక్టర్ గ్రహించి చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు వాపోతున్నారు.

వినాయకచవితికి వినాయకుడిని పెద్ద పెద్ద మండపాల్లో మాత్రమే కాదు.. ఇళ్లలో కూడా అందంగా అలకరించుకుంటారు. అయితే ఆ అలంకరణ ఎలా చేయాలనే విషయంలో చాలా మందికి సందిగ్ధత ఉంటుంది. దీనిని తొలగించటానికి నాలుగు రకాల అలంకరణలను మీకు సూచిస్తున్నాం..

వినాయకుడి మండపాల అలంకరణ ఇలా!



పూల మండపం

మండపానికి పూలు ఇచ్చినంత శోభ- మరే ఇతర అలంకారాలతోను రాదు. అంతే కాదు పువ్వులు పాజిటివిటీకి, స్వచ్ఛతకు ప్రతిరూపాలు కూడా! రకరకాల పువ్వులను తీసుకువచ్చి.. వాటిని గణపతి వెనక అందంగా పేరిస్తే- అద్భుతమైన మండపం అవుతుంది. బంతి పువ్వులు, చేమంతులతో పాటుగా గులాబీలను అందమైన బొకేలుగా తయారుచేసి మండపం ముందు పెడితే చూడటానికి చాలా అందంగా కనిపిస్తుంది.



దుప్పట్టాలతో...

ఎరుపు, పసుపు, ఆకుపచ్చ- ఇలా మన ఇళ్లలో రకరకాల దుప్పట్టాలు ఉంటాయి. వీటిలో తీసుకొని మండపాన్ని జాగ్రత్తగా అలంకరిస్తే- మొత్తం లుక్ మారిపోతుంది. ఒక వేళ ఇంట్లో కొత్త దుప్పట్టాలు లేకపోతే- ప్రత్యామ్నాయంగా శాలువాలను కూడా ఉపయోగించవచ్చు.

లైట్లతో అందం...

చిన్న చిన్న అరటి మొక్కలు.. వెనక ధగధగలాడే లైట్లు- ముందు అందమైన వినాయకుడు.. ఈ తరహా మండపాన్ని ఊహించుకుంటేనే ఆనందంగా అనిపిస్తుంది. అయితే లైట్ల కనెక్షన్ మాత్రం తప్పనిసరిగా ఉండాలి. దీనికి కూడా అయ్యే ఖర్చు తక్కువే!





రంగు రంగుల కాగితాలతో...

రంగు కాగితాలు మనకు స్టేషనరీ షాపుల్లో దొరుకుతాయి. వీటిని అందంగా కట్ చేయటం ఎలాగో యూట్యూబ్‌లో అనేక మంది నేర్పుతున్నారు. కొన్ని కాగితాలు కొని- వాటిని అందమైన ఆకృత్తుల్లో కట్ చేసి గణేష్ మండపానికి వెనక అందిస్తే చూడటానికి చాలా బావుంటుంది. దీనికయ్యే ఖర్చు కూడా చాలా తక్కువ.

అభిరుచి

ప్రొఫెసర్‌గా తరగతి గదిలో పాఠాలే కాదు... చక్కని రచనలతో గ్రంథకర్తగానూ పేరు గడించారు. పుస్తకాలే తన పిల్లలుగా... సాహిత్యమే తన లోకంగా జీవిస్తున్న డాక్టర్ కవితా భట్ కథ ఇది.

ఆమెకు పుస్తకాలే పిల్లలు

"జీవితం ఎప్పుడూ మనం అనుకున్నట్టు సాగదు. ఎత్తుపల్లాలు.. ఆటుపోట్లు... అన్నిటినీ తట్టుకొని ముందుకు సాగితేనే అనుకున్నది సాధించగలం. ఇది నాకు అనుభవం నేర్పిన పాఠం. ఉత్తరాఖండ్ తెహ్రీ గఢవాల్ జిల్లాలోని బౌన్సారా గ్రామం మాది. మా నాన్న బంకేలాల్ రతూరీ ప్రభుత్వ పాఠశాలలో టీచర్‌గా పని చేసేవారు. ఆయన జీతంతో ఇల్లు గడవడమే కష్టంగా ఉండేది. ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ పరిస్థితులూ అంతంతమాత్రమే. సంతానంలో నేనే పెద్ద. మా కోసం నాన్న పడుతున్న ఆవేదన, ఆందోళన నాకు అర్థమయ్యేది. నేనూ ఆయన కష్టాన్ని పంచుకోగలిగితే బాగుండని చిన్నప్పుడు ఎన్నో సందర్భాల్లో అనుకునేదాన్ని. వీటి నుంచి గట్టెక్కాలంటే చదువు ఒక్కటే మార్గమని భావించాను. బీఎస్సీ పూర్తయిన తరువాత ఫిలాసఫీ, యోగా, ఇంగ్లీష్, సోషల్‌వర్క్ సబ్జెక్టుల్లో మొత్తం నాలుగు మాస్టర్స్ డిగ్రీలు సాధించాను. లక్ష్యం వైపు పయనించాలంటే బలమైన పునాదులు ఉండాలి కదా. అందుకే ఇవన్నీ చదివాను. అంతేకాదు... సామాజిక అంశాలపై మరింత లోతైన అవగాహన కోసం ఉమెన్ ఎంపవర్‌మెంట్ తదితర డిప్లమో కోర్సులతోపాటు పీహెచ్‌డీ కూడా చేశాను.

కఠిన పరీక్షలకు నిలిచి...

ఫిలాసఫీ, యోగా సబ్జెక్టుల్లో యూజీసీ-నెట్ పరీక్ష రాస్తే, అందులో అర్హత సాధించాను. 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలాసఫికల్ రీసెర్చ్' నుంచి జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, జనరల్ రీసెర్చ్ ఫెలోషిప్. దాంతోపాటు యూజీసీ నుంచి పోస్ట్ డాక్టోరల్ ఫెలోషిప్ అందుకున్నాను. మా కుటుంబ పరిస్థితుల నేపథ్యంలో... వేరొకరిపై ఆధారపడకుండా స్వశక్తితో ఎదిగిన ఒక మహిళగా నాలాంటివారికి ఆదర్శంగా నిలవాలనుకున్నాను. అందుకే ఎన్ని కఠిన పరీక్షలు ఎదురైనా తట్టుకొని చదువు కొనసాగించాను. ఆత్మస్థైర్యంతో అడుగులు వేసి ఇక్కడి వరకు రాగలిగాను. ప్రస్తుతం ఉత్తరాఖండ్ 'హేమవతీ నందన్ బహుగుణ గఢవాల్ సెంట్రల్ యూనివర్సిటీ' ఫిలాసఫీ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నా.

ఎన్నో రచనలు...

ఒక పక్క విద్యా బోధన... మరోవైపు పుస్తక రచన చేస్తున్నా. సాహిత్య ప్రపంచంలో నాకంటూ కొన్ని పేజీలు ఉండాలనే తపన. ఇప్పటికి 27 పుస్తకాలు రాశాను. యోగిక్ స్టడీస్, సత్కర్మాస్, భారతీయ సాహిత్యం తదితర అంశాలకు సంబంధించిన పుస్తకాలు అందులో ఉన్నాయి. అయితే నాకు బాగా పేరు తెచ్చిన రచనలు 'గీతా దర్శన్', 'భారతీయ సాహిత్య మే జీవన్ మూల్య'. వీటికి ప్రతిష్ఠాత్మక సంస్థల నుంచి పురస్కారాలు,



సత్కారాలు అందుకున్నాను. యూపీలోని 'పటేల్ ప్రతినిధి సభ' వారు 'శైల్‌పుత్రి' బిరుదుతో గౌరవించారు. 2019లో మధ్యప్రదేశ్ సాహిత్య అకాడమీ 'అఖిల్ భారతీయ ఆచార్య రామచంద్ర శుక్లా' పురస్కారంతో కలిపి ఇప్పటికి ముప్పైకి పైగా అవార్డులు అందుకున్నాను. ఇవి సాహిత్యం, సంస్కృతికి అందించిన సేవలకు నాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నాను.

అక్షరంపై ప్రేమతో...

కొన్ని కారణాల వల్ల నేను తల్లిని కాలేకపోయాను. మాతృత్వపు మాధుర్యానికి నోచుకోనందుకు కొన్నాళ్లు బాధపడ్డాను. కానీ త్వరగానే దాని నుంచి కోలుకున్నాను. సాహిత్య లోకంలో విహరించడం ప్రారంభించాను. ఇప్పుడు నాకు పిల్లలు లేరన్న బాధ లేదు. ఎందుకంటే నా పుస్తకాలే నా పిల్లలు. నవ మాసాలు మోసి, బిడ్డను ప్రసవించడానికి ఎంత వేదన పడుతుందో... ఒక అంశాన్ని ఎంచుకొని, దానికి అక్షర రూపం ఇచ్చి, పుస్తకంగా బయటకు తేవడానికి నేనూ అంతగా శ్రమిస్తాను. రచనలో మునిగిపోతాను. అంతే ప్రేమతో ప్రతి పుస్తకానికీ రూపం ఇస్తాను. ఎవరైనా నా రచనలను ప్రశంసిస్తే... అది నా బిడ్డకు దక్కిన అభినందన. ఒక తల్లిగా సంతోషిస్తాను.

సమాజం కోసం...

బోధన, సాహిత్యంలో ఎంతగా మునిగినా... ఈ సమాజంలో ఒక వ్యక్తిగా నావంతు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తున్నాను. పోటీ పరీక్షలకు వెళ్లే విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నాను. వారానికి రెండు రోజులు దీనికి కేటాయించాను. అలాగే అణగారిన వర్గాల పిల్లలకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, అవసరమైన స్టడీ మెటీరియల్ అందిస్తున్నాను. మధ్యలో చదువు మానేసిన చిన్నారులను బడి బాట పట్టించేందుకు కృషి చేస్తున్నాను. ఎందుకంటే వారి జీవితాలను మార్చగలిగేది చదువు మాత్రమే. దానికి నన్నే ప్రత్యక్ష ఉదాహరణగా చూపిస్తూ, వారిలో స్ఫూర్తి నింపుతున్నాను."

ఆసరా

స్వదేశం ఫ్రాన్స్. కళపై మక్కువతో ఓ ప్రాజెక్ట్ పనిపై భారత్ వచ్చిన ఆమె... ఆ తరువాత ఇక్కడే స్థిరపడ్డారు. ఔత్సాహికులను కళాకారులుగా తీర్చిదిద్దడమే కాదు... ఎంతోమంది అఫ్ఘానిస్థాన్ మహిళా శరణార్థులకు ఉపాధి మార్గం చూపారు. భర్తతో కలిసి వారి అభ్యున్నతికి బాటలు వేసిన ఐరిస్ స్టైల్ జర్నీ ఇది.

అఫ్ఘాన్ శరణార్థుల కోసం..!





"సరిగ్గా ఏడున్నరేళ్ల కిందట... నేను, నా భర్త బిశ్వదీప్ మోయిత్రా ఢిల్లీలోని అఫ్ఘానిస్థాన్ శరణార్థుల శిబిరానికి వెళ్లాం. అక్కడ మహిళల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. చేతిలో డబ్బు లేక, సంపాదన మార్గాలు దొరక్క అవస్థలు పడుతున్నారు. ఒసామా బిన్ లాడెన్‌ను మట్టుబెట్టడం, అమెరికా తన బలగాలను ఉపసంహరించుకోవడం తదనంతర పరిణామల నేపథ్యంలో అఫ్ఘాన్ మహిళలు భారత్‌కు వలస వచ్చారు. ఢిల్లీలో వారిని కలిసినప్పుడు తమ బాధలు చెప్పుకున్నారు. బతకడానికి వేరే దారి లేక స్వదేశం నుంచి వెంట తెచ్చుకున్న తమ వస్తువులన్నిటినీ అమ్ముకోవాల్సి వచ్చింది. ఏ పూటకాపూట కష్టం నెట్టుకొస్తున్నారు. వారి బాధలు విని మా గుండె బరువెక్కింది. దీనికి పరిష్కారం ఏమిటి? ఏదో తోచిన సాయం చేసి చేతులు దులుపుకొంటే సరిపోదు. ఉపాధి అవకాశాలు కల్పిస్తేనే వారికి మనుగడ. అందుకు మేం ఏం చేయగలం? నేను, బిశ్వదీప్ తీవ్రంగా ఆలోచించాం.

సాధికారత వైపు అడుగులు...

అఫ్ఘాన్ శరణార్థ మహిళలకు శాశ్వత జీవనోపాధి కల్పించాలంటే... వారికి వృత్తి విద్యల్లో నైపుణ్యం కావాలి. అటు వైపు వారిని ప్రోత్సహించాం. తద్వారా ఆర్థిక సాధికారత సాధించవచ్చని చెప్పాం. తొలుత ఒకరిద్దరు మహిళలు మాత్రమే మమ్మల్ని నమ్మి ముందుకు వచ్చారు. ఒక ఏడాది తరువాత మరికొంతమంది జత కలిశారు. వీరందరి అభ్యున్నతిని దృష్టిలో పెట్టుకుని 2018లో నేను, మావారు కలిసి 'సిలైవాలీ' పేరుతో ఒక స్వచ్ఛంద సంస్థ నెలకొల్పాం. దీని ద్వారా క్లాత్ బొమ్మలు, పౌచ్‌లు, పర్సులు, వాల్ ఆర్ట్స్, వాల్ హ్యాంగింగ్స్ తయారు చేసి, విక్రయిస్తాం. రెడీమేడ్ దుస్తుల తయారీ పరిశ్రమల్లో వ్యర్థంగా పడేసే వస్త్రాన్ని సేకరించి, వాటితో ఈ ఉత్పత్తులు రూపొందిస్తాం.

పర్యావరణ పరిరక్షణ కూడా...

ఒకరిద్దరితో మొదలైన మా సంస్థలో ఇప్పుడు డెబ్బై మంది అఫ్ఘాన్ మహిళలు ఉన్నారు. వారందరికీ బొమ్మలు, ఇతర వస్తువుల తయారీలో పూర్తి స్థాయి శిక్షణ ఇచ్చాం. అనంతరం సంస్థ ద్వారా జీవనోపాధి కల్పించాం. ఇప్పుడు ఆ మహిళలందరూ తమ కాళ్లపై తాము నిలబడ్డారు. సంతోషంగా జీవనం సాగించగలుగుతున్నారు. నెలకు పన్నెండు వేల నుంచి పద్నాలుగు వేల రూపాయల వరకు సంపాదిస్తున్నారు. డిమాండ్ అధికంగా ఉండే నవంబర్, డిసెంబర్, జనవరి మాసాల్లో మరింత ఆదాయం లభిస్తుంది. అంతేకాదు... ఇప్పటివరకు 15 వేల కేజీల ఫ్యాబ్రిక్ వేస్ట్ చెత్త కుప్పల్లో చేరి, భూమికి భారం కాకుండా చూడగలిగాం. తద్వారా పర్యావరణ పరిరక్షణకు కొంతవరకు దోహదపడగలిగాం.

అలా భారత్‌కు వచ్చి...

నాకు మొదటి నుంచి కళలంటే మక్కువ. అందుకే ఆర్ట్ అండ్ డిజైన్ డిప్లమాలో చేరాను. ఫైనల్ ఇయర్ అసైన్‌మెంట్‌లో భాగంగా 1990లో తొలిసారి భారత్‌కు వచ్చాను. ఈ దేశం నాకు ఎంతో నచ్చింది. కళపై ఉన్న ఇష్టంతో ఇక్కడి పలు స్వచ్ఛంద సంస్థలో కలిసి ఔత్సాహిక కళాకారులకు శిక్షణ ఇచ్చేదాన్ని. వారికి విభిన్న కళాకృతుల తయారీ నేర్పించేదాన్ని. అలా తరచూ భారత్‌కు వచ్చిపోతున్న నేను... 2006లో బిశ్వదీప్‌తో పెళ్లి తరువాత ఇక్కడే స్థిరపడిపోయాను. బిశ్వదీప్ ఒకప్పుడు పాత్రికేయుడు. ఒక యోగా కేంద్రంలో తనతో పరిచయం అయింది. పెళ్లి తరువాత అంతర్జాతీయ వస్త్ర బ్రాండ్లకు డిజైన్ కన్సల్టెంట్‌గా పని చేసేదాన్ని. ఆ క్రమంలోనే నా దృష్టి భారత ఫ్యాషన్ పరిశ్రమలో టన్నులకు టన్నులు పేరుకుపోతున్న ఫ్యాబ్రిక్ వేస్ట్‌పై పడింది.

వ్యర్థంతో ఆకర్షణీయ ఉత్పత్తులు...

ఎన్నో అంతర్జాతీయ ఫ్యాషన్ బ్రాండ్లకు కేంద్రం ఢిల్లీ. ఇక్కడ రోజుకు వందల కిలోల వస్త్ర వ్యర్థాలు చెత్తకుప్పలను ముంచెత్తుతున్నాయి. ఈ వ్యర్థాన్ని పనికొచ్చే ఉత్పత్తులుగా మలిస్తే పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతుంది. అలాగే ఆర్థిక స్థోమత లేని కుటుంబాలకు అది ఒక ఉపాధి మార్గం అవుతుందని భావించాను. అందులో భాగంగానే అఫ్ఘాన్ మహిళలకు కళాకృతుల తయారీలో శిక్షణ ఇవ్వాలని నిర్ణయించాను. దీనికి బిశ్వదీప్ కూడా మద్దతునిచ్చారు. పూర్తి సమయం కేటాయించాలనే ఉద్దేశంతో ఒక ప్రముఖ ఆంగ్ల వారపత్రికలో ఎగ్జిక్యూటివ్ ఎడిటర్‌గా ఉన్న ఆయన, తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఒక మంచి లక్ష్యం కోసం ఇద్దరం కలిసి పని చేయడం ప్రారంభించాం. అందులో భాగంగానే ఫ్యాబ్రిక్ వేస్ట్‌ను అప్‌సైక్లింగ్ చేసి, కళాకృతులు రూపొందించాలని నిర్ణయించాం. అది సత్ఫలితాలను ఇచ్చింది. దానివల్ల అఫ్ఘాన్ మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరిగింది. వారి జీవితానికి ఒక భరోసా లభించింది.

ప్రపంచవ్యాప్తంగా...

మా సంస్థలో అఫ్ఘాన్ కళాకారులు రూపొందించిన బొమ్మలు, అల్లికలు, ఇంటి అలంకరణ వస్తువులు దేశవిదేశాల్లోని 150 నగరాలకు ఎగుమతి అవుతున్నాయి.



శరణార్థులు తయారు చేసే బొమ్మల్లో అద్భుతమైన సృజన మాత్రమే కాదు... వారి కథలు, వ్యక్తిత్వాలకు ప్రతిరూపాలుగా కనిపిస్తాయి. భారత్‌తో పాటు అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, జపాన్, కొరియా, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో ఈ బొమ్మలకు మంచి డిమాండ్ ఉంది. 'సిలైవాలీ' కళాకృతుల ధరలు రూ.280 నుంచి రూ.5,400 వరకు ఉన్నాయి. ఏడాదికి రెండు లక్షల డాలర్ల ఉత్పత్తులు ఎగుమతి చేస్తున్నాం. ఇప్పటివరకు మొత్తం నాలుగువందల మంది అఫ్ఘాన్ శరణార్థ మహిళలకు శిక్షణ ఇచ్చాం. వలస విధానాల వల్ల వీరిలో చాలామంది కెనడాకు వెళ్లి స్థిరపడ్డారు. ఏదిఏమైనా నేను, మావారు తీసుకున్న నిర్ణయంవల్ల వారి బతుకుల్లో వెలుగులు నింపగలిగాం. దీనికి మించిన సంతృప్తి, సంతోషం మాకు మరెందులోనూ లభించదు."

కౌన్సెలింగ్

ఆకర్షణ లోపిస్తే..?

Q డాక్టర్! నాదొక చిత్రమైన అనుమానం. దంపతుల మధ్య కాలక్రమేణా లైంగిక ఆకర్షణ తగ్గడం సహజం. ఇలాంటప్పుడు ఇద్దరి మధ్యా అనుబంధం బలహీనపడే ప్రమాదం ఉంటుంది కదా? అలాంటప్పుడు దంపతులను కలిపి ఉంచే అంశం ఏముంటుంది?

- ఓ సోదరి, హైదరాబాద్.

A సన్నిహిత సమయాల్లో దాపరికం లేకుండా మెలగడం, ఒకరి స్పర్శనూ, దగ్గరితనాన్నీ మరొకరు మనస్ఫూర్తిగా ఆస్వాదించడం అవసరం. లైంగిక సాన్నిహిత్యం దంపతుల మధ్య దూరాలు తగ్గించాలి. అంతేతప్ప, అసౌకర్యాలకూ, ఇబ్బందులకూ, మనస్పర్థలకూ కారణం కాకూడదు. ఒత్తిడి, ఆందోళనలు సాన్నిహిత్యానికి ప్రధాన శత్రువులు. పెళ్లైన మొదట్లో శారీరక ఆకర్షణలు సహజం. కానీ కాలక్రమేణా అవి మసకబారే అవకాశాలుంటాయి. అయితే కేవలం శారీరక ఆకర్షణే దంపతుల్ని కలిపి ఉంచుతుందనుకుంటే పొరపాటు. అంతకు మించి ఒకరి ఉనికిని మరొకరు ఆనందించడం, ఒకరి అభిప్రాయాలను వేరొకరు గౌరవించడం, సమస్యలను కలిసికట్టుగా పరిష్కరించుకోవడం, చర్చలు, సంప్రతింపులు లాంటివన్నీ దంపతులను కలిపి ఉంచుతాయి. ఎంతటి అభిప్రాయభేదాలొచ్చినా, ఎన్ని గొడవలు జరిగినా రాత్రి పడుకునే ముందు వాటి గురించి, పరిష్కరించుకుని, మనసులు తేలిక పరుచుకుని, ప్రేమగా హత్తుకుని, మునుపటి సాన్నిహిత్యాన్ని కొనసాగించాలి. దంపతుల మధ్య అహంభావాలు, పొగరు లాంటివి పనికి రావు. అలాగని అలకలు, బుజ్జగింపులు ఉండకూడదని అనడానికి వీల్లేదు. అవి కూడా ఉండి తీరాలి. అయితే అంతిమంగా చివరివరకూ జీవితాన్ని అన్యోన్యంగా కొనసాగించడమే ధ్యేయంగా నడుచుకోవాలి.



డాక్టర్ రమ,
గైనకాలజిస్ట్, హైదరాబాద్

నేడు టీచర్స్ డే

తల్లితండ్రులకు టీచర్లు ఇచ్చే సలహాలివే!

మన దేశ భవిష్యత్ తరాలను తయారు చేసేది ఉపాధ్యాయులే కాబట్టి వారికి సమాజంలో ఒక ప్రముఖమైన స్థానం ఉంటుంది. అలాంటి ఉపాధ్యాయులు పిల్లలకు సంబంధించిన తల్లితండ్రులకు ఇస్తున్న సలహాలేమిటో చూద్దాం...

- విద్య అంటే పాఠశాలల్లో చెప్పేది మాత్రమే కాదు. స్కూలు అయిపోయిన తర్వాత చదివే పుస్తకాలు.. ఇతరులతో మాట్లాడటం ద్వారా వచ్చే పరిణితి.. వీటన్నింటినీ కూడా పరిగణనలోకి తీసుకోవాలి. చాలా మంది పాఠశాలల్లో చెప్పేది మాత్రమే చదువు అనుకుంటారు. అది నిజం కాదు. స్కూలు పూర్తయిన తర్వాత నేర్చుకొనేది కూడా విద్యే. వాస్తవానికి స్కూల్లో బోధించేది కేవలం విజ్ఞానం మాత్రమే! కానీ వాస్తవ ప్రపంచంలో మనకు ఉపయోగించే విషయాలన్నీ మన చుట్టూ ఉన్న సమాజం నేర్పుతుంది.
- పిల్లల అభిప్రాయాలను స్వేచ్ఛగా చెప్పనివ్వాలి. ఒక వేళ వారు తమ అభిప్రాయాలను చెప్పటానికి ఇష్టపడకపోయినా- వారి చేత చెప్పించటానికి ప్రయత్నించాలి. దీని వల్ల వారి ఆలోచనా విధానం మనకు తెలుస్తుంది.
- ప్రతి విద్యార్థికి 24 గంటలు ఉంటాయి. వాటిలో ఎనిమిది గంటలు స్కూలుకు పోయిందనుకుద్దాం. మరో ఎనిమిది గంటలు ఇతర కార్యక్రమాలకు సరిపోయిందనుకుందాం. మిగిలిన ఎనిమిది గంటలూ వారిని నిద్రపొమ్మని సలహా ఇవ్వాలి. పడుక్కొనే ముందు ఆ రోజు స్కూల్లో జరిగిన సంఘటనలను



అడిగి తెలుసుకోవాలి. మంచి నిద్ర- బుర్రలో ఉన్న ఆలోచనలన్నింటినీ ఒక క్రమపద్ధతిలో పెట్టుకుంటుంది. దీని వల్ల పిల్లలు లాజికల్‌గా ఆలోచించగలుగుతారు. ఆలోచనలలో చురుకుతనం కూడా పెరుగుతుంది. చాలా మంది పిల్లలు నిద్రను తగ్గించి- ఫోన్లను వాడటం.. టీవీలను చూడటం మొదలైన పనులు చేస్తూ ఉంటారు. దీని వల్ల వారిలో చురుకుతనం తగ్గుతుంది.
- చాలా మంది టీవీ చూడటం తప్పు అనుకుంటారు. టీవీలు పిల్లల మానసిక అభివృద్ధికి తోడ్పడతాయి. వారికి ప్రపంచంలో జరుగుతున్న అనేక విషయాల గురించి తెలియజేస్తాయి. అయితే ఈ విషయంలో పిల్లలు ఏ ఛానల్స్ చూడాలనే విషయంపై స్పష్టత ఉండాలి.
- పిల్లలతో కానీ.. పిల్లల ఎదురుగా కానీ టీచర్లను తక్కువ చేసి మాట్లాడకూడదు. దీని వల్ల పిల్లల్లో చులకన భావన ఏర్పడుతుంది. ఒక వేళ టీచర్లు ఏదైనా విషయంపై తగిన శ్రద్ధ చూపించటం లేదని భావిస్తే- వారితోనే నేరుగా మాట్లాడాలి. అంతే కాకుండా- పిల్లలతో టీచర్లకు సందేశాలు పంపకూడదు.
- పిల్లలను సరైన సమయానికి తయారుచేసి.. వారిని స్కూళ్లకు పంపాల్సిన బాధ్యత తల్లితండ్రులదే! తల్లితండ్రులలో క్రమశిక్షణ లేకపోతే- పిల్లలకు కూడా క్రమశిక్షణ ఉండదు.
- పిల్లలకు టీచర్లు ఏదైనా పనిష్మెంట్ ఇస్తే- వారికి మద్దతుగా టీచర్లతో మాట్లాడవద్దు. ఏదైనా తప్పు చేస్తే- శిక్ష అనుభవించాల్సి వస్తుందనే విషయం వారికి తెలియాలి. తమ పిల్లలకు పనిష్మెంట్ రావటాన్ని కొందరు తల్లితండ్రులు జీర్ణించుకోలేరు. ఆ పనిష్మెంట్ రావటానికి తామే కారణమని భావిస్తారు. కానీ అది నిజం కాదనే విషయాన్ని తల్లితండ్రులు గుర్తించాలి.
- ఆరోగ్యం సరిగ్గా లేకపోయినా- కొందరు తల్లితండ్రులు తమ పిల్లలను స్కూలుకు పంపుతారు. దీని వల్ల ఇతర పిల్లలకు కూడా జలుబు వంటి వ్యాధులు అంటుకోవచ్చు. అందువల్ల పిల్లలకు ఆరోగ్యం బావుండనప్పుడు- వారిని స్కూలుకు పంపకపోవటమే మంచిది.
- టీచర్లకు సంబంధించిన ఈమెయిల్స్, ఫోన్ నెంబర్లు తల్లితండ్రులు తమ వద్ద తప్పనిసరిగా ఉంచుకోవాలి. దీని వల్ల అవసరమైనప్పుడు వారితో మాట్లాడటానికి వీలుంటుంది.
- స్కూలు, కాలేజీలకు సంబంధించి పిల్లలతో పాజిటివ్‌గానే మాట్లాడాలి. అనవసరపు కామెంట్స్ చేయటం వల్ల వారిలో చెడు అభిప్రాయాలు ఏర్పడుతాయి.


సమంతకు గాయం




టాలీవుడ్ కథానాయిక సమంత గాయపడ్డారు. ఈ విషయాన్ని ఆమె బుధవారం సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఎప్పుడు, ఎలా గాయపడ్డారు అనే వివరాలను ఆమె వెల్లడించలేదు. మోకాలి గాయానికి ఆక్యుపంచర్ విధానంలో చికిత్స తీసుకుంటున్నారు సమంత. తన శరీరంలో రెండు సూదులు గుచ్చి ఉన్న ఫొటోను ఆమె షేర్ చేసి, 'గాయాల బారిన పడకుండా యాక్షన్ స్టార్‌ను అవ్వగలనా?' అని సరదాగా స్పందించారు. దీంతో సమంత లీడ్‌రోల్‌లో నటిస్తూ, నిర్మిస్తున్న 'మా ఇంటి బంగారం' చిత్రం షూటింగ్‌లో గాయపడ్డారని భావిస్తున్నారు. ఆమె నటించిన 'హనీ బన్నీ' వెబ్‌సిరీస్ త్వరలో ప్రముఖ ఓటీటీలో స్ట్రీమింగ్ అవనుంది.

మేమున్నామని.. మీకేం కాదని..

వరద బాధితులకు సినీ ప్రముఖుల సాయం









వరదలతో ఇబ్బంది పడుతున్న తెలుగు ప్రజానీకాన్ని ఆదుకునేందుకు కొంతమంది సినీ ప్రముఖులు ఇప్పటికే తమవంతు సాయాన్ని అందించగా బుధవారం మరికొందరు విరాళాలను ప్రకటించారు. వరద బాధితులను ఆదుకునేందుకు చిరంజీవి రూ. కోటి సాయాన్ని ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రుల సహాయనిధికి చెరో రూ. 50 లక్షలు ఇస్తున్నట్లు ఆయన సోషల్ మీడియా వేదికగా తెలిపారు. 'వరద వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులు నన్ను కలిచివేశాయి. పదుల సంఖ్యలో అమాయకులు ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. అందరూ తమకు తోచినట్లు సహాయ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలి. ఈ విపత్కర పరిస్థితులు త్వరలోనే తొలగిపోవాలి' అని ఆయన ఆకాంక్షించారు. చిరు తనయుడు రామ్‌చరణ్ సైతం రూ. 50 లక్షల చొప్పున రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళాన్ని ప్రకటించారు. తెలుగు ప్రజలకు అందరూ అండగా ఉండాల్సిన సమయమిదని రామ్‌చరణ్ పేర్కొన్నారు. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మంగళవారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు ప్రకటించిన విషయం తెలిసిందే. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి కూడా రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు ఆయన బుధవారం ప్రకటించారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో వరద బారిన పడిన 400 పంచాయతీలకు ఒక్కోదానికి రూ. లక్ష చొప్పున మొత్తం రూ. నాలుగు కోట్ల సాయాన్ని అందజేయనున్నట్లు తెలిపారు.

అగ్ర కథానాయకుడు ప్రభాస్ తన వంతుగా రూ. రెండు కోట్ల విరాళాన్ని ప్రకటించారు. తెలంగాణకు, ఆంధ్రప్రదేశ్‌కు రూ. కోటి చొప్పున అందజేయనున్నట్లు ఆయన టీమ్ తెలిపింది. అల్లు అర్జున్ రెండు తెలుగు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళంగా ఇస్తున్నట్లు సోషల్ మీడియా ద్వారా తెలిపారు. ఈ విపత్కర పరిస్థితులు తొలగిపోయి ప్రజలంతా సురక్షితంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. వరద బాధితులను ఆదుకునేందుకు అక్కినేని కుటుంబం, గ్రూపు సంస్థలు రెండు రాష్ట్రాలకు కలిపి రూ. కోటి విరాళాన్ని ప్రకటించాయి. ఏపీ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 25 లక్షల సాయాన్ని ప్రకటించిన వైజయంతీ మూవీస్ సంస్థ తాజాగా తెలంగాణ సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. 20 లక్షల విరాళాన్ని ప్రకటించింది. నిర్మాత అశ్వనీదత్ బుధవారం ఏపీ సీఎం చంద్రబాబు నాయుడును కలసి చెక్ అందజేశారు. హీరో సాయిదుర్గ తేజ్ ఇరు రాష్ట్రాలకు కలిపి రూ. 20 లక్షలు, విజయవాడలోని అమ్మ ఆశ్రమానికి రూ. 5 లక్షల విరాళం ప్రకటించారు. అలీ, జుబేదా దంపతులు ఇరు రాష్ట్రాలకు కలిపి రూ. ఆరు లక్షలు విరాళంగా ఇస్తున్నట్లు తెలిపారు.

పవన్ కల్యాణ్ - రూ. 2 కోట్లు (ఏపీలోని గ్రామ పంచాయితీలకు రూ. 4 కోట్లు)
ప్రభాస్ - రూ. 2 కోట్లు
చిరంజీవి - రూ. కోటి
రామ్‌చరణ్ - రూ.కోటి
అల్లు అర్జున్ - రూ. కోటి
అక్కినేని కుటుంబం, గ్రూప్ సంస్థలు కలిపి - రూ. కోటి
సాయిదుర్గ తేజ్ -రూ.20 లక్షలు
వైజయంతీ మూవీస్ - రూ. 20 లక్షలు (తెలంగాణకు)
అలీ, జుబేదా దంపతులు - రూ. 6 లక్షలు



కోరమీనా నిన్ను.. కోసుకుంటా ఇయ్యాలా

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న 'దేవర 1' చిత్రం నుంచి మాస్ నంబర్‌ను విడుదల చేశారు. 'కొరమీనా నిన్ను.. కోసుకుంటా ఇయ్యాలా' అంటూ రామజోగయ్యశాస్త్రి రాసిన పాట వీడియోను విడుదల చేశారు. ఈ పాటలో ఎన్టీఆర్ వేసిన స్టెప్పులు ఆడియన్స్‌తో డాన్స్ చేయించేలా ఉన్నాయి. ఎన్టీఆర్ డాన్స్ ఎలా ఉండాలని అభిమానులు కోరుకుంటారో దాన్ని వింంచేలా శేఖర్ మాస్టర్ ఈ పాటకు కొరియోగ్రఫీ అందించారు. జాన్వీకపూర్ గ్లామరస్‌గా కనిపించారు. ఎన్టీఆర్‌తో పోటీగా స్టెప్స్ వేశారు. 'దేవర' మీద ఇప్పటివరకూ ఉన్న అంచనాలు ఈ పాటతో నెక్ట్స్ లెవల్‌కు చేరాయి. అనిరుధ్ అందించిన సంగీతం పాటకు ప్రాణం పోసింది. హై యాక్షన్ థ్రిల్లర్‌గా రూపుదిద్దుకుంటున్న 'దేవర' రెండు భాగాలుగా ప్రేక్షకులను అలరించనుంది. మొదటి భాగాన్ని ఈ నెల 27న తెలుగు, తమిళ, హిందీ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదల చేస్తున్నారు. కొరటాల శివ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ నిర్మిస్తున్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే ఐదేళ్ల నిషేధం

నడిగర్ సంఘం మహిళా భద్రతా కమిటీలో తీర్మానం



నటీమణులపై లైంగిక వేధింపులకు పాల్పడినట్టు రుజువైతే చిత్రపరిశ్రమలో పనిచేయకుండా ఐదేళ్లపాటు నడిగర్ సంఘం నిషేధం విధించనుంది. ఈ మేరకు నడిగర్ సంఘం అనుబంధ విభాగమైన మహిళా భద్రతా కమిటీ సమావేశంలో తీర్మానించారు. ఈ కమిటీ సమావేశం బుధవారం నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, ఉపాధ్యక్షుడు పూచ్చి మురుగన్, కోశాధికారి కార్తీ, కమిటీ అధ్యక్షురాలు రోహిణి సారథ్యంలో కమిటీ సభ్యులు సుహాసిని, ఖుష్బూ, లలిత కుమారి, కోవై సరళ తదితరులు పాల్గొన్నారు. ఇందులో కొన్ని తీర్మానాలు చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. లైంగిక వేధింపులకు పాల్పడినట్టు ఎవరైనా బాధితులు ఫిర్యాదు చేస్తే వాటిపై విచారణ జరిపి నిజమని తేలితే చిత్ర పరిశ్రమలో పనిచేయకుండా ఐదేళ్లపాటు నిషేధం విధించేలా తీర్మానం చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు, న్యాయ సలహాలు ఇప్పించేందుకు అవసరమైన సహాయ సహకారాలు అందించనున్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని తొలుత హెచ్చరించి, ఆ తర్వాత చర్యలకు ఉపక్రమిస్తారు. కమిటీకి ఫిర్యాదు చేసే బాధితులు మీడియాతో ప్రత్యక్షంగా మాట్లాడకూడదు. యూట్యూబ్‌లో సినీ నటులను కించపరిచేలా మాట్లాడేవారిపై బాధితులు సైబర్ విభాగం పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారికి కమిటీ అన్ని విధాలా సహకరిస్తుంది.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఇన్ ప్రోగ్రెస్

విడుదల వాయిదా



'ఈ నెల ఏడున 'జనక అయితే గనక' సినిమాను విడుదల చేయాలనుకున్నాం.అయితే ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో వరద పరిస్థితుల కారణంగా విడుదల వాయిదా వేస్తున్నాం. నవ్వుల వినోదం పండించే రోజుని త్వరలో ప్రకటిస్తాం. ప్రేక్షకులు అందరూ థియేటర్లలో చూసి ఆస్వాదించాల్సిన సినిమా కనుక ఈ నిర్ణయం తీసుకున్నాం' అని వెల్లడించారు దిల్ రాజు. సుహాస్ హీరోగా రూపుదిద్దుకున్న 'జనక అయితే గనక' చిత్రానికి సందీప్‌రెడ్డి బండ్ల దర్శకత్వం వహించారు. శిరీష్ సమర్పణలో హర్షిత్‌రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. హీరో సుహాస్ మాట్లాడుతూ 'మూవీ ఫైనల్ వెర్షన్ చూశాను. చాలా బాగా నచ్చింది. అందుకే యుఎస్‌ఏ హక్కులు కొన్నాను. ప్రతి దానికీ లెక్కలు చెప్పే మిడిల్ క్లాస్ యువకుడిగా నటించా. దిల్ రాజుగారు ఎంతో సపోర్ట్ చేశారు' అన్నారు.

పిల్లలతో చూడాల్సిన సినిమా



ప్రియదర్శి, విశ్వదేవ్, నివేద థామస్, గౌతమి ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం '35 చిన్న కథ కాదు'. నందకిషోర్ ఈమాని దర్శకత్వంలో రానాదగ్గుబాటి, సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించారు. ఈ శుక్రవారం సినిమా తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదలవుతున్న సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ 'ఇది పిల్లలతో కలసి చూడాల్సిన సినిమా. దర్శకుడు ప్రేక్షకుల హృదయాలను హత్తుకునేలా తెరకెక్కించార'ని ప్రశంసించారు.

మరిచిపోలేని థ్రిల్‌ను పంచుతుంది



వరుస అవకాశాలతో దూసుకుపోతున్నారు మీనాక్షీ చౌదరి. వెంకట్ ప్రభు దర్శకత్వంలో విజయ్ సరసన ఆమె నటించిన 'గోట్' (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైమ్) చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర విశేషాలను మీనాక్షీ మీడియాతో పంచుకున్నారు.

"ఈ సినిమాలో నాది చాలా మంచి పాత్ర. ఆ పాత్ర నన్ను నేను రిలేట్ చేసుకునేలా ఉంటుంది. దర్శకుడు వెంకట్ ప్రభు ఈ సినిమాలో ప్రతీ క్యారెక్టర్‌ను చాలా బాగా తీర్చిదిద్దారు. ఈ మూవీ షూటింగ్ సమయంలో విజయ్, స్నేహ, లైలా వంటి అనుభవజ్ఞులైన నటుల నుంచి ఎంతో నేర్చుకున్నాను. ఈ సినిమా అందరికీ మరిచిపోలేని థ్రిల్‌ను పంచుతుంది. విజయ్ యాక్టింగ్, వెంకట్ ప్రభు డైరెక్షన్ స్కిల్స్ ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లాయి" అని చెప్పారు.

ఫిష్ వెంకట్‌కు సాయం



విలన్ పాత్రల్లోనూ తనదైన శైలిలో కామెడీని పండిస్తూ తెలుగు ప్రేక్షకులను నవ్వించిన ఫిష్ వెంకట్ రెండు కిడ్నీలు పాడై దయనీయ స్థితిలో జీవితం వెళ్లదీస్తున్నారు. మెరుగైన వైద్యం కోసం ఖర్చు పెట్టే స్తోమత లేక ప్రభుత్వ ఆస్పత్రిలో డయాలసిస్ చేయించుకుంటున్నట్లు ఆయన ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. సినిమాల్లో నటించమని పిలుపు వస్తున్నా ఒంట్లో సత్తువ లేక కొన్నేళ్ల నుంచి ఇంటికే పరిమితమైనట్లు చెప్పారు. ఖర్చులకు చేతిలో పైసా లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మీడియా ద్వారా తెలుసుకున్న నిర్మాత చదలవాడ శ్రీనివాసరావు వైద్య ఖర్చుల నిమిత్తం లక్ష రూపాయలను అందజేశారు. ప్రసన్న కుమార్, రామసత్యనారాయణ, కె.అజయ్‌కుమార్, అనిల్ ఈ చెక్కును ఫిష్ వెంకట్‌కు అందజేశారు.



నిమ్స్‌లో ఎంహెచ్‌ఎం



హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)- 'మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ఆర్నెల్ల కంపల్సరీ ఇంటర్న్‌షిప్ కూడా ఉంది. ఇది ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. తెలంగాణ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 'నిమ్‌సెట్-ఎంహెచ్‌ఎం 2024'లో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. కోర్సు సమయంలో ఇతర డిగ్రీ/డిప్లొమా ప్రవేశాలకు, ప్రైవేట్ ప్రాక్టీస్/కన్సల్టేషన్‌లకు అనుమతించరు. ప్రోగ్రామ్‌ను గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెడికల్/నాన్ మెడికల్ విభాగాల్లో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. దివ్యాంగులకు అయిదేళ్లు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు వర్తిస్తుంది.

నిమ్‌సెట్-ఎంహెచ్‌ఎం వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. హెల్త్ సైన్సెస్‌కు సంబంధించి 40, అడ్మినిస్ట్రేషన్ అంశాలనుంచి 10, కంప్యూటర్ సైన్సెస్ అంశాల నుంచి 10, జనరల్ నాలెడ్జ్ నుంచి 15, టెస్టింగ్ ఆఫ్ ఐక్యూకు సంబంధించి 15, ఇంగ్లీష్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 40 శాతం; ఎస్సీ, ఎస్టీలకు 30 శాతం మార్కులు రావాలి.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **వెబ్‌సైట్:** nims.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/SJVUJjaలో చదవండి.

దిక్సూచి
DIKSUCHI

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'ఆన్‌లైన్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్‌'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. దీని వ్యవధి నాలుగు నెలలు(150 గంటలు). ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండుంబావు వరకు, సాయంత్రం రెండు నుంచి అయిదుంబావు వరకు సెషన్స్ నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా అసైన్‌మెంట్లు, అసెస్‌మెంట్లు, ప్రజంటేషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ఫైనల్ ఎగ్జామ్స్ ఉంటాయి. కోర్సు మెటీరియల్‌కు సంబంధించి లైఫ్ టైమ్ యాక్సెస్ ఇస్తారు. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **వెబ్‌సైట్:** www.iift.ac.in





సెబీ చీఫ్‌పై సిబ్బంది గుస్సా

వేధించుకు తింటున్నారంటూ ఆర్థిక శాఖకు లేఖ.. అంతా అబద్ధం అన్న సెబీ



న్యూఢిల్లీ: సెబీ చీఫ్ మాధవి పురి బుచ్‌పై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా సెబీ అధికారులే ఆమెతో వేగలేకపోతున్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తునారు. ఆమె సెబీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి, సంస్థలో పని ధోరణి మారిపోయిందని ఆరోపిస్తూ గత నెల ఆరో తేదీన, ఏకంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు ఐదు పేజీల లేఖ రాశారు. ఆచరణ సాధ్యంకాని లక్ష్యాలను నిర్దేశించడం, వాటిని సాధించలేకపోతే నలుగురి ముందు పేరు పెట్టి పరుష పదజాలంతో దూషించడం మామూలై పోయిందని అధికారులు ఆ లేఖలో పేర్కొన్నారు. 'గ్రీవెన్సెస్ ఆఫ్ సెబీ ఆఫీసియల్స్-ఎ కాల్ ఫర్ రెస్పెక్ట్' పేరుతో వారు ఈ లేఖ రాశారు. నలుగురిముందు పరుష పదజాలంతో బిగ్గరగా దూషించడమేగా, ప్రతి నిమిషం తమ కదలికలను గమనించడం పరిపాటైపోయిందని ఆరోపించారు. ఈ తరహా పనితీరు కారణంగా తమ మానసిక ఆరోగ్యం కూడా దెబ్బతింటోందని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు చేశారు. సెబీ చీఫ్ మాధవి పురి బుచ్ ఇప్పటికే అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఇపుడు సెబీ అధికారులు కూడా ఆమెపై దండెత్తడంతో ఆమె పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుందని భావిస్తున్నారు.

ఇది బయటి వ్యక్తుల పనే

మరోవైపు ఈ లేఖలోని ఆరోపణలను సెబీ తోసిపుచ్చింది. తమ సంస్థలో వర్కింగ్ కల్చర్ బాగానే ఉందని స్పష్టం చేసింది. గత నెల ఆరున కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖకు రాసిన లేఖ తమ ఉద్యోగులది కాదని తెలిపింది. బయటి వ్యక్తులే ఈ పని చేశారని ఆరోపించింది. తమ ఉద్యోగులు కూడా ఆ లేఖకు సంబంధించిన ఇ-మెయిల్ తాము పంపలేదని తెలిపినట్టు ప్రకటించింది. లేని సమస్యలు ఉన్నట్టు చూపిస్తూ మీడియా, ఆర్థిక మంత్రిత్వ శాఖ లేదా సెబీ బోర్డుకి లేఖ రాయాలని బయటి వ్యక్తులు తమ జూనియర్ అధికారులను పురిగొల్పుతున్నట్టు ఆరోపించింది.

ఫ్లిప్‌కార్ట్‌లో లక్ష కొలువులు

కొత్తగా 11 ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలు



న్యూఢిల్లీ: వచ్చే పండగల సీజన్ అమ్మకాలపై ఇ-కామర్స్ దిగ్గజం 'ఫ్లిప్‌కార్ట్' చాలా ఆశలు పెట్టుకుంది. ఈ సీజన్‌లో ప్రారంభమయ్యే 'బిగ్ బిలియన్ డేస్, 2024' సందర్భంగా దేశవ్యాప్తంగా లక్షకు పైగా ఉద్యోగాలు కల్పిస్తామని తెలిపింది. ఇన్వెంటరీ మేనేజర్లు, వేర్‌హౌస్ అసోసియేట్స్, లాజిస్టిక్స్ కో-ఆర్డినేటర్లు, కిరాణా పార్ట్‌నర్స్, డెలివరీ డ్రైవర్స్ రూపంలో ఈ ఉద్యోగాల కల్పన ఉంటుందని పేర్కొంది. పండగల సీజన్‌కు ముందే వీరిని రిక్రూట్ చేసుకుని అవసరమైన శిక్షణ ఇస్తామని ప్రకటించింది. ఈ నియామకాల్లో దివ్యాంగులైన స్త్రీలే ఎక్కువగా ఉంటారని తెలిపింది. బిగ్ బిలియన్ డేస్, 2024 డిమాండ్‌ను తట్టుకునేందుకు ఫ్లిప్‌కార్ట్ తొమ్మిది నగరాల్లో కొత్తగా 11 ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేసింది. దీంతో వాల్‌మార్ట్ నిర్వహణలోని ఈ ఇ-కామర్స్ దిగ్గజం ఎఫ్‌సీల సంఖ్య 83కు చేరింది.

అంధుల కోసం 'స్పెషల్ కేర్ గోల్డ్' పాలసీ

స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ 'స్పెషల్ కేర్ గోల్డ్' పేరుతో అంధుల కోసం ప్రత్యేక ఆరోగ్య బీమా పాలసీ తీసుకొచ్చింది. అంధులు సైతం పాలసీ వివరాలు చదువుకుని నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా ఈ పాలసీ వివరాలను స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ బ్రెయిలీ లిపిలో అందిస్తోంది. ఒక బీమా కంపెనీ అంధుల కోసం బ్రెయిలీ లిపిలో బీమా పాలసీ తీసుకు రావడం దేశంలో ఇదే మొదటిసారి. నలభై శాతం లేదా అంతకంటే ఎక్కువ అంధత్వం ఉన్న వ్యక్తులు ఈ సమగ్ర ఆరోగ్య బీమా పాలసీ తీసుకోవచ్చు. దేశంలో ఉన్న దాదాపు మూడున్నర కోట్ల మంది అంధుల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పాలసీ రూపొందించినట్టు స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ తెలిపింది,

డాక్టర్ రెడ్డీస్ 'ఇబుప్రొఫెన్'పై ఎఫ్‌డీఏ వేటు

న్యూఢిల్లీ: డాక్టర్ రెడ్డీ లాబ్స్, సిప్లా కంపెనీలకు అమెరికా మార్కెట్‌లో ఎదురు దెబ్బ తగిలింది. ఈ కంపెనీల అమెరికా అనుబంధ సంస్థలు మార్కెట్ చేస్తున్న రెండు ఉత్పత్తులపై అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ ఎఫ్‌డీఏ కొరడా ఝుళిపించింది. డాక్టర్ రెడ్డీస్ కంపెనీ మార్కెట్ చేసే ఇబుప్రొఫెన్, సిప్లా కంపెనీ మార్కెట్ చేసే సిఫిక్సైమ్ ఔషధాలు సరైన నాణ్యతా ప్రమాణాలు లేనందున వెనక్కి (రికాల్) తీసుకోవాలని ఆదేశించింది. ఇబుప్రొఫెన్ టాబ్లెట్లను నొప్పులు, జ్వరం తగ్గేందుకు ఉపయోగిస్తారు. సిప్లా కంపెనీ మార్కెట్ చేసే సిఫిక్సైమ్ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్లలో ఉపయోగిస్తారు. దీంతో వివిధ మోతాదుల్లో ఉన్న 1,50,040 ఇబుప్రొఫెన్ బాటిల్స్‌ను డాక్టర్ రెడ్డీ ల్యాబ్స్, 4,554 బాటిళ్ల సిఫిక్సైమ్ ఔషధాన్ని సిప్లా కంపెనీ వెనక్కి తీసుకున్నాయి.

అంతర్జాతీయ బాండ్ మార్కెట్‌లోకి

కెనరా బ్యాంకు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాల విరామం తర్వాత కెనరా బ్యాంకు అంతర్జాతీయ బాండ్ మార్కెట్లో ప్రవేశించింది. ఐఎఫ్ఎస్‌సి బ్యాంకింగ్ యూనిట్ ద్వారా ఐదేళ్ల కాల పరిమితిగల బాండ్లు జారీ చేసి 30 కోట డాలర్లు (సుమారు రూ.2,520 కోట్లు) సమీకరించింది. ఈ బాండ్లపై చెల్లించే వడ్డీరేటును 4.896 శాతంగా నిర్ణయించింది. వ్యాపార విస్తరణకు ఈ నిధులు వినియోగించనున్నట్టు బ్యాంకు ఎండీ, సీఈఓ సత్యనారాయణరాజు తెలిపారు. ఆసియా, పశ్చిమాసియా, యూరప్‌లకు చెందిన 72 మంది మదుపరులు ఈ బాండ్లలో పెట్టుబడులు పెట్టారు.

ఏపీలో ఇంటరార్క్ కొత్త ప్లాంట్ ప్రారంభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఇంటరార్క్ బిల్డింగ్ ప్రోడక్ట్స్ కంపెనీ ప్రీ ఇంజనీర్డ్ బిల్డింగ్ ఉత్పత్తుల తయారీకి ఐదో ప్లాంట్‌ను నెల్లూరు జిల్లాలోని (ఆంధ్రప్రదేశ్) అత్తివరంలో ప్రారంభించింది. ఇది కంపెనీకి చెందిన నాల్గవ ఇంటిగ్రేటెడ్ ప్లాంట్. అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్‌లో ప్రీ ఇంజనీర్డ్ బిల్డింగ్ ఉత్పత్తులు, ప్రీ ఇంజనీర్డ్ మెటల్ రూఫింగ్, క్లాడింగ్ వ్యవస్థలు తయారుచేస్తారు. 10 ఎకరాల విస్తీర్ణంలో ఈ ప్లాంట్ విస్తరించిన ఉండగా తొలి దశలో రూ.40 కోట్ల వ్యయంతో నాలుగు ఎకరాల ప్లాట్‌ను వినియోగించారు. దీంతో ఇంటరార్క్ స్థాపిత సామర్థ్యం ఏడాదికి 20 వేల మెట్రిక్ టన్నుల మేరకు పెరుగుతుంది. ఈ ప్లాంట్ ద్వారా 250 మంది స్థానికులకు ఉద్యోగాలు లభిస్తాయని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అర్వింద్ నందా తెలిపారు. ఈ ప్లాంట్‌ను ప్రారంభించడంతో పాటు కంపెనీ రెండో దశ నిర్మాణాలకు శంకుస్థాపన కూడా చేసింది. ఈ ప్లాంట్ ఏడెనిమిది నెలల్లో ప్రారంభమవుతుందని కంపెనీ తెలిపింది. ఈ దశ పూర్తయితే స్థాపిత సామర్థ్యం 40 వేల మెట్రిక్ టన్నులకు పెరిగి మొత్తం సామర్థ్యం 2 లక్షల ఎంటీలకు చేరుతుందని వెల్లడించింది.

వచ్చే వారం బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓ

న్యూఢిల్లీ: బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) వచ్చే వారంలో ప్రారంభం కానుంది. అప్పర్ లేయర్ ఎన్‌బీఎఫ్‌సీలు తప్పనిసరిగా స్టాక్ మార్కెట్లో లిస్ట్ కావాలన్న ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగా కంపెనీ ఐపీఓకు వస్తోంది.

మార్కెట్లో లాభాల స్వీకరణ

సెన్సెక్స్ 203 పాయింట్లు డౌన్

ముంబై: అమెరికా ఆర్థిక మందగమన భయాల నేపథ్యంలో దేశీయ ఇన్వెస్టర్లు బుధవారం ఐటీ, బ్యాంకింగ్, మెటల్ షేర్లలో లాభాలు స్వీకరించడంతో సెన్సెక్స్ 202.80 పాయింట్లు కోల్పోయి 82,352.64కి జారుకుంది. 14రోజుల వరుస ర్యాలీకి తెర దించిన నిఫ్టీ 81.15 పాయింట్లు కోల్పోయి 25,198.70 వద్ద ముగిసింది.

- జనరల్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (జీఐసీ ఆర్ఈ) వాటా కొనుగోలుకు సంస్థాగత ఇన్వెస్టర్లు బుధవారం రూ.2,300 కోట్ల విలువైన బిడ్లు సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం జీఐసీ ఆర్ఈలో 6.78 శాతం వరకు వాటాను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో విక్రయానికి పెట్టింది. ఒక్కో షేరును రూ.395గా నిర్ణయించింది.
- క్రాస్ లిమిటెడ్ ఐపీఓ ధరల శ్రేణిని రూ.228-240గా నిర్ణయించింది. కంపెనీ ఇష్యూ ఈనెల 9న ప్రారంభమై 11న ముగియనుంది. ఐపీఓ ద్వారా కంపెనీ రూ.500 కోట్లు సమీకరించాలనుకుంటోంది.

రూ.1650 తగ్గిన వెండి ధర

ఢిల్లీ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.450 తగ్గుదలతో రూ.73,600కు జారుకోగా.. కిలో వెండి ఏకంగా రూ.1,650 తగ్గి రూ.83,600కు దిగివచ్చింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) గోల్డ్ ఒకదశలో 2,520 డాలర్లు, సిల్వర్ 28 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యాయి.

అపోలో నుంచి 'అపోలో రీసెర్చి అకాడమీ'

న్యూఢిల్లీ: వైద్య పరిశోధనతో పాటు, ఆ రంగంలో వినూత్న కార్యక్రమాల నిర్వహణ అపోలో రీసెర్చ్ అకాడమీ పేరుతో కొత్త సంస్థను ఏర్పాటు చేసినట్టు అపోలో హాస్పిటల్స్ ప్రకటించింది. రవి పీ మహాజన్ ఈ సంస్థకు నాయకత్వం వహిస్తారు. అపోలో హాస్పిటల్స్ గ్రూప్ కంపెనీలు అపోలో హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చి ఫౌండేషన్, అపోలో యూనివర్సిటీ, ఏఆర్ఐ, అపోలో రీసెర్చ్ సెంటర్, అపోలో క్లినికల్ ఇన్నోవేషన్ గ్రూప్ కార్యకలాపాలను సమన్వయం చేస్తూ అపోలో రీసెర్చ్ అకాడమీ పని చేస్తుంది. ఈ కేంద్రాన్ని అంతర్జాతీయ వైద్య పరిశోధనలకు సైతం కేంద్రంగా ఎదిగేలా తీర్చిదిద్దాలని భావిస్తున్నట్టు అపోలో హాస్పిటల్స్ చైర్మన్ ప్రతాప్ సీ రెడ్డి తెలిపారు.

'ఇ జెనిసిస్'లో నాట్కోకు వాటా

హైదరాబాద్ : కెనడా కేంద్రంగా పనిచేసే బయోటెక్నాలజీ కంపెనీ 'ఇ జెనిసిస్ ఇంక్' ఈక్విటీలో స్థానిక నాట్కో ఫార్మా నాలుగు కోట్ల షేర్లు కొనుగోలు చేసింది. ఇందుకోసం 80 లక్షల డాలర్లు (సుమారు రూ.67.20 కోట్లు) చెల్లించినట్టు తెలిపింది. జెనిటిక్ ఇంజనీరింగ్ ద్వారా సురక్షితమైన కృత్రిమ అవయవాల అభివృద్ధిలో ఈ కంపెనీకి మంచి పేరుంది. నాట్కో ఫార్మా కెనడాలోని అనుబంధ సంస్థ ద్వారా ఇ జెనిసిస్ ఈక్విటీలో ఈ షేర్లు కొనుగోలు చేసింది.

ఐదేళ్లలో క్రెడిట్ కార్డులు డబుల్

2028-29 నాటికి 20 కోట్లకు.. పీడబ్ల్యూసీ నివేదిక అంచనా



న్యూఢిల్లీ: దేశంలో క్రెడిట్ కార్డుల వ్యాపారం శరవేగంగా వృద్ధి చెందుతోందని పీడబ్ల్యూసీ తాజా నివేదిక పేర్కొంది. గత 5 ఆర్థిక సంవత్సరాల్లో క్రెడిట్ కార్డులు రెట్టింపయ్యాయని.. మున్ముందు సంవత్సరాల్లోనూ ఇదే ట్రెండ్ కొనసాగనుందని ఆ నివేదిక తెలిపింది. 2028-29 నాటికి క్రెడిట్ కార్డులు రెట్టింపై 20 కోట్ల స్థాయికి చేరుకోవచ్చని అంచనా వేసింది. వచ్చే ఐదేళ్ల పాటు కార్డుల సంఖ్య 15 శాతం చొప్పున వృద్ధి చెందనుందని అంటోంది. నివేదికలోని మరిన్ని ముఖ్యాంశాలు..

- క్రెడిట్ కార్డుల జారీతోపాటు ఈ కార్డుల ద్వారా ఆర్థిక లావాదేవీలూ గణనీయంగా పెరిగాయి. లావాదేవీల సంఖ్య 22 శాతం పెరగగా.. లావాదేవీల మొత్తం విలువలో 28 శాతం వృద్ధి నమోదైంది. కొత్త ఉత్పత్తుల విడుదల, వినూత్న ఆఫర్లు, కస్టమర్ సెగ్మెంట్ల విస్తరణ వంటి అంశాలు ఇందుకు దోహదపడ్డాయని రిపోర్టు పేర్కొంది.
- డెబిట్ కార్డుల వినియోగం తగ్గుముఖం పడుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో డెబిట్ కార్డుల ద్వారా లావాదేవీలు వార్షిక ప్రాతిపదికన 33 శాతం తగ్గగా.. లావాదేవీల విలువ 18 శాతం తగ్గింది. అంతేకాదు, 2023-24లో కొత్త డెబిట్ కార్డుల జారీ వృద్ధి కూడా నెమ్మదించిందని.. యూపీఐ లావాదేవీలకు ప్రాచుర్యం పెరగడం ఇందుకు ఒక కారణమని రిపోర్టు తెలిపింది.
- దేశంలో డిజిటల్ చెల్లింపులు అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్నాయని.. 2023-24లో ఈ లావాదేవీల సంఖ్య 42% వృద్ధి చెందాయి. 2028-29 నాటికి ఈ ట్రెండ్ మూడింతలు కావచ్చని అంచనా.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,760 ▲	66,690 ▲	90,000 ▼
ముంబై	71,300 ▼	65,310 ▼	81,340 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

5వ తేదీ			
హైదరాబాద్	470	విజయవాడ	505
వరంగల్	472	గోదావరి	500
చిత్తూరు	518	విశాఖపట్నం	505
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	99	విజయవాడ	108
వరంగల్	99	గుంటూరు	105
కరీంనగర్	99	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	95
కర్నూలు	99	నెల్లూరు	95
విశాఖపట్నం	99	అనంతపురం	100
గోదావరి	108		

స్పోర్ట్స్



హర్విందర్ గురి.. తెచ్చింది పసిడి

ఆర్చరీలో భారత్‌కు చారిత్రక స్వర్ణం

షాట్‌పుట్‌లో సచిన్‌కు రజతం

వహ్వా.. హర్విందర్ సింగ్! పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో ఆరంభం నుంచి ఫైనల్ వరకు.. అదీ ఒకేరోజు వరుసగా జరిగిన ఐదు మ్యాచ్‌ల్లో 33 ఏళ్ల ఈ ఆర్చర్ రాణించిన తీరు అద్భుతం.. అమోఘం.. ప్రీక్వార్టర్స్, ఆపై సెమీఫైనల్లో వెనుకంజలో నిలిచినా అతడు ఒత్తిడికి లోనవలేదు.. పట్టు వీడలేదు..ప్రశాంత చిత్తంతో బాణాలు వేసి ఫైనల్‌కు దూసుకొచ్చాడు..అదే ఊపులో తుది పోరును ఏకపక్షం చేసి విజేతగా నిలిచాడు.. తద్వారా పారాలింపిక్స్‌లో పసిడి పతకం సాధించిన భారత తొలి ఆర్చర్‌గా చరిత్ర సృష్టించాడు. అంతకుముందు పురుషుల షాట్‌పుట్ ఎఫ్46 విభాగంలో వరల్డ్ చాంపియన్ సచిన్ సర్జేరావ్ ఖిలారి రజత పతకం కొల్లగొట్టాడు. దాంతో ఏడో రోజు పోటీలను భారత్ స్వర్ణ, రజత పతకాలతో ముగించింది.

పారిస్: పారాలింపిక్స్‌లో భారత్ అథ్లెట్ల జోరు కొనసాగుతోంది. అథ్లెటిక్స్, ఆర్చరీలో బుధవారం రెండు పతకాలు మన ఖాతాలో చేరాయి. ఆర్చరీ పురుషుల రికర్వ్ వ్యక్తిగత విభాగం ఫైనల్లో హర్విందర్ సింగ్ అదరగొట్టాడు. ఏకపక్షంగా జరిగిన ఫైనల్లో హర్విందర్ 6-0తో లుకాస్ సిజెక్ (పోలెండ్)ను చిత్తు చేసి చాంపియన్‌గా నిలిచాడు. పారాలింపిక్స్‌లో హర్విందర్‌కిది వరుసగా రెండో పతకం కావడం విశేషం. టోక్యో క్రీడల్లో హర్విందర్ కాంస్య పతకం కైవసం చేసుకున్నాడు. లుకాస్ రజతానికే పరిమితం కాగా, ఇరాన్ ఆర్చర్ రెజా కాంస్య పతకం నెగ్గాడు. అంతకుముందు సెమీఫైనల్లో 7-3తో మహ్మద్ రెజా(ఇరాన్)ను హర్విందర్ చిత్తు చేశాడు. క్వార్టర్‌ఫైనల్లో వరల్డ్ నెం. 9 హెక్టార్ జూలియో రమిరెజ్ (కొలంబియా)కు 6-2తో హర్విందర్ షాకిచ్చాడు.

ఫైనల్లో సిమ్రాన్: మహిళల 100 మీటర్ల టీ12లో సిమ్రాన్ శర్మ (12.17సె.) సీజన్ అత్యుత్తమ సమయంతో రేసును పూర్తి చేయడంతోపాటు తన హీట్‌లో అగ్రస్థానంలో నిలిచి సెమీఫైనల్‌కు అర్హత సాధించింది. మహిళల షాట్‌పుట్ ఎఫ్46 ఫైనల్లో భారత్‌కు చెందిన అమిషా రావత్ (9.25మీ.) 14వ స్థానంలో నిలిచింది. పురుషుల పవర్ లిఫ్టింగ్ 49 కి. ఫైనల్లో ఎనిమిదో స్థానంలో, మహిళల 45 కిలోల్లో సకినా ఖటూన్ ఏడో స్థానంతో నిరాశపరిచారు.

ప్చ్..అర్షద్: ఏపీ సైక్లిస్ట్ అర్షద్ షేక్ టైమ్ ట్రయల్ విభాగంలోనూ విఫలమయ్యాడు. పురుషుల సీ2 టైమ్ ట్రయల్ రేస్‌లో 25 నిమిషాల 20.11 సెకన్లలో గమ్యం చేరిన అర్షద్ 11వ, ఆఖరి స్థానంలో నిలిచాడు. పురుషుల 1000 మీటర్ల టైమ్ ట్రయల్ సీ1-3 క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో అర్షద్ ఆఖరి, 17వ స్థానం సాధించిన విషయం విదితమే.

డెంగ్యూతో వైకల్యానికి గురై..

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

హరియాణాలోని అజిత్ నగర్‌కు చెందిన హర్విందర్ సింగ్.. ఏడాదిన్నర వయసున్నప్పుడు డెంగ్యూ వ్యాధి బారిన పడ్డాడు. ఆ సందర్భంగా ఇచ్చిన కొన్ని ఇంజెక్షన్లు వికటించడంతో అతని కాళ్లు పనిచేయడం మానేశాయి. ఇలా, చిరు ప్రాయంలోనే వైకల్యానికి గురైనా ఎక్కడా ఆత్మవిశ్వాసం కోల్పోకుండా ముందుకు సాగాడు హర్విందర్. 2012 లండన్ పారాలింపిక్స్‌లో ఆర్చర్లను చూసి స్ఫూర్తిపొందిన అతను.. ఆర్చరీని కెరీర్‌గా ఎంచుకున్నాడు. 2017 పారా ప్రపంచ చాంపియన్‌షిప్‌తో అంతర్జాతీయ ఆర్చరీలోకి అరంగేట్రం చేసిన హర్విందర్.. ఆ టోర్నీలో ఏడోస్థానంలో నిలిచాడు. మరుసటి ఏడాది ఆసియా పారా క్రీడల్లో స్వర్ణం సాధించాడు. ఆ తర్వాత కొవిడ్ లాక్‌డౌన్ విధించడంతో హర్విందర్ సాధన కోసం తన పొలంలోనే ఆర్చరీ రేంజ్‌ను ఏర్పాటు చేశాడు. అక్కడ కఠోరంగా శ్రమించిన హర్విందర్ టోక్యో పారాలింపిక్స్‌లో కాంస్య పతకంతో మురిపించాడు. ఇప్పుడు పారిస్‌లో ఏకంగా స్వర్ణంతో విజయనాదం చేశాడు.



హర్విందర్

ఖిలారి.. కేక



పురుషుల షాట్‌పుట్ ఎఫ్46 విభాగంలో వరల్డ్ చాంపియన్ సచిన్ సర్జేరావ్ ఖిలారి రజత పతకం కొల్లగొట్టాడు. 16.32 మీటర్ల ఆసియా రికార్డు దూరం గుండును విసిరిన సచిన్ రెండో స్థానం చేజిక్కించుకున్నాడు. 34 ఏళ్ల ఖిలారి తన రెండో ప్రయత్నంలో ఈ రికార్డు దూరాన్ని నమోదు చేశాడు. ఈక్రమంలో తన పేరిటే ఉన్న 16.30 మీటర్ల ఆసియా రికార్డును బద్దలు కొట్టాడు. కెనడాకు చెందిన గ్రెగ్ స్టివార్ట్ (16.38మీ.) టోక్యోలో గెలిచిన తన స్వర్ణ పతకాన్ని నిలబెట్టుకున్నాడు. ఇక.. లుకా బకోవిక్ (క్రొయేషియా, 16.27మీ.) కాంస్యం గెలుపొందారు. మరో ఇద్దరు భారత అథ్లెట్లు మహ్మద్ యాసిర్ (14.21మీ.) 8, రోహిత్ (14.10మీ.) 9వ స్థానంలో నిలిచారు. హర్విందర్ స్వర్ణం, ఖిలారి రజతంతో ఈ క్రీడల్లో భారత్ మొత్తం పతకాల సంఖ్య 22కి చేరింది. ఇందులో 4 పసిడి పతకాలున్నాయి.

శరద్ అదుర్స్.. తంగవేలు మరోమారు



శరద్ తంగవేలు

భారత అథ్లెట్లు మంగళవారం అర్ధరాత్రి జరిగిన పోటీలలో నాలుగు పతకాలు సొంతం చేసుకున్నారు. పురుషుల హైజంప్ టీ63 విభాగంలో శరద్ కుమార్, మరియప్పన్ తంగవేలు రజత, కాంస్య పతకాలతో మెరిశారు. పురుషుల జావెలిన్ త్రో ఎఫ్46 కేటగిరీలో అజీత్ సింగ్, సుందర్ సింగ్ గుర్జార్ కూడా రజత, కాంస్య పతకాలు చేజిక్కించుకున్నారు. హైజంప్ టీ63లో 32 ఏళ్ల శరద్ కుమార్ 1.88 మీటర్ల దూరం దూకి రెండో స్థానం సాధించగా, 29 ఏళ్ల తంగవేలు మరియప్పన్1.85 మీటర్ల దూరంతో మూడో స్థానం దక్కించుకున్నాడు. మూడేళ్ల కిందట జరిగిన టోక్యో పారాలింపిక్స్‌లో తంగవేలు రజతం అందుకోగా, శరద్ కాంస్యం సాధించాడు. వరల్డ్ రికార్డు హోల్డర్, 19 ఏళ్ల ఫ్రెచ్ ఎజ్రా (అమెరికా) 1.94 మీటర్ల పారాలింపిక్స్ రికార్డు దూరంతో స్వర్ణం నెగ్గాడు.

జావెలిన్ త్రోలో రెండు, మూడు మనవే: పురుషుల ఎఫ్46 జావెలిన్ ఫైనల్ ఐదో రౌండ్‌లో సహచరుడు, వరల్డ్ రికార్డు హోల్డర్ సుందర్‌సింగ్ గుర్జార్ (64.96మీ.)ను వెనక్కు నెట్టిన అజీత్ సింగ్ రజత పతకం నెగ్గాడు. దాంతో గుర్జార్ కాంస్యానికే పరిమితమయ్యాడు. క్యూబా త్రోయర్ గెలెర్మో గొంజాలెజ్ (66.16మీ.) స్వర్ణ పతకం అందుకున్నాడు. పారాలింపిక్స్‌లో గుర్జార్‌కు ఇది వరుసగా రెండో కాంస్య పతకం. టోక్యో క్రీడల్లో అతడు మూడో స్థానంలో నిలిచాడు.



అజీత్ సుందర్



ఇదేమి అథ్లెటిక్ ట్రాక్?

గచ్చిబౌలి స్టేడియంలో పగుళ్లొచ్చిన సింథటిక్ ట్రాక్

అధికార యంత్రాంగం నిర్లక్ష్యంతో చేటు

హైదరాబాద్ స్పోర్ట్స్ హబ్‌గా పేరుగాంచిన గచ్చిబౌలి క్రీడా సముదాయం గత పాలకుల నిర్లక్ష్యంతో కళావిహీనంగా తయారైంది. రేవంత్ రెడ్డి సీఎం అయ్యాక ఇందులోని ఫుట్‌బాల్ స్టేడియం కొత్త రూపు సంతరించుకున్నా మిగిలిన క్రీడా ప్రాంగణాల పరిస్థితిలో మాత్రం ఎలాంటి మార్పూ లేదు. గత బీఆర్ఎస్ సర్కార్‌లానే స్పోర్ట్స్ యూనివర్సిటీ, పాలసీ అంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం ముందు గచ్చిబౌలితో పాటు నగరంలోని ప్రధాన స్టేడియాలను ఆధునీకరించాలని క్రీడా సంఘాలు కోరుతున్నాయి.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): గత పాలకుల అలసత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ (శాట్) అధికార యంత్రాంగం అసమర్థత వెరసి అంతర్జాతీయ స్థాయిలో ఒక వెలుగు వెలిగిన గచ్చిబౌలి క్రీడా సముదాయం ప్రస్తుతం కళాహీనంగా తయారైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి చొరవతో సుమారు రూ.16 కోట్లు వెచ్చించి ఇందులోని ఫుట్‌బాల్ స్టేడియాన్ని మాత్రం ఆధునీకరించారు. అయితే అక్కడే ఉన్న సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ ఆధునీకరణలో మాత్రం అడుగు ముందుకు పడలేదు. హకీంపేటలో స్పోర్ట్స్ సిటీ నిర్మిస్తామని, ప్రపంచంలోనే అత్యుత్తమ క్రీడా పాలసీని రూపొందిస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లు కాలక్షేపం చేసింది. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు కూడా స్పోర్ట్స్ యూనివర్సిటీ, కొత్త పాలసీ అంటూ ప్రకటనలు చేస్తోంది కానీ, అసలు సమస్యలను విస్మరిస్తోందని క్రీడా సంఘాలు, క్రీడాకారుల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

సింథటిక్ ట్రాక్ అధ్వాన్నం..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు చంద్రబాబు సీఎంగా ఉన్న హయాంలో అంతర్జాతీయ ప్రమాణాలతో వేసిన సింథటిక్ ట్రాక్ సరైన మెయింటెనెన్స్ లేక పూర్తిగా పాడైంది. జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించేందుకు పనికిరాని స్థితికి చేరుకుంది. అక్కడ సాధన చేస్తున్న క్రీడాకారులు తరచూ గాయాల బారిన పడుతున్నారు. ప్రస్తుతం గచ్చిబౌలిలో గల ఎనిమిది లైన్ల ప్రధాన సింథటిక్ ట్రాక్‌తో పాటు నాలుగు లైన్ల ప్రాక్టీస్ సింథటిక్ ట్రాక్ ఉంది. ఈ రెంటికి మరమ్మతులు చేయాలంటే రూ.9 కోట్లు ఖర్చువుతుందని అంచనా. ఖేలో ఇండియా పథకం కింద ఇప్పటికే మెదక్, కరీంనగర్, వరంగల్, ఉస్మానియా యూనివర్సిటీల్లో కేంద్ర ప్రభుత్వం సింథటిక్ ట్రాక్‌లు వేసింది. తెలంగాణ ప్రభుత్వ అధీనంలోని గచ్చిబౌలిలో క్రీడా సముదాయానికి కేంద్రం నిధులు ఇవ్వకపోతే కనీసం రాష్ట్ర నిధులతోనైనా ఆధునీకరణ పనులు చేపట్టాలని అథ్లెట్లు కోరుతున్నారు.

సెమీస్‌కు సబలెంక, నవారో

పురుషుల్లో టియాఫో, ఫ్రిట్జ్ ● జ్వెరెవ్, జెంగ్‌కు షాక్ ● యూఎస్ ఓపెన్



సబలెంక

న్యూయార్క్: మూడో గ్రాండ్‌స్లామ్ టైటిల్ వేటలో ఉన్న బెలారస్ స్టార్ అర్యానా సబలెంక యూఎస్ ఓపెన్ సెమీఫైనల్లోకి ప్రవేశించింది. బుధవారం జరిగిన క్వార్టర్స్ పోరులో రెండోసీడ్ సబలెంక 6-1, 6-2తో ఏడోసీడ్ జెంగ్ కిన్‌వెన్ (చైనా)ను చిత్తుచేసింది. గ్రాండ్‌స్లామ్‌లో సబలెంక చేతిలో ఓడడం జెంగ్‌కు ఇది వరుసగా రెండోసారి. మరో మ్యాచ్‌లో 13వ సీడ్ నవారో 6-2, 7-5తో 26వ సీడ్ పౌలా బడోసా (స్పెయిన్)ను ఓడించి గ్రాండ్‌స్లామ్‌లో తొలిసారి సెమీస్ చేరింది.

లోకల్ స్టార్ల అమీతుమీ: పురుషుల సింగిల్స్‌లో ఇద్దరు లోకల్ స్టార్లు ఫ్రాన్సెస్ టియాఫో, టేలర్ ఫ్రిట్జ్ మధ్య సెమీఫైనల్ ఫైట్‌కు రంగం సిద్ధమైంది. క్వార్టర్‌ఫైనల్లో 20వ సీడ్ ఫ్రాన్సెస్ టియాఫో 5-3, 6-7 (5), 6-3, 4-1తో ఆధిక్యంలో ఉన్నప్పుడు ప్రత్యర్థి, 9వ సీడ్ గ్రిగోర్ దిమిత్రోవ్ (బల్గేరియా) గాయం కారణంగా మ్యాచ్ నుంచి వైదొలిగాడు. ఇక, 4వ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ) పోరాటం క్వార్టర్స్‌కే పరిమితమైంది. 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 7-6(2), 3-6, 6-4, 7-6 (3)తో జ్వెరెవ్‌కు ఝలకిచ్చి తన స్నేహితుడు టియాఫోతో సెమీస్ పోరుకు సిద్ధమయ్యాడు.

ఆసియా టీటీకి శ్రీజ, స్నేహిత్

న్యూఢిల్లీ: కజకిస్థాన్ వేదికగా వచ్చే నెల 7వ తేదీ నుంచి జరిగే ఆసియా టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే భారత బృందంలో హైదరాబాద్ స్టార్లు ఆకుల శ్రీజ, ఎస్ఎఫ్ఆర్ స్నేహిత్‌కు చోటు లభించింది. పురుషుల, మహిళల జట్లకు శరత్ కమల్, మనికా బాత్రా సారథులుగా నియమితులయ్యారు.

ప్రాంజలికి కాంస్యం

హనోవర్ (జర్మనీ): ప్రపంచ బధిర షూటింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన ప్రాంజలి ధూమల్ కాంస్యంతో మెరిసింది. 25 మీటర్ల పిస్టల్ విభాగం ఫైనల్లో 29 పాయింట్లతో తృతీయ స్థానంలో నిలిచింది.

ఆర్ఆర్ కోచ్‌గా ద్రవిడ్!

జైపూర్: రాజస్థాన్ రాయల్స్ (ఆర్ఆర్) కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ నియామకం దాదాపుగా ఖరారైంది. దీనిపై త్వరలో అధికారిక ప్రకటన వెలువడనుంది. ద్రవిడ్ 2012, 2013 సీజన్లలో ఆర్ఆర్ కెప్టెన్‌గా వ్యవహరించాడు.

ఎనిమిదో ర్యాంక్‌కు పాక్

దుబాయ్: ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో పాకిస్థాన్ రెండు స్థానాలు దిగజారి 8వ ర్యాంక్‌లో నిలిచింది. పాక్ టెస్టు చరిత్రలో ఈ ర్యాంక్‌కు పడిపోవడం గత 59 ఏళ్లలో ఇదే తొలిసారి. చివరిగా 1965లో పాక్ 8వ ర్యాంక్‌లో నిలిచింది. తాజాగా బంగ్లాదేశ్ చేతిలో టెస్టు సిరీస్ కోల్పోవడంతో పాకిస్థాన్ ర్యాంక్ ఘోరంగా పతనమైంది.

11న బీఆర్ఎస్ శ్రేణులతో కేసీఆర్ భేటీ

» ప్రజల్లోకి వెళ్లడంపై వ్యూహ రచన

హైదరాబాద్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లేందుకు బీఆర్ఎస్ ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని భావిస్తోంది. అధికార కాంగ్రెస్ పార్టీని ఇరుకున పెట్టేలా కార్యాచరణ అమలు చేసేందుకు గులాబీ బాస్ వ్యూహరచన చేస్తున్నారు. అందులో భాగంగానే బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ ఈనెల 11న తెలంగాణ భవన్‌లో పార్టీ శ్రేణులతో సమావేశం కానున్నారు. రైతుల సమస్యలు, కాంగ్రెస్ ఇచ్చిన హామీలు, వాటిని అమలు చేయడంలో విఫలమవ్వడం తదితర అంశాలను ప్రజల్లోకి ఏవిధంగా తీసుకువెళ్లాలన్న దానిపై ఆయన చర్చించనున్నట్లు తెలిసింది. బీఆర్ఎస్ తరఫున క్షేత్రస్థాయిలో తరచూ కార్యక్రమాలు చేపట్టడం, ప్రజా సమస్యలపై గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు నాయకులు, కార్యకర్తలు పోరాటం చేయడంపై ప్రణాళికలు రూపొందించనున్నట్లు సమాచారం. సాగునీరు, విద్యుత్తు కష్టాలతోపాటు రుణమాఫీ, రైతు భరోసా ఇవ్వకపోవడం వంటి అంశాలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించేలా కేసీఆర్ నిరసనలు, రోడ్‌షోలు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. కాగా, గ్రామ, మండల స్థాయిలో కమిటీల ఏర్పాటు ఇప్పట్లో సాధ్యం కాదని బీఆర్ఎస్ ముఖ్యనేత ఒకరు అభిప్రాయపడ్డారు. పార్టీ సభ్యత్వాలను ప్రతి నాలుగేళ్లకు ఒకసారి చేయాల్సి ఉంటుందని, ఇప్పటికే చేపట్టిన సభ్యత్వాల నమోదు ప్రక్రియ పూర్తయి మూడేళ్లయిందని, దీంతో మరో ఏడాదికి సభ్యత్వ నమోదు చేపడతామన్నారు. ఆ ప్రక్రియ పూర్తయిన వెంటనే.. గ్రామ, మండల కమిటీలను నియమించే అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

ఆ పోలీసులపై చర్యలు తీసుకోండి

» భువనగిరి ఘటనపై స్పీకర్‌కు ఎమ్మెల్యే వేముల ఫిర్యాదు

నార్కట్‌పల్లి, సెప్టెంబరు 4: మంత్రులను ఆహ్వానించేందుకు వెళుతున్న తనని అడ్డుకుని అవమానించిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం కోరారు. సదరు అధికారులను ప్రివిలేజ్ కమిటీ ముందు హాజరుపరచి నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు బుధవారం ఫిర్యాదు అందజేశారు. తనని అవమానించడమంటే తన నియోజవర్గ ప్రజలను అవమానించినట్టేనని ఈ సందర్భంగా వాపోయారు. యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలో ఆగస్టు 30న నీటి పారుదలశాఖకు సంబంధించి పార్లమెంటు నియోజకవర్గ స్థాయి సమీక్ష జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు హెలికాప్టర్‌లో వచ్చిన రాష్ట్ర మంత్రులకు ఆహ్వానం పలికేందుకు వెళుతుండగా హెలీప్యాడ్ వద్ద విధి నిర్వహణలో ఉన్న పోలీసులు వేముల వీరేశాన్ని అడ్డుకున్నారు. పోలీసులు ఆయన్ను గుర్తించకపోవడంతోనే ఇలా జరిగిందని తెలుస్తోంది. అయితే, పోలీసులు అడ్డుకోవడాన్ని అవమానంగా భావించిన వీరేశం అక్కడి నుంచి ఆగ్రహంగా వెళ్లిపోయారు. ఈ ఘటనపైనే ఆయన స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే వీరేశం ఫిర్యాదును స్వీకరించిన స్పీకర్ గడ్డం ప్రసాద్.. జరిగిన ఘటనపై వివరాలు తెప్పించుకుని తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

ఆత్మగౌరవానికి ప్రతీక సెప్టెంబరు 17

» విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

» ఏలేటి మహేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 17న విమోచన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని, తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక విమోచన దినోత్సవాన్ని నిర్వహించే అవకాశం కాంగ్రెస్‌కు వచ్చిందని బీజేపీ శాసన సభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. తెలంగాణ విమోచన దినోత్సవాన్ని గత పాలకులు పట్టించుకోలేదన్నారు. మజ్లి‌స్‌కు భయపడి నిర్వహించలేదన్నారు. తెలంగాణ సిద్ధిస్తేనే ఆత్మగౌరవం సాధ్యమని సినిమా డైలాగులు చెప్పిన కేసీఆర్, అధికారంలోకి వచ్చాక మజ్లి‌స్‌కు భయపడి విమోచన దినోత్సవాన్ని నిర్వహించలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల వల్ల ప్రాణనష్టం జరగడం దురదృష్టకరం అని ఏలేటి పేర్కొన్నారు.

ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ అమలు చేయండి: మంద కృష్ణ

హైదరాబాద్, సెప్టెంబర్ 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేయబోయే ఉద్యోగాలలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని, దాని ఆధారంగానే నియామకాలు చేపట్టాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన టీజీపీఎస్సీ ఛైర్మన్ ఎం.మహేందర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తామని చెప్పారని, ప్రస్తుతం భర్తీ చేస్తున్న ఉద్యోగాలకు కూడా వర్గీకరణను అమలు చేస్తామని హామీ ఇచ్చారని మహేందర్ రెడ్డికి గుర్తు చేశారు. ప్రభుత్వం దీనికి సంబంధించిన ప్రక్రియ పూర్తి చేసే వరకు నియామక ప్రక్రియ ఆపివేయాలని కోరారు.

వైద్యులంతా ఎన్ఎంఆర్‌లో రిజిస్టర్ కావాల్సిందే: ఎన్ఎంసీ

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): దేశంలో వైద్య సేవలందించాలనుకునే ప్రతి ఒక్క ఎంబీబీఎస్ వైద్యుడు తప్పనిసరిగా నేషనల్ మెడికల్ రిజిస్టర్ (ఎన్ఎంఆర్)లో రిజిస్టర్ చేసుకోవాల్సిందేనని జాతీయ వైద్య మండలి స్పష్టం చేసింది. ఈ మేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ రిజిస్ట్రేషన్ ప్రతి ఒక్క వైద్యుడికి తప్పనిసరి అని స్పష్టం చేసింది. ఎన్ఎమ్ఆర్‌ను ఎథిక్స్ మెడికల్ రిజిస్ట్రేషన్ బోర్డు పర్యవేక్షిస్తుందని తెలిపింది. ఈ రిజిస్ట్రేషన్ ఎలక్ట్రానిక్ రూపంలో ఉంటుందని పేర్కొంది. వైద్యుడి పేరు, చిరునామా, విద్యార్హతలన్నీ ఇందులో పొందుపరుస్తామని వెల్లడించింది. దేశంలోని అల్లోపతిక్ (ఎంబీబీఎస్) వైద్యులందరి సమాచారం ఇందులో ఉంటుందని తెలిపింది. ఆన్‌లైన్‌లో ఎన్ఎంఆర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని వైద్యులకు సూచించింది.

ట్రేడింగ్ పేరుతో రూ.13.16 కోట్లు కొట్టేశారు

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో.. అధిక లాభాల ఆశ చూపి, ఓ సీనియర్ సిటీజన్ రూ.13.16 కోట్లు కొట్టేసిన ముగ్గురు సైబర్ కేటుగాళ్ల ఆటను సైబర్ సెక్యూరిటీ బ్యూరో(సీఎస్‌బీ) పోలీసులు కట్టించారు. హైదరాబాద్‌కు చెందిన ఓ సీనియర్ సిటీజన్‌కు కొద్దిరోజుల క్రితం రవి పవగీ పేరుతో వాట్సాప్‌లో ఓ సందేశం వచ్చింది. ఆన్‌లైన్ ట్రేడింగ్ కాల్స్ కోసం ఈ లింకు నొక్కి, గ్రూపులో చేరాలనేది అందులోని సారాంశం. దాంతో ఆయన ఆ గ్రూపులో చేరారు. అంతే.. ఆ వెంటనే అప్‌స్టాక్స్, ఇంటర్నేషనల్ బ్రోకింగ్(ఐబీ), ఏఎఫ్ఎస్ఎల్ కంపెనీల పేర్లతో పలువురు వ్యక్తులు బాధితుడిని ఫోన్‌లో సంప్రదించారు. పలు లింకులను పంపించారు. వారి మాటలు నమ్మిన బాధితుడు.. ట్రేడింగ్‌లో కొంత మొత్తం పెట్టుబడి పెట్టారు. తొలుత బాగా లాభాలు వచ్చినట్లుగా కేటుగాళ్లు చూపించారు. ఆ తర్వాత కేటుగాళ్లు పలు దఫాలుగా అధిక లాభాల పేరుతో పెట్టుబడులు పెట్టించారు. అలా బాధితుడు విడతల వారీగా రూ.13.16 కోట్లను పెట్టుబడిగా పెట్టారు. నిందితుల యాప్/వెబ్‌సైట్‌లో భారీగా లాభాలు వచ్చినట్లు చూపిస్తున్నా.. విత్‌డ్రాకు ఆప్షన్ ఇవ్వలేదు. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు ఈ నెల 2న సీఎస్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు.. ప్రాథమిక సాంకేతిక ఆధారాల మేరకు హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ ఖాజా హాషిముద్దీన్, అరాఫ్ ఖాలేద్ మొహియుద్దీన్, మహమ్మద్ అతీర్‌పాషాను అరెస్టు చేశారు. వీరిలో సయ్యద్ ఖాజా విద్యార్థి అని పోలీసులు తెలిపారు.

బీజేపీ సభ్యత్వ నమోదులో తెలంగాణ టాప్

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ చేపట్టిన ప్రాథమిక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ టాప్‌లో నిలిచింది. కొన్ని రోజులుగా ఏపీ, తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టింది. ఏపీలో 49,338 మందికి సభ్యత్వం ఇవ్వగా, తెలంగాణలో 1,85,134 మందికి పార్టీ సభ్యత్వం ఇచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి 2,34,472 మంది పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో తెలంగాణ తరువాత కర్ణాటకలో అత్యధిక సభ్యత్వ నమోదు జరిగింది. అక్కడ మొత్తం సభ్యత్వాలు 1.82 లక్షలు వచ్చాయని బుధవారం ఒక ప్రకటనలో బీజేపీ తెలిపింది.

రేపటి కోసం రోడ్ మ్యాప్

(మొదటిపేజీ తరువాయి)

సాంకేతిక పరిజ్ఞానం ద్వారా మరింత మెరుగైన సుపరిపాలన అందించేందుకు సమావేశాన్ని ఉపయోగించుకుంటామని మంత్రి చెప్పారు. ప్రత్యేక పరిశోధనల కోసం ఏఐ సిటీ ఏర్పాటుకు ఇప్పటికే 200 ఎకరాలు కేటాయించడాన్ని గుర్తుచేస్తూ ఏఐ సిటీ రోడ్ మ్యాప్‌నూ సదస్సులో ప్రకటిస్తామని చెప్పారు. అభివృద్ధి పదింతలు ముందుకు తీసుకెళ్లే దిశగా ఈ రోడ్ మ్యాప్ ఉంటుందన్నారు. వాణిజ్యం, వ్యాపార, పారిశ్రామికాభివృద్ధిలో ఏఐని ఉపయోగించుకోవడం ద్వారా మరింత అభివృద్ధి చేయాలన్నది తమ లక్ష్యం అని పేర్కొన్నారు. ఇప్పటికే ఐటీ రంగంలో ప్రపంచ ఖ్యాతి పొందిన హైదరాబాద్ ఏఐలోనూ ప్రత్యేకత చాటాలన్నది ఈ రెండు రోజుల సమావేశం ఏర్పాటు వెనక ప్రభుత్వ ఉద్దేశ్యం అని చెప్పారు. ఈ సదస్సుకు ఏఐ రంగంలో నిపుణులు, ప్రముఖ అంతర్జాతీయ దిగ్గజాలను ఆహ్వానించామని, సదస్సులో దాదాపు 2వేల మంది నిపుణులు పాల్గొంటున్నారని వెల్లడించారు. ప్రజలకు ఉపయోగపడేవిధంగా ఏఐ వినియోగంపై నిపుణులతో చర్చలు జరుపుతామని, మొత్తంగా ఏఐకి సంబంధించిన 28 అంశాలపై చర్చ ఉంటుందని పేర్కొన్నారు. ఇంతవరకు ఇలాంటి సదస్సులు ప్రైవేటు రంగాల్లో చేశారని, తొలిసారి ప్రభుత్వ ఆధ్వర్యంలో నాస్కామ్‌తో సంయుక్తంగా చేస్తున్నామని చెప్పారు. రేపటి అడుగుకు ఈ సమావేశం నాంది పలుకుతుందని, రెండు రోజుల సమావేశంలో చర్చించి తెలంగాణ ఏఐ పాలసీ రూపొందిస్తామని పేర్కొన్నారు. 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్న మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే..



అవును.. అదే అతిపెద్ద సవాల్

ఏఐతో కోల్పోయే ఉద్యోగాలు రాష్ట్రానికి అతిపెద్ద సవాల్. కొత్త సాంకేతికత వచ్చినప్పుడల్లా సహజంగానే ఇలాంటి ఆందోళన ఉంటుంది. మునుపు కంప్యూటర్లు వచ్చినప్పుడూ ఇలాంటి ఆందోళనే వ్యక్తమైంది. కంప్యూటర్లను వ్యతిరేకిస్తూ అప్పట్లో ఉద్యమాలే జరిగాయి. ఏఐ రాకతో ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా అలాంటి పరిస్థితే నెలకొంది. ఏఐతో ఇవాళ కూడా ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఉంది.. దీన్ని నేను కాదనడం లేదు. అయితే ఏఐతో కొత్త ఉద్యోగాలూ వస్తాయి. రాష్ట్రంలో ఏటా వేల సంఖ్యలో ఇంజినీర్లు పుట్టుకొస్తున్నారు. వీరిలో అత్యధికులు కోడింగ్, అల్గారిథమ్ రంగంలో ఉన్నారు. ఏఐ వస్తే కోడింగ్ కనుమరుగైపోతుంది. అలాంటప్పుడు వారి ఉపాధికి ఇబ్బంది లేకుండా కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఈ విషయాలపైనా సదస్సులో ప్రధాన అంశంగా చర్చ జరుపుతున్నాం. నిపుణుల సూచనలు స్వీకరిస్తాం. అయితే ఏఐ రాకతో నష్టనివారణ చర్యల కోసం రెగ్యులేటరీ 'ఫ్రేమ్ వర్క్' రూపొందించి నిపుణుల సూచనలూ స్వీకరిస్తాం. ఏఐ రంగంతోపాటు ఇతర రంగాల్లోనూ నైపుణ్యాల అభివృద్ధికి ఇప్పటికే యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రకటించాం. ఉద్యోగాల కల్పనకు అందులో శిక్షణ ఇవ్వబోతున్నాం.

వ్యవసాయశాఖలోనూ ఏఐ

సాంకేతిక పరిజ్ఞానం సహకారంతో సామాన్యుల జీవితాల్లో మార్పు తేవాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. ఇందుకు ఏఐని ఉపయోగిస్తాం. ఇప్పటికే వ్యవసాయ శాఖలో దీనిని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. రైతులు పంట వేయడం, భూమి పరిస్థితి, పంట వ్యవధి.. లాంటి సమాచార సేకరణకు ఏఐని ఉపయోగిస్తాం. రసాయన, సేంద్రియ ఎరువుల వినియోగం, పంటకు అధిక ధర వచ్చే మార్కెట్ గురించి రైతులకు సమస్త సమాచారం అందించడంలో ఏఐ వినియోగం ఉంటుంది. విద్య, వైద్య రంగంలో ఈ సాంకేతికతను వినియోగించేందుకు ఇప్పటికే పలు నిర్ణయాలు తీసుకున్నాం. రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ కార్డ్ ఇవ్వబోతున్నాం. అందులోనూ ఏఐ వినియోగిస్తాం. విద్యార్థుల్లో ఏ స్థాయిలో దీన్ని ఉపయోగించాలన్న అంశంపై నిపుణులతో చర్చిస్తున్నాం. పాఠ్యాంశాల్లోనూ దీన్ని చేరుస్తాం. 35 ప్రభుత్వ శాఖల్లో ప్రజలకు అందించే సేవలు మరింత మెరుగ్గా అందించేలా ఏఐ వినియోగం ఉంటుంది.

వ్యక్తిగత గోప్యత రక్షణకు చర్యలు

వ్యక్తిగత గోప్యత అనేది ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రతి పౌరుడు ఎదుర్కొంటున్న సమస్య ఇది. ప్రజలకు సంబంధించిన వ్యక్తిగత సమాచారం బహిర్గతం కాకుండా, వారి గోప్యత రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. డేటా ప్రైవసీపై త్వరలో ఒక ఫ్రేమ్ వర్క్ రూపొందిస్తాం. ప్రభుత్వ పాత్ర ఏమిటన్నది పరిశీలించి రక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం.

ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీల గురించి..

ఏఐతోపాటు ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీపైనా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. డేటా అనాలటిక్స్, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ రంగాల్లోనూ పరిశోధనా కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం. క్వాంటం కంప్యూటింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. వచ్చే నెలలో సైబర్ సెక్యూరిటీపై ఎస్పీలు, కలెక్టర్లు, రాష్ట్రస్థాయి అధికారులతో సదస్సు నిర్వహించబోతున్నాం. సైబర్ రంగంపై నిపుణులతో శిక్షణ ఇవ్వబోతున్నాం. రాష్ట్రం నుంచి యూనికార్న్ (బిలియన్ డాలర్ల) కంపెనీలు ఏర్పాటయ్యేలా ఇక్కడి యువతకు ప్రభుత్వ ప్రోత్సాహం ఉంటుంది. త్వరలో నూతన పారిశ్రామిక పాలసీ, ఎంఎస్ఎంఈ పాలసీ, బయోటెక్ లైఫ్ సైన్సెస్ పాలసీ, ఐటీ పాలసీ తీసుకురాబోతున్నాం. ఐటీ పాలసీపైనా ఈ రెండు రోజుల సదస్సులో చర్చ జరపబోతున్నాం.

..అలా ఔషధాల ధరలు తగ్గుతాయి

ప్రజల జీవితాలు మరింత మెరుగ్గా చేయడం, పదింతలు వేగంగా అభివృద్ధి సాధించాలన్న రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఏఐ టెక్నాలజీని పెద్దఎత్తున వినియోగించాలని నిర్ణయించాం. దీని ఫలాలు సామాన్యులకూ అందుతాయి. ఫార్మా రంగంలో ఏఐని పెద్దఎత్తున వినియోగించనున్నారు. ఫలితంగా ఉత్పాదకత ఎన్నో రెట్లు పెరిగి ఔషధాల ధరలూ తగ్గుముఖం పడుతాయి. దీంతో సామాన్యులకూ మేలు జరుగుతుంది. ఇతర రంగాల్లోనూ ఇలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయి.

నేడు, రేపు

ప్రపంచ కృత్రిమ మేధ సదస్సు

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచ కృత్రిమ మేధ(ఏఐ) సదస్సు'కు హైదరాబాద్ వేదిక కానుంది. గురు, శుక్రవారాల్లో (5, 6 తేదీలు) రెండు రోజుల పాటు ఈ సదస్సు జరగనుంది. దీనిని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నారు. హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(హెచ్ఐసీసీ)లో గురువారం ఉదయం 10 గంటలకు సదస్సును సీఎం రేవంత్ ప్రారంభిస్తారు. కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి పాల్గొంటారు. 'ప్రతి ఒక్కరికీ కృత్రిమ మేధస్సుతో పని(మేకింగ్ ఏఐ వర్క్ ఫర్ ఎవ్రీ వన్)' ఇతివృత్తంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఇలాంటి గ్లోబల్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సమ్మిట్‌ను నిర్వహించడం దేశంలో ఇదే మొదటిసారి. ఐటీ రంగంలో ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సదస్సును నిర్వహిస్తోంది. ప్రపంచ నలుమూలల నుంచి ఏఐ రంగంలో పేరొందిన దాదాపు 2 వేల మంది ప్రముఖులు, సంస్థల ప్రతినిధులు సదస్సుకు హాజరవుతున్నారు. ఏఐ రంగంలో అందరి దృష్టిని ఆకర్షిస్తున్న ఖాన్ అకాడమీ అధినేత సల్ ఖాన్, ఐబీఎం నుంచి డానియెలా కాంబ్, ఎక్స్‌ప్రైజ్ ఫౌండేషన్ నుంచి పీటర్ డయామండిస్ తదితర ప్రముఖులు ఈ సదస్సులో పాల్గొననున్నారు. ఏఐ రంగం అభివృద్ధికి తమ ఆలోచనలను పంచుకుంటారు. భవిష్యత్తు అవకాశాలు, కొత్త ఆవిష్కరణలపై చర్చలు జరుపుతారు. సమాజంపై ఏఐ ప్రభావం, నియంత్రణ, సవాళ్లను చర్చిస్తారు. కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టే పరిశోధనలు, స్టార్టప్ డెమోలు, అభివృద్ధి దశలో ఉన్న వినూత్న ప్రాజెక్టులను ఈ సదస్సులో ప్రదర్శిస్తారు. రెండు రోజుల సదస్సు కోసం ప్రధాన వేదికతో పాటు నాలుగు అదనపు వేదికలను ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో నిర్మించనున్న ఫోర్త్ సిటీలో 200 ఎకరాల విస్తీర్ణంలో ఏఐ సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం ఐటీ రంగానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని, అందుకు రాష్ట్రంలో ఉన్న అనుకూల వాతావరణాన్ని ఈ ఏఐ గ్లోబల్ సదస్సు ప్రపంచానికి చాటి చెబుతుందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రాన్ని ఏఐ హబ్‌గా తీర్చి దిద్దేందుకు, ప్రపంచ దిగ్గజ సంస్థల పెట్టుబడులను ఆకర్షించడానికి ఇటీవల అమెరికా పర్యటనలో సీఎం రేవంత్‌రెడ్డి అధిక ప్రాధాన్యమిచ్చారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని వివిధ రంగాల్లో ఏఐ సేవలను వినియోగించడానికి వీలుగా ప్రభుత్వం ప్రత్యేక రోడ్‌మ్యాప్‌ను రూపొందించింది. దీన్ని సదస్సులో సీఎం విడుదల చేస్తారు. సదస్సులో దాదాపు 25 కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

వరద నష్టం రూ.7 వేల కోట్లు

» మోదీతో మాట్లాడి నివేదిక పంపిన రేవంత్

» సీఎం, మంత్రులు క్షేత్రస్థాయిలోనే..

» పదేళ్లుగా ఇంటికే పరిమితమైన కేసీఆర్..

» మేము పనికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తాం

» బీఆర్ఎస్ వాళ్లది కేవలం ప్రచారమే

» హరీశ్.. బాబును ఎప్పుడు పొగుడుతారో ఎప్పుడు తిడుతారో తెలియదు

» ప్రతిపక్షంగా ఎలా ఉండాలో అడిగితే బీఆర్ఎస్‌కు శిక్షణ ఇస్తాం: తూర్పు జగ్గారెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వరదలు రావడంతోనే సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు సహా ప్రభుత్వ యంత్రాంగం అంతా క్షేత్రస్థాయిలోనే ఉండి.. వరద బాధితులకు సహాయ సహకారాలు అందించే పనిలోనే పడిందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. ప్రధాని మోదీతో మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి.. రాష్ట్రంలో వరదల కారణంగా రూ.7 వేల కోట్ల మేరకు పంట, ఆస్తి నష్టం జరిగినట్లుగా నివేదికలూ కేంద్రానికి పంపారన్నారు. కానీ.. సీఎంగా పదేళ్ల పాటు, ఇప్పుడు ప్రతిపక్ష నేతగానూ కేసీఆర్ ఇంటికే పరిమితమయ్యారన్నారు. ఆయన ప్రజల్లోకి రారని, ఇంటి నుంచే అంతా నడిపిస్తారని వ్యాఖ్యానించారు. గాంధీ భవన్‌లో బుధవారం మీడియాతో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, నాయకత్వం ఎప్పుడూ పనికి ఎక్కువ, ప్రచారానికి తక్కువ ప్రాధాన్యత ఇస్తాయని చెప్పారు. కానీ బీఆర్ఎస్ వాళ్లు మాత్రం పబ్లిసిటీకి దగ్గరగాను, పనికి దూరంగా ఉంటారన్నారు.

ముందుగా సమస్యలు చెప్పి.. తర్వాత పరిష్కారం అడగాలి

ఒక రాజకీయ పార్టీ నాయకునిగా ఖమ్మంకు హరీశ్‌రావు వెళ్లడం తప్పుకాదని జగ్గారెడ్డి అన్నారు. అక్కడ ఆయన దృష్టికి వచ్చి న సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పాలన్నారు. "ముందుగా సమస్యలు చెప్పి ఆ తర్వాత పరిష్కారం అడగాలి. కానీ.. ఖమ్మం వెళ్లక ముందే హరీశ్ రావు విమర్శలు చేయ డం ఏంది? ఇది రాజకీయాలు చేసే సమయమా? ముగ్గురు మంత్రులు ఏం చేయట్లేదంటున్న ఆయన.. ఏం చేయాలో చెప్పట్లేదు. ఇలాంటి సమయాల్లో ప్రతిపక్ష పార్టీ ఎలా ఉండాలో మమ్మల్ని అడిగితే శిక్షణ ఇస్తాం కదా?" అన్నారు. తమకు పదేళ్ల పాటు ప్రతిపక్షంలో ఉన్న అనుభవం ఉందని చెప్పారు. కాగా.. హరీశ్ రావు, ఆయన ఫ్యామిలీ.. చంద్రబాబును ఎప్పుడు పొగుడుతారో, ఎప్పుడు తిడతారో తెలియదన్నారు. వరదల సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల పనితనాన్ని మెచ్చుకోలేక.. లేని బురదను తమ ప్రభుత్వంపై చల్లుతూ ఏపీ సీఎం చంద్రబాబును మెచ్చుకుంటున్నారన్నారు. ఏపీలోని ప్రతిపక్షమేమో.. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనితనం బాగుందని అంటోందన్నారు. అక్కడి ప్రతిపక్షం.. ఇక్కడి ప్రభుత్వం పనితీరును, ఇక్కడి ప్రతిపక్షం.. అక్కడి ప్రభుత్వ పనితీరును మెచ్చుకుంటున్నాయన్నారు. ఖమ్మంలో వరదలు రాగానే డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల, పొంగులేటి స్థానికంగానే ఉండి సమీక్షలు చేశారని, ప్రజల ఇబ్బందులను తొలగించే పనిలో పడిపోయారన్నారు. మహబూబాబాద్‌లో సీఎం రేవంత్, సీతక్క, మెదక్‌లోరాజనర్సింహ పర్యటించారన్నారు. సాగునీటి శాఖ అధికారులను మంత్రి ఉత్తమ్ ఎప్పటికప్పుడు అప్రమత్తం చేశారని ఆయన చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగ్గారెడ్డి

నిమిషం కూడా కరెంట్ పోవద్దు!

(మొదటిపేజీ తరువాయి)

కర్నాటి వరుణ్‌రెడ్డి, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్, ట్రాన్స్‌కో జేఎండీ సి.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సౌర విద్యుత్తు వినియోగం పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. డిమాండ్‌కు అనుగుణంగా విద్యుదుత్పత్తి చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వివిధ శాఖల పరిధిలో వినియోగంలో లేని భూముల్లో సోలార్ ప్లాంట్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అటవీ భూముల్లో కూడా సోలార్ యూనిట్లు పెట్టాలని సూచించారు.



రైతులకు ఉచితంగా పంపులు

సౌర విద్యుత్తు వినియోగాన్ని గణనీయంగా పెంచాలని సీఎం రేవంత్ చెప్పారు. అందుకోసం రైతులకు సోలార్ పంపు సెట్లను ఉచితంగా అందించాలన్నారు. నాగర్‌కర్నూలుజిల్లా వంగూరు మండలం కొండారెడ్డిపల్లెను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, ఈ పథకాన్ని అమలు చేయాలని తెలిపారు. ఉచిత పంపు సెట్ల కార్యక్రమం అమలు కోసం 'పీఎం కుసుమ్' పథకాన్ని వినియోగించుకోవాలన్నారు. రైతులు కూడా తమ భూముల్లో సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకొనేలా ప్రోత్సహించాలని సూచించారు. అక్కడ ఉత్పత్తయిన విద్యుత్తును పంపుసెట్లకు వాడుకున్న తర్వాత మిగిలిన దాన్ని డిస్కమ్‌లు కొనుగోలు చేసి, రైతులకు అదనంగా ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని చెప్పారు. వంటగ్యాస్ బదులుగా సౌర విద్యుత్తును వాడుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. వీటిపై మహిళా సంఘాలకు శిక్షణ అందించి, వారు సౌర విద్యుత్తు వ్యాపారంలోకి అడుగుపెట్టేలా చూడాలని సూచించారు.

40 వేల మెగావాట్ల సామర్థ్యం సాధించాలి

రాష్ట్రంలో విద్యుత్తు స్థాపిత సామర్థ్యం 40 వేల మెగావాట్లకు చేరుకునేలా చర్యలు చేపట్టాలని సీఎం రేవంత్ ఆదేశించారు. సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై అధిక లోడ్‌ను తగ్గించుకోవడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. వినియోగదారులకు 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేయాలని స్పష్టం చేశారు.

విద్యా చట్టంపై పిటిషన్లు సింగిల్ జడ్జికి బదిలీ

పలు కోర్సులకు అనుమతి నిరాకరణపై హైకోర్టులో సవాల్ చేసిన ఇంజనీరింగ్ కాలేజీలు

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌లో సీఎస్ఈ, సీఎస్ఈ సైబర్ సెక్యూరిటీ, ఏఐ-ఎంఎల్ తదితర కోర్సులకు ఏఐసీటీఈ అనుమతులిచ్చిన తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం విద్యా చట్టం మేరకు నిరాకరించడం చెల్లదంటూ పలు కాలేజీలు వేసిన పిటిషన్లను చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని డివిజన్ బెంచ్ సింగిల్ జడ్జికి బదిలీ చేసింది. తెలంగాణ విద్యా చట్టం సెక్షన్ 20 అమలు చేసే విధానం చట్టబద్ధతను సవాల్ చేస్తూ ఎంజీఆర్, విద్యాజ్యోతి, సీఎంఆర్, కేఎంఆర్, మల్లారెడ్డి, మర్రి ఎడ్యుకేషనల్ సొసైటీ తదితర ఇంజనీరింగ్ కాలేజీలు పిటిషన్లు దాఖలు చేశాయి. బుధవారం చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే నేతృత్వంలోని డివిజన్ బెంచ్ ఎదుట అడ్వొకేట్ జనరల్ వాదనలు వినిపిస్తూ.. 'ఏపీ వర్సెస్ జేబీ ఎడ్యుకేషనల్ సొసైటీ' కేసులో సెక్షన్ 20 చట్టబద్ధతను సుప్రీంకోర్టు సమర్థించిందని.. ఇతర కారణాలతో మళ్లీ అదే సెక్షన్ చట్టబద్ధతను సవాల్ చేయడానికి వీలుండదన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. పిటిషనర్లయిన కాలేజీలు సెక్షన్ 20 చట్టబద్ధతను సవాల్ చేయట్లేదని.. అమల్లో లోపాలున్నాయంటున్నారు కాబట్టి రోస్టర్ ఉన్న సింగిల్ జడ్జికి పిటిషన్లను బదిలీ చేయాలని రిజిస్ట్రీకి ఆదేశాలిస్తున్నట్లు స్పష్టం చేసింది.

'గ్రామీణ' వైద్యులకు భారీగా వేతన పెంపు!

» 100-125 శాతం దాకా పెంచే యోచన

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లోని సర్కారీ దవాఖానాల్లో పనిచేసే వైద్యులకు వేతనాలు భారీగా పెరగనున్నాయి. ఈ మేరకు సర్కారు సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్, వరంగల్ వంటి నగరాలకే పరిమితమవుతున్న వైద్యులను గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు పంపించి.. మెరుగైన వైద్య సేవలందించేందుకు సర్కారు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తే రెట్టింపు వేతనం (వంద శాతం ఇన్సెంటివ్), గిరిజన ప్రాంతాల్లో అయితే 125 శాతం ఇవ్వనున్నట్లు సమాచారం. వైద్య కళాశాలలు, జిల్లా, ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో పని చేస్తూ స్పెషాలిటీ సేవలు అందించే వైద్యులందరికీ ఈ ప్రోత్సాహక పథకాన్ని వర్తింపజేయనున్నట్లు తెలుస్తోంది. ఆసిఫాబాద్, ములుగు, భూపాలపల్లి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని మెడికల్ కాలేజీల్లో పనిచేసేందుకు డాక్టర్లు దొరకడం లేదు. ఈ సమస్యకు చెక్ పెట్టేందుకు మంత్రి రాజనర్సింహ పలుమార్లు డాక్టర్లతో సమావేశమై, వారి అభిప్రాయాలు సేకరించారు. ఏపీ, ఒడిసా సహా పలు రాష్ట్రాల్లో అమలవుతున్న విధానంపై అధ్యయనం చేయించారు. ఒడిసాలో వైద్యులకు మూల వేతనంపై 25 నుంచి 150 శాతం వరకు ప్రోత్సాహకం కింద ఇస్తున్నారు. రాష్ట్రంలో కూడా ఇలా ప్రోత్సాహకాలివ్వాలంటే ఏటా రూ.200 కోట్లు అదనంగా ఖర్చవుతుందని అంచనా వేశారు. ఈ ప్రతిపాదనలను మంత్రి ఆమోదించి, ఆర్థిక శాఖకు పంపించారు.

వట్టెం పంపుహౌస్‌లో నీళ్లు తోడడం కష్టమే!

» 30 లక్షల క్యూబిక్ మీటర్ల నీళ్లు ఉన్నట్లు అంచనా

» నెల నుంచి 2 నెలల దాకా సమయం పట్టే అవకాశం

» త్వరగా పునరుద్ధరించాలని మంత్రి జూపల్లి ఆదేశం


వట్టెం పంపుహౌస్‌ను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి

నాగర్‌కర్నూల్/కందనూలు/హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని వట్టెం పంప్‌హౌస్‌లోకి 30లక్షల క్యూబిక్ మీటర్ల మేర నీరు చేరినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నీటిని తోడేందుకు నెల నుంచి రెండు నెలల వరకు సమయం పట్టే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఏదుల, వట్టెం పంప్‌హౌస్‌లను నీటిపారుదలశాఖ ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్, ఎత్తిపోతల సలహాదారుడు పెంటారెడ్డి తదితరులు పరిశీలించారు. వట్టెం పంపుహౌస్‌లో రెండు మోటార్లతో నీటిని ఎత్తిపోసే ప్రక్రియ బుధవారం ప్రారంభించగా.. మరో 16 మోటార్లు అదనంగా పెట్టాలని అధికారులను వారు ఆదేశించారు. వట్టెం పంప్‌హౌస్‌లో 9మోటార్లు పెట్టాలని నిర్ణయించగా... ఇప్పటివరకు 5 మోటార్లను బిగించారు. మిగతా మోటార్ల బిగింపు ప్రక్రియ కొనసాగుతున్న దశలోనే వరద నీటితో నిండిపోయింది. మరో నెలన్నర పాటు మోటార్లు నీటిలోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిన నేపథ్యంలో ముున్ముందు సాంకేతిక సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని ఇంజనీరింగ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. కేఎల్ఐ ఎత్తిపోతల పథకంలోని పంపుహౌస్‌కు సంబంధించి 3, 5వ మోటార్లను ఇప్పటికీ పునరుద్ధరించ లేకపోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొంటున్నారు. అయితే, వట్టెం పంపుహౌస్ డీ వాటరింగ్ ప్రక్రియ నెల రోజుల్లోనే పూర్తి చేసి.. ఆ తర్వాత మరమ్మతులు చేపట్టేందుకు అధికారులు ప్రణాళికలు రచిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో నార్లాపూర్ నుంచి ఏదులవరకు ప్రధాన కాల్వకు సంబంధించి 15లక్షల క్యూబిక్ మీటర్ల పనులు మిగిలి ఉండగానే ఇరిగేషన్ అధికారులపై ఒత్తిడి తెచ్చి, ప్రాజెక్టును ప్రారంభించడం వల్లే ఈ తతంగమంతా జరిగిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగా, కీలకమైన ప్యానల్ బోర్డులు, స్టార్టర్లు, ఎలక్ట్రికల్ ఎక్విప్‌మెంట్‌ను సురక్షిత ప్రదేశంలో ఉంచడంతో పంప్‌హౌస్‌కు భారీనష్టం తప్పిందన్న వాదన వినిపిస్తోంది. మరోవైపు.. వట్టెంపంపుహౌస్‌ను త్వరగా పునరుద్ధరించాలని మంత్రి జూపల్లి ఆదేశించారు. నీట మునిగిన పంపుహౌస్‌ను అధికారులతో కలిసి మంత్రి బుధవారం పరిశీలించారు. పంపులు నీట మునగడానికి గల కారణాలు, వాటి సామర్థ్యం, సర్వీస్,నిర్వహణ విషయాలపై ఆరా తీశారు.

రాష్ట్రాన్ని వదలని వాన

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు.. ఉధృతంగా ప్రవహించిన వాగులు, వంకలు

- అత్యధికంగా కోహెడలో 24 సెం.మీ. నమోదు
- బొగ్గు ఉత్పత్తికి బ్రేక్.. ఓసీపీల్లో ఆగిన వెలికితీత
- మరో 4 రోజులపాటు భారీ వర్షాలు
- నేడు మరో అల్పపీడనం.. వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

వర్షాలు ఒకింత తగ్గుముఖం పట్టాయని ప్రజలు ఊరట చెందేలోపే.. మంగళవారం అర్ధరాత్రి నుంచి కొన్ని జిల్లాల్లో.. బుధవారం ఉదయం నుంచి కొన్ని చోట్ల.. భారీ వర్షాలు దంచికొట్టాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా సిద్దిపేట జిల్లా కోహెడలో 24 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. తెల్లవారుజాము నుంచి కురిసిన భారీ వర్షానికి కోహెడ మండలం జలదిగ్బంధమైంది. అనేక గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మంచిర్యాల జిల్లావ్యాప్తంగా బుధవారం ఉదయం 6 గంటలకు ప్రారంభమైన వర్షం 9 గంటల వరకు ఎడతెరపి లేకుండా కురిసింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, ఘట్‌కేసర్‌లో మంగళవారం రాత్రి 11 గంటలకు ప్రారంభమైన వర్షం.. తీవ్ర రూపం దాల్చి ఉరుములు, మెరుపులతో రెండు గంటలపాటు కుంభవృష్టిగా కురిసింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వానలకు ఘట్‌కేసర్ మండలంలోని వెంకటాపూర్ అరుంధతి, వైభవ్ కాలనీల్లో వరదనీరు ఇళ్లలోకి వచ్చి చేరింది. అలాగే.. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ మరోసారి జలమయమైంది. కొన్ని హాస్టళ్ల సెల్లార్లలో నీరు చేరడంతో విద్యార్థులు బయటికి రాలేని పరిస్థితి ఏర్పడింది. సంగారెడ్డి జిల్లా కేంద్రానికి చేరువలో ఉన్న 161 నంబరు నాందేడ్-అకోలా జాతీయ రహదారిపై వరద నీరు నిలిచింది. దాదాపు 4 గంటలపాటు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడంతో హైవే అథారిటీ సిబ్బంది.. డీజిల్ మోటార్లను తెప్పించి ఉదయం నుంచి సాయంత్రం వరకు నీటిని ట్యాంకర్లతో తోడేసినా వరదనీటి ప్రవాహం తగ్గలేదు. ఇక.. జోగులాంబ గద్వాల జిల్లాలో నెట్టెంపాడు ప్రాజెక్టు కింద నిర్మించిన చిన్నోనిపల్లి రిజర్వాయర్ పరిధిలోని చిన్నోనిపల్లి గ్రామంలో చేరిన వరదనీటితో ప్రజలు అవస్థలు పడుతున్నారు. రిజర్వాయర్ బ్యాక్ వాటర్ అంతా గ్రామాన్ని చుట్టుముట్టి ఇళ్లలోకి చేరడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గ్రామంలోకి వస్తున్న తేళ్లు, పాముల మధ్య ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని బతుకుతున్నారు. బుధవారం గ్రామానికి చెందిన రైతు వడ్డె మల్లేష్ (18) నారుమడిలో నారు తీయడానికి వెళ్లి విషపురుగు కాటుకు బలయ్యాడు. ఇక.. హైదరాబాద్ నగరంలోనూ.. మంగళవారం రాత్రి 11గంటల నుంచి బుధవారం ఉదయం 7 గంటల వరకూ పలు ప్రాంతాల్లో 8.7 నుంచి 5 సెం.మీ వర్షం కురిసింది.


ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలంలో లో లెవల్ వంతెన పై నుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు

ఇంకా వర్షాలే..

నగరంలో మరో రెండురోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని బేగంపేట వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా కూడా రానున్న నాలుగు రోజుల్లో పలు ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయని హైదరాబాద్ వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. గురు, శుక్రవారాల్లో జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు.. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. గురువారం బంగాళాఖాతంలో.. అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా ఓపెన్‌కాస్ట్ గనుల్లో వర్షపు నీరు చేరడం వల్ల ఓవర్ బర్డెనింగ్ సహా ఇతర పనులన్నీ పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో భూపాలపల్లి ఏరియాలో రోజుకు 47,146 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు వెలికితీతకు అంతరాయం ఏర్పడిందని సింగరేణి వర్గాలు తెలిపాయి. అలాగే.. వర్షాల కారణంగా మంచిర్యాలజిల్లాలోని శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి సింగరేణి డివిజన్‌లలోని ఓపెన్ కాస్టు గనుల్లో బొగ్గు తవ్వకాలు నిలిచిపోగా, ఓబీ తొలగింపు పనులకు ఆటంకం ఏర్పడుతోంది. .


శ్యామల్‌రాజుకు సీపీఆర్ చేస్తున్న ఆర్ఎస్ఐ రమేష్

విద్యుత్ పునరుద్ధరణ చేపట్టాలి: భట్టి



హైదరాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): వరదలతో దెబ్బతిన్న విద్యుత్ సరఫరా వ్యవస్థను యుద్ధప్రాతిపదికన పునరుద్ధరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సచివాలయంలో బుధవారం ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ పునరుద్ధరణ క్రమంలో ఏ సమస్యలు వచ్చినా డిస్కమ్‌ల సీఎండీల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. విపత్తు సమయంలో సిబ్బంది సాహసోపేతంగా పనిచేశారని భట్టి అభినందించారు. ఇక ప్రతీ వినియోగదారుడికి నాణ్యమైన కరెంట్‌ను అందించే బాధ్యత విద్యుత్ సంస్థలదేనని గుర్తుచేశారు.

రెండు రాష్ట్రాలకు మాజీ సీజేఐ ఎన్వీ రమణ విరాళం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన రెండు తెలుగు రాష్ట్రాల్లో వరద బాధితుల సహాయార్థం సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ విరాళం అందజేశారు. ఆయా రాష్ట్రాల సీఎం రిలీఫ్ ఫండ్‌కి చెరో రూ.10 లక్షల చొప్పున ప్రకటించారు. చెక్‌లను తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్, ఏపీ అడిషనల్ రెసిడెంట్ కమిషనర్ హిమాన్షు కౌశిక్‌కు.. జస్టిస్ ఎన్వీ రమణ బుధవారం ఇక్కడ తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. వరదల వల్ల సంభవించిన మరణాలపై ఆవేదన వ్యక్తం చేశారు. రెండు తెలుగు రాష్ట్రాలకు ఉదారంగా సహాయాన్ని అందించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రెండు రాష్ట్రాల అధికారులు జస్టిస్ ఎన్వీ రమణకు కృతజ్ఞతలు తెలిపారు.


తెలంగాణ రెసిడెంట్ కమిషనర్‌కు చెక్ అందించిన మాజీ సీజేఐ ఎన్వీ రమణ

వరద బాధితులకు యశోద ఆస్పత్రి కోటి విరాళం

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో రాష్ట్రం అతలాకుతలమైన నేపథ్యంలో నగరంలోని యశోద గ్రూప్ హాస్పిటల్స్ నిర్వాహకులు స్పందించారు. వరద బాధితులకు రూ.కోటి విరాళాన్ని ప్రకటించారు. యశోద ఆస్పత్రి ఆపరేషన్స్ చీఫ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసి చెక్కును అందజేశారు. ఆపద కాలంలో దాతృత్వాన్ని చాటుకున్న యశోద హాస్పిటల్స్ ఛైర్మన్ రవీందర్‌రావు, డైరెక్టర్లు సురేందర్‌రావు, దేవేందర్‌రావులను భట్టి అభినందించారు.

యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు: సీతక్క

హైదరాబాద్, సెప్టెంబరు4 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరద ప్రభావిత ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. సచివాలయంలో అధికారులతో సమీక్షలో ఆమె మాట్లాడుతూ వరద ప్రభావిత గ్రామాల్లో రోడ్లు, పారిశుధ్యం, తాగునీటి సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలన్నారు. తక్షణ అవసరంగా రూ.24 కోట్లు మంజూరు చేశామని, అవసరాన్ని బట్టి మరిన్ని నిధులు ఇస్తామని తెలిపారు. వర్షాలు, వరదల్లో ప్రమాదవశాత్తు మరణించిన వారి జాబితాను ప్రభుత్వానికి అందించాలన్నారు. ముందస్తుగా ప్రతి మండలంలో విపత్తు నిర్వహణ కమిటీలు నియమించాలని ఆమె సూచించారు.

వర్షాలకు ఇద్దరు వృద్ధ మహిళల మృతి

- ములుగుజిల్లాలో ఇంటి గోడ కూలి ఒకరు!
- యాదాద్రి భువనగిరి జిల్లాలో వరదనీటిలో పడి ప్రాణాలు కోల్పోయిన మరో వృద్ధురాలు
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో.. కిన్నెరసాని వాగు దాటే క్రమంలో పశులకాపరి గల్లంతు

ములుగు, సెప్టెంబరు 4: భారీ వర్షానికి ఇంటిగోడ కూలి ఒక వృద్ధురాలు, యాదాద్రి భువనగిరి జిల్లాలో వరదనీటిలో పడి మరో వృద్ధురాలు దుర్మరణం పాలయ్యారు. ములుగు జిల్లా ములుగు మండలం భూపాల్‌నగర్ (పందికుంట)కు చెందిన సున్నం ఆగమ్మ (75) గ్రామంలోని ఓ చిన్న ఇంట్లో ఒంటరిగా నివసిస్తోంది. బుధవారం తెల్లవారుజామున నిద్రలో ఆమెపై గోడ కూలి పడటంతో తీవ్ర గాయాలై మృతి చెందింది. అలాగే.. యాదాద్రిభువనగిరి జిల్లా మానాయికుంట. గ్రామానికి చెందిన బోడ ఐలమ్మ(80) మనుమళ్లతో కలిసి గ్రామంలో నివాసం ఉంటోంది. మంగళవారం రాత్రి సమయంలో కురిసిన భారీ వర్షానికి ఐలమ్మ ఇంటి చుట్టుపక్కల మోకాలి లోతు వరద నీరు చేసింది. బుధవారం ఉదయం ఇంటి ఎదురుగా ఉన్న నిల్వ నీటిలో ఐలమ్మ మృతదేహం ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. అర్ధరాత్రి సమయంలో బహిర్భూమికి బయటకు వచ్చిన ఐలమ్మ ప్రమాదవశాత్తు వరద నీటిలో పడి మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. మరోవైపు.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం పరిధిలోని కిన్నెరసాని, మొర్రేడు వాగులు పొంగిప్రవహించడంతో ఆ రెండు వాగుల సంగమ ప్రాంతంలో బుధవారం 8 మంది పశువుల కాపర్లు చిక్కుకుపోయారు. వారిలో జారె సాయి అనే పశులకాపరి రాత్రి 9 గంటల సమయంలో వరద తగ్గిందని భావించి వాగు దాటే ప్రయత్నం చేసి గల్లంతయ్యాడు. అతడి కుటుంబసభ్యులు అధికారులకు ఆ విషయం తెలపగా.. వారు కిన్నెరసాని ప్రాజెక్టు అధికారులతో మాట్లాడి ప్రాజెక్టు గేట్లను నిలిపివేయాలని కోరారు. గడ్డపైనే ఉన్న మిగతావారిని అధికారులు రక్షించారు. ఇక.. వరద బురదను తొలగించుకుంటున్న వ్యక్తికి గుండెపోటు వస్తే అక్కడే ఉన్న పోలీస్ అధికారి సీపీఆర్ చేసి రక్షించారు. ఖమ్మం నగర శివారులోని దంసలాపురం కాలనీకి చెందిన శ్యామల్‌రాజు.. మున్నేరు వరదలతో బురదమయమైన తన ఇంటిని శుభ్రం చేసుకుంటుండగా ఆయనకు గుండెపోటు వచ్చింది. దీంతో ఆయన భార్య కేకలు వేస్తూ బయటకు వచ్చారు. అక్కడే సహాయక చర్యల్లో ఉన్న ఆర్ఎస్ఐ రమేష్.. వెంటనే వారి ఇంట్లోకి వెళ్లి అతడికి సీపీఆర్ చేశారు. దీంతో అతడు ప్రమాదంనుంచి బయటపడ్డాడు. వెంటనే రమేష్.. అంబులెన్స్‌కు సమాచారం అందించి అతణ్ని ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించారు.

రైళ్ల పునరుద్ధరణ

- ఇంటికన్నె, తాళ్లపూసపల్లి, వద్ద మరమ్మతులు పూర్తి
- గూడ్స్‌రైలు, సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌లతో ట్రయల్ రన్
- ఆ తర్వాత ప్రయాణికులతో వెళ్లిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్

హైదరాబాద్ సిటీ/కేసముద్రం, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇంటికన్నె-కేసముద్రం, మహబూబాబాద్-తాళ్లపూసలపల్లి స్టేషన్ల మధ్య కొట్టుకుపోయిన రైల్వే ట్రాక్‌ల పునరుద్ధరణ పనులు కొలిక్కి వచ్చాయి. వరద ఉధృతి తగ్గడంతో విజయవాడ నుంచి సికింద్రాబాద్ వైపు వచ్చే ట్రాక్ (అప్ లైన్) మరమ్మతులను రైల్వే అధికారులు పూర్తి చేశారు. బుధవారం మధ్యాహ్నం నుంచే రైళ్ల రాకపోకలను పాక్షికంగా పునరుద్ధరించారు. సికింద్రాబాద్ నుంచి విజయవాడ వైపు (డౌన్ లైన్) మార్గంలో పునరుద్ధరణ పనులను బుధవారం రాత్రికల్లా పూర్తి చేస్తామని అధికారులు స్పష్టం చేశారు. దీంతో మూడు రోజులుగా నిలిచిపోయిన వందలాది రైళ్ల రాకపోకలకు మార్గం సుగమమైంది. ఆదివారం సాయంత్రం నుంచి 12 ఎక్స్‌కవేటర్లు, 11 టిప్పర్లు, 2 క్రేన్లు, ఒక రోడ్డు రోలర్‌తోపాటు 600 మంది కార్మికులు, ఇంజనీరింగ్, ఓహెచ్ఈ (ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్), ఎస్‌అండ్‌టీ (సిగ్నల్ అండ్ టెలికాం) సిబ్బంది, ఉన్నతాధికారులు నిరంతరం శ్రమించి ఎట్టకేలకు బుధవారం ఉదయం 10గంటలకు అప్‌లైన్ ట్రాక్‌ను సిద్ధం చేశారు. ఈ ట్రాక్ మీదుగా తొలుత ఒక గూడ్స్ రైలు, ఆ తర్వాత కేసముద్రం రైల్వేస్టేషన్‌లో నిలిపి ఉంచిన బెంగళూరు-దానాపూర్ సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్(ఖాళీ రైలు)తో ట్రయల్ రన్ చేసి పరీక్షించారు. గుంటూరు నుంచి విజయవాడ మీదుగా సికింద్రాబాద్‌కు ప్రయాణికులతో బయల్దేరిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.30గంటలకు ఆయా స్టేషన్లను ఎటువంటి ఆటంకం లేకుండా దాటి వెళ్లడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ తర్వాత తిరుపతి-ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్, డౌన్ వైపు హౌరా, నాగర్‌సోల్, గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లను కాషన్ ఆర్డర్‌తో నెమ్మదిగా నడిపించారు. బుధవారం రాత్రిలోగానే డౌన్ లైన్‌ను కూడా సిద్ధం చేసి గురువారం నుంచి అన్ని రైళ్ల రాకపోకలు పునరుద్ధరించే అవకాశం ఉన్నట్లు దక్షిణ మధ్య రైల్వే వర్గాలు తెలిపాయి. మరమ్మతుల కోసం 30వేల క్యూబిక్ మీటర్ల మట్టి, 5వేల క్యూబిక్ మీటర్ల కంకర, 6వేల క్యూబిక్ మీటర్ల ప్రత్యేక మట్టిని ఉపయోగించారు. ట్రాక్ పునరుద్ధరణ పనులను రైల్ నిలయంలోని విపత్తు నిర్వహణ కార్యాలయం నుంచి దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పర్యవేక్షించారు. పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమైన అధికారులు, సిబ్బందిని ఆయన ప్రశంసించారు. భారీ వర్షాల కారణంగా రద్దయిన పలు రైళ్లను అధికారులు పునరుద్ధరించినా, దారి మళ్లించడంతో గంటల కొద్దీ ఆలస్యంగా నడుస్తున్నాయి.


మహబూబాబాద్ జిల్లాలోని ఇంటికన్నె వద్ద ట్రాక్ మరమ్మతుల అనంతరం సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌తో ట్రయల్‌రన్

సీఎంఆర్‌ఎఫ్‌కు విరాళాలు ఇవ్వండి..

- ఇది మానవత్వం చూపాల్సిన సమయం..
- వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వానికి అండగా నిలవండి
- సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వరద బాధితులను ఆదుకోవడంలో తెలంగాణ ప్రభుత్వానికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ కంపెనీలు, ఇతర రంగాల్లోని ప్రముఖులు స్పందించాలని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్)కి విరాళాలు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. విరాళాలను ఆన్‌లైన్ బ్యాంకింగ్, చెక్కుల రూపంలో లేదా యూపీఐ పేమెంట్ యాప్స్ ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి విరాళాలు అందించవచ్చన్నారు. "వరద బాధితులను ఆదుకోవడానికి చేతనైనంత సాయం అందించండి. ఇది మానవత్వం ప్రదర్శించాల్సిన సమయం" అని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారని సీఎంవో 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేసింది.

విరాళాలు ఇవ్వాలంటే ఇలా..

http://cmrf.tsonline.gov.in అనే వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. సీఎంఆర్ఎఫ్ విభాగంలోకి వెళ్లి విరాళం చెల్లింపుల ఆప్షన్‌ను ఎంచుకోవాలి. ఇందులో ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ (ఆర్టీజీఎస్, నెఫ్ట్, ఐఎంపీఎస్), యూపీఐ, చెక్కు రూపంలో చెల్లించే వివరాలు ఉంటాయి.

ఆన్‌లైన్ చెల్లింపులకు..

ఖాతా నంబర్: 62354157651, ఖాతా పేరు: సీఎం రిలీఫ్ ఫండ్, బ్యాంక్: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్రాంచ్: సెక్రటేరియట్, హైదరాబాద్, తెలంగాణ, బ్రాంచ్ కోడ్: 020077, ఐఎఫ్ఎస్సీ కోడ్: ఎస్‌బీఐఎన్0020077లతో విరాళం చెల్లించవచ్చు. ఇవే వివరాలను నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్ కార్డులకు వినియోగించవచ్చు.

చెక్కు, డీడీ రూపంలో అయితే..

పేయి నేమ్: "సీఎం రిలీఫ్ ఫండ్, తెలంగాణ స్టేట్" అని చెక్కు, డీడీపై రాయాలి. చిరునామా: సీఎం రిలీఫ్ ఫండ్, డాక్టర్.బీ.ఆర్.అంబేడ్కర్ తెలంగాణ సెక్రటేరియట్, హైదరాబాద్, 500022కు పంపాలి.

SBI
Merchant Name: TELANGANA CMRF
UPI ID: tgcmrelieffund@sbi
BHIM UPI

యూపీఐ ద్వారా...

గూగుల్, ఫోన్‌పే, ఇతర యూపీఐ యాప్స్ ద్వారా చెల్లింపు చేయాలంటే వెబ్‌సైట్‌లోకి వెళ్లగానే.. ఎస్‌బీఐ లోగో ఉండటంతోపాటు మర్చంట్ పేరు: తెలంగాణ సీఎంఆర్ఎఫ్, యూపీఐ ఐడీ: tgcmrelieffund@sbi అని రాసి.. ఒక క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఆ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి కూడా విరాళాలను ఇవ్వవచ్చు.

నిండా ముంచిన వానలు

నీట మునిగిన పత్తి, వరి, మిర్చి పంటలు

- ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో భారీగా దెబ్బతిన్న పంటలు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్): ఈ ఏడాది వానాకాలం పంటల సాగు సానుకూలంగా ఉందని భావించిన అన్నదాతలను వర్షాలు తీరని నష్టాన్ని మిగిల్చాయి. పంటలన్నీ నీట మునగడంతో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ప్రధానంగా ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, వరంగల్ జిల్లాల్లో పంటలకు భారీగా నష్టం వాటిల్లింది. వరి, పత్తి, మిర్చి పంటలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సుమారు 70 వేల ఎకరాల్లో పంటలు నష్టపోయినట్టు ప్రాథమిక అంచనా. జిల్లాలోని రఘునాథపాలెం, తిరుమలాయపాలెం, ఖమ్మంఅర్బన్, ఖమ్మం రూరల్, చింతకాని, కూసుమంచి, మధిర, ఎర్రుపాలెం, వైరా, కొణిజర్ల, కారేపల్లి, కామేపల్లి మండలాల్లోని అధిక నష్టం జరిగింది. అయితే పంటల నష్టంపై ఉమ్మడి జిల్లాలో వ్యవసాయాధికారులు పూర్తిస్థాయి సర్వే సాగిస్తున్నారు. తెల్లబంగారం సాగుద్వారా ఈఏడాది కష్టాలు గట్టెక్కుతాయని ఆశించిన రైతులు వరద నష్టంతో కన్నీటిపర్యంతం అవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. వర్షాలకు పంటలు కూడా దెబ్బతిన్నాయి. నష్టం మహబూబాబాద్ జిల్లాలో ఎక్కువగా ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో పత్తి, కంది, మిరప, వరి పంటలు దెబ్బతిన్నాయి. నారాయణపేట జిల్లాలో కంది పంటకు బాగా నష్టం జరిగింది. వికారాబాద్ జిల్లాలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. నిజామాబాద్ జిల్లాలో సోయాబీన్ పంట నీట మునగడంతో రైతన్న ఆశలన్నీ ఆవిరయ్యాయి. వ్యవసాయంపైనే ఆధారపడ్డ తమను వర్షాలు నిండా ముంచాయని, పెట్టుబడి కూడా వచ్చేట్టు లేదని, ప్రభుత్వమే ఆదుకోవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు. మరోవైపు.. రాష్ట్రంలో వర్షాలు, వరదల కారణంగా 1,53,278 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేశామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఈ నష్టం 4 లక్షల ఎకరాల వరకు పెరిగే అవకాశం ఉదని, నష్టంపై అధికారులు అంచనా వేస్తున్నారని చెప్పారు.


ఖమ్మం జిల్లా మధిర మండలం ఇల్లెందులపాడులో వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంట

ఈ కష్టాలకు కారణం ప్రభుత్వ నిర్లక్ష్యమే

(మొదటిపేజీ తరువాయి)

శాఖ లేఖతో ఈ విషయం బట్టబయలైందన్నారు. బుధవారం సిద్దిపేట పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను, అమర్‌నాథ్ సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులకు మట్టి గణపతులను పంపిణీ చేసిన సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. ప్రభుత్వ తీరును తప్పుబడుతూ ఓ ప్రకటన విడుదల చేశారు. విపత్తుల నిర్వహణకు కేంద్రం ఎస్‌ఆర్‌డీపీ కింద విడుదల చేసిన నిధులు రూ.208 కోట్లు కూడా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాలోకి జూన్ నెలలోనే జమ అయ్యాయని, ఈ నిధులను వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కేంద్రానికి యుటిలైజేషన్ లెటర్ ఇచ్చే సోయి లేకపోవడమేంటని ప్రశ్నించారు. కాంగ్రెస్ అవగాహనా రాహిత్యం, నిర్లక్ష్యపు పోకడలతో రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి వ్యంగ్యం తప్ప.. పరిపాలన వ్యవహారం లేదని ఎద్దేవా చేశారు. ఆపదలో వరద బాధితులను ఆదుకునేందుకు వెళ్తే బీఆర్ఎస్ ఎమ్మెల్యేల కాన్వాయ్‌పై కాంగ్రెస్ దాడులకు పాల్పడిందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారని, పాలు నీళ్లు ప్రజలే తెలుస్తారని వ్యాఖ్యానించారు. సిద్దిపేటలో సగం నిర్మాణం పూర్తయిన వెటర్నరీ కళాశాలను ప్రభుత్వం కొడంగల్‌కు తరలించుకుపోయిందని విమర్శించారు. భారీ వర్షం, వరదలతో సర్వం కోల్పోయిన బాధితులను ఆదుకునేందుకు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు తమ ఒక నెల వేతనాన్ని విరాళంగా ఇవ్వాలని నిర్ణయించినట్లు హరీశ్‌రావు తెలిపారు. పార్టీ అధినేత కేసీఆర్ సూచన మేరకు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలంతా ఈ విరాళాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే పార్టీ తరఫున రాష్ట్ర వ్యాప్తంగా సహాయక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. వరద బాధితులు అత్యంత దయనీయ, విషాదకరమైన స్థితిలో ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తినడానికి తిండి కూడా లేకుండా ఎంతో మంది వరద బాధితులు చిన్న, పెద్ద, వృద్ధులు బిల్డింగ్‌ల పైకెక్కి ఎదురుచూస్తున్నారని తెలిపారు. వారి కోసం గురువారం ఉదయం సిద్దిపేట నుంచి 6 లారీల్లో ఆహార ప్యాకెట్లు, నిత్యావసర సరుకులు పంపించనున్నట్లు పేర్కొన్నారు. సిద్దిపేట మునిసిపల్ కౌన్సిలర్లు కూడా నెల వేతనాన్ని అందించేందుకు ముందుకు వచ్చారన్నారు. సిద్దిపేట అమర్‌నాథ్ సేవా సమితి, కేదార్‌నాథ్ సేవా సమితి, సిద్దిపేట ఐఎంఏ అసోసియేషన్ వైద్యులు సహకారం అందిస్తామని చెప్పినట్లు వెల్లడించారు.

'ఎస్‌డీఆర్‌ఎఫ్'కు ఎప్పటికప్పుడు నిధులు

ప్రస్తుతం రాష్ట్రం వద్ద 1345 కోట్లున్నాయి

- యూసీలిస్తే.. మా వాటా నిధులిస్తాం: కేంద్ర హోం శాఖ

హైదరాబాద్, న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర విపత్తుల నిర్వహణకు తమ వాటా కింద ఎప్పటికప్పుడు నిధులు విడుదల చేసినట్లు కేంద్రం తెలిపింది. 'రాష్ట్ర విపత్తుల నిర్వహణ నిధి (ఎస్‌డీఆర్ఎఫ్)' కింద ఇప్పటికే రాష్ట్రం వద్ద రూ.1,345 కోట్లు అందుబాటులో ఉన్నాయని స్పష్టం చేసింది. రాష్ట్ర ప్రభుత్వం 'యుటిలైజేషన్ సర్టిఫికెట్ (యూసీ)'ను సమర్పించకపోవడం వల్ల జూన్‌లో ఇవ్వాల్సిన రూ.208.40 కోట్లను విడుదల చేయలేదని కేంద్ర హోం శాఖ వివరించింది. తెలంగాణకు ఎస్‌డీఆర్ఎఫ్ వాటా నిధుల విడుదల, వినియోగం అంశాలను కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కేంద్ర హోం మంత్రి అమిత్ షా దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన అమిత్ షా.. తగిన చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆ మేరకు జాతీయ విపత్తుల విభాగం డైరెక్టర్ ఆశిష్ వి.గవాయ్.. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. ఎస్‌డీఆర్ఎఫ్ నిధుల విడుదలపై పూర్తి స్థాయి వివరణ ఇచ్చారు. ఆగస్టు 31 నుంచి రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద పోటెత్తుతుందంటూ తెలంగాణ 'స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ (ఎస్ఈవోసీ)' ఫోన్ ద్వారా తెలియజేసిందని కేంద్ర హోంశాఖ తెలిపింది. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి-కొత్తగూడెం, మహబూబ్‌నగర్, సూర్యాపేట, వరంగల్, మహబూబాబాద్ జిల్లాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయని తెలిపింది. కానీ, ఈ వరద పరిస్థితికి సంబంధించి రాష్ట్రం నుంచి నిర్దేశిత పద్ధతిలో ఎలాంటి నివేదికా కేంద్ర హోంశాఖలోని కంట్రోల్ రూమ్‌కు రాలేదని స్పష్టం చేసింది. అయినా, వరద పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి సహకరించడానికి ఏడు ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను, బోట్లు, ప్రాణ రక్షక పరికరాలను కూడా పంపించామని వివరించింది. రెండు వైమానిక హెలికాప్టర్లను కూడా పంపినట్లు తెలిపింది. "రాష్ట్ర అకౌంటెంట్ జనరల్ నివేదిక ప్రకారం 2024 ఏప్రిల్ 1 నాటికి రాష్ట్రం వద్ద రూ.1,345 కోట్ల ఎస్‌డీఆర్ఎఫ్ నిధులు అందుబాటులో ఉన్నాయి. 2024-25లో సంభవించే వరదలు, ఇతర నోటిఫైడ్ ప్రకృతి విపత్తుల నిర్వహణ కోసం వీటిని వినియోగించుకోవచ్చు. ఎస్‌డీఆర్ఎఫ్‌కు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కేంద్ర వాటా నిధులను విడుదల చేయడానికి అవసరమైన వివరాలు, సమాచారాన్ని రాష్ట్ర ప్రభుత్వం పంపించలేదు. రాష్ట్ర వాటా నిధులతో పాటు కేంద్రం పంపించిన నిధులను ఎస్‌డీఆర్ఎఫ్ ఖాతాలో జమ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏప్రిల్, అక్టోబరు నెలల్లో కేంద్ర హోం, ఆర్థిక శాఖలకు సర్టిఫికెట్లను సమర్పించాల్సి ఉంటుంది. ఈ ఖాతా నుంచి వినియోగించిన నిధులు, అందుబాటులో ఉన్న నిధుల వివరాలను తెలపాల్సి ఉంటుంది. 2022-23కు సంబంధించి కేంద్రం తన రెండో వాయిదా వాటా కింద రూ.188.80 కోట్లను 2023 జూలై 10న ఎస్‌డీఆర్ఎఫ్ కోసం విడుదల చేసింది. 2023-24కు సంబంధించి ఒక్కో వాయిదా కింద రూ.198 కోట్ల చొప్పున రెండు వాయిదాల నిధులను 2024 మార్చిలో విడుదల చేసింది. 2024 మొదటి వాయిదా నిధులు రూ.208.40 కోట్లను ఎస్‌డీఆర్ఎఫ్‌కు జూన్ 1న విడుదల చేయాల్సి ఉంది. కానీ, దీనికి సంబంధించి రాష్ట్రం నుంచి ఎలాంటి అభ్యర్థన రాలేదు. గతంలో విడుదల చేసిన నిధుల యూసీలనూ సమర్పించలేదు" అని కేంద్ర హోంశాఖ వివరించింది. ఇప్పటికైనా పాత నిధుల యూసీలను సమర్పించాలని రాష్ట్రానికి సూచించింది.

హైడ్రాపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేయలేదు

» కేవీపీ రామచంద్రరావు స్పష్టీకరణ

హైదరాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ పరిసరాల్లో హైడ్రా కూల్చివేతలకు సంబంధించి అధిష్ఠానానికి తాను ఎలాంటి ఫిర్యాదు చేయలేదని కాంగ్రెస్ సీనియర్ నేత కేవీపీ రామచంద్రరావు స్పష్టం చేశారు. హైడ్రాపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేసిన వారి జాబితాలో కేవీపీ పేరు కూడా ఉన్నట్లు వినిపిస్తోందని ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైంది. దీనిపై కేవీపీ బుధవారం వివరణ ఇచ్చారు. తాను అధిష్ఠానం వద్దకు వెళ్లలేదని, పెద్దలెవర్నీ కలవలేదనీ, హైడ్రాపై ఎవరికీ ఎలాంటి ఫిర్యాదు ఇవ్వలేదని చెప్పారు.

ఉపాధ్యాయులది గొప్ప బాధ్యత: సీఎం రేవంత్

» నేడు రాష్ట్రపతి అవార్డు స్వీకరించనున్న ఐదుగురు తెలుగు టీచర్లు

హైదరాబాద్/న్యూఢిల్లీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ, సమాజాన్ని ఉన్నతంగా మార్చే ఉపాధ్యాయుల బాధ్యత గొప్పదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గురువులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో అధ్యాపకులది కీలక పాత్రని, అలాంటి గురువులను ప్రజా ప్రభుత్వం సమున్నతంగా గౌరవిస్తుందని పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్ఫూర్తితో ఉపాధ్యాయులు మరింత అంకితభావంతో పనిచేయాలని కోరారు. కాగా, ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో సుమారు 47 మంది టీచర్లకు సీఎం అవార్డులను ప్రదానం చేయనున్నారు. అదేవిధంగా తెలుగు రాష్ట్రాల నుంచి ఐదుగురు ఉపాధ్యాయులు నేడు రాష్ట్రపతి నుంచి అవార్డును స్వీకరించనున్నారు. వీరిలో ఏపీ నుంచి మిద్దె శ్రీనివాసరావు, సురేష్ కొనాకి, తెలంగాణ నుంచి కీసర ప్రభాకర్‌రెడ్డి, తాడూరి సంపత్‌కుమార్ ఉపాధ్యాయులు కాగా, మరో తెలుగు అధ్యాపకురాలు నందవరం మృదుల అవార్డు అందుకోనున్నారు.

జైళ్లలో మా హక్కులను హరించొద్దు

» చంచల్‌గూడ జైల్లో మావోయిస్టు ఖైదీల నిరాహారదీక్ష..!

సైదాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): జైళ్లలో తమ హక్కులను హరించొద్దని మావోయిస్టు ఖైదీలు డిమాండ్ చేశారు. తమ హక్కులను, ప్రాథమిక స్వేచ్ఛను కాపాడాలంటూ చంచల్‌గూడ జైలులో మావోయిస్టు ఖైదీలు అమితాబ్ బాగ్చీ, గంగాధర్, రాజ్‌కుమార్ ఒక రోజు నిరాహారదీక్ష చేపట్టి తమ డిమాండ్లను అమలు చేయాలని జైలు అధికారులను కోరారు. మావోయిస్టు ఖైదీలను ఒంటరిగా లాకప్‌లో పెట్టి వేధించడం న్యాయస్థానాల ఉల్లంఘనే అవుతుందని, తక్షణమే వారికి ప్రత్యేక కిచెన్, బ్యారక్‌ను ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు లాకప్ తెరిచి, లైబ్రరీలో పుస్తకాలు, దినపత్రికలు, పెన్నులు, పేపర్లు అందుబాటులో ఉంచాలని, ఉదయం వాకింగ్ చేసేందుకు అవకాశం కల్పించాలని కోరారు. నాణ్యమైన ఆహారం, వైద్యం అందించాలని, ములాఖత్‌లకు ప్రత్యేక గది ఏర్పాటు చేయాలని విన్నవించారు. మావోయిస్టు హక్కులను కాలరాస్తున్న జైలు అధికారులపై ప్రభుత్వాలు, న్యాయస్థానాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ ఉద్యోగుల పదోన్నతులపై న్యాయ విచారణ

» జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, జేఏసీ చైర్మన్ కుమారస్వామి డిమాండ్

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంస్థల్లో ఉద్యోగుల పదోన్నతులపై న్యాయవిచారణ చేపట్టాలని, జనాభా ప్రాతిపదికన పదోన్నతులు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య, తెలంగాణ ఎలక్ట్రిసిటీ బీసీ, ఓసీ ఎంప్లాయిస్ ఐక్యకార్యాచరణ సమితి చైర్మన్ కోడెపాక కుమారస్వామి డిమాండ్ చేశారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ బీసీ, ఓసీ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం సోమాజిగూడ విద్యుత్‌సౌధలో మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ సంస్థల్లో బీసీ, ఓసీ ఉద్యోగులకు నష్టం కలిగించేలా సుప్రీంకోర్టు, హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘిస్తూ గత కొన్నేళ్లుగా షరతులతో పదోన్నతులు కల్పిస్తున్నారన్నారు. విద్యుత్ సంస్థల్లో 2014 జూన్ 2 నుంచి కల్పించిన అన్ని పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన బీసీ, ఓసీ ఉద్యోగులకు వెంటనే పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

జగన్ చేష్టలతోనే ఇంతటి విపత్తు

» నాడే గండ్లు పూడిస్తే సమస్య వచ్చేది కాదు: చంద్రబాబు



అమరావతి, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు సీఎంగా ఉన్న జగన్ చేష్టల వల్లే విజయవాడ నగరం ఇప్పుడు ఇంత విపత్తు ఎదుర్కొంటోందని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. బుడమేరుకు పడిన గండ్లను చూసి వదిలేయకుండా గత వైసీపీ ప్రభుత్వం పూడ్చి ఉండి ఉంటే విజయవాడలో ఇప్పుడు ఇంత ముంపు ఉండేది కాదని, అప్పుడు పడుకొని నిద్రపోయి ఇప్పుడు లేచి వచ్చి రాళ్లు విసురుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సొంత పత్రికలో బుద్ధిలేని రాతలు రాస్తున్నారని మండిపడ్డారు. బుధవారం విజయవాడ కలెక్టరేట్ ప్రాంగణంలో చంద్రబాబు విలేకరులతో మాట్లాడారు. "మేం వచ్చి కేవలం ఎనభై రోజులైంది. బుడమేరుకు ఎప్పుడో గండ్లు పడి ఉన్నాయి. వాటిని పట్టించుకోలేదు. అడ్డగోలుగా వాటి కట్టలను ఆక్రమించేశారు. ప్లాట్లు చేసి అమ్ముకొన్నారు. బుడమేరు వరద కొంత పోలవరం కుడి కాల్వ ద్వారా కృష్ణా నదిలోకి వెళ్లాలి. కాల్వ గట్ల మట్టిని కూడా ఈ పెద్ద మనుషులు తవ్వుకొని అమ్ముకొన్నారు. ఈ పని చేసిన దుర్మార్గులను వదిలిపెట్టం" అని చంద్రబాబు మండిపడ్డారు. అమరావతి మునిగిపోయిందని ప్రచారం చేశారని, అమరావతిలోకి చుక్క నీరు రాలేదని, వస్తే ఫొటోలు చూపించాలన్నారు. విజయవాడలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో రెండు రోజుల్లో సాధారణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉందన్నారు.

బుడమేరు ఆక్రమణలే బెజవాడకు శాపం



అమరావతి, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): బుడమేరు కారణంగానే విజయవాడలోని ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరోపించారు. పేర్కొన్నారు. బుడమేరు 90శాతం ఆక్రమణలకు గురైందని, అదే విజయవాడకు శాపంగా మారిందని చెప్పారు. గత ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే ఈ పరిస్థితి వచ్చిందని, వైసీపీ ప్రభుత్వం మునిగిపోయే ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చిందని, అక్కడ ఇళ్లు నిర్మించుకున్న వారు ముంపునకు గురయ్యారని తెలిపారు. ఏపీలో రానున్న 20 ఏళ్లలో ఎలాంటి ఆక్రమణలు లేకుండా చేస్తామని పవన్ స్పష్టం చేశారు. బుధవారం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. వైసీపీ నేతలు ఉన్మాద విమర్శలు చేయడం కాకుండా బాధితులకు సాయం చేసేందుకు ముందుకు రావాలని చెప్పారు. సీఎం చంద్రబాబు పరిపాలన అనుభవం ఇప్పుడు బాగా పనిచేస్తోందని, 74 ఏళ్ల వయసులోనూ ఆయన బుల్డోజర్లు ఎక్కి మరీ సహాయక చర్యల్లో పాల్గొంటున్నారని కొనియాడారు. తెలంగాణలో హైడ్రాను తాను సమర్థిస్తున్నట్లు తెలిపారు. కాగా, ఏపీ వ్యాప్తంగా దెబ్బతిన్న గ్రామ పంచాయతీలకు వ్యక్తిగతంగా విరాళం ఇవ్వాలని నిర్ణయించామని పవన్ ప్రకటించారు.

మండపాల కరెంట్‌కు 16.92 కోట్లు ఇవ్వండి

» ప్రభుత్వానికి డిస్కమ్‌ల ప్రతిపాదనలు

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అనుమతులు తీసుకున్న మండపాలకు ఉచితంగా కరెంట్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడంతో.. దీని కోసం రూ.16.92 కోట్లు అవసరమవుతాయని డిస్కమ్‌లు అంచనా వేశాయి. ఈనెల 7 నుంచి వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈ తరుణంలో మండపాల ఏర్పాటుకు అనుమతులు తీసుకున్న వారికి ఈనెల 7 నుంచి 17 వరకు ఉచిత కరెంట్ ప్రయోజనాన్ని వర్తింపచేయనున్నారు. అయితే మట్టి విగ్రహాలు పెట్టేవారికి ఇస్తారా? ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో విగ్రహాల మండపాలకు కూడా ఉచితంగా కరెంట్ ఇస్తారా? అనేది త్వరలో తేలనుంది. దాంతో మండపాలకు ఉచితంగా కరెంట్ ఇవ్వడానికి రూ.16,92,18,636లను విడుదల చేయాలని డిస్కమ్‌లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టాయి.

కబ్జాలు.. కలుషితం!

ఆక్రమణలు.. వ్యర్థాల బారిన చెరువులు.. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో భారీగా నిర్మాణాలు

» నగర చెరువులపై హైకోర్టుకు కమిటీ నివేదిక

» 13 చెరువులను పరిశీలించిన కమిటీ

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వానను, వరదను తమలో ఇముడ్చుకొని.. భూగర్భ జలాలను పెంచే చెరువులను కొందరు అక్రమార్కులు చెరబడుతున్నారు. ప్రజలకు సాగు, తాగునీటికి దోహదపడే జలాశయాలను కాలుష్యానికి కేరాఫ్‌గా మారుస్తున్నారు. మురుగునీటి వ్యర్థాలు, రసాయనాలతో విషతుల్యం చేస్తున్నారు. జలాశయాలను పరిరక్షించేందుకు అధికారులు కనీస చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులు చెలరేగిపోతున్నారు. దీంతో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిధిలో చెరువుల పరిస్థితి దయనీయంగా మారిందని.. హైకోర్టు నియమించిన కమిటీ వెల్లడించింది. చెరువులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి హైకోర్టుకు ఈ మేరకు నివేదికను సమర్పించింది. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో 16 చెరువులు ఆక్రమణకు గురవుతున్నా జీహెచ్‌ఎంసీ కమిషనర్, అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ 2007లో హైకోర్టులో మాదాపూర్‌కు చెందిన 'గమన' స్వచ్ఛంద సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనిల్ సిదయాకర్.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన హైకోర్టు.. ఆయా జిల్లాల అధికారులు సంయుక్త నివేదిక అందించాలని 2013 జూన్ 10న ఒకసారి, 2023 డిసెంబరు 12న మరోసారి, 2023 డిసెంబరు 27న, ఈ ఏడాది జనవరి 22న, ఫిబ్రవరి 2న పలుమార్లు ఆదేశాలు జారీ చేసింది. ఆయా జిల్లాల్లోని చెరువులను పరిశీలించి వాస్తవాలతో నివేదికను సమర్పించాలంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 6న ఓ కమిటీని నియమించింది. న్యాయవాదులు గాది ప్రవీణ్‌కుమార్, టి.శ్రీకాంత్‌రెడ్డి సభ్యులుగా నియమితులైన ఈ కమిటీ.. జీహెచ్‌ఎంసీ అధికారులు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు చెరువుల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలేమిటన్నది పరిశీలించింది. ఈ రెండు జిల్లాల్లోని 13 చెరువులను పరిశీలించి తమ నివేదికను ఈ ఏడాది మార్చి 5న హైకోర్టుకు సమర్పించింది. హైకోర్టు నియమించిన కమిటీ ఈ ఏడాది ఫిబ్రవరి 12న జీహెచ్‌ఎంసీ, రెవెన్యూ అధికారులతో సమావేశమై ప్రాథమిక సమాచారం తెలుసుకుంది. ఫిబ్రవరి 15 నుంచి 17 వరకు 13 చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. రక్షణ చర్యలు చేపట్టకపోవడం వల్లే చెరువులు ఆక్రమణకు గురయ్యాయని హైకోర్టుకు సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఈ చెరువుల కాలుష్యం కేవలం పర్యావరణానికి మాత్రమే కాకుండా.. ప్రజా ఆరోగ్యానికి కూడా తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశాలున్నాయని తెలిపింది. ఆక్రమణలు, కాలుష్యం కారణంగా చెరువులపై ఆధారపడిన పక్షులు, జంతుజాలం, జలచరాలు అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది.



మేడికుంట చెరువు-నానక్‌రామ్‌గూడ

ఈ చెరువు వద్ద చేపట్టిన వాకింగ్ ట్రాక్ పనులు పూర్తి కాలేదు. సీసీ టీవీలు లేకపోవడంతో ఆక్రమణలు చోటు చేసుకుంటున్నాయి. ఫెన్సింగ్ పూర్తి కాలేదు. చెరువు చుట్టూ రక్షణ వలయం ఉంటే ఆక్రమణలను నివారించవచ్చు.

చెరువుల వారీగా నివేదికలోని కీలకాంశాలు

హస్మత్‌పేట్ బోయిని చెరువు..

హస్మత్‌పేట్ బోయిని చెరువు అత్యంత కలుషితంగా ఉంది. ఇక్కడ ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ల పరిధిలో పలు నిర్మాణాలు కనిపించాయి. మురుగునీటి మళ్లింపు ఏర్పాట్లు ఉన్నప్పటికీ చర్యలు తీసుకోకపోవడంతో వ్యర్థాలతో నిండిపోయింది. ఇక్కడ కొద్దిసేపు కూడా నిలబడటం కష్టంగా ఉంది. చెరువు వద్ద ఫెన్సింగ్ రెండు వైపుల మాత్రమే వేశారు. లేక్ గార్డులు ఇద్దరు మాత్రమే ఉన్నారు. చెరువులో వ్యర్థాలను అధికంగా పారబోస్తున్నారు. మురుగునీరు చెరువులో చేరుతుండడం వల్ల దుర్గంధం వెదజల్లుతోంది.

గంగారం పెద్ద చెరువు-చందానగర్


ఇక్కడ ఫెన్సింగ్ ఏర్పాట్లు ఏమీ లేవు. రింగ్ బండ్/వాకింగ్ ట్రాక్ కూడా అందుబాటులో లేదు. సీసీ టీవీలు, లేక్ గార్డ్ లేరు. మురుగునీటి మళ్లింపు ఏర్పాట్లు కూడా లేవు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో ఆక్రమణలు జరిగాయి. ఈ చెరువు మురుగు నీటి వ్యర్థాలతో పూర్తిగా కలుషితమయింది. వరదల సమయంలో మురుగునీటిని మొత్తం కాలనీల్లోకి వదిలేస్తున్నారు. పక్కనే ఉన్న నాలాల ద్వారా శుద్ధి చేయని జలాలను చెరువులోకి మళ్లించడంతో నీరు కలుషితమవుతోంది.

చిన్న దామెర చెరువు-దుండిగల్

ఈ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ ప్రాంతాల్లో గణనీయంగా ఆక్రమణలు జరిగాయి. పలు కాలేజీలూ, ఇన్‌స్టిట్యూట్‌లు కూడా చెరువు చుట్టూ ఉన్నాయి. వీరు వ్యర్థాలను చెరువులో వేసి దానిని పూడ్చివేసే పనులు కూడా చేస్తున్నారు. దీని కారణంగా చెరువులోని నీరు రైతుల పొలాల్లోకి వెళ్తోంది. రెసిడెన్షియల్ కాలేజీల నుంచి వచ్చే మురుగునీరు నేరుగా చెరువులోకి వెళ్లే ఏర్పాట్లు చేయడం ద్వారా చెరువులోని చేపలు చనిపోతున్నాయి. మురుగునీటి మళ్లింపు ఏర్పాట్లు లేవు.

మద్దెలకుంట చెరువు- బైరామల్‌గూడ

ఈ చెరువులో అధిక భాగం ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఆక్రమణకు గురైంది. మెయిన్ బండ్ వైపు మాత్రమే ఫెన్సింగ్ పనులు జరిగితే, మిగిలిన మూడు వైపులా, పక్క ఆస్తుల యజమానులు గోడలు కట్టుకున్నారు. రింగ్ బండ్, వాకింగ్ ట్రాక్ లేదు. సీసీ టీవీలు కూడా లేవు. ఇక్కడ ఒకే ఒక్క లేక్ గార్డ్ మాత్రమే కనిపించాడు. మురుగునీటి మళ్లింపు పనులు పూర్తయినా.. అది పనిచేస్తున్నట్లుగా మాత్రం కనిపించలేదు. ఈ చెరువు, చెత్తా చెదారంతో నిండి పోయింది. చెరువు దుర్గంధం వ్యాపింపజేస్తోంది.



మాదాపూర్ దుర్గం చెరువు..

దుర్గం చెరువులో మురుగునీటి శుద్ధికి కేవలం 12 ఎంఎల్‌డీ సామర్థ్యంలో మాత్రమే ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. వాస్తవానికి అంతకంటే ఎక్కువగానే వ్యర్థ జలాలు ఈ చెరువులో చేరుతున్నాయి. దీంతో చెరువు కలుషితమయింది. ఈ చెరువులో 146 నిర్మాణాలు బఫర్‌జోన్‌లో ఉంటే, 78 నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నాయి. చెరువు పునరుద్ధరణతోపాటు ఇన్‌లెట్, ఔట్‌లెట్‌లు సరిగా ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలి.

నల్లగండ్ల చెరువు- నల్లగండ్ల

ఈ చెరువు వద్ద ఫెన్సింగ్ పనులు చేపట్టడంతో రక్షణ కనిపిస్తోంది. మురుగునీటి పారుదల పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. వాకింగ్ ట్రాక్ పనులు మాత్రం అసంపూర్తిగా ఉన్నాయి. సీసీ కెమెరాలు అందుబాటులో లేవు. చెరువును పరిరక్షించేందుకు చర్యలు తీసుకోవాలి.

పెద్ద చెరువు- ఫీర్జాదిగూడ

పెద్ద చెరువుకు న్యాయ పరమైన చిక్కుల కారణంగా ఫెన్సింగ్ పనులు కొంతమేరకే పూర్తయ్యాయి. రింగ్‌బండ్/వాకింగ్ ట్రాక్ పనులూ అసంపూర్తిగా ఉన్నాయి. ఇక్కడ సీసీ కెమెరాలు లేవు. లేక్ గార్డులు కూడా అందుబాటులో లేరు. కోర్టులో కేసు నడుస్తున్న కారణంగా మురుగునీటి మళ్లింపు పనులు జరగడం లేదు.

అంబీర్ చెరువు-కూకట్‌పల్లి

ఇక్కడ మెయిన్ రోడ్ వైపు కూడా ఫెన్సింగ్ వర్క్ పూర్తి కాలేదు. రింగ్ బండ్ పూర్తయింది. కానీ, వాకింగ్ ట్రాక్ వేయలేదు. సీసీ టీవీ కెమెరాలు, లేక్ గార్డుల ఏర్పాట్లు కనిపించలేదు. మురుగునీటి మళ్లింపు పనులు పూర్తి కాలేదు. సరైన పెట్రోలింగ్, నిఘా లేకపోవడంతో ఈ చెరువు మరింతగా ఆక్రమణకు గురయ్యే అవకాశాలు అధికంగా ఉన్నాయి.

చిన్నరాయుని చెరువు- అల్వాల్

ఈ చెరువులో వ్యర్థాలు అధికంగా పారబోస్తున్నారు. మురుగునీటి మళ్లింపు పనులు పూర్తయ్యాయి. అయితే దానిని ఇప్పటివరకు సరిగా నిర్వహించడం లేదు.



ఉప్పల్ నల్లచెరువు..

ఉప్పల్ నల్లచెరువును కొందరు నాశనం చేస్తున్నారు. ఈ చెరువులో ఫెన్సింగ్ కేవలం మెయిన్ బండ్ వైపు మాత్రమే ఉంది. మిగిలిన మూడు వైపులా పక్క ఆస్తుల యజమానులు గోడలు నిర్మించుకున్నారు. మురుగునీటి మళ్లింపు ఏర్పాట్లు చేస్తున్నట్లుగా ఏమాత్రం కనిపించలేదు. ఈ చెరువు మొత్తం చెత్తాచెదారం, మురుగునీటితో నిండిపోయి దుర్గంధం వ్యాపింపజేస్తోంది. చెరువు మొత్తం తూడుతో నిండిపోయింది. కొంతమంది రైతులు, స్థానిక సాగుదారులు కాలుష్య జలాలతోనే కూరగాయల సాగు చేస్తున్నారు. ఈ అంశం ఆరోగ్యపరంగా తీవ్ర ప్రమాదాన్ని కలిగించే విధంగా ఉంది. చెరువును కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవడంతోపాటు సంభావ్య ఆరోగ్య ప్రమాదాల నివారణ కోసం కూడా తగిన చర్యలు చేపట్టాలి.



సున్నం చెరువు-అల్లాపూర్

ఈ చెరువుకు ఫెన్సింగ్ అసంపూర్ణంగా వేశారు. అలాగే రింగ్ బండ్/ వాకింగ్ ట్రాక్ పనులు కూడా అంతంతమాత్రంగా చేశారు. ఈ చెరువును అక్రమార్కుల చెర నుంచి పరిరక్షించేందుకు లేక్ గార్డులు, సీసీ టీవీ కెమెరాలను కూడా ఏర్పాటు చేయలేదు. మురుగు నీరు బయటకు వెళ్లేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సి ఉంది.



దమ్మాయిగూడ మున్సిపల్‌లోని దమ్మాయి చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైడ్రా పేరుతో బ్లాక్‌మెయిల్‌కు పాల్పడితే జైలుకే:రంగనాథ్

హైదరాబాద్ సిటీ, జవహర్‌నగర్, మౌలాలి, కీసర రూరల్, సెప్టెంబరు, 4 (ఆంధ్రజ్యోతి) : హైడ్రాకు ఫిర్యాదు చేస్తామంటూ బెదిరించినా.. అక్రమ వసూళ్లకు పాల్పడినా జైలు జీవితం తప్పదని హైడ్రా కమిషనర్ రంగనాథ్ హెచ్చరించారు. గత కొద్ది రోజులుగా ట్రై కమిషనరేట్ పరిధిలో హైడ్రా విభాగం విస్తృతంగా అక్రమ నిర్మాణాల తొలగింపులు చేపడుతున్న నేపథ్యంలో కొంతమంది సామాజిక కార్యకర్తల ముసుగులో బఫర్ జోన్, ఎఫ్.టి.ఎల్ పరిధిలో లేదా వాటి పరిసరాల్లో నిర్మాణం చేపడుతున్న బిల్డర్లను, ఇళ్ల నిర్మాణదారులను బెదిరిస్తున్నారు. ఇది అక్రమ నిర్మాణమని, బఫర్ జోన్, ఎఫ్.టి.ఎల్ పరిధిలో నిర్మిస్తున్నారని.. హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని, కూల్చేవేసేంత వరకు వదిలిపెట్టమని బ్లాక్‌మెయిల్ చేస్తున్నారు. ఎవరైనా రెవెన్యూ ఉద్యోగులమనిగానీ, మున్సిపల్, నీటి పారుదల విభాగాలతో పాటు హైడ్రా విభాగానికి చెందిన అధికారులం అంటూ బెదిరింపులకు పాల్పడితే మొదట స్థానిక పోలీస్‌స్టేషన్‌లోగానీ, పోలీస్ కమిషనర్ లేదా ఎస్పీకి ఫిర్యాదు చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ సూచించారు. కాగా మేడ్చల్ జిల్లా జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ పాటు మున్సిపల్, రెవెన్యూ అధికారులు బుధవారం పలు ప్రాంతాలను పరిశీలించారు. అంబేడ్కర్‌నగర్ చెరువు(ఇందిరమ్మ చెరువు) ఎఫ్‌టీఎల్ ప్రాంతాల్లో పలు అక్రమ నిర్మాణాలు గుర్తించారు. జవహర్‌నగర్ మాజీ మేయర్ కావ్య ఫామ్‌హౌజ్‌పై ఫిర్యాదు రావడంతో వచ్చిన హైడ్రా అధికారులతో మాజీ మేయర్ మాట్లాడారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని అక్రమనిర్మాణాలు, కమర్షియల్ స్థలాలపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. మల్కాజిగిరి సర్కిల్ గౌతంనగర్ డివిజన్ మిర్జాలగూడలోని చిన్మయమార్గ్‌లో రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను కమిషనర్ బుధవారం పరిశీలించారు. అలాగే మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని దమ్మాయి చెరువును రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులతో కలిసి హైడ్రా కమిషనర్ బుధవారం పరిశీలించారు. ఇక్కడ ప్లాట్లు విక్రయించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

హైడ్రా పేరుతో బెదిరిస్తే.. 1064కు సమాచారం ఇవ్వండి: ఏసీబీ

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): చెరువులను, నాలాలను ఆక్రమించి ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన అక్రమ కట్టడాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతోంది. ఇదే అదునుగా కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులు గతంలో వచ్చిన ఫిర్యాదులు, నోటీస్‌ల్ని చూపించి హైడ్రాకు ఫిర్యాదు చేస్తామని బిల్డర్లను బెదిరించి వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు ఎవరైనా హైడ్రా పేరు చెప్పి డబ్బులు డిమాండ్ చేస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. టోల్ ఫ్రీ నెంబరు 1064కు సమాచారం ఇవ్వాలని ఏసీబీ చీఫ్ సీవీ ఆనంద్ తెలిపారు.

హైడ్రాకు హై పవర్

(మొదటిపేజీ తరువాయి)

ఇస్తున్నాయని సీఎస్ తెలిపారు. ఇక నుంచి ఓఆర్ఆర్ పరిధిలో ఉన్న ఆస్తుల సంరక్షణ, అక్రమ నిర్మాణాల కూల్చివేతల తొలగింపునకు హైడ్రా ద్వారానే నోటీసులు ఇవ్వనున్నామని చెప్పారు. ఇందుకు సంబంధించి విధివిధానాల రూపకల్పన బాధ్యతలను పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శికి అప్పగించారు. ఇందుకు అనుగుణంగా.. పురపాలక శాఖ తాజాగా రెవెన్యూ సహా కీలక విభాగాలకు నోట్ పంపింది. ఈ నిర్ణయం అమల్లోకి వస్తే.. హెచ్‌ఎండీఏ పరిధిలో ఉన్న 3532 చెరువుల ఆక్రమణలపై, వాటి సంరక్షణపై పూర్తి అధికారాలు హైడ్రా పరిధిలోకే రానున్నాయి.

ఏయే అధికారాలను బదలాయిస్తారంటే..

తెలంగాణ భూ ఆక్రమణ చట్టం, తెలంగాణ వాల్టా చట్టం, నీటిపారుదల శాఖ చట్టాలు, జీహెచ్‌ఎంసీ చట్టాల ద్వారా అమలు చేసే అధికారాలను, పంచాయతీరాజ్ పరిధిలో అమలు చేస్తున్న అధికారాలను హైడ్రా పరిధిలోకి తీసుకు రానున్నారు. భూ ఆక్రమణలకు సంబంధించి ఇప్పటివరకు నోటీసులు కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దారు ఆధ్వర్యంలో ఇస్తున్నారు. నోటీసులు ఇవ్వడం, ఇచ్చిన నోటీసులను తొలగించే అధికారం కేవలం రెవెన్యూ అధికారులకే ఉంది. మునిసిపాలిటీ పరిధిలోనైతే ఆయా సంస్థలకు ఉంటుంది. వాటన్నింటినీ ఇప్పుడు హైడ్రాకు బదలాయించాలంటే జీవో ద్వారా చేయాలా? లేక చట్టంలో మార్పులు తేవాలా? అనే అంశంపై రెవెన్యూ అధికారులు న్యాయసలహా కోరారు. అయితే ఓఆర్ఆర్ పరిధిలోనైతే కొన్ని అంశాల్లో చట్టంలో మార్పులు చేయాల్సి ఉంటుందని, మరికొన్ని అంశాలపై జీవో ద్వారా అధికారాలను బదలాయించవచ్చనే చర్చ జరుగుతోంది. జీహెచ్‌ఎంసీ పరిధిలో చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణలు, కూల్చివేతలకు సంబంధించి ఉన్న అధికారాలను జీవో ద్వారా బదలాయించే అవకాశం ఉందని, దాని పరిధిలో లేని చోట్ల చట్టపరంగా మార్పులు చేయాల్సిన అవసరం ఉందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్ విషయంలో ఇప్పటివరకు రెవెన్యూ శాఖ ద్వారా నోటీసులు ఇచ్చి చర్యలు తీసుకుంటోంది. ఎక్కడైనా, వాల్టా చట్టం ఉల్లంఘనలు జరిగినా, ప్రభుత్వ భూమిని ఆక్రమించుకున్నా.. సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకునే హక్కు ప్రస్తుతం రెవెన్యూ అధికారులకే ఉంది. భూ ఆక్రమణలకు సబంధించి కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్, తహసీల్దార్ పరిధిలో భూ ఆక్రమణ చట్టం-1905 ద్వారా చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఈ చట్టంలోని సెక్షన్ 5, సెక్షన్ 6 ద్వారా భూ ఆక్రమణకు పాల్పడిన వ్యక్తికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తారు. రెవెన్యూ రికవరీ యాక్ట్-1864 సెక్షన్ 25 ద్వారా రికవరీ నోటీసులు జారీ చేసే అధికారాన్ని కలిగి ఉన్నారు. అలాగే చెరువులు, కాలువల భూభాగంలో నిర్మించిన ఇళ్లపై చర్యలు తీసుకునేందుకు 2002 వాల్టా చట్టంలోని సెక్షన్ 23 ప్రకారం రెవెన్యూ అధికారులు నోటీసులు ఇస్తారు. ఈ తరహా అధికారాలన్నింటినీ ఇకపై హైడ్రాకు కట్టబెట్టనున్నారు.

3532 చెరువులూ హైడ్రా పరిధిలోకే..

హెచ్‌ఎండీఏ పరిధిలో మొత్తం 3532 చెరువులు ఉన్నాయి. వాటిలో అనేక చెరువులు కబ్జాలకు గురయ్యాయి. ఈ చెరువుల్లో ఆక్రమణలన్నింటినీ తొలగించేందుకు అవసరమైన అధికారాలను హైడ్రాకు దఖలు పరచడమే ప్రభుత్వ లక్ష్యంగా తెలుస్తోంది. మరోవైపు వీటిలో 230 చెరువులకు సంబంధించి మాత్రమే హెచ్‌ఎండీఏ తుది నోటిఫికేషన్ ఇచ్చింది. మిగిలిన 2525 చెరువులకు సంబంధించి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ కాగా.. తుది నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది. తుది నోటిఫికేషన్ ఇచ్చిన చెరువుల్లోని ఆక్రమణలను తొలగించడం, ప్రాథమిక నోటిఫికేషన్ వచ్చిన వాటిలో ఆక్రమణలపై కూడా దృష్టి పెట్టే దిశగా హైడ్రాను బలోపేతం చేయనున్నారని సమాచారం.

జోరు తగ్గిన వరద

శ్రీశైలం, సాగర్, పులిచింతల గేట్లన్నీ మూసివేత.. గోదావరి ప్రాజెక్టులకు నిలకడగా వరద

హైదరాబాద్, సెప్టెంబరు 4(ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్‌లో ప్రాజెక్టులకు వరద తగ్గుముఖం పట్టింది. దీంతో శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల గేట్లన్నీ మూసివేశారు. మరో పక్క గోదావరి ప్రాజెక్టుల్లోకి వరద ప్రవాహం నిలకడగా ఉంది. శ్రీశైలం జలాశయం గరిష్ఠ సామర్థ్యం 215.81 టీఎంసీలకు గాను.. 210.99 టీఎంసీల మేర నిల్వ ఉంది. నాగార్జున సాగర్‌లోకి 1,11,265 క్యూసెక్కులు వస్తుండగా.. ప్రాజెక్టు గేట్లు పూర్తిగా మూసివేసి నీటి విడుదల ఆపేశారు. విద్యుదుత్పత్తి ద్వారా 60 వేల క్యూసెక్కులు వదులుతున్నారు. ఎగువ నుంచి ప్రవాహం గణనీయంగా తగ్గిపోవడంతో పులిచింతల ప్రాజెక్టు గేట్లను కూడా మూసివేశారు. మరోవైపు, సింగూరు ప్రాజెక్టుకు 44 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. ఈ ప్రాజెక్టు సామర్థ్యం 29.91 టీఎంసీలు కాగా.. 25.89 టీఎంసీల నిల్వ ఉంది. నిజాంసాగర్ ప్రాజెక్టుకు 28 వేల క్యూసెక్కుల వరద వస్తోంది. ఈ ప్రాజెక్టు సామర్థ్యం 17.80 టీఎంసీలు కాగా... 15.81 టీఎంసీల నిల్వ ఉంది. దాంతో లోతట్టు ప్రాంతాలను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ఏక్షణంలోనైనా ప్రాజెక్టు గేట్లను ఎత్తే అవకాశం ఉంది. ఇక శ్రీరామ్‌సాగర్‌కు 3 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా... 3.85 లక్షలను దిగువకు వదులుతున్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు 3.39 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 2.40 లక్షలను దిగువకు వదిలేస్తున్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మిడ్ మానేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 2.688 టీఎంసీల నీరు నిల్వ ఉంది. లోయర్ మానేరు రిజర్వాయర్‌లో ప్రస్తుతం 18 టీఎంసీల జలాలు నిల్వ ఉన్నాయి. ఇక, నల్లగొండ జిల్లా సరిహద్దులోని డిండి ప్రాజెక్టుకు దుందుభివాగు నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ ప్రాజెక్టు ఓ గేటును అధికారులు బుధవారం ఎత్తివేసి.. దిగువకు నీటిని విడుదల చేశారు.

ఏడు గేట్ల నుంచి దిగువకు మూసీ నీటి విడుదల....

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జున సాగర్ తర్వాత రెండో పెద్ద సాగునీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టుకు వరద పోటు కొనసాగుతోంది. మూసీ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 645అడుగులు(4.46 టీఎంసీలు)అడుగులు కాగా బుధవారం సాయంత్రానికి 642.20అడుగులుగా(3.74 టీఎంసీలు) నమోదైంది. మరోవైపు, హైదరాబాద్ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో మూసీ నదీలోకి భారీగా వరద నీరు చేరుతోంది. కాగా, ఎగువన కురిసిన భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి పెరగడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు.

ఎన్‌కౌంటర్ పోలీసులపై హత్య కేసు పెట్టండి


దిశ నిందితుల ఎన్‌కౌంటర్ కేసులో వాదనలు

హైదరాబాద్, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : దిశ నిందితులను ఎన్‌కౌంటర్ చేసి న్యాయవ్యవస్థను అపహాస్యం చేసేలా వ్యవహరించిన పోలీసులపై హత్య కేసు పెట్టి దర్యాప్తు చేపట్టాలని దిశ నిందితుల ఎన్‌కౌంటర్‌ను వ్యతిరేకిస్తున్న మహిళా హక్కులు, ప్రజా సంఘాలకు సంబంధించిన పిటిషనర్ల తరఫు న్యాయవాదులు కోరారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది బృందా గ్రోవర్ వాదనలు కొనసాగిస్తూ.. జస్టిస్ సిర్పుర్కర్ కమిషన్ నివేదికను పరిగణనలోకి తీసుకుని ఎన్‌కౌంటర్ చేసిన పోలీసులపై రెండో ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించాలని కోరారు. సీబీఐ తరఫున న్యాయవాది కాపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. ధర్మాసనం ఆదేశిస్తే సీబీఐ దర్యాప్తునకు సిద్ధంగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది మహేశ్‌రాజే వాదనలు వినిపిస్తూ ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తారని.. మరింత సమయం ఇవ్వాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం సమయం కోరడంపై ధర్మాసనం అసహనం వ్యక్తంచేస్తూ ఇది తుది విచారణ అని.. అన్ని పక్షాలు అంగీకరించిన తర్వాతే తుది విచారణ చేపడుతున్నామని.. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది బృందా గ్రోవర్ వాదనలు మొదలు పెట్టడానికి ముందే సిద్ధంగా లేమని ప్రభుత్వం చెప్పాల్సిందని వ్యాఖ్యానించింది. విచారణ గురువారానికి వాయిదా పడింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor:* **K. Srinivas.** *Ph. No. (0870) 2100480/84,*
RNI No:APTEL/2003/9741, ***Managing Director : Vemuri Radha Krishna*** *Founder: K.L.N.Prasad.*

ఆంధ్రజ్యోతి
diksuchi@andhrajyothy.com
దిక్సూచి
హైదరాబాద్ ● గురువారం 5 సెప్టెంబరు 2024

నిమ్స్‌లో ఎంహెచ్ఎం



హైదరాబాద్‌లోని నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)- 'మాస్టర్ ఇన్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండున్నరేళ్లు. ఇందులో ఆర్నెల్ల కంపల్సరీ ఇంటర్న్‌షిప్ కూడా ఉంది. ఇది ఫుల్ టైమ్ ప్రోగ్రామ్. ఇందులో మొత్తం 20 సీట్లు ఉన్నాయి. తెలంగాణ అభ్యర్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి. 'నిమ్‌సెట్-ఎంహెచ్ఎం 2024'లో సాధించిన మెరిట్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. కోర్సు సమయంలో ఇతర డిగ్రీ/డిప్లొమా ప్రవేశాలకు, ప్రైవేట్ ప్రాక్టీస్/కన్సల్టేషన్‌లకు అనుమతించరు. ప్రోగ్రామ్‌ను గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తి చేయాలి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి మెడికల్/నాన్ మెడికల్ విభాగాల్లో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 20 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. దివ్యాంగులకు అయిదేళ్లు; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు మూడేళ్ల సడలింపు వర్తిస్తుంది.

నిమ్‌సెట్-ఎంహెచ్ఎం వివరాలు: దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. హెల్త్ సైన్సెస్‌కు సంబంధించి 40, అడ్మినిస్ట్రేషన్ అంశాలనుంచి 10, కంప్యూటర్ సైన్సెస్ అంశాల నుంచి 10, జనరల్ నాలెడ్జ్ నుంచి 15, టెస్టింగ్ ఆఫ్ ఐక్యూకు సంబంధించి 15, ఇంగ్లీష్ నుంచి 10 ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలను ఆంగ్ల మాధ్యమంలో ఇస్తారు. అభ్యర్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం రెండు గంటలు. ఈ పరీక్షలో అర్హత సాధించాలంటే జనరల్, బీసీ అభ్యర్థులకు కనీసం 40 శాతం; ఎస్సీ, ఎస్టీలకు 30 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.5,000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.4,000
- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 16
- **దరఖాస్తు హార్డ్ కాపీ చేరేందుకు చివరి తేదీ:** సెప్టెంబరు 18
- **చిరునామా:** అసోసియేట్ డీన్, అకడమిక్-2, రెండో అంతస్తు, పాత ఓపీడీ బ్లాక్, నిజామ్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పంజాగుట్ట, హైదరాబాద్-500082
- **వెబ్‌సైట్:** nims.edu.in

ఇఫ్లూలో సంస్కృతం కోర్సు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ(ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)- సంస్కృతంలో ప్రొఫిషియెన్సీ కోర్సును అందిస్తోంది. దీని వ్యవధి 50 గంటలు. ప్రోగ్రామ్‌లో భాగంగా సంస్కృతం చదవడం, రాయడం, వినడం, మాట్లాడడం, భాష సంబంధిత వ్యాకరణం తదితరాలు నేర్పిస్తారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు క్లాస్‌రూమ్ సెషన్స్ ఉంటాయి. పదోతరగతి ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. మొత్తం 25 సీట్లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.3000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 13
- **వెబ్‌సైట్:** www.efluniversity.ac.in

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- 'ఆన్‌లైన్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ ఎక్స్‌పోర్ట్ ఇంపోర్ట్ మేనేజ్‌మెంట్'లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది వీకెండ్ ప్రోగ్రామ్. ఇందులో ఆరు మాడ్యూల్స్ ఉంటాయి. దీని వ్యవధి నాలుగు నెలలు(150 గంటలు). వారాంతాల్లో లైవ్ ఇంటరాక్టివ్ సెషన్స్ ద్వారా బోధన ఉంటుంది. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం పన్నెండుంబావు వరకు, సాయంత్రం రెండు నుంచి అయిదుంబావు వరకు సెషన్స్ నిర్వహిస్తారు. కనీసం 75 శాతం అటెండెన్స్ తప్పనిసరి. ప్రోగ్రామ్‌లో భాగంగా అసైన్‌మెంట్లు, అసెస్‌మెంట్లు, ప్రజంటేషన్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ఫైనల్ ఎగ్జామ్స్ ఉంటాయి. కోర్సు మెటీరియల్‌కు సంబంధించి లైఫ్ టైమ్ యాక్సెస్ ఇస్తారు. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 10
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** సెప్టెంబరు 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.iift.ac.in

జేఎన్‌టీయూకేలో ఎంటెక్ స్పాన్సర్డ్ కోటా



కాకినాడలోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూకే)- ఎంటెక్ ప్రోగ్రామ్‌లో స్పాన్సర్డ్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. కనీసం ఏడాది అనుభవం ఉన్న వర్కింగ్ ప్రొఫెషనల్స్ దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్ 2024/జీప్యాట్ 2024/ఏపీ పీజీఈసెట్ 2024 ర్యాంక్, అకడమిక్ మెరిట్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. స్పెషలైజేషన్‌కు అయిదు చొప్పున మొత్తం 65 సీట్లు ఉన్నాయి.

క్యాంపస్‌లు

- యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, కాకినాడ
- ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, కాకినాడ
- యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, నర్సరావుపేట

విభాగాలు-స్పెషలైజేషన్‌లు

- సివిల్ ఇంజనీరింగ్ - స్ట్రక్చరల్ ఇంజనీరింగ్, సాయిల్ మెకానిక్స్ అండ్ ఫౌండేషన్ ఇంజనీరింగ్, వాటర్ రిసోర్స్ ఇంజనీరింగ్
- ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ - హై ఓల్టేజ్ ఇంజనీరింగ్, అడ్వాన్స్‌డ్ ఎలక్ట్రికల్ పవర్ సిస్టమ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ డ్రైవ్స్, పవర్ ఎలక్ట్రానిక్స్
- మెకానికల్ ఇంజనీరింగ్ - క్యాడ్/క్యామ్, మెషిన్ డిజైన్, థర్మల్ ఇంజనీరింగ్
- ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ - కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ అండ్ సిగ్నల్ ప్రాసెసింగ్, కంప్యూటర్ అండ్ కమ్యూనికేషన్, వీఎల్ఎస్ఐ అండ్ ఎంబెడెడ్ సిస్టమ్స్
- కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ - కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ
- రెన్యూవబుల్ ఎనర్జీ అండ్ ఎన్విరాన్‌మెంట్ - రెన్యూవబుల్ ఎనర్జీ, ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంట్
- బయోటెక్నాలజీ, నానోటెక్నాలజీ, రిమోట్ సెన్సింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఏవియానిక్స్, ఎన్విరాన్‌మెంటల్ ఆక్యుపేషనల్ హెల్త్ అండ్ సేఫ్టీ

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ఏఐఎంఈ లేదా ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ/ఫిజిక్స్/బయోటెక్నాలజీ/ఎర్త్ సైన్స్/ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ/ఎలక్ట్రానిక్స్/జియాలజీ/ఫుడ్ టెక్నాలజీ/ఫుడ్ సైన్స్ అండ్ న్యూట్రిషన్/డెయిరీ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి. గేట్ 2024/జీప్యాట్ 2024/ఏపీ పీజీఈసెట్ 2024 ర్యాంక్ ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1000
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 17
- **వెబ్‌సైట్:** www.jntuk.edu.in

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో అప్రెంటిస్‌లు

మొత్తం ఖాళీలు: 550

చెన్నైలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, సెంట్రల్ ఆఫీస్... దేశవ్యాప్తంగా ఐఓబీ శాఖల్లో అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఆంధ్రప్రదేశ్‌లో 22, తెలంగాణలో 29 ఖాళీలు ఉన్నాయి.

అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 ఆగస్టు 1 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.

శిక్షణ వ్యవధి: ఏడాది.

స్టయిపెండ్: నెలకు మెట్రో ప్రాంతానికి రూ.15,000; అర్బన్ ప్రాంతానికి రూ.12,000; సెమీ-అర్బన్/రూరల్ ప్రాంతానికి రూ.10,000.

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ టెస్ట్(ఆబ్జెక్టివ్ టైప్), లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, సర్టిఫికెట్ వెరిఫికేషన్ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 10

వెబ్‌సైట్: https://www.iob.in/Careers

టీసీఐఎల్‌లో వివిధ ఖాళీలు

మొత్తం ఖాళీలు: 204

ఢిల్లీలోని టెలీకమ్యూనికేషన్స్ కన్సల్టెంట్స్ లిమిటెడ్(టీసీఐఎల్)... ఒప్పంద ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. నర్సింగ్ ఆఫీసర్
2. ల్యాబ్/ఈసీజీ/ఓటీ/పోస్ట్ మార్టమ్ టెక్నీషియన్స్
3. ల్యాబ్ అసిస్టెంట్/ఆడియోమెట్రి/ఓటీ/మార్చురీ/ప్లాస్టర్ రూం
4. ఫార్మసిస్ట్
5. జూనియర్ రేడియోగ్రాఫర్
6. రిఫ్రాక్షనిస్ట్
7. ఫిజియోథెరపిస్ట్
8. ఆక్యుపేషనల్ థెరపిస్ట్
9. అసిస్టెంట్ డైటీషియన్
10. డ్రెస్సర్

అర్హత: టెన్త్, ఇంటర్, సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 27 నుంచి 32 ఏళ్లు మించకూడదు

ఎంపిక: స్కిల్ టెస్ట్/ఇంటర్వ్యూ, షార్ట్‌లిస్టింగ్, ధ్రువపత్రాల పరిశీలన తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 13

వెబ్‌సైట్: https://www.tcil.net.in/index.php



డీఆర్‌డీఓలో జేఆర్ఎఫ్ ఖాళీలు

మొత్తం ఖాళీలు: 8

హైదరాబాద్‌లోని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్(డీఆర్‌డీఓ)కు చెందిన సెంటర్ ఫర్ హై ఎనర్జీ సిస్టమ్స్ అండ్ సైన్సెస్(చెస్)... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు

1. రీసెర్చ్ అసోసియేట్: **2 పోస్టులు**
2. జూనియర్ రీసెర్చ్ ఫెలో: **6 పోస్టులు**

విభాగాలు: మెకానికల్, కంప్యూటర్ సైన్స్, ఫిజిక్స్, లేజర్ టెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, కెమిస్ట్రీ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, పీజీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. నెట్/గేట్ స్కోరు తప్పనిసరి.

వయోపరిమితి: రీసెర్చ్ అసోసియేట్ పోస్టుకు 35 ఏళ్లు, జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుకు 28 ఏళ్లు మించకూడదు.

స్టయిపెండ్: నెలకు రీసెర్చ్ అసోసియేట్ పోస్టులకు రూ.67,000; జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టులకు రూ.37,000.

ఎంపిక: విద్యార్హత, షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ, పని అనుభవం తదితరాల ఆధారంగా

దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా

ఈమెయిల్: hrd.chess@gov.in

వెబ్‌సైట్: www.drdo.gov.in/drdo/

పవర్‌గ్రిడ్‌లో ఆఫీసర్ ట్రైయినీ

మొత్తం ఖాళీలు: 9

ఢిల్లీలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(పవర్‌గ్రిడ్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

అర్హత: పోస్టును అనుసరించి కనీసం 60 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. క్లాట్ స్కోరు తప్పనిసరి.

జీతం: నెలకు రూ.40,000

వయోపరిమితి: 28 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: రూ.500. ఎస్సీ/ఎస్టీ/పీడబ్ల్యూబీడీ/ఎక్స్ సర్వీస్‌మన్ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: ధ్రువపత్రాల పరిశీలన, బిహేవియరల్ అసెస్‌మెంట్, గ్రూప్ డిస్కషన్, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ, క్లాట్ స్కోరు తదితరాల ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: నవంబరు 7

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: నవంబరు 27

వెబ్‌సైట్: https://www.powergrid.in/

ఐఐసీటీలో ప్రాజెక్ట్ అసోసియేట్స్

మొత్తం ఖాళీలు: 24

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ)... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

పోస్టుల వివరాలు

1. సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్
2. ప్రాజెక్ట్ అసోసియేట్-1
3. ప్రాజెక్ట్ అసోసియేట్-2
4. సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, నెట్/గేట్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.


వయోపరిమితి: సీనియర్ ప్రాజెక్ట్ అసోసియేట్ పోస్టులకు 40 ఏళ్లు; సైంటిఫిక్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్ పోస్టుకు 50 ఏళ్లు; ఇతర పోస్టులకు 35 ఏళ్లు మించకూడదు.

ఎంపిక విధానం: ఇంటర్వ్యూ, స్కిల్ టెస్ట్ తదితరాల ఆధారంగా

ఇంటర్వ్యూ తేదీ: సెప్టెంబరు 10

వేదిక: ఐసీఎంఆర్- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ(ఐఐసీటీ), హైదరాబాద్.

వెబ్‌సైట్: https://www.iict.res.in/



లిటిల్స్

మంచి గురువు ధర్మం



పూర్వం వాల్మీకి మహాముని ఆశ్రమంలో అనేక మంది విద్యాభ్యాసం కోసం వచ్చేవారు.అలా చేరిన శిష్యుల బృందంలో ఒకరోజు ఒక విద్యార్థి వస్తువు కనిపించకుండా పోయింది ఆ వస్తువును ఎవరు తీసుకుని ఉంటారు అనేది అక్కడున్న వారందరికీ తెలుసు. వారందరూ వెళ్లి, ఎ మహర్షికి ఆ విద్యార్థి పేరును ఫిర్యాదుచేసారు. అంతా తెలుసుకున్న తర్వాత కూడా మహాముని ఆ విద్యార్థిని దండించకుండా వదిలేసాడు. ఇలా అతన్ని దండించకుండా వదిలేస్తే, ఆశ్రమంలో మేమంతా ఉండటం కష్టం అని వారందరూ మహర్షితో చెప్పారు. దానికి ఆయన 'చూడండి. మీకు మంచీ చెడు తెలిసిపోయాయి, ఆ విద్యార్థికి ఇంకా తెలియనందువలనే ఇలాంటి తప్పుచేసాడు మీరంతా బయటకు వెళ్లి బ్రతకగలరు కానీ అతనికి మరికొంత కాలం విద్య అవసరం కాబట్టి నేను నా సహాయం అవసరమైన శిష్యుడిని వదులుకోలేను. సంపూర్ణ ఆరోగ్యవంతుని కంటే అనారోగ్యంతోఉన్న వారికే కదా వైద్యుని అవసరం ఎక్కువ'. అని శిష్యులను సమాధాన పరచి పంపివేశాడు. పై కథను పదేపదే ప్రస్తావించడమే కాకుండా అందులోని గురువు ధర్మాన్ని అక్షరాలా అలాగే నిలుపుకున్న మహానుభావుడు మరెవరో కాదు. భారత దేశం నుండి 27 సార్లు నోబెల్ పురస్కారానికి నామినేట్ చేయబడిన ఉత్తమ ఉపాధ్యాయుడు, స్వతంత్ర భారత ప్రథమ ఉప రాష్ట్రపతి శ్రీ. సర్వేపల్లి రాధా కృష్ణన్ గారు.


6 తేడాలను కనిపెట్టండి




కుక్కలు ఎన్ని ఉన్నాయి?



సరైన నీడను గుర్తించండి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 402

6					3		2	
3								7
	1	5	8					
1			7	4		2		
		7				6		
		4		2	5			1
					7	8	1	
5								4
	6		1					9

సుడోకు - 401 సమాధానం

8	3	1	5	7	6	9	4	2
9	7	4	2	8	3	5	1	6
5	2	6	4	1	9	3	8	7
3	8	9	6	4	5	7	2	1
6	1	7	3	2	8	4	9	5
2	4	5	1	9	7	6	3	8
4	5	8	7	3	2	1	6	9
1	6	2	9	5	4	8	7	3
7	9	3	8	6	1	2	5	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.